

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 208

బుధవారం 18-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మూడు రోజుల నష్టాలకు చెక్

క్రూడాయిల్ ధరల తగ్గుదల ప్రభావం.. సెన్సెక్స్ 261 పాయింట్లు లాభం - 15లో



నెదర్లాండ్స్ సంచలనం

ప్రపంచ కప్ మ్యాచ్‌లో 38 పరుగులతో ఓడిన దక్షిణాఫ్రికా -14లో



అధికారమిస్తే కులగణన

కులగణన, రుణమాఫీ, రూ. 25 లక్షల వైద్య బీమా వంటి హామీలతో కాంగ్రెస్ మధ్యప్రదేశ్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసింది.

- వివరాలు 8లో



గాజా ఆస్పత్రిపై భీకర దాడి

గాజాలోని అల్ అహ్లీ సిటీ ఆస్పత్రిపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో 500 మంది ప్రాణాలు కోల్పోయారు.

- వివరాలు 6లో



త్వరలో జాబిల్లిపైకి భారతీయుడు

2040 నాటికి తొలి భారతీయుడిని చంద్రుడిపైకి పంపించాలని ఇస్రోకు ప్రధాని మోదీ లక్ష్యం నిర్దేశించారు.

- వివరాలు 6లో



పరమ పదవి సోపానం

రాజకీయాల్లోకి వచ్చే నాయకులు ఎప్పుడు, ఎలాంటి పదవులు చేపడతారో ఎవరూ ఊహించలేని పరిస్థితి ఉంటుంది.

- వివరాలు 7లో

ఆపద మొక్కులకు ఆగం కావొద్దు!

సిరిసిల్ల, సిద్దిపేట ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్



- అలవిగాని హామీలిచ్చే వారిని నమ్మొద్దు
- కాంగ్రెస్ వస్తే మూడు గంటల కరెంటే..
- ధరణిని రద్దు చేస్తే రైతులు భూములపై ఆశలు వదులుకోవాల్సిందే
- మోటార్లకు మీటర్లు పెట్టేవాళ్లను, మత పిచ్చోళ్లను కూడా నమ్మొద్దు
- ఒకే కుటుంబంలా కలిసి ఉన్న మన మధ్య పంచాయితీలు పెట్టేందుకు వచ్చే వారితో జాగ్రత్త
- సిరిసిల్ల ఎమ్మెల్యే, చేనేత మంత్రి.. కేటీఆర్ కావడం మీ అదృష్టమన్న సీఎం
- ఆరడుగుల బుల్లెట్ హరీశ్ సిద్దిపేటను అద్భుతంగా అభివృద్ధి చేశాడని కితాబు
- ఎన్నికల్లో ఇద్దర్నీ ఆశీర్వదించాలని విజ్ఞప్తి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/ సాక్షి, సిద్దిపేట: 'ఎన్నికల సమయంలో కొందరు ఆపద మొక్కులవారు వస్తారు. అలవిగాని హామీలతో మభ్యపెట్టాలని చూస్తారు. వారి మాటలు నమ్మి ఆగం కావొద్దు. మోటార్లకు మీటర్లు పెట్టేవారిని, మత పిచ్చోళ్లను కూడా నమ్మొద్దు. ముఖ్యంగా రైతులంతా అప్రమత్తంగా ఉండాలి. మూడేళ్లు కష్టపడి ధరణిని రూపొందించాం. గతంలో వీఆర్వో నుంచి రెవెన్యూ సెక్రటరీ దాకా ఎవరికి కోపమొచ్చినా రైతుల భూమి మాయమయ్యేది. కానీ ధరణితో రైతుల అనుమతి లేకుండా.. సీఎం కూడా రైతు భూమి జోలికి వెళ్లలేని స్థితి కల్పించాం. ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తే.. రైతులు భూములపై ఆశలు వదులుకోవాల్సిందే..' అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హెచ్చరించారు. సిద్దిపేట రక్తం, మాంసం, బుద్ధి, బలమే తనను ఇంతవాణ్ణి చేశాయన్నారు. సిరిసిల్లను సోలాపూర్‌లా మారుస్తామని, విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రం, సిద్దిపేటల్లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన ప్రసంగించారు.

కేసీఆర్ మొండిపట్టుతోనే 24 గంటల కరెంటు

'గత 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎక్కడ చూసినా కరెంటు కోతలు, ఆగిన మగ్గాలు, పాముకాట్లు, తేలు కాట్లతో రైతుల ప్రాణాలు పోవడం తప్ప వారు చేసిందేమీ లేదు. ప్రస్తుతం రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నాం. కానీ కాంగ్రెస్ వాళ్లు 3 గంటలు మాత్రమే చాలు అంటున్నారు. మీకు 24 గంటలు కావాలా? 3 గంటలు కావాలా? (అంతా 24 గంటలు కావాలంటూ కేకలు వేశారు) ప్రధాని మోదీ సొంత ఊర్లో కూడా 24 గంటల కరెంటు రావడం లేదు. కానీ మనకు అది ఎలా

మిగతా 2వ పేజీలో ▶

సిద్దిపేట రక్తమే నన్ను ఇంతటివాడిని చేసింది

యావత్ దేశం ఆశ్చర్యపడేలా.. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోతున్నానంటే ఈ గడ్డ పుణ్యమే. సిద్దిపేట నుంచి నాకు దొరికిన రక్తం, మాంసం, బుద్ధి, బలమే నన్ను ఇంతవాణ్ణి చేశాయి. చింతమడకలో అమ్మ చనుబాలు తాగే సమయంలో అమ్మకు ఆరోగ్యం దెబ్బతింటే ఊర్లో ఓ ముదిరాజ్ తల్లి నాకు చనుబాలు ఇచ్చి సాదింది. సిద్దిపేటే నన్ను సాది పెద్ద చేసి, చదువు చెప్పింది. రాజకీయంగా జన్మనిచ్చి నాయకుణ్ణి చేయడంతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యేంత ఎత్తుకు తీసుకెళ్లింది. ఈ గడ్డ రుణం ఎన్నటికీ తీర్చుకోలేను. -కేసీఆర్

చట్టబద్ధత కల్పించలేం



- స్వలింగ వివాహాలపై సుప్రీంకోర్టు
- అది పార్లమెంటు పరిధిలోని అంశమన్న ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం
- వారు సహజీవనంలో ఉండొచ్చు
- హక్కులను ప్రభుత్వాలు కాపాడాలి
- దత్తత హక్కుండదంటూ 3:2తో తీర్పు

- వివరాలు 6లో



రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో సీఈవో వికాస్‌రాజ్

కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్నికల డబ్బు

- పంపిణీకి అక్రమంగా తరలిస్తున్నారు
- నిఘా పెట్టి కట్టడి చేయాలని కోరిన బీఆర్ఎస్
- ప్రగతిభవన్‌లో బీ–ఫారాలు పంపిణీ చేయడం కోడ్ ఉల్లంఘనే
- చర్యలు తీసుకోవాలని కోరిన కాంగ్రెస్
- మునుగోడులో జప్తు చేసిన డబ్బు ఏం చేశారని ప్రశ్నించిన సీపీఎం
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన సీఈఓ వికాస్‌రాజ్ -5లో



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకుంటున్న వహీదా రెహమాన్, జాతీయ ఉత్తమ నటుడు అవార్డు అందుకుంటున్న అల్లు అర్జున్

సినిమాలు... కళాకారులు సమాజంలో మార్పుకి సారథులు

14లో

69వ జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

రామోజీ మా సంతకాలు ఫోర్జరీ చేశారు

నకిలీ సంతకాలతో షేర్లను శైలజా కిరణ్‌కు బదలాయించారు

మార్గదర్శి సహ వ్యవస్థాపకుడు జీజే రెడ్డి కుమారుడు యూరిరెడ్డి వెల్లడి

- గదిలో బంధించి.. తుపాకీతో బెదిరించారు.. అది ఆయన సామ్రాజ్యం .. ఎదిరిస్తే ప్రాణాలు దక్కవు
- ప్రాణభయంతో ఖాళీ స్టాంపు పేపర్‌పై సంతకాలు చేశాం
- షేర్ల బదిలీ ప్రక్రియ పూర్తి చేయలేదు
- ఆఫర్, యాక్సెప్టెన్సీ, కన్సిడరేషన్ లేనే లేవు.. మా సంతకాలు ఫోర్జరీ చేశారు.. షేర్లను శైలజా కిరణ్ పేరిట బదలాయించారు
- రామోజీకి భయపడి మా ఫిర్యాదును ఎవరూ పట్టించుకోలేదు
- మార్గదర్శి సొమ్ము అక్రమ తరలింపుపై సీఐడీ కేసులతో మాకు ధైర్యం వచ్చింది
- మేమిచ్చిన ఆధారాలు పరిశీలించాకే కేసు నమోదు చేశారు




సాక్షి, అమరావతి: 'రామోజీరావు పచ్చి మోసం చేశారు. తొలుత మమ్మల్ని ఓ గదిలో నిర్బంధించి, తుపాకీతో బెదిరించి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో షేర్లు బదిలీ చేయించుకోవాలని ప్రయత్నించారు. ప్రాణాలు దక్కించుకొనేందుకు ఆయనిచ్చిన ఖాళీ స్టాంపు పేపర్లపై సంతకాలు పెట్టి బయట పడ్డాం. షేర్లు మాత్రం బదిలీ చేయలేదు. ఆ తర్వాత ఫోర్జరీ సంతకాలతో మాకున్న 288 షేర్లను ఆయన కోడలు, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్‌కు బదలాయించుకున్నారు' అని మార్గదర్శి చిట్‌ఫండ్స్ సహ వ్యవస్థాపకుడు జీజే రెడ్డి కుమారుడు యూరి రెడ్డి చెప్పారు. తమ షేర్లను

మిగతా 12వ పేజీలో ▶

చంద్రబాబుకు నో రిలీఫ్

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బాబు క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో తీర్పు రిజర్వు



- సెక్షన్ 17ఏ నిజాయితీపరులకే.. అవినీతిపరులకు కాదు.. ఈ కేసులో అవినీతి స్పష్టంగా కనిపిస్తోంది
- రూ. వందల కోట్ల స్కాం దర్యాప్తును అడ్డుకోవడానికి ఈ సెక్షన్‌ను ఉపయోగించరాదు
- అవినీతి కేసులో ఆధారాలుంటే ప్రత్యేక కోర్టు విచారించొచ్చు
- ఏపీ సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి
- బాబు 40 రోజులుగా జైల్లో ఉన్నారు.. మధ్యంతర బెయిల్ ఇవ్వండి
- చంద్రబాబు న్యాయవాది సాల్వే అభ్యర్థన.. 17ఏపై ఇరు పక్షాల వాదనలు పూర్తి
- ఫైబర్‌నెట్ కుంభకోణం కేసు విచారణ శుక్రవారం చేపడతామన్న ధర్మాసనం
- అప్పటివరకు బాబును అరెస్టు చేయొద్దన్న సుప్రీంకోర్టు

12లో

నేడు రామప్పకు రాహుల్, ప్రియాంక



- ఆరు గ్యారంటీలకు ఆలయంలో పూజలు
- అక్కడి నుంచి రామాంజాపూర్‌లో మహిళా విజయభేరి సభకు..
- రాత్రి భూపాలపల్లిలో బస చేయనున్న రాహుల్

2లో

నా బిడ్డ చావుపై రాజకీయాలు చేయొద్దు



- చావుకు కారణమైన వాడిని శిక్షించాలి
- నా కుమార్తె ఉరి వేసుకున్నట్టే వాడికి ఉరిశిక్ష పడాలి
- ప్రవల్లిక తల్లి మర్రి విజయ వీడియో వైరల్..
- నిందితుడు శివరామ్ కోసం పోలీసుల ముమ్మర గాలింపు చర్యలు

దుగ్గొండి: ''మీకు, మీ పార్టీలకు గొడవలు ఉంటే మీరే చూసుకోండి .. మా కుటుంబాన్ని నా బిడ్డ చావును అందులోకి లాగకండి'' అంటూ ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిని ప్రవల్లిక తల్లి మర్రి విజయ మాట్లాడిన మాటలు మంగళవారం సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బిక్కాజి పల్లి గ్రామానికి చెందిన ప్రవల్లిక ఈనెల 13న రాత్రి హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డ సంగతి తెలిసిందే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వివిధ రాజకీయ

మిగతా 5వ పేజీలో ▶

మద్యం, డబ్బుతో కేసీఆర్ సిద్ధం: రేవంత్



- అమరుల స్థూపం వద్ద ప్రమాణానికి రాకపోవడంతో బీఆర్ఎస్ వైఖరి స్పష్టం
- మేం 6 గ్యారంటీలతోనే ఎన్నికలకెళ్తాం
- ఒక ఆడబిడ్డ కుటుంబాన్ని అవమానించిన సర్కార్‌కు బుద్ధి చెప్పాలి
- రాష్ట్రంలో నిరుద్యోగులు కదం తొక్కితే కాంగ్రెస్‌కు 90 సీట్లు వస్తాయి.. మోదీ, కేసీఆర్, ఒవైసీ ఒక్కటే

సాక్షి, హైదరాబాద్: మద్యం, డబ్బు పంచకుండా ఎన్నికల్లో పోటీ చేసేలా అమరవీరుల స్థూపం వద్ద ప్రమాణం చేయాలంటూ తాను విసిరిన సవాల్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ స్వీకరించకపోవడంతో ఈ విషయంలో బీఆర్ఎస్ వైఖరి అర్థమైందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శించారు. మునుగోడు, హుజూరాబాద్ తరహాలో మరోసారి మద్యం, డబ్బుతో ఎన్నికల్లో పోటీకి కేసీఆర్ సిద్ధమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ మాత్రం ఆరు గ్యారంటీలతోనే ఎన్నికలకు వెళుతుందని, డబ్బు, మద్యం పంపిణీ చేయదని

మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఇలా పారాచూట్‌లో వెళితే టికెట్ గ్యారంటీ అని తెలిసింది!

రేపు బీజేపీ తొలి జాబితా?

మేనిఫెస్టో విడుదలకు మరింత సమయం పట్టే అవకాశం

- జాప్యంపై రాష్ట్ర నాయకుల్లో ఒకింత ఆందోళన
- ఓపిక పట్టాలంటున్న జాతీయ నాయకత్వం
- ఐదు రాష్ట్రాల్లో తెలంగాణలో చివరగా ఎన్నికలున్నందున తొందరెందుకని ఎదురు ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: బీజేపీ అభ్యర్థుల తొలి జాబితాను గురువారం ఢిల్లీలో ప్రకటించే అవకాశముంది. బుధవారం ఢిల్లీలో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. ఒకవేళ అవకాశం ఉంటే బుధవారం రాత్రే జాబితా ప్రకటించే అవకాశాన్నీ కొట్టిపారేయలేమని పార్టీ నేతలు చెబుతున్నారు. జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ ఇలా అన్ని వర్గాలకు తగిన ప్రాధాన్యత దక్కేలా కసరత్తు సాగుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే 60–70 స్థానాల్లో అభ్యర్థుల పేర్లపై రాష్ట్రపార్టీ ముఖ్యనేతలు ఓ అంచనాకు రాగా... ఏకాభిప్రాయం కుదిరిన సింగిల్ క్యాండిడేట్ నియోజకవర్గాలు కొన్నింటిని రెండు లేదా మూడో జాబితాలో ప్రకటించే అవకాశాలున్నాయని అంటున్నారు. తొలి జాబితాలో 35–40 మంది అభ్యర్థులు ఉండొచ్చునని చెబుతున్నారు. మొత్తంగా ఇతర పార్టీల కంటే కూడా బీసీలు (దాదాపు 40 సీట్లు), మహిళలకు ఎక్కువ సీట్లు

మిగతా 5వ పేజీలో ▶

సిద్దిపేట



సిరిసిల్ల



మంగళవారం సిద్దిపేట, సిరిసిల్ల సభలకు భారీగా హాజరైన ప్రజలు

రేవంత్, కవిత బిజినెస్ పార్ట్‌నర్స్

ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు



సుభాష్‌నగర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బిజినెస్ పార్ట్‌నర్స్ అని, వారు ఒకే కంపెనీలో డైరెక్టర్లుగా ఉన్నారని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నిజామాబాద్ జిల్లాకేంద్రంలో బీజేపీ అర్బన్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కవిత రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఆకుల లలితను కాంగ్రెస్‌లోకి పంపించి అర్బన్ టికెట్ ఇప్పిస్తున్నారని, అందుకే కవితను నిజామాబాద్ అర్బన్, బోధన్ ఇన్‌చార్జీగా బీఆర్ఎస్ నియమించిందని ఆరోపించారు. బతికుండగా ఆరోగ్యబీమా ఇవ్వలేని సీఎం కేసీఆర్.. చనిపోయాక రూ.5 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తానని బీఆర్ఎస్ మేనిఫెస్టోలో చేర్చారని, కానీ మంత్రి కేటీఆర్‌కు రూ.10 లక్షలు, ఎమ్మెల్సీ కవితకు రూ.20 లక్షలు బీమా ఇస్తానని ఎద్దేవా చేశారు. మైనార్టీబంధు రూ.10 లక్షలకు పెంచాలని ఎంఐఎం నేత ఒవైసీ ఎందుకు డిమాండ్ చేయడం లేదో చెప్పాలన్నారు. ప్రజలకు నవంబర్ 30న మంచి అవకాశం వచ్చినందున బీజేపీకి మద్దతుగా నిలవాలని అన్నారు.

వ్యక్తిగత విషయాలపై ఇంత విషమా..!

అర్వింద్ వ్యాఖ్యలపై కవిత ఆవేదన



జగిత్యాలటౌన్: 'తెలంగాణ ప్రజలకు ఒక విజ్ఞప్తి. ఆడబిడ్డనైన నన్ను నిజామాబాద్ ఎంపీ అర్వింద్ అన్న మాటలు మీ ఆడబిడ్డలను అంటే మీకు సమ్మతమేనా..? నేను రాజకీయాల్లో ఉన్నా కాబట్టి నన్ను ఏమన్నా ఒప్పుకుందామా..? తెలంగాణలో ఇలాంటి రాజకీయాలను అనుమతిద్దామా..? 'అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర భావోద్వేగంతో ప్రశ్నించారు. ఈ మేరకు కవిత ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్‌లో తాను ఓడిపోయాక, గెలిచిన వారికి పనిచేసే అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతో మౌనంగా ఉంటున్నానని, గెలిచిన వ్యక్తి బాధ్యతలు విస్మరించి ఇష్టమొచ్చినట్లు వ్యక్తిగతంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. 'నువ్వు చచ్చిపోతే 20 లక్షలు ఇస్తా.. మీ అన్న చచ్చిపోతే పది లక్షలిస్తా.. మీ నాన్న ఇట్లా..' అంటూ అర్వింద్ మాట్లాడటం.. ఇటువంటి భాషను ప్రయోగించడం ఎంతవరకు కరెక్టో ప్రజలు ఆలోచించాలని కవిత విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమం తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు కూడా ఆంధ్రాపాలకులపై మన నేతలు ఇలా అమర్యాదగా మాట్లాడలేదని గుర్తుచేశారు. అలాంటి మర్యాదకరమైన రాజకీయాలు ఇప్పుడూ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. కక్షలకు తెలంగాణలో తావులేదని స్పష్టం చేశారు. ఇలా అడ్డగోలుగా మాట్లాడేవాళ్లు ఉంటారనే ఆడబిడ్డలను ఉద్యోగాలకు పంపించడానికి తల్లిదండ్రులు సంకోచించే పరిస్థితి ఉందన్నారు. మరీ ముఖ్యంగా రాజకీయాల్లోకి వచ్చే ఆడబిడ్డలకు ఏం సందేశం ఇస్తున్నట్లని ప్రశ్నించారు.

ఆపద మొక్కులకు | ఆగం కావొద్దు!

▶ మొదటి పేజీ తరువాయి

సాధ్యమైంది? కేవలం కేసీఆర్ మొండిపట్టు పట్టడం వల్లే. ఇదొక్కటే కాదు..అన్ని రంగాల్లో తెలంగాణ నంబర్ 1గా ఉంది. విద్యుత్ వినియోగం, ఇంటింటికీ నల్లా కనెక్షన్లలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నాం. మోటార్లకు మీటర్లు అంటూ బీజేపీ వాళ్లు బెదిరించాలని చూసినా జంకలేదు. హిందు-ముస్లిం అంటూ మత విద్వేషాలు రెచ్చగొట్టే మతపిచ్చిగాళ్లు కూడా వస్తున్నారు. మనం ఏళ్లుగా గంగా జమునా తెహిజీబ్‌లా ఒకే కుటుంబంలా కలిసి ఉన్నాం. మన మధ్య పంచాయితీలు పెట్టేందుకు వచ్చే వారితో జాగ్రత్త..' అంటూ కేసీఆర్ హెచ్చరించారు.

సిరిసిల్లను షోలాపూర్‌గా మారుస్తాం..

'నేను చదువుకుంటున్న రోజుల్లో ఎగువ మానేరు నీటితో కళకళలాడేది. ముస్తాబాద్‌లో పదుల సంఖ్యలో రైస్ మిల్లులు కూడా ఉండేవి. కానీ నేను సిద్దిపేట ఎమ్మెల్యే అయ్యాక.. సమైక్య పాలనలో మానేరు నీరు, రైస్ మిల్లులు క్రమంగా కనుమరుగయ్యాయి. తెలంగాణ వచ్చాక పరిస్థితి మారింది. ఒకప్పుడు ఎటుచూసినా కరువు నేలలతో ఉన్న సిరిసిల్ల నేడు నదులు, ప్రాజెక్టుల్లో నీటితో సజీవ జలధారగా మారింది. పచ్చటి పొలాలతో కళకళలాడుతోంది. ఉద్యమ సమయంలో సిరిసిల్లలో ఆత్మహత్యలు కలచివేసేవి. సిరిసిల్ల ఎమ్మెల్యే, చేనేత మంత్రి కేటీఆర్ కావడం మీ అందరి అదృష్టం. చేనేత మగ్గం నడవాలి, నేత కార్మికులకు ఉపాధి రావాలని పట్టుబట్టి ఏటా రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల పనులను సిరిసిల్ల చేనేతలకు అప్పగించాడు. అన్ని మతాల పండగల సమయంలో పేదలు కొత్తబట్టలు కట్టుకోవాలన్న ఆశయంతో.. చీరలు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. కానీ కొందరు ఆ చీరలను కాల్చి, కార్యక్రమాన్ని అవమానించారు. భవిష్యత్తులో సిరిసిల్లను షోలాపూర్‌గా మారుస్తాం. విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతాం. కేటీఆర్ గురించి నా కంటే బాగా మీకే తెలుసు. మరోసారి ఆశీర్వదించండి..' అంటూ కేసీఆర్ విజ్ఞప్తి చేశారు.





సిరిసిల్ల, సిద్దిపేట సభల్లో కేసీఆర్. చిత్రంలో కేటీఆర్, హరీశ్‌రావు

నిరుపేదలకు సూపర్ ఫైన్ బియ్యం

'బీఆర్ఎస్ మేనిఫెస్టో గురించి కొత్తగా చెప్పేదేం లేదు. కల్యాణలక్ష్మి కింద తొలుత రూ.50 వేలు ఇచ్చాం. క్రమంగా దాన్ని రూ.లక్షకు పెంచాం. పింఛన్ కూడా రూ.1,000 నుంచి రూ.2,000 చేశాం. క్రమంగా దాన్ని రూ.5 వేలు చేస్తాం. కాళేశ్వరం దాని అనుబంధ ప్రాజెక్టుల కారణంగా రాష్ట్రంలో 30 కోట్ల టన్నుల ధాన్యం పండుతోంది. అందుకే నిరుపేదలకు సూపర్ ఫైన్ సన్న బియ్యం పంపిణీ చేయబోతున్నాం..' అని తెలిపారు.

ఉద్యమ విజయానికి పునాది ఇక్కడే...

సిద్దిపేట సభలో నాతో కలిసి పని చేసిన మిత్రులు, సహచరులు ఆత్మీయులు వందలాది మంది ఉన్నారని కేసీఆర్ అన్నారు. కొండంరాజ్‌పల్లి మాదన్న.. మా నవాబ్ సాబ్.. నాకు డిపాజిట్ కట్టే తోర్నాల చంద్రారెడ్డి బావ ఎక్కడ ఉన్నడో. ఒక్కొక్కటీ జ్ఞాపకం చేసుకుంటే బాధేస్తుంది. తాగునీటి కోసం సిద్దిపేట పడ్డ తిప్పలు చెప్పలేం. లోయర్ మానేరు నుంచి నీళ్లు తెచ్చుకొని జలజాతర చేసుకున్నాం. సిద్దిపేట మంచినీళ్ల పథకమే మిషన్ భగీరథకు పునాది. దళితబంధుకు ప్రేరణ రామంచ గ్రామం. తెలంగాణ ఉద్య మం విజయం సాధించడానికి పునాది వేసింది కూ డా సిద్దిపేట గడ్డనే..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

హరీశ్.. ఆరడుగుల బుల్లెట్

'ఆరు అడుగుల బుల్లెట్ హరీశ్‌రావు.. నేను ఊహించిన దానికంటే ఎన్నో రెట్లు, బ్రహ్మాండంగా సిద్దిపేటను అభివృద్ధి చేశాడు. హరీశ్‌రావు మీద ఒక జోక్ ఉంది. 'అటు ఇటు తిరుగుతడు.. ఎక్కడన్నా ఓ తట్టెడు పెండ కనబడితే తీసుకుపోయి సిద్దిపేటలో వేసుకుంటడు' అని చెబుతారు. ఇక్కడికి అన్నీ వచ్చాయ్. నీళ్లు, రైళ్లు వచ్చాయి. కన్నీరు కార్చిన సిద్దిపేటలో చెక్ డ్యాంలన్నీ పన్నీరు కారినట్టు మత్తళ్లు దుంకుతున్నాయి. ఒక్క ఎయిర్‌పోర్ట్ మాత్రమే రావాలి. హరీశ్ స్థానంలో నేనున్నా ఇంతలా చేసేవాడిని కాదేమో. అంత అద్భుతంగా పని చేస్తున్నాడు. గత ఎన్నికల రికార్డును తిరగరాసి భారీ మెజార్టీతో హరీశ్‌ను గెలిపించాలి..' అని సీఎం కోరారు.

ఎక్కడ నిలబడ్డా కోనాయిపల్లి వెంకటేశ్వరస్వామి ఆశీర్వాదం

'కరీంనగర్, మహబూబ్‌నగర్ ఎంపీగా పోయినా.. గజ్వేల్ ఎమ్మెల్యేగా, రేపు కామారెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నా..కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి పాదాల వద్ద నామినేషన్ పత్రాలు పెట్టే పోతా అనే విషయం మీకు తెలుసు. బ్రహ్మాండంగా 50 ఏళ్లు కలిసిమెలిసి బతికిన బతుకులు మనవి..' అని కేసీఆర్ పేర్కొన్నారు. సిరిసిల్ల సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. ఒకప్పుడు కరువు నేలగా ఉన్న సిరిసిల్లను కాళేశ్వరం జలాలతో పచ్చగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. సిరిసిల్ల సాధించిన అభివృద్ధి, ఇక్కడి భూగర్భ జలాల గురించి ట్రైనీ ఐఏఎస్‌లు తమ శిక్షణలో భాగంగా తెలుసుకునే స్థాయికి కేసీఆర్ చేర్చారని కొనియాడారు. సిద్దిపేట ప్రజలు చూపిస్తున్న అభిమానానికి తన చర్మం వలిచి చెప్పులు కుట్టించినా తక్కువేనని అక్కడి సభలో మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు అన్నారు. చివరి శ్వాస ఉన్నంత వరకు సీఎం కేసీఆర్‌కు, నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని చెప్పారు.

తొలి ఉద్యోగం రజనీకే

టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హామీ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నాంపల్లికి చెందిన వికలాంగురాలు (మరుగుజ్జు) రజనీకి తొలి ఉద్యోగం ఇస్తామని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. రజనీ మంగళవారం గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డిని కలిసి తన సమస్యలను వివరించింది. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ రజనీ పీజీ పూర్తి చేసినా ప్రైవేటు సంస్థల్లోనూ ఉద్యోగం ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 9న ఎల్బీ స్టేడియంలో కొత్త సీఎం ప్రమాణ స్వీకారం ఉంటుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే వస్తారన్నారు. అదే రోజు కాంగ్రెస్ పార్టీ రజనీకి ఉద్యోగం ఇస్తుందని, ఇది తన గ్యారంటీ అని రేవంత్‌రెడ్డి చెప్పారు. గ్యారంటీ కార్డును స్వయంగా రజనీ పేరుతో రేవంత్‌రెడ్డి నింపారు.

6 హామీలతో తెలంగాణలో ఇక అఖండ విజయమే

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ట్వీట్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణసహా ఐదు రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. తెలంగాణలో ఇప్పటికే ప్రకటించిన ఆరు హామీలతో అఖండ విజయాన్ని సొంతం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల కోసమే పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన ట్వీట్ చేశారు. 'రాజస్తాన్ అత్యుత్తమ ఆరోగ్య సంరక్షణ విధానాన్ని కలిగి ఉంది. కర్ణాటక సాటిలేని సామాజిక భద్రతను అందిస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లో దృఢమైన విధాన నిర్ణయాలతో ఔత్సాహికవేత్తలకు మద్దతుగా ఉంటోంది. ఇక అవినీతిలో కూరుకుపోయిన బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం. ఇక ఆరు హామీలు తెలంగాణలో అఖండ విజయం సాధిస్తాయి'అని ఆయన ట్వీట్ చేశారు.

మద్యం, డబ్బుతో కేసీఆర్ సిద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

మేం ఎక్కడా మద్యం, డబ్బు పంచలేదు

దేశంలోనే హుజూరాబాద్ అత్యంత ఖరీదైన ఎన్నిక అని ఆనాడు విశ్లేషకులు చెప్పారని రేవంత్ గుర్తు చేశారు. మునుగోడులో కూడా మద్యం ఏరులై పారిందని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ఆ రెండు చోట్లా చుక్క మందు కానీ, డబ్బు కానీ పంచలేద న్నారు. తెలంగాణ ప్రజలు కోరుకున్న స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధిని కేసీఆర్ పక్కనబెట్టారన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలను తన కుటుంబానికే పరిమితం చేశారని ఆరోపించారు. నిరుద్యోగ యువతి ప్రవల్లిక ఆత్మహత్య చేసుకుంటే ఆ కుటుంబం పరువును మంటగలిపేలా ప్రభుత్వం వ్యవహరించిందని ధ్వజమెత్తారు. ప్రవల్లిక మరణంపై తప్పుడు వ్యాఖ్యలు చేసిన పోలీస్ అధికారిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ప్రవల్లిక కుటుంబ సభ్యులను తాను రాహుల్‌గాంధీ వద్దకు తీసుకెళ్లాలనుకుంటే.. ప్రగతిభవన్‌లో బంధించారని అన్నారు.

కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలను ఊడగొట్టాలి

రాష్ట్రంలో రిటైర్డ్ అయిన అధికారులను ప్రభుత్వం ఎందుకు కొనసాగిస్తోందని, వీరికి ఎన్నికల నియమావళి వర్తించదా? అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బంధువులు, కావలసిన కొందరు రిటైర్డ్ అధికారులను ప్రైవేటు సైన్యంగా చేసుకొని కేసీఆర్ తమపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ రెట్టింపు చేసి కేసీఆర్ మేనిఫెస్టోలో పెట్టారని, కానీ 2 లక్షల ఉద్యోగాల ఊసు ఎందుకు ఎత్తలేదని ప్రశ్నించారు. ఈ 45 రోజులు ప్రతి నిరుద్యోగ యువకుడు ముందుకొచ్చి కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలను ఊడగొట్టాలని, అప్పుడే రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని అన్నారు. 30 లక్షల నిరుద్యోగ యువకులు కాంగ్రెస్‌కు ఓటు వేయడంతో పాటు తల్లిదండ్రులతో కూడా వేయిస్తే 90 లక్షల ఓట్లతో పాటు 90 సీట్లు వస్తాయని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగా నే జాబ్ క్యాలండర్ ప్రకారం ఉద్యోగ నియామకా లు చేపడుతుందని హామీ ఇచ్చారు. ఒక ఆడబిడ్డ కుటుంబాన్ని అవమానించేలా వ్యవహరించిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు.

రోడ్డు మీదే అరెస్టు.. ఉద్రిక్తత




రేవంత్‌రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

నాంపల్లి: రాష్ట్రంలో డబ్బులు, మద్యం పంచకుండా ఎన్నికలను నిర్వహించాలంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరిన రేవంత్‌రెడ్డి ఉదయం పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలతో కలిసి తెలంగాణ అమరవీరుల స్థూపం గన్‌పార్కు సమీపానికి చేరుకున్నారు. పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ వస్తున్న వారిని పోలీసులు అడ్డుకున్నారు. గన్‌పార్కుకు అనుమతించకుండా రోడ్డు మీదనే అరెస్టు చేశారు. ఈ సందర్భంగా గన్‌పార్కు వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసు కుంది. కార్యకర్తలను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. సుమారు గంటన్నర సేపు అక్కడ హైడ్రామా నడిచింది. పోలీసులు ఎంత సర్దిచెప్పినా రేవంత్ రెడ్డి వినకపోవడంతో బలవంతంగా అక్కడినుంచి తరలించారు. ఆ తర్వాత అంజన్‌కుమార్ యాదవ్ గన్‌పార్కు నుంచి హాకా భవన్ చౌరస్తాకు చేరుకుని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

గోషామహల్‌లో ఎంఐఎం పోటీ చేయదా?

కామారెడ్డిలో కాంగ్రెస్ నుంచి ఎన్నికవుతూ వస్తున్న షబ్బీర్ అలీ అనే మైనారిటీ నేతను ఓడించేందుకు కేసీఆర్ అక్కడి నుంచి పోటీ చేస్తున్నారని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఓ మైనారిటీని ఓడించేందుకు పోటీ చేస్తున్న కేసీఆర్‌కు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ మద్దతివ్వడం వెనుకున్న ఒప్పందం ఏంటని ప్రశ్నించారు. అలాగే ఎంఐఎంను, ఒవైసీ కుటుంబాన్ని దూషించిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై ఎంఐఎం ఎందుకు పోటీ చేయడం లేదో చెప్పాలన్నారు. మోదీ, కేసీఆర్, అసదుద్దీన్ ఒవైసీ ముగ్గురూ ఒక్కటేనని రేవంత్ చెప్పారు.

బీఆర్ఎస్ రెబెల్‌గా చేవెళ్ల నుంచి పోటీ: రత్నం



చేవెళ్ల: చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ రెబెల్ అభ్యర్థి గా పోటీ చేస్తానని ఆ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మంగళవారం ఆయన చేవెళ్లలో విలేకరులతో మాట్లాడారు. తనకు రాజకీయ భిక్ష పెట్టిన ఈ గడ్డకు ప్రాణం ఉన్నంత వరకు సేవ చేస్తానని వ్యాఖ్యానించారు. తనను నమ్ముకుని ఉన్న కార్యకర్తల కోరిక మేరకు ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని చెప్పారు. పదేళ్లుగా వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వీరికి భరోసాగా నిలిచేందుకు ఎన్నికల బరిలో ఉంటానని రత్నం వెల్లడించారు. ప్రస్తుత రాజకీయాలు డబ్బులమయంగా మారిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. పార్టీ అధిష్టానం కూడా తనకు సముచిత న్యాయం చేస్తామని భరోసా ఇచ్చిందన్నారు. కానీ తన కార్యకర్తలు మాత్రం అప్పటి వరకు వేచి చూడాల్సిన పనిలేదని, పోటీలో ఉండాల్సిందేనని పట్టుబడుతున్నారని రత్నం తెలిపారు.

తెలంగాణ ఎన్నికల ఏఐసీసీ అబ్జర్వర్‌గా ఎంపీ తిరునావక్కరసు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఏఐసీసీ పరిశీలకుడిగా ఎంపీ తిరునావక్కరసును ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

కేసీఆర్‌ది అహంకార, దుర్మార్గ పాలన

- దానిని అంతం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు
- నన్ను తొక్కిపడేసే శక్తి హరీశ్‌రావుకు లేదు: ఈటల రాజేందర్

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ అహంకార, దుర్మార్గపు పాలనను అంతం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. అలవికాని హామీలతో కేసీఆర్ ప్రజలను మరోసారి బురిడీ కొట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని, అయితే ఈసారి బీఆర్ఎస్‌కి ప్రజలు ఓటు వేయడానికి సిద్ధంగా లేరని చెప్పారు. తొమ్మిదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రజలకిచ్చిన అనేక హామీలు అమలు కాలేదని ఆయన మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికి హుజూరాబాద్ ప్రజలకు అవకాశం వచ్చిందని, ఇప్పుడు గజ్వేల్ ప్రజలు కూడా సదవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు సిద్ధమవుతున్నారన్నారు. గజ్వేల్‌లో పేదల భూములు గుంజుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పగిస్తున్న దుర్మార్గపు వ్యవస్థ నడుస్తోందని, మరోసారి అక్కడ గెలిస్తే 40, 50 ఏళ్లుగా పేదలు సాగుచేస్తున్న భూములను గుంజుకుని ప్రైవేట్ వారికి కట్టబెడతారన్నారు. 'ఈటల రాజేందర్‌కు మద్దతు ఇస్తే తొక్కిపడేస్తా అని మంత్రి హరీశ్‌రావు అంటున్నారట.. తొక్కిపడేసే శక్తి నీకు లేదు. నిన్ను తొక్కిపడేసేది గజ్వేల్ ప్రజలు' అని ఈటల హెచ్చరించారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఓరుగంటి కిట్టు, నాగార్జునసాగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ముఖ్య నేత రంజిత్‌యాదవ్, చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ చక్రధర్ తదితరులు బీజేపీలో చేరారు. ఈటల, ఇతర నేతలు వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.



బీజేపీలో చేరిన నేరేడుచర్ల మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శ్రీలతారెడ్డి

బీజేపీతోనే న్యాయం: శ్రీలతారెడ్డి

ఈ సందర్భంగా శ్రీలతారెడ్డి మాట్లాడుతూ 'బీఆర్ఎస్ పాలనలో ప్రజల ఆకాంక్షలు, లక్ష్యాలు, ఆశయాలు నెరవేరలేదని, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. సంకినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీలు చేసిన అభివృద్ధి ఏమిటో కూడా చెప్పుకోలేని పరిస్థితి నెలకొందన్నారు.

నేడు రామప్ప ఆలయానికి | రాహుల్, ప్రియాంక

- ఆరు గ్యారంటీల మేనిఫెస్టోకు ఆలయంలో పూజలు
- అక్కడి నుంచి రామాంజాపూర్‌లో నిర్వహించే మహిళా విజయభేరి సభకు
- రాత్రి భూపాలపల్లిలో బస చేయనున్న రాహుల్

సాక్షి, హైదరాబాద్/వెంకటాపురం(ఎం): మూడు రోజుల రాష్ట్ర పర్యటనకు రానున్న ఏఐసీసీ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ బుధవారం ములుగు జిల్లాలో పర్యటించనున్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడతారని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మంగళవారం మీడియాకు చెప్పారు. సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో రాహుల్, ప్రియాంక పాలంపేటకు చేరుకుంటారన్నారు. అక్కడినుంచి కాన్వాయ్‌లో 4:15 గంటలకు రామప్ప ఆలయానికి చేరుకొని కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల మేనిఫెస్టోను వారు రామలింగేశ్వరుడి ముందు పెట్టి పూజలు చేస్తారని తెలిపారు. శివుడిపై రాహుల్, ప్రియాంకతోపాటు తనకూ విశ్వాసం ఉందన్నారు. అనంతరం 4:45 గంటలకు ఆలయం నుంచి బస్సుయాత్ర ద్వారా రామాంజాపూర్‌లో ఏర్పాటుచేసిన మహిళా విజయభేరి సభా ప్రాంగణానికి బయలుదేరుతారు. అక్కడ రాహుల్, ప్రియాంక మహిళలను ఉద్దేశించి ప్రసంగించి, మహిళా డిక్లరేషన్ కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించనున్నారు. సభ అనంతరం ప్రియాంక ఢిల్లీకి పయనం కానుండగా, రాహుల్ బుధవారం రాత్రి భూపాలపల్లిలో బస చేస్తారు. రాహుల్ గురువారం ఉమ్మడి కరీంనగర్, శుక్రవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల్లో బస్సుయాత్ర సాగించనున్నారు. దసరా సెలవుల తరువాత రాహుల్ మలి దశ బస్సుయాత్ర ఉంటుంది. కాగా, రాహుల్, ప్రియాంక పర్యటన సందర్భంగా ములుగు ఎమ్మెల్యే సీతక్క మంగళవారం రామాంజాపూర్ సభాస్థలిని పరిశీలించారు. మహిళా విజయభేరికి పార్టీ శ్రేణులు, అభిమానులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



రామాంజాపూర్‌లో సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సీతక్క, కాంగ్రెస్ నాయకులు

ప్రజల ఆ ఒక్క కోరికా | తీరుతుందేమో!

- పోటీ చేయకుండానే పీవీ నర్సింహారావు ప్రధాని కాలేదా
- నా కొడుకు రాజీనామా చేస్తాడు.. నేను ఎమ్మెల్యే అవుతా..
- సీఎం పదవిపై మాజీమంత్రి జానారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



గుర్రంపోడు (నాగార్జునసాగర్): 'నేను ఏ హోదాలో ఉన్నా ముఖ్యమంత్రిగా ఉన్నట్లుగానే లెక్క.. 55 ఏళ్ల రాజకీయ అనుభవమున్న నన్ను తెలుగు రాష్ట్రాల్లో అందరూ గౌరవిస్తున్నారు, ముఖ్యమంత్రిగా చూడాలనే ఆకాంక్ష ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. నేను ఆశించకుండానే అనేక పదవులు వచ్చాయి. ఏ ముఖ్యమంత్రీ చేయని పలు శాఖలకు మంత్రిగా పనిచేశా.. ప్రజల ఆ చివరి కోరిక కూడా నాకు తెలియకుండానే తీరవచ్చు'అని మాజీమంత్రి కుందూరు జానారెడ్డి వ్యాఖ్యానించారు. 'పదవుల రేసులో నేను ఎప్పుడూ లేను, పదవే రేసులో ఉండి నన్ను వరిస్తుంది'అని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేయకుండానే పీవీ నర్సింహారావు ప్రధానమంత్రి కాలేదా.. ముఖ్యమంత్రి అయినంక, ఆరు నెలల తర్వాత నా కొడుకు రాజీనామా చేస్తాడు.. నేను ఎమ్మెల్యే అవుతా'అంటూ వ్యాఖ్యానించారు. మంగళవారం నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలో జెడ్పీటీసీ సభ్యురాలు గాలి సరితా రవికుమార్, పదిమంది సర్పంచ్‌లు, ఒక ఎంపీటీసీ, పలువురు నాయకులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జానారెడ్డి మాట్లాడారు. మరోమారు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ మాయమాటలకు ప్రజలు మోసపోవద్దని కోరారు. సమావేశంలో నాగార్జునసాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు జయవీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గుర్రంపోడు మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఎమ్మెల్యే బాపూరావు గుడ్‌బై

త్వరలో కాంగ్రెస్‌లో చేరిక

- రేవంత్‌రెడ్డితో భేటీ.. బోథ్ టికెట్ కోసం దరఖాస్తు



సాక్షి, హైదరాబాద్, ఆదిలాబాద్: బీఆర్ఎస్‌కి బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు గుడ్‌బై చెప్పారు. త్వరలో కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. బోథ్ టికెట్ కోసం దరఖాస్తు సమర్పించారు. బీఆర్ఎస్ అధిష్టానం ఈసారి బోథ్ నియోజకవర్గం టికెట్‌ను బాపూరావుకు కాకుండా జెడ్పీటీసీ అనిల్‌జాదవ్‌కు టికెట్ కట్టబెట్టింది. ఈ నేపథ్యంలో రేవంత్‌ను కలిసిన బాపూరావు పలు అంశాలపై చర్చలు జరిపారు. బోథ్‌లో తనకు కాంగ్రెస్ టికెట్ ఇస్తే విజయం సాధిస్తానని స్పష్టం చేసినట్టు తెలిసింది. కాంగ్రెస్‌లో ఎప్పుడు చేరుతున్నారని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావును 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా, త్వరలోనే చేరుతానని తెలిపారు. కాగా, బీఆర్ఎస్, బీజేపీల నుంచి కాంగ్రెస్‌లోకి చేరికల పరంపర కొనసాగు తోంది. జీహెచ్‌ఎంసీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర నేతలు రేవంత్ నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డి సమక్షంలో పలువురు నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కల్వకుర్తి, కొడంగల్ నియోజకవర్గాలకు చెందిన మాజీ ఎంపీపీలు రాంరెడ్డి, సాంబయ్య గౌడ్, సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్‌లో చేరారు. షాద్ నగర్ నియోజకవర్గానికి చెందిన సర్పంచ్‌లు ప్రతాప్, మంజుల, బాల్ రాజు, గోపాల్, రాములు, యాదయ్య, జహంగీర్, కౌన్సిలర్లు, ఇతర నేతలు కూడా కాంగ్రెస్‌లో చేరారు.

HONDA



SUPER 6 OFFERS*

Low ROI	No Cost	Cashback Upto	Down Payment		No
@ 6.99%	EMI	₹5000	₹0	100 Pe 100	Hypothecation

1. Connect earphones
2. Scan QR code
3. Enjoy the video

For dealer details, WhatsApp or missed call on 7230032200 or scan the QR Code

ACTIVA 30 MILLION#

BOOK ONLINE NOW!

CLICK BOOK RELAX

Honda Motorcycle & Scooter India Pvt. Ltd., Registered Office: Plot No. 1, Sector - 03, IMT Manesar, Distt. Gurugram, (Haryana) – 122050, India; **Website:** www.honda2wheelersindia.com; **Customer Care:** customercare@honda2wheelersindia.com

*Terms and Condition apply. Product shown in the picture may vary from the actual product available in the market. Accessories shown in the product are not part of the standard equipment. #Source: Cumulative sales figure of Brand Activa from June 2001 to June 2023.

Honda Exclusive Authorized Dealerships: **HIMAYAT NAGAR:** Autofin Honda - 9985550099, 9908055755; **NAMPALLY:** Autofin Honda - 9985550099; 9701022300; **UPPAL:** Autofin Honda - 9985550099, 9989129090; **DOMALGUDA:** Autofin Honda - 9985550099, 8886629908; **M.G. ROAD:** Fortune Honda - 27570000, 9948888084; **MALKAJGIRI:** Fortune Honda - 27249166, 9948831000; **SAINIKPURI:** Fortune Honda - 27114200, 9948888085; **KUSHAIGUDA:** Fortune Honda - 65816112, 9948888767; **NEW BHOIGUDA:** Fortune Honda - 04029888801, 9948888051; **W. MARREDPALLY:** Fortune Honda - 29709044, 99488 88079; **DAMMAIGUDA:** Fortune Honda - 9948888048; **SP ROAD:** Fortune Honda - 48541878, 9948877736; **KUKATPALLY:** JSP Honda - 18005727177, 9959251133; **MADINAGUDA:** JSP Honda - 9959251188; **CHINTAL:** JSP Honda - 23084477, 9959891100; **BALKAMPET:** JSP Honda - 9959045592; **MIYAPUR:** JSP Honda - 9959891133; **GANDIMAISAMMA:** Ojasvi Honda - 9000003316; **SOMAJIGUDA:** Pratul Honda - 66732233, 7036532323; **ERRAGADDA:** Pratul Honda - 23801312, 9959532323; **MALAKPET:** Aadi Honda - 44178888/77/99, 9399999408; **NAGOLE:** Aadi Honda - 9399999402; **MOOSARAMBAGH:** Aadi Honda - 900030445; **KOTHAPET:** Aadi Honda - 9533120625; **SANTOSH NAGAR:** Aadi Honda - 9397999304, 8019798113; **VANSTHALIPURAM:** Deccan Honda - 8340866669, 8340866660; **B N REDDY NAGAR:** Deccan Honda - 04035164961, 04035164962; **TADBUND:** Raam Honda - 9100091054; **BALANAGAR:** Raam Honda - 9100211168; **TIRUMALAGIRI:** Raam Honda - 8886645057; **ALWAL:** Raam Honda - 9100091052; **MEDCHAL:** Sowmya Honda - 9951044400; **TOLICHOWKI:** Orange Honda - 9160188880; **MASAB TANK:** Orange Honda - 9581797921; **BAHADURPURA:** Maximus Honda - 7670820146/147/148/149, 9705806488; **IBRAHIMPATNAM:** Maximus Honda - 9293946999; **ATTAPUR:** Dwaraka Honda - 24001221, 8977001221; **SHAMSHABAD:** Dwaraka Honda - 9000633877; **KONDAPUR:** Vaishnaoi Honda - 9908822933, 9618277911; **GACHIBOWLI:** Vaishnaoi Honda - 8886604419, 8886604420; **VIKARABAD:** 8886720099, 8886940099; **MADHAPUR:** 7799345543, 7799765765; **HABSIGUDA:** Ride Honda - 7207022299, 9885418834; **GHATESKAR:** Ride Honda - 9885014931; **MEDIPALLY:** Ride Honda - 9885014935; **KOMPALLY:** Raam Honda - 9100771605; **CHANDRAYANGUTTA:** Maximus Honda - 8501026666, 24446477; **NARSAPUR:** A1 Honda - 9440202875; **KOTHUR:** Sun Honda - 08548-256161, 9000245092; **TURKYAMJAL:** Sri Sai Honda - 08415-234848, 9391334848; **TUKKUGUDA:** Dwarka Honda - 7730888843; **MEDAK RC PURAM:** Harmony Honda - 23180000, 9491025000; **SANGAREDDY:** VenkataSaai Honda - 9603755559; **GAJWEL:** VenkataSaai Honda -9133925559; **SIDDIPET:** Harmony Honda - 9491025048; **ZAHEERABAD:** Harmony Honda - 9491025020; **SADASIVPET:** Sree Krishna Honda - 9885921659; **MEDAK:** Sri Venkateshwara Honda - 9032003412, 08452-221999; **TOOPRAN:** VenkataSaai Honda - 9121095559; **JOGIPET:** VenkataSaai Honda - 9121395559.

For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com



ఒక్క క్షణం ఒక రోజునే మార్చగలదు.
ఒక్క రోజు ఒక జీవితాన్నే మార్చగలదు.
ఒక్క జీవితం ప్రపంచాన్నే మార్చగలదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 18 అక్టోబర్ 2023

రంగుల ఒలింపిక్స్ స్వప్నం

ఎప్పటి నుంచో వింటున్నదే... తెర వెనుక జోరుగా ప్రయత్నాలు సాగుతున్నదే... ఇప్పుడు అధికారికంగా ఖరారైంది. 128 ఏళ్ళ సుదీర్ఘ విరామం తర్వాత క్రికెట్ మళ్ళీ విశ్వక్రీడల్లో పునఃప్రవేశం చేయనుంది. మరో అయిదేళ్ళలో రానున్న 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో ఈ 'జెంటిల్మెన్ క్రీడ' సహా స్క్వాష్, బేస్‌బాల్/ సాఫ్ట్‌బాల్, లక్రాస్, ఫ్లాగ్ ఫుట్‌బాల్ ఆటలు అయిదింటిని అదనంగా ప్రవేశపెట్టనున్నారు. భారత్‌లో 50 ఓవర్ల ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ జరుగుతున్న వేళ ఈ ప్రకటన రావడం విశేషం. ముంబయ్‌లో 141వ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ప్రారంభ సమావేశంలో మాట్లాడుతూ, భారత్‌లో 2036 నాటి ఒలింపిక్స్ నిర్వహణకు మన ప్రధాని బాహాటంగా ఉత్సుకతను వ్యక్తం చేశారు. ఆ వెంటనే రెండు రోజులకే ఒలింపిక్ కార్యక్రమ సంఘం అధ్యక్షుడు కార్ల్ స్టాస్ క్రికెట్‌కు ఒలింపియాడ్‌లో స్థానాన్ని ప్రకటించడం ఉత్సాహం నింపింది. కాలానికి తగ్గట్టు మారే ఈ ప్రయత్నం అభినందనీయమే. అదే సమయంలో ఇది పలు సవాళ్ళపై చర్చ రేపింది.

ఎప్పుడో 1900లోనే తొలిసారిగా ప్యారిస్ ఒలింపిక్స్‌లోనే క్రికెట్ భాగమైంది. తర్వాత ఇన్నేళ్ళకు లాస్ ఏంజెల్స్‌లో మళ్ళీ తెరపైకి వస్తోంది. స్క్వాష్ సహా మిగతా 4 ఆటలకు విశ్వ క్రీడాంగణంలో ఇదే తెరంగేట్రం. ప్రపంచంలోని అతి పెద్ద క్రీడా సంరంభం నుంచి ఇన్నేళ్ళుగా క్రికెట్‌ను దూరంగా ఉంచడం దురదృష్టకరమే! ఇప్పుడు టీ–20 క్రికెట్ విస్తృత ప్రాచుర్యం పొందడమే కాక మునుపెన్నడూ లేని విధంగా ప్రపంచంలోని అనేక దేశాలు ఆ ఫార్మట్ పోటీల్లో పాల్గొంటున్నాయి. ఈ నేపథ్యంలో టీ–20 క్రికెట్‌కు కూడా చోటివ్వడం ప్రజాస్వామ్యబద్ధమైన ఆలోచన. తద్వారా ఒలింపిక్స్ మరింత చేరువవుతుంది. ఫుట్‌బాల్ తర్వాత ప్రపంచంలో అత్యధికులు అనుసరించే క్రీడగా క్రికెట్ ప్రసార, ప్రచార హక్కులతో ఒలింపిక్ సంఘానికి వచ్చే ఆదాయం, అటు నుంచి భారత్‌కు లభించే వాటా సరేసరి. అందుకే, ఐఓసీ తీసుకున్న ఈ నిర్ణయం వెనుక చాలా లెక్కలే ఉన్నాయి.

అయితే చిన్న తిరకాసుంది. క్రికెట్ సహా కొత్తగా చేరే ఆటలన్నీ 2028 ఒలింపిక్స్‌కే పరిమితం. వాటిని తర్వాత కొనసాగించాలా లేదా అన్నది ఆపైన 2032లో ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చే బ్రిస్బేన్ నిర్ణయిస్తుంది. నిజానికి, కామన్వెల్త్ దేశాలే కాక, ప్రపంచమంతా ఆడే విశ్వక్రీడగా క్రికెట్ విస్తరించాల్సి ఉంది. ఐఓసీ గుర్తింపు పొందిన 206 దేశాల్లో ప్రస్తుతం 50 శాతాని కన్నా తక్కువ చోట్లే క్రికెట్ ఆడుతున్నారు. కనీసం 75 శాతం చోట్ల క్రికెట్ తన ఉనికిని చాటాల్సి ఉంది. అది ఓ సవాలు. కొన్ని ఐఓసీ సభ్యదేశాలు చేస్తున్న ఈ వాదన సబబే. అలాగే, కొత్తగా ఒలింపియాడ్‌లోకి వస్తున్న అయిదింటిలో నాలుగు... టీమ్ స్పోర్ట్స్. కాబట్టి, క్రీడాగ్రామంలో ఆటగాళ్ళ సంఖ్య అంగీకృత కోటా 10,500 కన్నా 742 మేర పెరుగుతుంది. గేమ్స్ విలేజ్‌పై భారం తగ్గించడానికి ఇతర ఆటల్లో అథ్లెట్ల కోటా తగ్గించడం, కొన్ని మెడల్ ఈవెంట్లను ఈసారికి పక్కనపెట్టడమే మార్గం. అది కొంత నిరాశే!

అలాగే, ఒలింపిక్స్‌లోకి క్రికెట్ పునఃప్రవేశం బాగానే ఉంది కానీ, అగ్ర క్రికెటర్లు ఆ క్రీడాసంరంభంలో కాలుమోపుతారా అన్న అనుమానం పీడిస్తోంది. ఇటీవలి ఏషియన్ గేమ్స్ అనుభవమే అందుకు సాక్ష్యం. ఆసియా ఖండంలోని అధిక భాగం అగ్రశ్రేణి జట్లు ప్రధాన ఆటగాళ్ళను అక్కడకు పంపనే లేదు. అదేమంటే, దగ్గరలోనే 50 ఓవర్ల ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ ఉందన్నాయి. ఇండియా అయితే ఏషియాడ్‌కి క్రికెట్ జట్టునే పంపకూడదనుకుంది. ఆఖరు క్షణంలో క్రికెట్ బోర్డ్ మనసు మార్చుకుంది. వచ్చే 2028 నాటి అంతర్జాతీయ క్రికెట్ క్యాలెండర్ ఇంకా ఖరారు కాలేదు గనక, ఆ ఏడాది జూలైలో 16 రోజుల పాటు సాగే ఒలింపిక్స్‌లో అగ్రతారలు ఆడేందుకు వీలుగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) షెడ్యూల్‌ను ఖరారు చేస్తుందని ఒలింపిక్ సంఘం ఆశాభావంలో ఉంది.

గతంలో యూ23 అవతారంలో ఒలింపిక్స్‌లో ఫుట్‌బాల్ ప్రయోగం చేశారు. కానీ, ఆదరణ, ఆదాయం అంతంతే! టెన్నిస్, గోల్ఫ్‌లను చేర్చుకున్నా, ప్రథమశ్రేణి పేర్లు కనపడలేదు. ఇక, వరుణుడి కరుణపై ఆధారపడడం క్రికెట్‌కు మరో తలనొప్పి. తాజా ఏషియాడ్‌లో వాన వల్ల మ్యాచ్ రద్దయి, టీ20 ర్యాంకింగ్‌ను బట్టి స్వర్ణపతక విజేతను నిర్ణయించిన ప్రహసనం చూశాం. ఇక, 2036 ఒలింపిక్స్‌ను భారత్‌లో నిర్వహించేలా సర్వశక్తులూ ఒడ్డుతామని మోదీ ప్రకటించడం సంతోషమే అయినా, సాధ్యాసాధ్యాలపై అనుమానాలున్నాయి. జీ20 సదస్సు, ఏషియాడ్‌లో పతకాల శతకం తెచ్చిన ఉత్సాహంలో ప్రధాని దీన్ని '140 కోట్ల ప్రజల స్వప్నం'గా పేర్కొన్నారు. కానీ, వేల కోట్లతో స్టేడియమ్‌లు నిర్మించేకన్నా సామాన్యులకు కూడుగూడుపై దృష్టి పెట్టాలనే వాదనని విస్మరించలేం.

భారీ ఖర్చు రీత్యా 2026 కామన్వెల్త్ గేమ్స్ నిర్వహించడానికి సైతం ఆస్ట్రేలియా చేతులెత్తేసింది. ఇక, 2010లో మన కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణ అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయింది. అప్పట్లో భారత ఒలింపిక్ అసోసియేషన్‌ను 14 నెలలు ఐఓసీ బహిష్కరించింది. అవన్నీ మనం మర్చిపోరాదు. 2035 నాటికి భారత్ 6 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థ అవుతుందనీ, 2047కి అగ్రరాజ్యంగా అవతరిస్తామనీ జబ్బలు చరుస్తున్న వేళ ఒలింపిక్స్ స్వప్నం వసతులు పెంచుకోవడానికీ, క్రీడా ప్రతిభను పెంచిపోషించుకోవడానికీ ఉపయుక్తమే! దాని వెంటే ఉన్న సవాళ్ళతోనే సమస్య. తలసరి ఆదాయంలో మనల్ని ఎంతో మించిన లండన్, టోక్యో, ప్యారిస్, సియోల్‌లకున్న సహజమైన సానుకూలత మనకుందా? సంబరం ముగిశాక ఏథెన్స్, రియో లాంటి ఆతిథ్య దేశాలకు ఐరావతాలుగా మారి క్రీడాంగణాల్ని వాడుకొనే ప్రణాళిక ఉందా? పేరుప్రతిష్ఠలతో పాటు ప్రజలకూ పనికొచ్చేలా వ్యూహరచన చేస్తేనే ఎంత రంగుల కలకైనా సార్థకత.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
ఆశ్వయుజమాసం, తిథి: శు.చవితి రా.11.26 వరకు
తదుపరి పంచమి, నక్షత్రం: అనూరాధ రా.8.26 వరకు
తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: రా.1.56 నుండి 3.33 వరకు,
దుర్ముహూర్తం: ఉ.11.22 నుండి 12.09 వరకు,
అమృత ఘడియలు: ఉ.9.54 నుండి 11.31 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

బహుజనులకు అదే విముక్తి మార్గం

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

కోట్లాది మంది రాజ్యాధికారానికి నోచుకోకుండా పోవడానికి రాజకీయాల్లో ఉన్న వర్ణతత్వమే కారణం అన్నారు అంబేడ్కర్. నిజానికి అంబేడ్కర్, మహాత్మా పూలే, పెరియార్ రామస్వామి నాయకర్ బహుజన వర్గాల సామాజిక, సాంస్కృతిక రాజకీయ విముక్తి కోసం బాటలు వేస్తూనే వచ్చారు. కానీ దళిత బహుజనులు, మైనారిటీలు మత భావాల ఊబిలో కూరుకుపోయారు. రాజ్యాధికారాన్ని అగ్రవర్ణ పార్టీల మీద ఆధారపడి పొందాలనే భావనలోనే ఇంకా ఉన్నారు. దేశంలో సామాజిక న్యాయం సంపూర్ణంగా జరగాలంటే కులాల వారీగా జనాభా లెక్కలు సేకరించాలి. శూద్రులను రాజకీయంగా, ఆర్థికంగా పైకి తేవడం అన్ని పార్టీల తక్షణ కర్తవ్యం కావాలి.

బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రారంభించిన బీసీ కుల గణన ఇండియా కూటమికి ప్రధాన ఎజెండాగా ఉంది. దేశంలో సామాజిక న్యాయం సంపూర్ణంగా జరగాలంటే కులాల వారీగా జనాభా లెక్కలు సేకరించాలి. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల జరుగుతున్నాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మిజోరం, తెలంగాణ వంటి ముఖ్యమైన రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో దగ్గర దగ్గర 16.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో దళిత బహుజన మైనారిటీలు 85 శాతం. అభ్యర్థులుగా నిలబడుతున్న మెజారిటీ వర్గం అగ్ర కులాలే.

డబ్బును, మద్యాన్ని నియంత్రించడానికి ఈ రాష్ట్రాల్లో 970 చెక్‌పోస్టులు పెట్టారని చెబుతున్నారు. నిజానికి ఎన్నికల వ్యవహారం మొత్తం మద్యం, మాఫియా, డబ్బు పంపిణీలో మునిగిపోయి వుందని అందరికీ తెలుసు. ఎన్నికల బరిలో కోటీశ్వరులు, అవినీతి సమ్రాట్లు, కల్తీ వ్యాపారులు, విద్యా వ్యాపారులు ఎక్కువమంది నిలబడుతున్నారు. కేసుల్లో ఉన్నవారు భారీగా ఉన్నారు. దీనికి పార్టీల భేదం లేదు. అందులో ఉన్నవారు ఇందులో ఉంటారు. ఆ పార్టీలో ఉన్నవారు టికెట్ లేకపోతే రెండో రోజే జంప్ అవుతారు. సామాజిక న్యాయానికి దూరంగా బతుకుతున్న పార్టీలు ఇవన్నీ. ఇంతకుముందు ఇచ్చిన మానిఫెస్టోనే మరలా కొత్తగా ప్రకటిస్తారు.

రాజ్యాంగాన్ని పూర్తి చేసిన తరువాత అంబేడ్కర్ చేసిన ప్రకటన చాలా విలువైనది. జనవరి 26, 1950 నుంచి వైరుధ్యాల జీవితంలోకి మనం అడుగు పెడుతున్నాం. రాజకీయాల్లో, ఆర్థిక, సాంఘిక జీవితాల్లో అసమానత్వం, వైరుధ్యాలను తొలగించకపోతే అసమానత్వంతో బాధపడుతున్న ప్రజలు ఈ రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థను పేల్చివేస్తారు అని హెచ్చరించారు. ఇది చాలా వాస్తవమైన ప్రకటన. రాజ్యాంగం ఇచ్చిన హక్కును గౌరవించలేని అంధత్వం సోకాల్డ్ రాజకీయ నాయకుల్ని వెంటాడుతోంది.

అంబేడ్కర్ భారతదేశానికి బ్రాహ్మణవాదం, పెట్టుబడిదారీ వాదాలను శత్రువులన్నాడు. బ్రాహ్మణవాదం అంటే ఇది బ్రాహ్మణులకు పరిమితమైంది కాదు. నా కులమే అన్ని కులాల కంటే అధికమైందనే భావం, ఆ కుల భావంతో ఇతరులను కించపరచడం. నేను, నా కుటుంబం, నా కులం మాత్రమే ఆర్థికంగా పైకి రావాలని ఆలోచించడం. కులాన్ని, కుటుంబాన్ని దాటలేనివాడు రాజనీతిజ్ఞుడు కాలేడు.

అంబేడ్కర్ ఆలోచనలు ఆనాటి నుండి ఈనాటి వరకు సమకాలీనంగానే ఉండడానికి కారణం సమాజంలో మార్పు చాలా ఆలస్యంగా జరుగుతోంది. నిజానికి కాంగ్రెస్ పార్టీ బీసీలకు మొదటి నుండి అన్యాయం చేస్తూనే వచ్చింది. కాకా కాలేల్కర్ కమీషన్‌ను తొక్కిపెట్టింది. మండల్ కమిషన్‌ను తొక్కి పెట్టింది. ఇకపోతే 1951లో రాజ్యాంగంలో 15(4), 16(4) క్లాజులను పొందుపరచి రాజ్యాంగ పరంగా బీసీ రిజర్వేషన్లకు వున్న అడ్డంకి తొలగించబడింది. అక్కడి



నుండి 1978 వరకు పరిపాలనలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను తమ రాజకీయ చదరంగంలో పావులుగా వాడుకున్నదే తప్ప వారి సంక్షేమానికి ఇసుమంత సౌలభ్యాన్ని కూడా కలిగించలేదు. 2012–1978న అప్పటి జనతాపార్టీ ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ పార్లమెంటులో చేసిన ప్రకటన మేరకు మాజీ పార్లమెంటు సభ్యులు బి.పి. మండల్ అధ్యక్షతన వెనుకబడిన తరగతుల కమీషన్ నియమింపబడింది. ఆ కమీషన్‌లో ఆర్.ఆర్. బోలే, దివాన్ మోహన్ లాల్, దీనబంధు సాహు, కె. సుబ్రహ్మణ్యం, యస్.యస్. గిల్ సభ్యులుగా వున్నారు. ఈ కమిషన్ మొత్తం 40 సిఫార్సులను చేసింది. అందులో ప్రధానమైనవి:

సాంఘికంగా, విద్యా విషయకంగా వెనుకబాటుతనం, ఆర్థిక పేదరికం అనేవి అంగవైకల్యం పొందిన కుల వ్యవస్థ తాలూకు రెండు ప్రత్యక్ష ఫలితాలు. వీటిని తొలగించడానికి తీవ్రమైన పరిపాలనా మార్పులు అవసరం; రిజర్వేషన్లు వుండడం వలన అర్హత, యోగ్యత ఏమీ దెబ్బతినవు. జనాభాలో 52 శాతం వున్న వీరికి ఆ జనాభాకు తగిన రిజర్వేషన్లు విద్యా ప్రభుత్వోద్యోగాల్లో వుండాలి; ఉద్యోగ నియామకాలలో ప్రత్యక్షంగా భర్తీ చేసుకొనేటప్పుడు అభ్యర్థుల వయసు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల వలె పొడిగించాలి; ఆయా కులాల్లోని అభ్యర్థులు దొరకనపుడు ఖాళీలను మూడు సంవత్సరాల వరకు అట్టి పెట్టాలి; మిగులు భూముల పంపిణీ బీసీలకు కూడా జరపాలి; 3,743 కులాలను బీసీ కులాలుగా తేల్చారు.

మండల్ కమిషన్ నివేదిక అమలు జరపకపోవడం వల్లే ఆనాడు కాంగ్రెస్‌కు బీసీలు దూరమయ్యారు. ఆ తరువాత జనతా పార్టీ ఏర్పడిన తరువాత మండల్ కమీషన్ నివేదికలోని కొన్ని అంశాలు అమలు జరపడం గురించే జన సంఘ్ బయటకు వచ్చి భారతీయ జనతా పార్టీగా రూపొందింది. బీసీల రిజర్వేషన్ల విషయంలో బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒకటిగానే ఉన్నాయని మాజీ ప్రధాని వీపీ సింగ్ ఈ వ్యాసకర్తతో స్వయంగా అన్నారు. బీసీలంతా హిందువులే అని బీజేపీ ప్రకటిస్తుంది. శూద్రులను క్షత్రియత్వం నుండి కిందకి నెట్టి బానిసలుగా మార్చారని అంబేడ్కర్ చెప్పారు. ఏ బానిసత్వాన్ని అయితే వైదిక, బ్రాహ్మణవాదం, హిందూ వాదం బీసీలపై రుద్దిందో వారు అదే హిందూ ఆచారాలని ఆచరించడం ఆశ్చర్యాన్ని కొలిపే విషయం.

సామాజిక, రాజకీయ బానిసత్వం అనే భావజాలం కట్టు బానిసలుగా చేస్తుంది. శూద్రులను బానిసత్వం నుండి విముక్తి చేయడం కోసం, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో తీవ్రంగా కృషి చేశారు జ్యోతిబా పూలే. శూద్రులను రాజకీయంగా, ఆర్థికంగా పైకి తేవటం ప్రభుత్వ కర్తవ్యం. శూద్రుల మనస్సు హృదయమూ సంతోషపడినట్లయితే ముందు ముందు బ్రిటిష్ ప్రభుత్వం వారి విధేయత గురించి ఆలోచించవలసిన అవసరమే రాదు అన్నారు జ్యోతిబా. ఆయన ఉద్యమం 1840 నుండి 1880 వరకు బలంగా సాగింది. ఆయన సత్యశోధక్ సమాజాన్ని స్థాపించి శూద్రుల్లోనూ, దళితుల్లోనూ ఉత్తేజకరమైన మార్పులు తీసుకువచ్చాడు. శూద్రుల్లోని భూస్వామ్య కులాలు ఓబీసీల నుండి విడిపోయాక బ్రాహ్మణవాదులు, భూస్వామ్య కులాలు కలసి ఓబీసీలను, దళితులను అణుస్తూ వచ్చాయి. నిజానికి 1870 దశకంలోనే జ్యోతిబా, ఆయన శ్రీమతి నిమ్న జాతుల పాఠశాలల కోసం సుమారు పది సంవత్సరాల పాటు కృషి చేశారు. అవి స్థిరపడ్డాయనుకొన్న తర్వాతనే ఇతర సాంఘిక, సేవా కార్యక్రమాలవైపు దృష్టి మళ్ళించారు. అయితే విదేశీయుల ఆదరణ తగ్గటం, స్థానికులు వాటిపై తగినంత శ్రద్ధ చూపకపోవటం వంటి కారణాల వల్ల అవి ప్రత్యేకంగా నిలబడలేకపోయాయి.

నిజానికి దళితులని, శూద్రులని ఎప్పటికప్పుడు నూత్నమైన నినాదాలతో అగ్రకుల పార్టీలు మోసం చేస్తూనే వస్తున్నాయి. అంబేడ్కర్, మహాత్మా పూలే, పెరియార్ రామస్వామి నాయకర్ ఈ వర్గాల సామాజిక, సాంస్కృతిక రాజకీయ విముక్తి కోసం బాటలు వేస్తూనే వచ్చారు. కానీ దళిత బహుజనులు, మైనార్టీలు మత భావాల ఊబిలో కూరుకుపోయారు. రాజ్యాధికారాన్ని అగ్రవర్ణ పార్టీల మీద ఆధారపడి పొందాలనే భావనలోనే ఇంకా ఉన్నారు. ఇండియా కూటమి ఒక దళితుడిని ప్రధానమంత్రిగా ప్రకటించే స్థాయిలో ఎందుకు లేదు? నిరంతరం రాజ్యాంగ సూత్రాలను ధ్వంసం చేయాలనే ఆలోచనతో ముందుకెళ్తున్న బీజేపీని కొన్ని ప్రయోజనాలను ఆశించో, కొన్ని ఆచారాలకు లోబడో, మళ్ళీ మళ్ళీ ఎన్నుకుంటున్నారు. వారి గంభీరమైన ఉపన్యాసాలకు మైమరచిపోయి వారికి సామాజిక, రాజకీయ బానిసత్వం చేస్తూనే వస్తున్నారు. కోట్లాది మంది రాజ్యాధికారానికి నోచుకోకుండా పోవడానికి కారణం రాజకీయాల్లో ఉన్న వర్ణతత్వమే అన్నారు అంబేడ్కర్. ఆయన మార్గంలోనే విముక్తి ఉందని దళిత, బహుజనులు గమనించినప్పుడే మత, కుల భావాలకు అతీతంగా సమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

వ్యాసకర్త దళితోద్యమనేత | 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

గుర్తుకొస్తున్నాయి



అనిల్ నాకు చిరకాల మిత్రుడు. ఇండియా కోసం అనిల్‌తో కలిసి చాలా కాలం ఆడటం నా అదృష్టం. ఆటకు నిజమైన స్ఫూర్తి, స్ఫూర్తికి నిజమైన ఛాంపియన్ అనిల్. జన్మదిన శుభాకాంక్షలు మిత్రమా! (17 అక్టోబర్ అనిల్ కుంబ్లే బర్త్ డే.)

– సచిన్ టెండూల్కర్, క్రికెట్ దిగ్గజం

నా వల్ల కాదు



నవంబర్‌లో జరుగనున్న ఈ ఏడాది వెబ్ సమిట్‌కు నేను దూరంగా ఉండదలిచాను. అందుకోసం నా ప్రదర్శనను రద్దు చేసుకున్నాను. బదులుగా ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రజల శాంతి కోసం ప్రార్థిస్తున్నాను. హమాస్‌ను ఖండిస్తున్నాను.

– గ్యారీ ట్యాన్, 'వైకాంబినేటర్' సీఈవో

ఇలా ఎలా జరుగుతుంది!



వీగర్‌లో మారణహోమానికి, తైవాన్‌లో దురాగతాలకు, హాంకాంగ్‌లో మానవ హక్కుల హననానికి పాల్పడుతూ... ఉక్రెయిన్‌లో పుతిన్ చర్యలకు మద్దతు ఇస్తున్న చైనాతో వాణిజ్య చర్చల ప్రణాళికను సునాక్ (బ్రిటన్) ప్రభుత్వం గుట్టు చప్పుడు కాకుండా పునరుద్ధరించింది!

– బెనెడిక్ట్ రోజర్స్, యాక్టివిస్ట్–ఎనలిస్ట్

మతిపోతోంది!



డాక్టరుగా శిక్షణ పొందడంలో ప్రయోజనం ఏమిటి! నేను లింక్డ్‌ఇన్‌లో గమనిస్తున్నాను. పి.ఎ. (ఫిజీషియన్ అసోసియేట్)గా ఉద్యోగాలు చేస్తున్నవారి వేతనం డాక్టర్‌లకు వస్తున్న దాని కన్నా ఎంతో మెరుగ్గా ఉంది. నేనిప్పుడు పి.ఎ. అర్హతను పొందాలని చూస్తున్నాను. వైద్య డిగ్రీ ఉన్నవారు దరఖాస్తుకు అర్హులో కాదో మరి!

– డాక్టర్ నాట్, ఇంగ్లండ్

రేడియో తరంగాలు



కొత్త పుస్తకం 'ఇగ్నైటింగ్ కలెక్టివ్ గుడ్‌నెస్: మన్ కీ బాత్ ఎట్ 100'... ప్రధాని నరేంద్ర మోదీజీ నాయకత్వంలో మన దేశం చేపట్టిన ఒక ప్రత్యేక ప్రయాణం గురించి చెబుతుంది. నూరవ ఎపిసోడ్ మార్క్ దాటిన ఈ రేడియో ప్రసంగాల సంకలనాన్ని యువత తప్పనిసరిగా చదవాలి. పుస్తకాన్ని ప్రచురించిన 'బ్లూ క్రాఫ్ట్'కు అభినందనలు.

– అమిత్‌షా, కేంద్ర హోం మంత్రి


ముక్కలవని మనిషి



కుమార్తె షీనా బోరా హత్య కేసులో ప్రధాన నిందితురాలిగా అభియోగాలు మోసిన ఇంద్రాణీ ముఖర్జీ... కుష్వంత్‌సింగ్ లిటరరీ ఫెస్టివల్–2023లో తన పుస్తకం 'అన్‌బ్రోకెన్' గురించి మాట్లాడిన విధానం ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. స్వీయ ప్రేమ, సామాజిక నిబంధల గురించి ఎంతో లోతైన అవగాహనతో ఆమె తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

– బలరామ్ శర్మ, సామాజిక కార్యకర్త

విజాతి వికర్షణ



"క్వీర్‌నెస్ అనేది సహజమైన ఒక అసహజం. నగర జీవులది, ఉన్నత వర్గాలది కాదు" అని సుప్రీంకోర్టు చెప్పింది. 'క్వీర్' అంటే 'విజాతి ధ్రువాలకు ఆకర్షింపబడని' అని అర్థం. ఈ అసహజం 'సహజమే' అని కోర్టు అభిప్రాయపడింది కదా... మరి సజాతి పెళ్లిళ్లను గుర్తించడానికి ఎందుకు నిరాకరించినట్లు?

– ఆదిత్య రాథోడ్, జియో పొలిటికల్ జర్నలిస్ట్



అనుకరణ

మా అమ్మాయి
తన సైకిల్ హ్యాండిల్ మధ్య
గూడు అల్లుకున్న ఒక సాలె పురుగును
తీసెయ్యలేక పోయింది–
ఎదురుచూస్తూ ఉంది.
దానంతట అదే తన నివాసం
మార్చుకుంటుందేమోనని!

అప్పుడు నేనన్నాను
'ఆ గూడు తీసెయ్యరా బుజ్జీ
అప్పుడు దానికి తెలిసొస్తుంది
ఈ స్థలం తన ఇల్లు కాదనీ...
అప్పుడు నువ్ ఎంచక్కా
నీ బైక్ వాడుకోవచ్చు'– అని.


నా కూతురు ముఖంలో
ఆందోళన కనిపించింది–
'లేదు నాన్నా! లేదు
అలా చేయడం వల్లే కదా?
వలస వచ్చిన చాలామంది
నిరాశ్రయులై పోతున్నారూ?' అంది.

ప్రపంచం నా కళ్ళముందు
గిర్రున తిరిగింది!

మూలం: ఫాదీ జౌదా
(పాలస్తీనియన్–అమెరికన్ కవి)
తెలుగు: డాక్టర్ దేవరాజు మహారాజు

రెండు వేల ఏళ్ల పట్టణం

సందర్భం



గార రంగనాథం

ఒక వ్యక్తి ప్రఖ్యాతుడైనప్పుడు అతడి పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవాలనీ, అతడి క్రమాభివృద్ధిని అవగతం చేసుకోవాలనీ ఉత్కంఠ సహజం. ఒక ప్రాంతం వెలుగులోకి వచ్చినా అలాంటి ఉత్సుకతే జనానికి కలుగుతుంది. ఉత్తరాంధ్రకు చెందిన విశాఖ పట్టణం కార్యనిర్వాహక రాజధానిగా ముస్తాబవుతున్న గొప్ప సందర్భంలో ఆ పట్టణ చరిత్రను పరిశీలిద్దాం.


ఇతిహాసాలలో హస్తినాపురం, మధురానగరం, చరిత్రలో కళింగనగరం, ధాన్యకటకం, పిష్టపురం ఇలా నగరాలూ, పురాలూ, కటకాలూ ఉన్నాయేగానీ పట్టణాలు లేవు. బంగాళాఖాత తీరంలో విదేశాలతో వాణిజ్యం కోసం ఏర్పడిన కొన్ని రేవుల వద్ద ఏర్పడిన నగరాలను మాత్రం ఎందుచేతనో పట్టణాలుగా పిలవడం జరిగింది. గోపాలపట్టణం, కళింగపట్టణం, భీమునిపట్టణం, మచిలీపట్టణం, నాగపట్టణం, చెన్నపట్టణం, ఇలా. అలాంటిదే విశాఖపట్టణం కూడా!

విశాఖపట్టణం కళింగ దేశంలో ఒక భాగం. కళింగం ఆంధ్రం కంటే భిన్నమైన నేల. బౌద్ధమతం నందుల పాలనకు ముందే కళింగదేశంలో ప్రవేశించింది. మౌర్యుల కాలంలోనే బౌద్ధం కళింగ దేశంలో వ్యాప్తి చెందింది. విజయుడనే కళింగరాజు 700 మంది బౌద్ధ భిక్షువులతో బుద్ధుని అస్తికలను తీసుకొని కళింగ తీరపు రేవులో ఓడెక్కి సింహళం వెళ్ళాడని బౌద్ధ గ్రంథాలు తెలుపుతున్నాయి. కళింగ ప్రజలు జీవనోపాధికై తూర్పు దేశాలకు వలస వెళ్ళేవారు. కళింగ పట్టణం మొదలైన రేవుల నుండి ప్రజలు ఓడలెక్కి బర్మా, ఇండోనేషియా వంటి దేశాలకు వలస వెళ్ళారు. బౌద్ధమతం ఈ వలసలను ప్రోత్సహించింది. అలాంటి రెండువేల ఏళ్ళనాటి కళింగ దేశపు రేవు పట్టణాల్లో విశాఖపట్టణం ఒకటని చెప్పవచ్చు.

విశాఖ ప్రాంతంలో రెండువేల ఏళ్ళ క్రిందట బౌద్ధం మంచి ప్రచారంలో ఉండేది. అనకాపల్లి దగ్గరి ఒకప్పటి బుద్ధునికొండే నేడు బొజ్జన్నకొండగా పిలువ బడుతోంది. గుప్తుల నాణెం ఇక్కడ దొరికినందున క్రీ.శ. నాలుగైదు శతాబ్దుల నాడు ఈ ప్రాంతం బౌద్ధ క్షేత్రంగా మంచి ప్రచారంలో ఉండేదని చెప్పవచ్చు. విశాఖలోని తొట్లకొండ బౌద్ధ నిర్మాణాలు క్రీస్తుకు పూర్వమే నిర్మించ బడినట్లు చరిత్ర. ఇక్కడి బావికొండ, పావురాలకొండ ఒకనాటి బౌద్ధప్రాచుర్యానికి నిదర్శనాలు. అలాంటి కాలంలో విశాఖ అనే మహిళ జైన మతాన్ని వదలి బౌద్ధంలో ప్రవేశించి తన యావదాస్తిని దానం చేసినట్టు బౌద్ధచరిత్రలు చెబుతు న్నాయి. ఈ తీరంలో ఆవిడ తన ఆస్తితో బౌద్ధ సన్యాసుల కోసం ఒక నగరం నిర్మించి ఉంటుంది. దానిని అప్పటి నుండి ఆమె పేరన విశాఖ పట్టణంగా పిలుచుకొని ఉంటారు. చారిత్రక సంఘటనల తోడి ఒక అంచనా ఇది.

సముద్రతీరాన రాముడు ప్రతిష్ఠించిన ఈశ్వరుడు రామేశ్వరుడు అయినట్టే, విశాఖ సముద్రతీరాన విశాఖవర్మ నిర్మించిన కోవెలే విశాఖేశ్వర ఆలయం అయిందని ఇక్కడి ప్రజలు నమ్ముతుంటారు. విశాఖ వర్మ శ్రీపురం నుండి కోరోషండ శాసనాన్ని వేయించాడు. అతని కాలం నుండి ఈ పట్టణాన్ని విశాఖ పట్నంగా పిలుస్తున్నారు. 1600 సంవత్సరాల నాడు నిర్మించిన ఆ కోవెల కాలక్రమంగా ఆటుపోట్లకు గురై సముద్రగర్భంలో కలిసిపోయింది. ప్రస్తుతం ఆ ప్రాంతాన్నే 'లాసన్సు బే' అంటున్నారు. అప్పటినుండి భక్తులు ఈ ప్రాంతంలోనే సముద్రస్నానం చేస్తూ ఉండడం వలన ఇక్కడి రాళ్ళను నేటికీ తీర్థపురాళ్ళని అంటున్నారు.

ఇవన్నీ అంచనాలే అయినా, విష్ణువర్ధన మహారాజు పరిపాలనా కాలంలో, క్రీ.శ. 1068లో వేయించిన ద్రాక్షారామ భీమేశ్వరుని కోవెలలోని శిలాశాసనంలో విశాఖపట్టణం అనే పదం ఉంది. ఈ విశాఖకు



సంబంధించి ప్రస్తుతానికి దొరుకుతున్న తొలి చారిత్రకాధారం ఇదే! విశాఖపట్నానికి దక్షిణగా ఉన్న దుర్గ కొండ మీద ఐదు శాసనాలు లభించాయి. అందులో నాల్గు క్రీ.శ.1090, 1180, 1198, 1250 కాలాల నాటివి. ఈ నాల్గింటిలోనూ 'విశాఖపట్టణమైన కుళోత్తుంగ చోడపట్టనత్తు' అనే ఉంది. వెయ్యేళ్ళ క్రిందటే ఉనికిలో ఉన్న విశాఖపట్టణాన్ని కుళోత్తుంగుడను చోళరాజు పేరన 'కుళోత్తుంగ చోళపట్టణం'గా మార్చినట్టు వీటి ద్వారా స్పష్టమౌతోంది.

ఇక 1500 తరువాత తూర్పు దండయాత్రకు వచ్చిన కృష్ణదేవరాయలు కటకం ప్రతాపరుద్ర గజపతిని జయించడం కోసం కొంతకాలం పాటు తన సైన్యాన్ని సింహాచలం ప్రాంతంలో నిలిపి ఉంచాడు. సైన్యం నిలిచిన చోట్లు పాలెంలు అయ్యాయి. అలా ఏర్పడిన పదులకొద్దీ పాలెంలు ఈ విశాఖపట్టణం లోపలా, బైటా నేటికీ ఉన్నాయి. కానీ రాయల నాటి చరిత్రలో సింహాచలానికి ఉన్న ప్రాధాన్యత విశాఖకు లేదు. అప్పటికి దాని ప్రశస్తి తగ్గి ఉంటుంది.

విశాఖలో ఆంగ్లేయులు అడుగుపెట్టింది 1634 అయినా, వారి ఫ్యాక్టరీ 1682లో ప్రారంభమైంది. యూరోపియన్లు జలమార్గంలోనే మన దేశానికి రావడం, సహజసిద్ధ ఓడరేవు విశాఖలో ఉండడం, వారి ఎగుమతి దిగుమతులు ఓడల్లోనే జరుగుతుండడం కారణంగా విశాఖ ప్రఖ్యాతమైంది. హార్బరుతో పాటు, కోరమండల్, కాల్‌టెక్స్, ఉక్కు ఫేక్టరీ లాంటి పరిశ్రమలెన్నో చేరి విశాఖపట్నం మహానగరమైంది.


ఆంధ్రరాష్ట్ర శాశ్వత రాజధాని విశాఖలో ఏర్పడాలనే రొక్కం లక్ష్మీనరసింహం గారి సవరణకు అనుకూలంగా 61, ప్రతికూలంగా 58 ఓట్లు పడినట్లు, 20 మంది తటస్థంగా ఉండిపోయినట్లు, 1953 డిసెంబర్ 1న వార్తాపత్రికలలో వచ్చింది. ముందటిరోజు అప్పటి ఆంధ్రరాష్ట్ర తాత్కాలిక రాజధాని కర్నూలులో జరిగిన శాసనసభలో ఈ ఓటింగ్ జరిగినట్టు శాసన సభాధ్యక్షులు వల్లంపాటి వెంకట్రామయ్య సభలో ప్రకటించారు. అనంతరం సభలోగల ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు స్పందిస్తూ 1956 ఏప్రిల్ సరికి విశాఖలో శాశ్వత రాజధాని ఏర్పాటు చేస్తామని సమాధానమిచ్చారు. పాలకుల చేత తరతరాలుగా వెనుకబాటుకు గురౌతున్న కళింగాంధ్రలో ఈ నాటికి ఒక రాజధాని ఏర్పడడం ఎంతైనా ముదావహం.

వ్యాసకర్త సాహిత్య విమర్శకుడు | 98857 58123
(70 ఏళ్ళ 'రాజధాని' హామీ నెరవేరుతున్న వేళ.)

మనుషులలో దేవుడు

మనుషులు నిత్యం దేవాలయాలకు వెళతారు. పూజలు చేస్తారు. ఆపద మొక్కులు మొక్కుతారు. ఆపదలు తీరితే సంతోషంతో మొక్కులు చెల్లిస్తారు. తీరకపోతే దేవుడున్నాడా, ఉంటే తమను ఎందుకు పట్టించుకోవట్లేదని వాపోతారు. చేసే పూజలు, వేసే కానుకలు చాలవేమో అని మరింత భక్తిని ప్రదర్శిస్తారు.

మనిషి తాను చేసిన శిలా విగ్రహాలకు మాత్రమే మహిమ ఉందని విశ్వసిస్తూ, సాటి మనిషికి అవసరంలో సహాయపడక పోవటం



దైవానికి ఆనందం కలిగించదని గుర్తించడు. సృష్టి అణువు అణువులో ఉన్న తనని గుర్తించని మనిషిని దేవుడు మెచ్చడు. దేవుడెక్కడో కొండల్లో, కోనల్లో ఉంటాడని భావిస్తూ వ్యయ ప్రయాసలకు ఓర్చి వెతుకుతూ ఉండే మనిషికి, నిజంగా కళ్ళు తెరిచి, మనసు పెట్టి చూస్తే, సాటి మనిషిలోనే దైవం కనిపిస్తాడని ఒక మహాకవి చెపుతాడు. మనుషుల్లో దైవాన్ని దర్శించగలగటం ఉదాత్త లక్షణం.

దేవతా ప్రతిమలకు ఉత్సవాలూ, కల్యాణాలూ చేయించటానికి వేలు వ్యయం చేసే మనిషి, ఇంటిముందు నిల్చున్న అన్నార్తునికి మెతుకు విదల్చడని నిందిస్తాడు మరో మహాకవి. కంటి కెదురుగా కనిపించే ప్రతి మనిషిలో దైవాన్ని దర్శించగలిగితే, ఆపన్నులకు స్నేహ హస్తాన్ని అందించగలిగితే, నిత్యం భగవంతుని ప్రత్యక్ష సాన్నిధ్యాన్ని అనుభవిస్తున్నట్లే! మనిషి తన సాటి మనిషికి అందించే సేవే భగవంతునికి చేసే నిజమైన సేవ అవుతుంది. మానవ సేవే మాధవ సేవ అంటే అదే కదా!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ నుంచి డబ్బు

- ఎన్నికల్లో పంపిణీకి అక్రమంగా తరలిస్తున్నారు
- కట్టడి చేయాలన్న బీఆర్‌ఎస్
- ప్రగతిభవన్‌లో బీ-ఫారాలు పంపిణీ చేయడం కోడ్ ఉల్లంఘనే
- ఎన్నికల సంఘం విచారణకు ఆదేశించిందని తెలిపిన కాంగ్రెస్
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన సీఈఓ వికాస్‌రాజ్


ఎన్నికల నియమావళిపై అవగాహన కోసం నిర్వహించిన భేటీకి హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో ఓటర్లకు ఎరవేసేందుకు కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ నుంచి రాష్ట్రానికి భారీగా డబ్బులను తరలిస్తున్నారని, ఆయా రాష్ట్రాల సరిహద్దుల వెంట పటిష్ట నిఘా ఉంచి కట్టడి చేయాలని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సోమభరత్ కుమార్ ఎన్నికల అధికారులను కోరారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్ రాజ్ మంగళవారం తన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై వారి అభిప్రాయాలు, సూచనలను సేకరించారు. అనంతరం ఆయా పార్టీల నేతలు మీడియాతో మాట్లాడారు. సోమ భరత్ మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాల్లో నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలతో కొందరు చెలరేగి పోతున్నారని, అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాలెట్‌పై రాజకీయ పార్టీల గుర్తులను వృద్ధులు సులువుగా గుర్తుపట్టేలా చర్యలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రాల్లో సరైన వెలుతురు సదుపాయం కల్పించాలన్నారు.

ప్రగతిభవన్‌లో బీ-ఫారాల పంపిణీపై విచారణకు ఆదేశం..

ముఖ్యమంత్రి అధికారిక నివాసం ప్రగతిభవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులకు బీ-ఫార్మ్‌లు పంపిణీ చేయడాన్ని ఎన్నికల కోడ్ ఉల్లంఘనగా పరిగణించి చర్యలు తీసుకోవాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ ఫిర్యాదు చేశారు. ప్రగతిభవన్ పబ్లిక్ ప్రాపర్టీ అని, అక్కడ ఎలాంటి రాజకీయ కార్యకలాపాలకు తావు లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదుతో కేంద్ర ఎన్నికల సంఘం విచారణకు ఆదేశించిందన్నారు. అక్టోబర్ 4న ప్రకటించిన తుది ఓటర్ల జాబితాకు తోడుగా త్వరలో అనుబంధ ఓటర్ల జాబితాను సైతం ప్రచురిస్తామని సీఈఓ వికాస్‌రాజ్ తెలిపారన్నారు. ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవడానికి ఇప్పటికీ అవకాశం ఉందని తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల నిబంధనలపై సరైన అవగాహన లేదన్నారు. రాజకీయ పార్టీల సభలు, సమావేశాలకు అనుమతుల జారీపై స్వయంగా ఎన్నికల సంఘమే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాంపల్లి నియోజకవర్గంలో బోగస్ ఓట్లను తొలగించాలని కాంగ్రెస్ నేత ఫిరోజ్‌ఖాన్ కోరారు. సజావుగా ఎన్నికలు జరిపేందుకు నియోజకవర్గంలో కేంద్ర బలగాలను దింపాలని సూచించారు.

మునుగోడులో జప్తు చేసిన డబ్బు ఏమైంది?

ఇటీవల ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్ల తొలగింపుపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు డీజీ నరసింహా రావు కోరారు. మునుగోడు ఉప ఎన్నికల్లో జప్తు చేసిన డబ్బులను ఏం చేశారని ప్రశ్నించారు. పోలింగ్‌కు 5 రోజుల ముందు ఓటర్లందరికీ స్లిప్పులు జారీ చేయాలని సూచించారు. బోగస్ ఓట్లను తొలగించాలని, అక్రమ డబ్బు తరలింపును కట్టడి చేయాలని టీడీపీ నేత సతీష్ సూచించారు. ఎన్నికలు జరిగే వరకు రాష్ట్రంలో మద్యం విక్రయాలను నిషేధించాలని, ఓటును ఆధార్‌కార్డుతో అనుసంధానం చేయాలని ఆప్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈవీఎంలకు బదులుగా పేపర్ బ్యాలెట్‌తో ఎన్నికలు జరపాలని ప్రజాశాంతి పార్టీ కోరింది. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న పలువురు అధికారులపై సీఈఓకి ఫిర్యాదు చేసినట్టు బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దయానంద్ రావు తెలిపారు. అలాగే పాతబస్తీలో బోగస్ ఓట్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కోరామన్నారు.

ఆ అధికారులను బదిలీ చేయాలి.. బీజేపీ

బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులను బదిలీ చేయాలని బీజేపీ నేత ఆంథోని రెడ్డి కోరారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎన్నికల పరిశీలకులను, కేంద్ర బలగాలను దించాలని సూచించారు.

ప్రతి ఫిర్యాదుపై చర్యలు

రాజకీయ పార్టీలకు సీఈఓ వికాస్‌రాజ్ హామీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన సహకారాన్ని రాజకీయ పార్టీలకు అందజేస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ హామీ ఇచ్చారు. సోషల్ మీడియాతో సహా ఏ అంశంపైన అయినా అభ్యర్థులు, రాజకీయ పార్టీలు చేసే సహేతుకమైన ప్రతి ఫిర్యాదును సానుకూలంగా పరిశీలిస్తామని స్పష్టం చేశారు. ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకుని పరిష్కరించాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశిస్తామని తెలిపారు. శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్ సమీపిస్తుండటంతో మంగళవారం ఆయన తన కార్యాలయంలో గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పించారు. స్టార్ క్యాంపైనర్లు, మేనిఫెస్టోలు, నామినేషన్లు, అఫిడవిట్లు, ప్రకటనల ముందస్తు ధ్రువీకరణలకు సంబంధించిన నియమ నిబంధనలు, అధునాతన యాప్‌ల వంటి సాంకేతిక సౌకర్యాలు, ఓటరు జాబితాల తాజాస్థితి, వాటిలో మార్పులు చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలను వారికి వివరించారు. ఇప్పటివరకు 14.99 లక్షల ఓటర్ల వివరాలను సవరించినట్టు తెలియజేశారు. సమావేశంలో వివిధరాజకీయ పార్టీలకి చెందిన 20 మంది ప్రతినిధులు హాజరై పలు సమస్యలను సీఈఓ దృష్టికి తీసుకొచ్చారు. అదనపు సీఈఓ లోకేష్ కుమార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహమద్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి పాల్గొన్నారు.

నెలాఖరు వరకు ఓటర్ల నమోదు..

ఈ ఏడాది జనవరి 5 నుంచి 27.5 లక్షలకు పైగా ఓటరు కార్డులను ముద్రించి ఓటర్లకు పంపిణీ చేశామనీ, ఈ నెలాఖరులోగా మిగిలిన ఓటరు కార్డుల ముద్రణ పూర్తి చేసి ఓటర్లకు అందజేస్తామని జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహమద్ తెలియజేశారు. ఓటర్లు కూడా ఈ-ఎపిక్ కార్డులను ఓటర్ల సేవా పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. ఈ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం కొత్త ఓటర్ల నమోదుకు ఈ నెలాఖరు వరకు గడువు ఉందన్నారు.

బీఎస్పీ బహుజన భరోసా!

- పది ప్రధాన హామీలతో మేనిఫెస్టో విడుదల
- యువతకు ఉద్యోగాలు, రైతు సంక్షేమం, భూమిహక్కుకు పెద్దపీట
- చాకలి ఐలమ్మ మహిళా జ్యోతి పేరిట మహిళలకు వరాలు
- మహిళా కార్మికులు, రైతులకు ఉచిత వాషింగ్ మెషీన్, స్మార్ట్‌ఫోన్లు
- 3.91 కోట్ల ప్రజల ఆకాంక్షల మేరకు బహుజన భరోసా: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్


మంగళవారం బీఎస్పీ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

సాక్షి, హైదరాబాద్, పెద్దపల్లి రూరల్: బహుజన భరోసా పేరుతో బహుజన్ సమాజ్ పార్టీ మేనిఫెస్టోను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ విడుదల చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పార్టీ నాయకుల సమక్షంలో పది ప్రధాన హామీలతో కూడిన మేనిఫెస్టోను ప్రకటించారు. 3.91 కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు బహుజన భరోసా ఆవిష్కరిస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ ఒక కుటుంబం పాలైందని, ఈ రాష్ట్రాన్ని అందరి తెలంగాణగా మార్చేందుకే బహుజన భరోసా ప్రకటిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో తొమ్మిదిన్నరేళ్ల అధికారం చెలాయించిన బీఆర్‌ఎస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మేనిఫెస్టోల పేరుతో మరోసారి అంకెల గారడీ చేసిందని విమర్శించారు. గ్రూప్ పరీక్షలు రాసి ఉద్యోగం రాదని తెలిసి ఆత్మహత్యకు పాల్పడ్డ యువతి ప్రవల్లిక వ్యక్తిత్వాన్ని కించపరిచేలా తప్పుడు మాటలు మాట్లాడారని విమర్శించారు. ఈ నేపథ్యంలో భవిష్యత్ తెలంగాణ ఎలా ఉండాలని మేధావులు, రిటైర్డ్ అధికారులు, అన్నివర్గాల ప్రజలతో చర్చించి బహుజన భరోసా పేరుతో మేనిఫెస్టో రూపొందించినట్లు ప్రవీణ్ తెలిపారు. ఇది ప్రొవిజనల్ మేనిఫెస్టో మాత్రమేనని, తెలంగాణ ప్రజలు ఇంకా ఏమైనా కోరుకుంటే వారి ఆకాంక్షల మేరకు వాటిని కూడా పొందుపరుస్తామని చెప్పారు.కాగా, పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో కాల్వశ్రీరాంపూర్ మండలానికి చెందిన మాజీ మావోయిస్టు నిదానపురం కొమురయ్య బీఎస్పీలో చేరారు. ఆయనకు ప్రవీణ్‌కుమార్ బీఎస్పీ కండువా కప్పి ఆహ్వానించారు. అదేవిధంగా పెద్దపల్లి పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నేత మర్రిపల్లి సతీశ్ బీఎస్పీలో చేరారు.

మేనిఫెస్టోలో బీఎస్పీ ఇచ్చిన 10 ప్రధాన హామీలు..

1. 'కాన్షీ' యువ సర్కార్: యువతకు ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు. మహిళలకు 5 లక్షల ఉద్యోగాలు. షాడో మంత్రులుగా విద్యార్థి నాయ కులు.
2. పూలే విద్యా దీవెన: మండలానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్, ప్రతి మండలం నుంచి ఏటా 100 మంది విద్యార్థులకు విదేశీ విద్య, డేటా, ఏఐ, కోడింగ్ లో శిక్షణ.
3. బహుజన రైతు ధీమా: ప్రతి పంట కనీస మద్దతు ధరతో కొనుగోలు. రైతులకు విత్తు నుంచి విక్రయం వరకు కచ్చితమైన ప్రభుత్వ రాయితీ. ధరణి పోర్టల్ రద్దు.
4. చాకలి ఐలమ్మ మహిళా జ్యోతి: మహిళా కార్మికులు, మహిళా రైతులకు ఉచిత వాషింగ్ మెషీన్, స్మార్ట్ ఫోన్, డ్రైవింగ్‌లో శిక్షణ. అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల ఉద్యోగులు క్రమబద్ధీకరణ. మహిళా సంఘాలకు ఏటా రూ. 1 లక్ష
5. భీం రక్షా కేంద్రాలు: వృద్ధులకు హాస్టల్, ఆహారం, ఉచిత వైద్య సేవలు. రక్షా కేంద్రాల్లో వికలాంగులకు, ఒంటరి మహిళలకు తోడ్పాటు.
6. బ్లూ జాబ్ కార్డ్: పల్లె, పట్టణాల్లో 150 రోజుల ఉపాధి హామీ, రోజు కూలి రూ. 350 కి పెంపు. కూలీలకు ఉచిత రవాణా, ఆరోగ్య, జీవిత బీమా
7. నూరేళ్ల ఆరోగ్య ధీమా: ప్రతి కుటుంబానికి రూ.15 లక్షల ఆరోగ్య బీమా ప్యాకేజీ. ఏటా రూ. 25,000 కోట్లతో పౌష్టికాహార, ఆహార బడ్జెట్
8. వలస కార్మికుల సంక్షేమ నిధి: రూ. 5,000 కోట్ల నిధితో గల్ఫ్ కార్మికులకు సంక్షేమ బోర్డు. వలస కార్మికులకు వసతి, కార్మికులు, లారీ, టాక్సీ డ్రైవర్లకు 600 సబ్సిడీ క్యాంటీన్లు.
9. షేక్ బందగీ గృహ భరోసా: ఇల్లు లేని వారికి 550 చదరపు గజాల ఇంటి స్థలం, ఇల్లు కట్టుకునే వారికి రూ. 6 లక్షలు సహాయం. ఇంటి పునర్నిర్మాణానికి రూ.1 లక్ష సహాయం.
10. దొడ్డి కొమురయ్య భూమి హక్కు: భూమిలేని ప్రతి పేద కుటుంబానికి ఎకరం భూమి, మహిళల పేరిట పట్టా.

రేపు బీజేపీ తొలి జాబితా?

▶ మొదటి పేజీ తరువాయి

ఇచ్చే అవకాశముందనే చర్చ జరుగుతోంది.

మేనిఫెస్టోకు ఓపిక పట్టండి

అధికార బీఆర్‌ఎస్ 98 మంది అభ్యర్థులకు బీ ఫారాలు ఇవ్వగా, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ 55 మందితో తొలిజాబితా ప్రకటించేసింది. ఈ రెండు పార్టీలు మేనిఫెస్టోను ప్రకటించి ప్రచారంలో ముందున్న నేపథ్యంలో బీజేపీ ఇంకా తొలి జాబితాను కూడా ప్రకటించకపోవడంపై పార్టీ నాయకుల్లో ఆందోళన ఉంది. మేనిఫెస్టోను ఎప్పుడు ప్రకటిస్తారనే దానిపై స్పష్టత కొరవడటంతో దిగాలు చెందుతున్నారు. ఆయా అంశాలను కొందరు ముఖ్య నేతలు జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లగా... ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో తెలంగాణలో చివర్లో ఎన్నికలు జరగనుండటంతో ఎందుకు తొందర పడుతున్నారని ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో మేనిఫెస్టో ప్రకటనకు సమయం పట్టొచ్చని సమాచారం. మేనిఫెస్టోలో ప్రతిపాదించే విషయాలను రాష్ట్ర పార్టీ జాతీయ నాయకత్వానికి నివేదించాక... వారే ఏయే అంశాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలనే దానిపై స్పష్టతనిస్తారని చెబుతున్నారు. మేనిఫెస్టో ప్రకటనతోపాటే అన్ని మాధ్యమాల ద్వారా ప్రచారం విస్తృతంగా చేపట్టేలా ఢిల్లీ పెద్దలు వ్యూహ రచన చేస్తున్నట్టు సమాచారం. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, బీసీలకు తగిన గుర్తింపు, కేసీఆర్ సర్కార్ వైఫల్యాలు తదితర అంశాలపై దృష్టి సారించినట్టు తెలిసింది.

సకల జనుల ద్రోహి పేరుతో...

కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారంటూ 'సకల జనుల ద్రోహి కేసీఆర్' పేరిట ఎన్నికల ప్రచారం చేపట్టాలని కమలం పార్టీ నిర్ణయించినట్లు తెలిసింది. మంగళవారం రాష్ట్ర పార్టీ ఎన్నికల సహ ఇన్‌చార్జి సునీల్ బన్సల్ సమక్షంలో ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, పార్టీ వ్యవహారాల సమన్వయకర్త నల్లు ఇంద్రసేనారెడ్డి, పార్టీ ప్రధానకార్యదర్శి బంగారు శ్రుతి తదితరులు ప్రచార కార్యక్రమాలపై చర్చించినట్లు సమాచారం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు సంబంధించిన అంశాలను బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు భిన్నంగా ప్రజల దృష్టిని ఆకర్షించేలా కొత్తపంథాలో ప్రచారం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన 14 కమిటీల (మేనిఫెస్టో, క్యాంపెయిన్, సోషల్ ఔట్‌రీచ్, స్క్రీనింగ్) సమావేశాలతో పార్టీ కార్యాలయమంతా సందడి నెలకొంది. మేనిఫెస్టో, అభ్యర్థుల స్క్రీనింగ్, క్యాంపెయిన్, ఎన్నికల మేనేజ్‌మెంట్‌పై చర్చించేందుకు కిషన్‌రెడ్డి, ఈటల, ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భేటీ అయినట్టు తెలుస్తోంది.

నా బిడ్డ చావుపై రాజకీయాలు చేయొద్దు..

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీల ప్రముఖులు స్పందించారు. మృతురాలి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ క్రమంలో మంగళవారం ప్రవల్లిక తల్లి విజయ, సోదరుడు ప్రణయ్ మాట్లాడిన రెండు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి.

నా బిడ్డ చావును అందులోకి లాగకండి..

వీడియోలో ఏముందంటే.. 'మా అమ్మాయి పేరు మర్రి ప్రవల్లిక. రెండేళ్ల నుంచి నా బిడ్డ, నా కొడుకును హైదరాబాద్‌లోనే ఉంచి చదివిస్తున్నా.. మేము కాయకష్టం చేసుకుని చదివిస్తున్నం. మా పిల్లలకు కష్టం రాకూడదని హైదరాబాద్‌లోనే ఉంచి చదివిస్తున్న. నా బిడ్డను వాడు వేధించాడు. వాడి టార్చర్‌ను మా అమ్మాయి మాతో చెప్పుకోలేక ఆత్మహత్య చేసుకుంది. నా బిడ్డ చావుకు కారణమైన వాడిని శిక్షించాలి. వాడు బయటికి రాకుండా చూడాలి. నా బిడ్డ కష్టం వేరే వాళ్లకు రావద్దు. మీకు, మీ పార్టీలకు గొడవలు ఉంటే మీరే చూసుకోండి .. మా కుటుంబాన్ని నా బిడ్డ చావును అందులోకి లాగకండి. నా బిడ్డ ఉరి వేసుకున్నట్టే వాడికి ఉరిశిక్ష పడాలి' అని మర్రి విజయ వీడియో పోస్టు చేశారు. 'ప్రవల్లిక చనిపోవడానికి కారణం శివరామ్. మా అక్క స్నేహితురాలి ద్వారా పరిచయమయ్యాడు. వేధించాడు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక డిప్రెషన్‌లో పడింది. సూసైడ్ చేసుకుంది' అని ప్రవల్లిక తమ్ముడు మర్రి ప్రణయ్‌కుమార్ మరో వీడియోలో పేర్కొన్నాడు.

సీఎంను కలిసేందుకు వెళ్లారా?: ప్రవల్లిక ఆత్మహత్య రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించడం.. ప్రభుత్వంపై పలు ఆరోపణలు రావడంతో.. సోమవారం ప్రవల్లిక తల్లిదండ్రులు మర్రి లింగయ్య, విజయ మంత్రి కేటీఆర్ నుంచి పిలుపు రావడంతో సిరిసిల్ల వెళ్లి కలిసినట్లు వార్తలొచ్చాయి. అదే రోజు రాత్రి వారు ఇంటికి తిరిగివచ్చి మంగళవారం ఉదయం 5వ రోజు పక్షికి పెట్టే కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ప్రకాశ్ జవదేకర్ పరామర్శకు వస్తున్నారని సమాచారం వచ్చినా.. వారు కలవడానికి నిరాకరించడంతో కిషన్‌రెడ్డి తన పర్యటన రద్దు చేసుకున్నారు. పక్షి కార్యక్రమం ముగియగానే సీఎం కేసీఆర్‌ను కలవడానికి హైదరాబాద్‌కు వెళ్లినట్లు బంధువుల ద్వారా తెలిసింది. ఈ నేపథ్యంలో ఎక్కడ మాట్లాడారో తెలియదు కానీ వారి మాటలు చర్చనీయాంశమయ్యాయి.

శివరామ్ కోసం గాలింపు ముమ్మరం..

సాక్షి, హైదరాబాద్: ప్రియుడు మోసం చేసిన కారణంగానే మర్రి ప్రవల్లిక ఆత్మహత్యకు పాల్పడ్డట్టు నిర్ధారించిన హైదరాబాద్ చిక్కడపల్లి పోలీసులు ఆ మేరకు కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా వాసి శివరామ్ రాథోడ్ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. శివరామ్ చేతిలో మోసపోయానన్న విషయాన్ని ప్రవల్లిక తన సోదరుడు ప్రణయ్‌కి వాట్సాప్ సందేశాల ద్వారా తెలిపింది. ఈ మేరకు ప్రణయ్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. పరారీలో ఉన్న నిందితుడు శివరామ్ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

మేనిఫెస్టోలో రైతుబంధేనా... ఉద్యోగ నోటిఫికేషన్లకు చోటు లేదా?

అఖిలపక్ష భేటీలో టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టోలో సంక్షేమ పథకాలు, రైతుబంధేనా.. ఉద్యోగ నోటిఫికేషన్లకు చోటు లేదా అని టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ప్రశ్నించారు. ఉద్యోగాల్లేక నిరుద్యోగులు అల్లాడుతుంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ... ఉద్యోగాలు సకాలంలో భర్తీ చేయకపోవడంతో ప్రవల్లిక ఆత్మహత్య చేసుకుందన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చారో మంత్రి కేటీఆర్ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో తాను పోటీ చేస్తానో లేదో ఇప్పుడే చెప్పలేమని, కాంగ్రెస్‌తో పొత్తు చర్చల దశలో ఉందని, టీజేఎస్‌కు ఎన్ని సీట్లు ఇస్తారో చూడాలని కోదండరాం అన్నారు. ఏఐసీసీ అధికార ప్రతినిధి డోలీ శర్మ మాట్లాడుతూ... యువత ధైర్యం కోల్పోవద్దని జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకుల్ని ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు.

అడుగడుగునా 'కట్టల' పాములు

- ఎన్నికల కమిషన్ ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు
- భారీగా పట్టుబడిన నగదు
- ఎనిమిది రోజుల్లో రూ.71.55 కోట్లు
- 72.26 కిలోల బంగారం, 429.1 కిలోల వెండి స్వాధీనం
- మొత్తం విలువ రూ.130 కోట్ల పైమాటే..
- వెల్లడించిన ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధానాధికారి


చందానగర్‌లో పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన రశీదుల్లేని బంగారం, వెండి ఆభరణాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో రూ.కోట్ల విలువైన నగదు, మద్యం, వెండి, బంగారం పట్టుబడుతున్నాయి. ఈ నెల 9న రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చినప్పటినుంచి మంగళవారం ఉదయం వరకు నిర్వహించిన తనిఖీల్లో మొత్తం రూ.130 కోట్లకు పైగా విలువైన నగదు, బంగారం, వెండి, మద్యం స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధానాధికారి వికాస్‌రాజ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీసులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 373 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 374 స్టాటిక్ సర్వైవలెన్స్ టీమ్‌లు, 95 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులలో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

డబ్బే డబ్బు!

ఎలాంటి అధికారిక గుర్తింపు పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.71.55 కోట్ల స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధానాధికారి వికాస్‌రాజ్ వివరించారు. స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం మొత్తం విలువ రూ.7.75 కోట్లు ఉంటుందన్నారు. 1694 కిలోల గంజాయి విలువ రూ.4.58 కోట్లు, పట్టుబడిన బంగారు, వెండి మొత్త విలువ రూ. 40.08 కోట్లు ఉంటుందని వివరించారు. ఇందులో మొత్తం 72.267 కిలోల బంగారం, 429.107 కిలోల వెండి, 42.03 క్యారట్ల వజ్రాలున్నాయని స్పష్టం చేశారు. ల్యాప్‌టాప్‌లు, వాహనాలు, కుక్కర్లు, చీరలు, క్రీడా సామగ్రి విలువ మొత్తం రూ.6.29 కోట్లు అని వికాస్‌రాజ్ తెలిపారు. ఈనెల 16వ తేదీ ఉదయం నుంచి 17వ తేదీ ఉదయం 9 గంటల వరకు మొత్తం రూ.21.84 కోట్ల విలువైన వస్తువులు, మద్యం స్వాధీనం చేసుకున్నట్టు చెప్పా రు. 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నియమావళి అమల్లో ఉన్న రోజుల్లో రూ.103 కోట్ల విలువైన నగదు, మద్యం, బంగారం, వెండి, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకోగా.. ఈసారి ఇప్పటికే ఆ మొత్తం విలువ రూ.130 కోట్లు దాటడం విశేషం.

5,529 ఆయుధాలు స్వాధీనం: డీజీపీ కార్యాలయం

రాష్ట్రవ్యాప్తంగా 5,529 లైసెన్స్‌డ్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు డీజీపీ కార్యాలయం తెలిపింది. వీటితోపాటు మరో మూడు అక్రమ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొంది. 5,252 బైండోవర్ కేసులలో మొత్తం 17,128 మందిని బైండోవర్ చేసినట్టు వెల్లడించింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన 184 మందిపై 56 కేసులు నమోదు చేసినట్టు వెల్లడించింది.

నగదు, మద్యం, బంగారం, వెండి, ఇతర వస్తువుల పట్టివేత ఇలా..

స్వాధీనం చేసుకున్న నగదు	రూ.71.55,58,094
స్వాధీనం చేసుకున్న మద్యం విలువ	రూ.7,75,79,917
స్వాధీనం చేసుకున్న గంజాయి, మత్తు పదార్థాలు	రూ. 4,58,04,720
స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి, వజ్రాల విలువ	రూ. 40,08,44,300
ఇతర వస్తువులు (ల్యాప్‌టాప్‌లు, కుక్కర్లు, క్రీడా సామగ్రి, చీరలు) విలువ	రూ.6.29,04,500
మొత్తం	రూ.130,26,91,531

క్లుప్తంగా...

రాష్ట్రానికి యాసంగి ఎరువులు

18.64 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: ఈ యాసంగి సీజన్‌కు 18.64 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు తెలంగాణకు కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖకు సమాచారం పంపింది. ఎరువుల్లో 9.2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయనుంది. అయితే ఈసారి సాగు పెరగనున్నందున 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని కేంద్రానికి రాష్ట్ర వ్యవసాయశాఖ నివేదించింది. గత యాసంగిలో 74 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, ఈసారి 75 లక్షల నుంచి 80లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి. గత వానాకాలం సీజన్‌లో 1.26 కోట్ల ఎకరాల్లో పంటలు సాగైన సంగతి తెలిసిందే.

ఎక్సైజ్ అధికారుల అక్రమ బదిలీలపై చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖలో చేపట్టిన అధికారుల అక్రమ బదిలీలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) వికాస్‌రాజ్‌కు బీజేపీ ఎన్నికల కమిషన్ వ్యవహారాల కమిటీ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సందర్భంగా ప్రతీసారి అధికార బీఆర్‌ఎస్ మద్యం పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభ పరుస్తున్నందున కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగాలనే ఉద్దేశంతో దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని ఈసీ ఆదేశాలిస్తే.. ఆ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ వివిధ పోస్టింగ్‌లు, బదిలీ లను ప్రతిపాదిస్తూ మున్సిపల్ మంత్రి కేటీఆర్ ద్వారా వాటినే సీఎస్ ఆమోదించేలా చేశారని పేర్కొన్నారు. గతంలో టీజీవోల అధ్యక్షుడిగా ఉన్న శ్రీనివాస్‌గౌడ్ తమ సంఘం ఆఫీస్ బేరర్లను ఈ బదిలీలకు సిఫార్సు చేశారని ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం సీఈవోకు శశిధర్‌రెడ్డి, కమిటీ సభ్యుడు పొన్నా వెంకటరమణ వినతిపత్రం అందజేశారు. దీంతోపాటు ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రాసిన లేఖ, 14 మంది అధికారులకు ఇచ్చిన బదిలీ ఆర్డర్ల కాపీలను జతచేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేద్దాం

వలస కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గల్ఫ్ జేఏసీ నిర్ణయం

మోర్తాడ్(బాల్కొండ): తమ సమస్యలను పరిష్కరించాలని ఏళ్లతరబడి కోరుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించకపోవడంతో వలస కార్మికుల పక్షాన గల్ఫ్ జేఏసీ కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాజకీయ కోణంలోనే వలస కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవాలని గల్ఫ్ సంఘాల ప్రతినిధులు భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో వలస కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో గతంలో వలస వెళ్లి ఇంటికి వచ్చిన కార్మికులను, గల్ఫ్ దేశాల్లో మృత్యువాత పడిన కార్మికుల కుటుంబ సభ్యులను, జేఏసీ నాయకులను ఎన్నికల బరిలోకి దింపి సత్తా చాటాలని నాయకులు ఆశిస్తున్నారు. గల్ఫ్ కార్మికుల సంఘాలకు నాయకత్వం వహిస్తున్న కొందరు వివిధ పార్టీల టికెట్‌లను ఆశించారు. అయితే ఏ రాజకీయ పార్టీ కూడా వలస కార్మికుల సంఘాల నాయకులకు బీ ఫాం ఇవ్వడానికి ఆసక్తి చూపలేదు. ఈ విషయాన్ని గుర్తించిన గల్ఫ్ జేఏసీ ప్రతినిధులు యూఏఈలోని అజ్మన్‌లో ఉన్న ఇండియన్ అసోసియేషన్ భవనంలో రెండు రోజుల కింద సమావేశమయ్యారు. సౌదీ అరేబియా, ఒమన్, కువైట్, బహ్రెయిన్, ఖతర్ దేశాల నుంచి వచ్చిన తెలంగాణ గల్ఫ్ సంఘాల ప్రతినిధులు, యూఏఈలోని వివిధ సంఘాల నాయకులు, రాష్ట్రంలో ఉంటూ గల్ఫ్ అంశాలను పరిశీలిస్తున్న జేఏసీ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల అంత్యక్రియల సాయం పెంపు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు చనిపోయినప్పుడు వారి కుటుంబ సభ్యులకు అందించే అంతిమ సంస్కారాల ఆర్థిక సాయాన్ని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు టీఎస్‌ఆర్టీసీ పెంచింది. పింఛన్‌దారులు చనిపోతే వారి అంతిమ సంస్కారానికి అందించే మొత్తాన్ని రూ.30 వేలకు పెంచుతూ ఈ ఏడాది జూన్‌లో ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇదే మొత్తాన్ని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు కూడా వర్తింప చేయాలన్న ఉద్దేశంతో సెప్టెంబరు 2న జరిగిన ఆర్టీసీ బోర్డు సమావేశంలో తీర్మానించినట్టు ఆర్టీసీ వెల్లడించింది.

బకాయిలు చెల్లించాలి

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులకు దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఆర్థిక చెల్లింపుల్లో చాలా వరకు ఎన్నికల కోడ్ పరిధిలోకి రానివైనందున.. వెంటనే చెల్లించాలని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు కోరారు. గత ఏడాది కాలంలో చెల్లించిన తొమ్మిది విడతల డీఏ బకాయిలు, 2013 నాటి వేతన సవరణ బాండ్ల బకాయిలు చెల్లించాలని కోరారు. అవసరమైతే ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని దసరా పండగ అడ్వాన్సును కార్మికులకు చెల్లించాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

బీమా మోసాల నియంత్రణపై వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: ఇటీవల ఎక్కువగా నమోదవుతున్న జీవితబీమా మోసాల కేసుల్లో పక్కాగా దర్యాప్తు చేసేందుకు ఎలాంటి మెళకువలు పాటించాలన్న అంశాలపై తెలంగాణ సీఐడీ విభాగం అధికారులకు మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించింది.

క్లుప్తంగా...

2040 నాటికి జాబిల్లి పైకి భారతీయుడు

ఇస్రోకు లక్ష్యాలు నిర్దేశించిన ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: చంద్రయాన్‌-3 ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)కు కీలక లక్ష్యాలను నిర్దేశించారు. 2040 నాటికి తొలి భారతీయుడిని చంద్రుడిపైకి పంపించాలని, 2035 నాటికి అంతరిక్షంలో ఇండియన్‌ స్పేస్‌ స్టేషన్‌ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతిష్టాత్మక గగన్‌యాన్‌ మిషన్‌లో భాగంగా మొట్టమొదటి ఫ్లైట్‌ టెస్ట్‌ వెహికల్‌ అబార్ట్‌ మిషన్‌-1 (టీవీ-డీ1)ను ఈ నెల 21న పరీక్షించనున్నారు. ఉదయం 7 నుంచి 9 గంటలలోపు ఈ పరీక్ష జరుగుతుంది. టీవీ-డీ1 ప్రయోగ ఏర్పాట్లపై ప్రధాని మోదీ మంగళవారం ఇస్రో అధికారులతో సమీక్ష నిర్వహించారు. గగన్‌యాన్‌ గురించి ఇస్రో చైర్మన్‌ ఎస్‌.సోమనాథ్‌ ప్రధాని మోదీకి తెలియజేశారు. కొత్త లక్ష్యాలు ఏర్పర్చుకోవాలని, వాటిని సాధించేందుకు కృషి చేయాలని ఇండియన్‌ సైంటిస్టులకు మోదీ పిలుపునిచ్చారు. శుక్రగ్రహంపై ఆర్బిటార్‌ మిషన్‌, మార్స్‌ ల్యాండర్‌ వంటి ప్రయోగాలు చేయాలని చెప్పారు.

ఇస్రో చైర్మన్‌ సోమనాథ్‌కు గౌరవ డాక్టరేట్‌

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్‌ ఎస్‌.సోమనాథ్‌కు బెంగళూరు యూనివర్సిటీ మంగళవారం గౌరవ డాక్టరేట్‌ ప్రదానం చేసింది. ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన సోమనాథ్‌ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తనకు ఇచ్చిన గౌరవ డాక్టరేట్‌ను ఇటీవల ప్రయోగించిన చంద్రయాన్‌-3, ఆదిత్య-ఎల్‌1 మిషన్లలో పని చేసిన బృంద సభ్యులకు అంకితం ఇస్తున్నట్లు చెప్పారు. అంతరిక్ష ప్రయోగాల వల్ల లభించే సాంకేతిక పరిజ్ఞానం సామాన్య ప్రజలకు మేలు చేకూర్చాలన్నదే తమ లక్ష్యమని, ఆ దిశగా కృషి చేస్తున్నామని వెల్లడించారు.

ఎంపీ మొయిత్రాపై ఆరోపణలు.. ఎథిక్స్‌ కమిటీకి

న్యూఢిల్లీ: తృణమూల్‌ కాంగ్రెస్‌(టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రాపై బీజేపీ ఎంపీ నిశికాంత్‌ దుబే లంచం ఆరోపణల వ్యవహారాన్ని నైతిక విలువల కమిటీకి పంపినట్లు లోక్‌సభ స్పీకర్‌ ఓం బిర్లా మంగళవారం వెల్లడించారు. లోక్‌సభ నైతిక విలువల కమిటీకి చైర్మన్‌గా బీజేపీ సభ్యుడు వినోద్‌ కుమార్‌ సోంకార్‌ ఉన్నారు. 'అదానీ గ్రూప్‌ లక్ష్యంగా ఇప్పటి వరకు ఆమె లోక్‌సభలో 50 నుంచి 61 వరకు ప్రశ్నలడిగారు. 12 డిసెంబర్‌ 2005 నాటి 'క్యాష్‌ ఫర్‌ క్వెరీ' వ్యవహారాన్ని గుర్తుచేసే విధంగా పార్లమెంట్‌లో ప్రశ్నలు అడగడం ద్వారా వ్యాపారవేత్త శ్రీ దర్శన్‌ హీరానందానీ వ్యాపార ప్రయోజనాలను కాపాడేందుకు మహువా మొయిత్రా పన్నిన నేరపూరిత కుట్ర ఇది అనేందుకు ఎలాంటి సందేహం లేదు'అని ఆదివారం ఎంపీ దుబే స్పీకర్‌కు లేఖ రాశారు. ఇది తీవ్రమైన నిబంధనల ఉల్లంఘన, సభా ధిక్కారం, నేరంగా పేర్కొన్నారు. మొయిత్రా, వ్యాపారవేత్త నుంచి లంచం తీసుకుంటున్నట్లు ఉన్న తిరుగులేని సాక్ష్యాలను ఒక న్యాయవాది తనతో పంచుకున్నారని దూబే చెప్పారు.

మోదీ 'ఆర్మీ'ని కూడా వాడుకుంటున్నారు

కాంగ్రెస్‌ చీఫ్‌ ఖర్గే విమర్శ

న్యూఢిల్లీ: ఎన్నికల్లో లబ్ధి కోసం మోదీ ప్రభుత్వం సైన్యాన్ని కూడా వాడుకుంటోందని కాంగ్రెస్‌ చీఫ్‌ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. సైనికుల పట్ల ఉండే జనాదరణను పెట్టుబడిగా పెడుతూ వారి గౌరవాన్ని దెబ్బతీస్తోందని అధికార బీజేపీపై ఆయన మండిపడ్డారు. 'దేశవ్యాప్తంగా 822 సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలంటూ ఆర్మీని మోదీ ప్రభుత్వం కోరింది. ఈ పాయింట్ల వద్ద ప్రధాని మోదీ చిత్రాన్ని ఉంచుతున్నారు. తమ సాహసాలను చాటడానికి బదులుగా సైనిక జవాన్లతో మోదీ ప్రభుత్వం తమ పథకాలను ప్రచారం చేయిస్తోంది. ప్రధాని మోదీ దేశాన్ని కాపాడాల్సిన సైన్యాన్ని తనను తాను ప్రమోట్‌ చేసుకోవడానికి వాడుకుంటున్నారు'అని విమర్శించారు. గత 75 ఏళ్లలో ఇలాంటివి ఎవరూ చేయలేదని ఖర్గే మంగళవారం 'ఎక్స్‌'లో పేర్కొన్నారు. 'భారత జవాన్ల త్యాగాలు, సాహసాలను చూసి కాంగ్రెస్‌ పార్టీ గర్విస్తోంది. జాతీయతా భావం గురించి పాఠాలు చెప్పే బీజేపీ మాత్రం, సైనికుల గౌరవాన్ని దెబ్బతీస్తోంది'అని ఖర్గే ఆరోపించారు.

తమిళనాడులో బాణాసంచా పరిశ్రమల్లో పేలుళ్లు

14 మంది కార్మికులు మృతి

సాక్షి, చెన్నై: తమిళనాడులో మరోసారి బాణాసంచా పేలుళ్లు చోటు చేసుకున్నాయి. ఈ దుర్ఘటనలో 14 మంది మరణించారు. బాణాసంచా తయారీకి పేరుగాంచిన విరుదునగర్‌ జిల్లా శివకాశీలోని రెండు పరిశ్రమల్లో మంగళవారం పేలుళ్లు జరిగాయి. తొలుత కిచ్చనాయకన్‌ పట్టి గ్రామంలో జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు మృతిచెందాడు. మంగళం గ్రామంలోని ఓ బాణసంచా పరిశ్రమ గోడౌన్‌లో పేలుడు ధాటికి 13 మంది ప్రాణాలు కోల్పోయారు. వారి మృతదేహాలు గుర్తు పట్టలేనంతంగా కాలిపోయాయి. ఈ ప్రమాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడ్డవారికి రూ.లక్ష చొప్పున అందజేస్తామన్నారు. తమిళనాడులో అక్టోబరు నెలలోనే ఆరు చోట్ల బాణాసంచా పరిశ్రమల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. హోసూరు అత్తిపల్లి ప్రమాదంలో 14 మంది, అరియలూరులో ప్రమాదంలో 12 మంది మృతి చెందారు.

గాజా ఆస్పత్రిపై భీకర దాడి

500 మంది మృత్యువాత ! ● వందల్లో క్షతగాత్రులు

- గాజా సిటీ ఆస్పత్రిపై ఇజ్రాయెల్‌ వైమానిక దాడి చేసిందన్న గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ
- దక్షిణ గాజాపైనా దాడులు
- ముందస్తు హెచ్చరికలు లేకుండానే దాడులు చేయడం పట్ల ఆగ్రహావేశాలు
- 11వ రోజుకు చేరిన ఇజ్రాయెల్‌-హమాస్‌ ఘర్షణ
- ఇజ్రాయెల్‌-లెబనాన్‌ సరిహద్దులో ఉద్రిక్తతలు



ఇజ్రాయెల్‌ దాడితో మంటల్లో చిక్కుకున్న గాజా సిటీలోని అల్‌ అహ్లీ ఆస్పత్రి



రఫా బోర్డర్‌ వద్ద ఈజిప్టులోకి ప్రవేశించేందుకు ఎదురుచూస్తున్న ఓ బాలిక

ఖాన్‌ యూనిస్‌/వాషింగ్టన్‌: హమాస్‌, ఇజ్రాయెల్‌ యుద్ధం మంగళవారం భీకరరూపం సంతరించుకుంది. సెంట్రల్‌ గాజాలోని అల్‌ అహ్లీ సిటీ ఆస్పత్రిపై ఇజ్రాయెల్‌ జరిపిన భారీ వైమానిక దాడిలో ఏకంగా 500 మంది ప్రాణాలు కోల్పోయారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అయితే దాడిని ఇజ్రాయెల్‌ ధృవీకరించలేదు. ఆస్పత్రిపై దాడి చేసింది తమ బలగాలేనా కాదా అనే దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఇజ్రాయెల్‌ తెలిపింది. దాడిలో ఆస్పత్రి పరిసరాలు భీతావహంగా మారాయి. ఆస్పత్రిలోని హాళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. రోగుల శరీరభాగాలు ఛిద్రమై చెల్లాచెదురుగా పడిన దృశ్యాలు మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. దాడి ఘటనపై పాలస్తీనా అధ్యక్షుడు మొహమ్మద్‌ అబ్బాస్‌ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మూడు రోజుల సంతాప దినాలు ప్రకటించారు. దాడికి ముందు ఆ ఆస్పత్రిలో మూడువేల మంది శరణార్థులు ఆశ్రయంపొందుతున్నట్లు తెలుస్తోంది.

ఉత్తర గాజాను ఖాళీ చేయాలని, తక్షణమే దక్షిణ గాజాకు వెళ్లిపోవాలని పాలస్తీనియన్లను ఆదేశించిన ఇజ్రాయెల్‌ సైన్యం మంగళవారం అదే దక్షిణ గాజాపై భీకర స్థాయిలో వైమానిక దాడులు నిర్వహించింది. భారీగా రాకెట్లు ప్రయోగించింది. ఈ దాడుల్లో పదులు సంఖ్యలో జనం మరణించారు. దక్షిణ గాజాలోని రఫా, ఖాన్‌ యూనిస్‌ నగరాల్లో ఈ దాడులు జరిగాయి. పలు భవనాలు ధ్వంసమయ్యాయి. రఫాలో 27 మంది, ఖాన్‌ యూనిస్‌లో 30 మంది మృతి చెందారని గాజా ఆరోగ్య శాఖ మాజీ మంత్రి బసీమ్‌ నయీం చెప్పారు. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండానే ఇజ్రాయెల్‌ సైన్యం విరుచుకుపడిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు ఉత్తర గాజాపై భూతల దాడులకు సన్నాహాలు చేస్తూ, మరోవైపు దక్షిణ గాజాపై హఠాత్తుగా వైమానిక దాడులు చేయడం గమనార్హం. హమాస్‌ స్థావరాలను, మిలిటెంట్ల మౌలిక సదుపాయాలను, కమాండ్‌ సెంటర్లను ధ్వంసం చేయడానికే దక్షిణ గాజాపై రాకెట్లు దాడులు నిర్వహించినట్లు ఇజ్రాయెల్‌ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్‌ కల్నల్‌ రిచర్డ్‌ హెచ్ట్‌ చెప్పారు. హమాస్‌ కదలికలు ఎక్కడ కనిపించినా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఇంకా శిథిలాల కిందే మృతదేహాలు

ఇజ్రాయెల్‌-హమాస్‌ మధ్య యుద్ధం మంగళవారం 11వ రోజుకు చేరుకుంది. ఇరుపక్షాల నడుమ పరస్పర దాడుల్లో ఇప్పటిదాకా ఇజ్రాయెల్‌లో సైనికులు, మహిళలు, చిన్నారులతో సహా 1,400 మందికిపైగా జనం మరణించారు. మిలిటెంట్ల చేతికి దాదాపు 200 మంది ఇజ్రాయెల్‌ పౌరులు బందీలుగా చిక్కారు. గాజాలో 2,778 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 9,700 మందికి క్షతగాత్రులుగా మారారు. మృతుల్లో మూడింట రెండొంతుల మంది చిన్నపిల్లలేనని గాజా ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధి అబ్బాస్‌ తెలిపారు. గాజాలో మరో 1,200 మంది భవనాల శిథిలాల కింద చిక్కుకొని, మృతి చెందినట్లు భావిస్తున్నామని స్థానిక అధికారులు వెల్లడించారు. ఈ మరణాలు అధికారిక గణాంకాల్లో చేరలేదు. విద్యుత్‌, పెట్రోల్‌, డీజిల్‌ లేకపోవడంతో శిథిలాలను తొలగించడం సాధ్యం కావడం లేదు. ఇజ్రాయెల్‌ దళాలు భీకర స్థాయిలో దాడులు చేస్తున్నా హమాస్‌ మిలిటెంట్లు వెనక్కి తగ్గడం లేదు. గాజా నుంచి ఇజ్రాయెల్‌ భూభాగంపైకి రాకెట్లు ప్రయోగిస్తూనే ఉన్నారు. ఉత్తర గాజాపై భూతల దాడుల విషయంలో ఇజ్రాయెల్‌ ప్రభుత్వం ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదని లెఫ్టినెంట్‌ కల్నల్‌ రిచర్డ్‌ హెచ్ట్‌ వెల్లడించారు. ఉన్నత స్థాయిలో సమాలోచనలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే తమ పదాతి దళాలు అడుగు ముందుకేస్తాయని, తమ సైన్యం గాజా సరిహద్దుల్లో సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.



రఫాలో శిథిలాల్లో తమ వారి కోసం వెతుకుతూ రోదిస్తున్న స్థానికుడు

ఉత్తర గాజా సగం ఖాళీ!

ఉత్తర గాజా నుంచి జనం తరలింపు కొనసాగుతోంది. దక్షిణ గాజాకు పయనమవుతున్నారు. ఉత్తర గాజా సగానికి పైగా ఖాళీ అయినట్లు సమాచారం. ఆసుపత్రుల్లోని వేలాది మంది రోగులు, క్షతగాత్రులు ఇంకా అక్కడే ఉన్నారు. ఆహారం, నీరు, ఔషధాలు పూర్తిగా నిండుకున్నాయని, బాధితుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని స్వచ్ఛంద సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పాలస్తీనియన్ల కోసం ఇతర దేశాలు పంపించిన ఆహారం, నిత్యావసరాలు వారికి అందడం లేదు. రఫా సరిహద్దును ఈజిప్టు మూసివేసింది. నిత్యావసరాలతో కూడిన వాహనాలు గాజాలో ప్రవేశించడానికి ప్రస్తుతం ఈ సరిహద్దు వద్ద వేచి ఉన్నాయి. ఈజిప్టు అనుమతిస్తేనే గాజా ప్రజలకు ఆహారం అందుతుంది. రఫా సరిహద్దును తెరిపించేందుకు కొందరు మధ్యవర్తులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఇజ్రాయెల్‌ మంగళవారం మూడు గంటలపాటు గాజాకు నీరు సరఫరా చేసింది. ఈ నీరు గాజాలో కేవలం 14 శాతం మందికి సరిపోతుంది.

గాజాపై దాడులు ఆపండి: ఖమేనీ

గాజాపై ఇజ్రాయెల్‌ దాడులను ఇరాన్‌ సుప్రీం లీడర్‌ అయతొల్లా అలీ ఖమేనీ ఖండించారు. దాడులు వెంటనే ఆపాలని డిమాండ్‌ చేశారు. ఇజ్రాయెల్‌ తీరు మార్చుకోకపోతే హింసాత్మక ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించారు. ఇజ్రాయెల్‌ వైఖరి పట్ల ఇస్లామిక్‌ దేశాలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయని స్పష్టం చేశారు.

నేడు ఇజ్రాయెల్‌లో జో బైడెన్‌ పర్యటన

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ బుధవారం ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. హమాస్‌ దాడులను ఖండించిన ఆయన ఇప్పటికే ఇజ్రాయెల్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. యూదులకు సంఘీభావం తెలియజేస్తూ ఇజ్రాయెల్‌లో పర్యటించబోతున్నానని బైడెన్‌ 'ఎక్స్‌'లో పోస్టు చేశారు. జోర్డాన్‌లోనూ పర్యటిస్తానని, ఇస్లామిక్‌ దేశాల అధినేతలతో భేటీ అవుతానని, గాజాలో తాజా పరిణామాలు, పాలస్తీనియన్లకు అందించాల్సిన మానవతా సాయంపై చర్చిస్తానని వెల్లడించారు. పాలస్తీనియన్లకు హమాస్‌ ప్రాతినిధ్యం వహించడం లేదన్నారు. గాజా ప్రజలకు మానవతా సాయం అందించడానికి వీలుగా ఒక ప్రణాళిక రూపొందించాలని అమెరికా, ఇజ్రాయెల్‌ నిర్ణయించాయని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌ మంగళవారం చెప్పారు.

హమాస్‌ టాప్‌ కమాండర్‌ హతం

సెంట్రల్‌ గాజాలోని బురీజ్‌ శరణార్థుల శిబిరంపై జరిగిన ఇజ్రాయెల్‌ దాడుల్లో హమాస్‌ అగ్రశ్రేణి కమాండర్‌ అయమాన్‌ నొఫాల్‌ హతమయ్యాడు. ఈ విషయాన్ని హమాస్‌ మిలటరీ విభాగం స్వయంగా వెల్లడించింది. నొఫాల్‌ సెంట్రల్‌ గాజా స్ట్రిప్‌లో హమాస్‌ మిలిటెంట్‌ వ్యవహారాల ఇన్‌చార్జిగా పని చేస్తున్నాడు. ఇతర ఇస్లామిక్‌ దేశాల్లోని మిలిటెంట్‌ గ్రూప్‌లతో అతడికి సన్నిహిత సంబంధాలున్నాయి.

రెచ్చిపోయిన లెబనాన్‌ హెజ్బొల్లా మిలిటెంట్లు

లెబనాన్‌-ఇజ్రాయెల్‌ సరిహద్దులో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఉదయం హెజ్బొల్లా మిలిటెంట్లు లెబనాన్‌ భూభాగం నుంచి ఉత్తర ఇజ్రాయెల్‌పైకి యాంటీ-ట్యాంక్‌ క్షిపణిని ప్రయోగించారు. దీంతో ఇజ్రాయెల్‌లో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటనతో ఇజ్రాయెల్‌ సైన్యం అప్రమత్తమైంది. సరిహద్దు నుంచి పౌరులను ఖాళీ చేయించాలని ఆదేశించింది. తమ భూభాగంపై జరిగిన దాడికి ప్రతిస్పందనగా దక్షిణ లెబనాన్‌పై వైట్‌ ఫాస్ఫరస్‌ బాంబులను ప్రయోగించింది. యుద్ధ ట్యాంకులతో బాంబుల వర్షం కురిపించింది. ఇంతలో లెబనాన్‌ వైపు నుంచి ఇజ్రాయెల్‌పై మరో రెండు యాంటీ-ట్యాంక్‌ క్షిపణి దాడులు జరిగాయి. ఈ దాడిలో ఎవరూ గాయపడలేదు. లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్లే లక్ష్యంగా ఇజ్రాయెల్‌ సైన్యం రాకెట్‌ దాడులు నిర్వహించింది. నలుగురు మిలిటెంట్లు హతమయ్యారని ఇజ్రాయెల్‌ సైన్యం వెల్లడించింది. గతవారం లెబనాన్‌లోని ఇస్లామిక్‌ జిహాద్‌ సభ్యులు ఇజ్రాయెల్‌పై దాడులు చేసిన సంగతి తెలిసిందే. హమాస్‌కు మద్దతుగా హెజ్బొల్లా మిలిటెంట్లు, ఇస్లామిక్‌ జిహాద్‌ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌తో ఘర్షణకు దిగుతున్నారు. ఇజ్రాయెల్‌-లెబనాన్‌ సరిహద్దుల్లో ఘర్షణలు మరింత ఉధృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. హెజ్బొల్లాకు ఇరాన్‌ అండగా నిలుస్తోంది. ఇజ్రాయెల్‌-హమాస్‌ మధ్య యుద్ధం ఇతర దేశాలకు విస్తరించకుండా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నామని తుర్కియే విదేశాంగ మంత్రి హక్కన్‌ ఫిదాన్‌ చెప్పారు.

చట్టబద్ధత కల్పించలేం

స్వలింగ వివాహాలపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ

- అది పార్లమెంటు పరిధిలోని అంశం
- స్వలింగ సంపర్కులు సహజీవనంలో ఉండొచ్చు
- వారి హక్కులను ప్రభుత్వాలు కాపాడాలి
- దత్తత హక్కుండదంటూ 3:2తో తీర్పు
- దానితో విభేదించిన సీజేఐ, జస్టిస్‌ కౌల్‌

న్యూఢిల్లీ: స్వలింగ వివాహాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక వివాహాల చట్టం ప్రకారం అలాంటి వివాహాలకు చట్టబద్ధత కల్పించేందుకు నిరాకరించింది. ''అది న్యాయస్థానానికి సంబంధించింది కాదు. పార్లమెంటు పరిధిలోని అంశం. కోర్టులు చట్టాలు చేయవు. వాటిని మంచి చెడులను బేరీజు వేస్తాయంతే'' అని పేర్కొంది. సీజేఐ జస్టిస్‌ డీవై చంద్రచూడ్‌ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఏకగ్రీవ తీర్పు వెలువరించింది. అయితే స్వలింగ సంపర్కులకు పెళ్లాడే స్వేచ్ఛ, హక్కు ఉంటాయని స్పష్టం చేసింది. అంతేగాక ఇతరుల మాదిరిగానే వారికి అన్ని రకాల హక్కులూ సమానంగా ఉంటాయని, వారిపై వివక్ష చూపొద్దని పేర్కొంది. వారి హక్కులను కాపాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ విషయమై సాధారణ ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ప్రభుత్వాలకు సూచించింది. తద్వారా స్వలింగ సంపర్కులు వివక్ష ఎదుర్కోకుండా చూడాలని పేర్కొంది. అలాగే స్వలింగ బంధాలు పట్టణ, సంపన్న వర్గాలకు పరిమితమైన ధోరణి అన్న కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. ''స్వలింగ సంపర్కం అనాది కాలం నుంచీ ఉన్న సహజ ధోరణే. అది కేవలం పట్టణాలకో, సంపన్న వర్గాలకో సంబంధించింది కాదు. ఈ విషయంలో కుల, సామాజిక వర్గ భేదాలూ ఉండవు. కనుక ఆ అపోహను వదిలించుకోవాలి'' అని సూచించింది. కాకపోతే స్వలింగ జంటలకు పిల్లలను దత్తత తీసుకునే హక్కుండబోదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు 3:2తో మెజారిటీ తీర్పు వెలువరించింది. దత్తతతో పాటు పలు న్యాయపరమైన అంశాల విషయంలో సీజేఐ జస్టిస్‌ చంద్రచూడ్‌, న్యాయమూర్తి జస్టిస్‌ సంజయ్‌ కిషన్‌ కౌల్‌తో న్యాయమూర్తులు జస్టిస్‌ ఎస్‌.రవీంద్ర భట్‌, జస్టిస్‌ హిమా కోహ్లీ, జస్టిస్‌ పి.ఎస్‌.నరసింహ విభేదించారు.



నాలుగు తీర్పులు

స్వలింగ సంపర్కం నేరం కాదంటూ 2018లో సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కూడా కల్పించాలంటూ ఎల్‌జీబీటీక్యూఐఏ++ వర్గాల తరఫున 21 పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై సుదీర్ఘ విచారణ అనంతరం గత మే 11న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. తాజాగా దీనిపై మొత్తం 4 తీర్పులు వెలువరించింది. మొత్తం అంశంపై సీజేఐ 247 పేజీల తీర్పు వెలువరించారు. స్వలింగ జంటల దత్తత తదితర అంశాలపై సీజేఐ అభిప్రాయాలతో ఏకీభవిస్తూ జస్టిస్‌ కౌల్‌ విడిగా 17 పేజీల తీర్పు వెలువరించారు. కాగా వాటితో విభేదిస్తూ తనతో పాటు జస్టిస్‌ కోహ్లీ తరఫున జస్టిస్‌ భట్‌ 89 పేజీల తీర్పు వెలువరించారు. దానితో పూర్తిగా ఏకీభవిస్తూ జస్టిస్‌ నరసింహ 13 పేజీల తీర్పు రాశారు. స్వలింగ ప్రవృత్తి సహజమైనదే తప్ప మానసిక రుగ్మత కాదని సీజేఐ స్పష్టం చేశారు. లైంగిక గుర్తింపు, ప్రవృత్తుల గురించి విచారణ జరిపే నెపంతో స్వలింగ జంటలను పోలీసులు వేధించవద్దని ఆదేశించారు. ఈ నిమిత్తం వారిని పోలీస్‌ స్టేషన్లకు పిలిపించడం గానీ, వారి నివాసాలకు వెళ్లడం గానీ చేయొద్దని చెప్పారు.

దత్తతపై...

అవివాహితులకు, స్వలింగ జంటలకు దత్తత హక్కుండదంటూ ధర్మాసనం 3:2 మెజారిటీతో తీర్పు వెలువరించింది. వారికి ఆ హక్కును నిషేధిస్తున్న దత్తత చట్ట నిబంధనలను సమర్థిస్తున్నట్టు పేర్కొంది. అయితే దీనిపై కూడా పార్లమెంటు సమగ్రంగా చర్చించి సరైన నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడింది.

సమస్యల పరిష్కారానికి కమిటీ

స్వలింగ సంపర్కులకు చట్టబద్ధ వివాహ హక్కు లేదని, రాజ్యాంగం ప్రకారం దాన్ని మౌలిక హక్కుగా పొందజాలరని పేర్కొంటూ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పు వెలువరించింది. అదే సమయంలో, స్వలింగ జంటల సమస్యలు, ఆందోళనల పరిష్కారానికి తీసుకోవాల్సిన పాలనాపరమైన చర్యలను పరిశీలించేందుకు కేబినెట్‌ కార్యదర్శి సారథ్యంలో ఉన్నత స్థాయి కమిటీ వేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఎల్‌జీబీటీ కమ్యూనిటీతో పాటు సామాజిక తదితర రంగాల నిపుణులకు అందులో చోటుండాలని సూచించింది. వీటికి సంబంధించి ఎలాంటి నిర్ణయానికైనా వచ్చే ముందు రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు అన్ని వర్గాల వారి వాదనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలియజేసింది. రేషన్‌కార్డు తదితరాల నిమిత్తం స్వలింగ జంటను ఒకే కుటుంబంగా పరిగణించడం, ఉమ్మడి బ్యాంకు ఖాతా తెరవడం, డెత్‌ బెనిఫిట్స్‌ తదితరాల నిమిత్తం తమలో ఒకరిని నామినీగా పేర్కొనడం వంటి సౌకర్యాలను కల్పించవచ్చేమో పరిశీలించాలని సూచించింది. దాంతో ఆ మేరకు చర్యలు తీసుకుంటామని కేంద్రం తరఫున సొలిసిటర్‌ జనరల్‌ తుషార్‌ మెహతా హామీ ఇచ్చారు. అన్ని అంశాలనూ సమగ్రంగా పరిశీలించిన మీదట కమిటీ ఇచ్చే తుది నివేదికను కేంద్ర, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల్లో పాలనపరంగా అన్ని స్థాయిల్లోనూ అమలు చేయాలని సీజేఐ స్పష్టం చేశారు. 'స్వలింగ జంటల బంధాన్ని చట్టపరంగా గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది. లేదంటే వారికి అన్యాయం చేసినట్టే అవుతుంది' అని సీజేఐ అభిప్రాయపడ్డారు.

ఎల్‌జీబీటీక్యూఐఏ++ అంటే

లెస్బియన్‌, గే, బైసెక్సువల్‌, ట్రాన్స్‌జెండర్‌, క్వీర్‌, క్వశ్చనింగ్‌, ఇంటర్‌సెక్స్‌, పాన్‌సెక్సువల్‌, టూ స్పిరిట్‌, అసెక్సువల్‌ తదితరులు

ఎవరేమన్నారు..



అవివాహితులు, స్వలింగ జంటలు దత్తత తీసుకోవడాన్ని నిషేధిస్తున్న సెంట్రల్‌ అడాప్షన్‌ రిసోర్స్‌అథారిటీ (సీఏఆర్‌ఏ) నిబంధన 5(3) రాజ్యాంగవిరుద్ధం, చట్టవిరుద్ధం. స్త్రీ పురుష జంటలు మాత్రమే మంచి తల్లిదండ్రులు కాగలరన్న భావన సరికాదు. అది స్వలింగ జంటల పట్ల వివక్షే అవుతుంది. అసలు వివాహమనే బంధానికి సమానంగా వర్తించే సార్వత్రిక భావనంటూ ఏదీ లేనే లేదు

– సీజేఐ జస్టిస్‌ డీవై చంద్రచూడ్‌



స్వలింగ సంపర్కుల పట్ల జరుగుతున్న చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దేందుకు బహుశా ఇది సరైన సందర్భం. ఈ దిశగా రాజ్యాంగ వ్యవస్థలన్నీ సకారాత్మక చర్యలు చేపట్టాలి. ఈ విషయంలో జస్టిస్‌ చంద్రచూడ్‌ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నా

– జస్టిస్‌ ఎస్‌.కె.కౌల్‌



కేవలం లైంగిక ప్రవృత్తి ఆధారంగా పెళ్లి చేసుకునే విషయంలో ఫలానా వారికి ఫలానా హక్కు వర్తించబోదని చెప్పబోవడం పొరపాటే అవుతుంది. స్వలింగ జంటలు పరస్పరం ప్రేమను వ్యక్తం చేసుకోవడాన్ని ఎవరూ నిషేధించలేరు. కానీ దానికి చట్టపరమైన గుర్తింపును మాత్రం ఇప్పటికైతే వారు కోరజాలరు. అలాగే దత్తత హక్కును కూడా! ఈ విషయంలో జస్టిస్‌ భట్‌ తీర్పుతో పూర్తిగా ఏకీభవిస్తున్నా

– జస్టిస్‌ నరసింహ





ఎల్‌జీబీటీక్యూఏఐ++ జంటల సమస్యలు మా దృష్టికి రాకపోలేదు. కానీ వారికి దత్తత హక్కు లేదన్న సీఏఆర్‌ఏలోని నిబంధన 5(3) చెల్లుబాటవుతుంది. అయితే స్వలింగ స్వభావులకు భాగస్వాములను ఎంచుకునేందుకు, సహజీవనం చేసేందుకు పూర్తి హక్కుంటుంది. అయితే ఆ బంధంతో వారికి దఖలు పడాల్సిన హక్కులను గుర్తించాల్సిన అనివార్యత మాత్రం ప్రభుత్వాలకు లేదు

జస్టిస్‌ రవీంద్ర భట్‌, జస్టిస్‌ హిమా కోహ్లీ

చైనాలో పుతిన్‌

బెల్ట్‌ అండ్‌ రోడ్‌ ప్రాజెక్టుకు మద్దతు

తాయ్‌ పీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌ పుతిన్‌ చైనా పర్యటనకు బయల్దేరారు. మంగళవారం చైనా రాజధాని బీజింగ్‌ చేరుకున్నారు. ఆయనకు గార్డ్‌ ఆఫ్‌ ఆనర్‌తో ఘన స్వాగతం లభించింది. ద్వైపాక్షిక విషయాలతో పాటు పలు ఇతర అంశాల్లో ఇరు దేశాల బంధం ఎంత పటిష్టంగా ఉందో చెప్పేందుకు ఈ పర్యటన తాజా నిదర్శనమని అంటున్నారు. అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా అవి ఇప్పటికే పరోక్షంగా జట్టు కట్టడం తెలిసిందే. అందులో భాగంగా ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు చైనా మద్దతు పలుకుతోంది. విదేశాల్లో ఆర్థిక, భౌగోళిక, దౌత్యపరమైన ఆధిపత్యం సాధించేందుకు చైనా ప్రదర్శిస్తున్న దూకుడుకు రష్యా దన్నుగా నిలుస్తూ వస్తోంది. ముఖ్యంగా చైనా అధ్యక్షుడు తలపెట్టిన బెల్ట్‌ అండ్‌ రోడ్‌ మౌలిక సదుపాయాల ప్రాజెక్టు (బీఆర్‌ఐ)కు కూడా రష్యా మద్దతు పలుకుతోంది. ఆ ప్రాజెక్టులో తనకేమీ తప్పుడు ఉద్దేశాలు కనిపించడం లేదని చైనా అధికార మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్‌ చెప్పారు కూడా. బీఆర్‌ఐ పదో వార్షికోత్సవానికి ఆయన హాజరవుతున్నారు. దీని ద్వారా మధ్య ఆసియాలోని మాజీ సోవియట్‌ యూనియన్‌ దేశాల మధ్య ఆర్థిక బంధం ఏర్పాటు చేయాలని ఆశాభావం వెలిబుచ్చారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి దిగేందుకు కొద్ది వారాల ముందు కూడా పుతిన్‌ చైనాలో పర్యటించారు. ఇక జిన్‌ పింగ్‌ కూడా మార్చిలో రష్యాలో పర్యటించారు. ఆ దేశంపై అమెరికా, పాశ్చాత్య దేశాల ఆంక్షలను దుయ్యబట్టారు.

ఆప్‌ ఎంపీ రాఘవ్‌ చద్దాకు ఊరట

న్యూఢిల్లీ: ఆప్‌ ఎంపీ రాఘవ్‌ చద్దాకు ఢిల్లీ హైకోర్టు ఊరట కల్పించింది. ప్రభుత్వ బంగ్లాను ప్రస్తుతానికి ఆయన ఖాళీ చేయాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఈ మేరకు దిగువ కోర్టు ఏప్రిల్‌లో ఇచ్చిన ఆదేశాలను పునరుద్ధరిస్తూ మంగళవారం జస్టిస్‌ అనూప్‌ ఆదేశాలిచ్చారు. తనకు కేటాయించిన టైప్‌-7 బంగ్లాను ఖాళీచేయాలంటూ రాజ్యసభ సెక్రటేరియట్‌ అధికారులు మార్చిలో నోటీసు పంపారు. దీనిపై ఆయన పటియాలా కోర్టుకెళ్లగా ఓసారి అనుకూలంగా, సెక్రటేరియట్‌ రివ్యూపిటిషన్‌ వేళ వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. దీంతో ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న న్యాయస్థానం రాఘవ్‌ చద్దా ప్రస్తుతానికి ఆ బంగ్లాను ఖాళీ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రం బిజాపూర్‌ జిల్లాలో మంగళవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ మద్దేడు డివిజనల్‌ కమిటీ సభ్యుడు మృతి చెందాడు. మద్దేడు పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కొరంజెడ్‌-బందెపారా అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ ముఖ్య నేతలు సమావేశమయ్యారన్న నిఘా వర్గాల సమాచారంతో సోమవారం సాయంత్రం నుంచి డీఆర్‌జీ, ఎస్టీఎఫ్‌, బస్తర్‌ ఫైటర్స్‌తో పాటు సీఆర్‌పీఎఫ్‌ 170వ బెటాలియన్‌ బలగాలు కూంబింగ్‌ చేపట్టాయి. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున మావోయిస్టులు కాల్పులు జరపగా పోలీసులు ఎదురు కాల్పులకు దిగారు. గంటపాటు హోరాహోరీగా కాల్పులు జరగగా మావోయిస్టులు తప్పించుకెళ్లారు. ఆ ప్రాంతంలో మావోయిస్టు డివిజనల్‌ కమిటీ మెంబర్‌, ఏరియా కమిటీ ఇన్‌చార్జ్‌ పొదెం నగేశ్‌ మృతదేహం కనిపించింది. ఆ ప్రాంతంలో ఒక ఏకే 47 తుపాకీ, పేలుడు పదార్థాలు, మందులు, బ్యానర్లు, పోస్టర్లు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. 108 వరకు అరెస్ట్‌ వారెంట్లున్న నగేశ్‌ తలపై అధికారులు గతంలో రూ.8 లక్షల రివార్డు ప్రకటించారన్నారు. ఘటనాస్థలి నుంచి ఏరియా కమిటీ కార్యదర్శి బుచ్చన్న, ఏరియా కమిటీ సభ్యుడు విశ్వనాథ్‌తో పాటు మరో 20 మంది వరకు మావోలు తప్పించుకుని ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. వారి కోసం అదనపు బలగాలను రంగంలోకి దించి కూంబింగ్‌ ముమ్మరం చేశారు. మావోయిస్టు మృతదేహాన్ని బిజాపూర్‌ జిల్లా కేంద్రానికి తరలించామని బస్తర్‌ ఐజీ సుందర్‌రాజ్‌ చెప్పారు. నవంబర్‌ 7వ తేదీన మొదటి విడతలో ఎన్నికలు జరగనున్న బస్తర్‌ జిల్లాలో 20 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి.

సీఎం కేసీఆర్ టీ బ్రేక్



సాక్షి, సిద్దిపేట : సిద్దిపేట బీఆర్ఎస్ సభ అనంతరం హైదరాబాద్‌కు తిరుగు పయనమైన సీఎం కేసీఆర్ సిద్దిపేట శివారులోని పొన్నాల దాబా వద్ద కాసేపు బ్రేక్ తీసుకున్నారు. దాబాలో రిలాక్స్‌డ్‌గా టీ తాగారు. ఆయన వెంట మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మీకు తెలుసా?

1985లో ఇక్కడా పుంజుకున్న టీడీపీ

1985 ఉమ్మడి ఏపీ శాసనసభ మధ్యంతర ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ మరోసారి విజయం సాధించింది. ఈసారి కూడా ఉమ్మడి ఏపీలో 202 సీట్లు టీడీపీకి రాగా, ఏభై సీట్లు కాంగ్రెస్‌కు దక్కాయి. సీపీఐకి 11, సీపీఎంకు 11, బీజేపీకి ఎనిమిది, జనతా పార్టీకి మూడు సీట్లు రాగా, ఇండిపెండెంట్లు తొమ్మిది మంది గెలిచారు. తెలంగాణ వరకు చూస్తే టీడీపీకి 59 సీట్లు వచ్చాయి. టీడీపీ పరిస్థితి ఇక్కడ మరింత మెరుగు పడగా, కాంగ్రెస్ బాగా దెబ్బ తినడం విశేషం. కాంగ్రెస్‌కి కేవలం 14 స్థానాలే వచ్చాయి. అదే టైమ్‌లో ఆంధ్ర, రాయలసీమలలో కాంగ్రెస్‌కు 36 సీట్లు రావడం గమనార్హం. తెలంగాణలో సీపీఐ కి 8, సీపీఎంకు ఏడు, బీజేపీకి ఎనిమిది, జనతా పార్టీకి మూడు సీట్లు రాగా ఇండిపెండెంట్లు ఎనిమిది మంది నెగ్గారు. వామపక్షాలు, భారతీయ జనతా పార్టీలు తెలంగాణలోనే అధికంగా తమ ఉనికిని చాటుకున్నాయి.

1989లో టీడీపీకి తెలంగాణలో గట్టి దెబ్బ

1989 ఉమ్మడి ఏపీ శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఓడించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్‌కి 181 సీట్లు రాగా, టీడీపీకి 74 సీట్లు వచ్చాయి. సీపీఐ ఎనిమిది, సీపీఎం ఆరు, బీజేపీ ఐదు, జనతా ఒకటి, ఎంఐఎం నాలుగు సీట్లు సాధించాయి. పదిహేను మంది ఇండిపెండెంట్లు గెలిచారు. తెలంగాణ ప్రాంతం వరకు పరిశీలిస్తే, 107 స్థానాలకు గాను కాంగ్రెస్ 58 చోట్ల విజయం సాధించింది. తెలుగుదేశం పార్టీకి కేవలం 19 స్థానాలే దక్కాయి. సీపీఐ ఎనిమిది, సీపీఎం నాలుగు, బీజేపీ ఐదు, జనతా ఒకటి గెలుచుకోగా, ఎనిమిది మంది ఇండిపెండెంట్లు ఉన్నారు. విశేషం ఏమిటంటే ఆంధ్రలో కంటే తెలంగాణలోనే టీడీపీ దారుణంగా దెబ్బతినగా.. వామపక్షాలతో పాటు కమలం పార్టీ ఇక్కడ ఉనికి చాటుకున్నాయి.

మేకల కళ్యాణ్ చక్రవర్తి

ఎవరికి ఏం రాసిపెట్టి ఉంటుందో ఎవరికి తెలుసు అంటారు పెద్దలు. రాజకీయాల్లో అయితే ఈ నానుడి సరిగ్గా సరిపోతుంది. ప్రజాసేవే పరమావధిగా రాజకీయాల్లోకి వచ్చే నాయకులు ఎప్పుడు ఎలాంటి పదవులు చేపడతారో, ఏ హోదాలో ప్రజల సేవకు అంకితమవుతారో ఊహించలేని పరిస్థితి. వారికి దేశ ప్రధాని మొదలు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, అసెంబ్లీ స్పీకర్లుగా, శాసనమండలి చైర్మన్లుగా, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలుగా, మంత్రులుగా వివిధ హోదాల్లో పనిచేసే అవకాశం దక్కుతుంది. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ పదవుల్లో ఏది దక్కినా రాజకీయ నాయకుడిగా విజయవంతమైనట్టే. ఇక మంత్రి హోదాలు అదనం. ఇలాంటి రాజకీయ నేతల జాబితా తెలంగాణలో చాంతాడు కంటే పొడవుగానే ఉందని చరిత్రను పరిశీలిస్తే ఇట్టే అర్థమవుతుంది.

పరమ పదవి సోపానం




ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, మంత్రి హోదాల్లో రాష్ట్ర రాజకీయ నేతలు

- చిన్న సభలోకి వెళ్లాలనుకున్నా అనూహ్యంగా పెద్దల సభకు కొందరు నాయకులు
- ఎమ్మెల్యే కావాలన్న ఆకాంక్ష నెరవేరకుండానే ఎంపీలుగా చట్టసభల్లోకి..
- కొందరు ఎమ్మెల్సీతోనే సరి... మూడు సభలకూ వెళ్లిన మరికొందరు
- ఎంపీగా, ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి హోదాలో సేవలందించిన ఇంకొందరు

రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న పీవీ నర్సింహారావు దేశంలో అత్యున్నత రాజకీయ పదవులు అనుభవించారు. తన రాజకీయ భవిష్యత్తుకు పునాది వేసిన మంథని నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పీవీ.. నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేశారు. కేంద్ర మంత్రిగా, ప్రధాన మంత్రిగా కూడా పనిచేసిన ఘనత దక్కించుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని హనుమకొండ, నంద్యాలతోపాటు మహారాష్ట్రలోని రాంటెక్, ఒడిశాలోని బరంపురం లోక్‌సభ స్థానాల నుంచీ పీవీ గెలుపొందారు. ఇక, ఆ తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా పలు హోదాల్లో రాష్ట్ర, దేశ ప్రజలకు సేవచేసిన జాబితాలో సీఎం కేసీఆర్ ఉన్నారు. ఆయన కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్ ఎంపీగా, సిద్దిపేట, గజ్వేల్ ఎమ్మెల్యేగా, కేంద్ర, రాష్ట్రాల స్థాయిలో మంత్రిగా, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసిన ఆయన రెండోసారి తెలంగాణ ముఖ్యమంత్రిగా సేవలందిస్తున్నారు.

పీవీది ప్రత్యేక స్థానం



జాబితా చాలా పెద్దదే..

పలు చట్టసభల్లోకి ప్రవేశించిన నేతల్లో తెలంగాణకు చెందిన చాలా మంది ఉన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో చురుగ్గా ఉన్నవారిని ఒక్కసారి పరిశీలిస్తే కిషన్‌రెడ్డి (ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర కేబినెట్ మంత్రి), ధర్మపురి శ్రీనివాస్ (ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి), సురేశ్‌షెట్కార్ (జహీరాబాద్ ఎంపీ, నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే), సత్యవతి రాథోడ్ (డోర్నకల్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి), మాలోతు కవిత (మహబూబాబాద్ నుంచి ఎమ్మెల్యే, ఎంపీ)లు పలు పదవుల్లో పనిచేశారు. సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత నిజామాబాద్ ఎంపీతోపాటు అదే జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలిచారు. సోయం బాపూరావు, గెడం నగేశ్, రమేశ్ రాథోడ్‌లు కూడా ఆదిలాబాద్ నుంచి ఎమ్మెల్యే, ఎంపీగా గెలుపొందారు. గుత్తా సుఖేందర్‌రెడ్డి (మిర్యాలగూడ ఎంపీ, ఎమ్మెల్సీ, శాసనమండలి చైర్మన్‌గా), అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ ఎంపీగా, పాతబస్తీలో ఎమ్మెల్యేగా పనిచేశారు. తమ్మినేని వీరభద్రం (ఎంపీ, ఎమ్మెల్యే) పువ్వాడ నాగేశ్వరరావు (ఎంపీ, ఎమ్మెల్సీ), భట్టి విక్రమార్క (ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే), టి.జీవన్‌రెడ్డి (జగిత్యాల ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా), కె.ఆర్.సురేశ్‌రెడ్డి (ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్, రాజ్యసభ ఎంపీ), షబ్బీర్‌అలీ (ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి), బాలాగౌడ్ (నిజామాబాద్ ఎంపీ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్), ఆకుల లలిత (ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ), జువ్వాది చొక్కారావు (ఎమ్మెల్యే, ఎంపీ), చెన్నమనేని విద్యాసాగర్‌రావు (ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి), కెప్టెన్ లక్ష్మీకాంతరావు (ఎమ్మెల్యే, ఎంపీ), బాగారెడ్డి (ఎమ్మెల్యే, ఎంపీ, రాష్ట్రమంత్రి), సోలిపేట రాంచంద్రారెడ్డి (ఎమ్మెల్యే, రాజ్యసభ ఎంపీ), దేవేందర్‌గౌడ్ (ఎమ్మెల్యే, మంత్రి, రాజ్యసభ ఎంపీ), పట్నం మహేందర్‌రెడ్డి (ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాష్ట్ర మంత్రి), డాక్టర్ కె.లక్ష్మణ్ (ఎంపీ, ఎమ్మెల్యే), వి.హనుమంతరావు (ఎమ్మెల్యే, ఎంపీ), సలావుద్దీన్ ఒవైసీ (ఎంపీ, ఎమ్మెల్యే), మల్లురవి (ఎంపీ, ఎమ్మెల్యే)లు కూడా పలు హోదాల్లో రాజకీయాల్లో సేవలందించారు. గత చరిత్రను తరచిచూస్తే జి.వెంకటస్వామి ఒకసారి ఎమ్మెల్యేగా, ఏడుసార్లు ఎంపీగా గెలుపొందారు. కాంగ్రెస్ నేత చకిలం శ్రీనివాసరావు, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, కమ్యూనిస్టు దిగ్గజాలు భీంరెడ్డి నర్సింహారెడ్డి, ధర్మభిక్షం, రావి నారాయణరెడ్డి,లు కూడా ఎమ్మెల్యే, ఎంపీలుగా పనిచేశారు.

మూడు, నాలుగు హోదాల్లో..

రాష్ట్ర స్థాయిలోని ఉభయసభల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కొందరు దక్కించుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ఒక సభ, దేశ స్థాయిలో మరో సభలోకి ప్రవేశించారు మరికొందరు. రాష్ట్రస్థాయిలోని రెండు సభలు, జాతీయ స్థాయిలోని మరో సభలో అడుగుపెట్టారు ఇంకొందరు. కడియం శ్రీహరి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, రేవంత్‌రెడ్డి, ఎల్.రమణలు మూడు సభల్లో (అసెంబ్లీ, శాసన మండలి, పార్లమెంట్) ప్రవేశించిన అదృష్టజాతకులుగా నిలిచిపోతారు. కడియం , ఎల్.రమణ రాష్ట్ర మంత్రిగానూ పనిచేశారు. ఇక, ఎమ్మెల్యే, ఎంపీ కేటగిరీలో ప్రస్తుతం రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్న పలువురు నాయకులు మంత్రి హోదాలో కూడా పనిచేశారు. మల్లారెడ్డి (మల్కాజ్‌గిరి నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీ, రాష్ట్రమంత్రి), కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (నల్లగొండ ఎమ్మెల్యే, భువనగిరి ఎంపీ, మంత్రి), ఉత్తమ్ కుమార్‌రెడ్డి (కోదాడ, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే, నల్లగొండ ఎంపీ, మంత్రి), ఎర్రబెల్లి దయాకర్‌రావు (పాలకుర్తి, వర్ధన్నపేట ఎమ్మెల్యే, వరంగల్ ఎంపీ, మంత్రి), ఎస్. ఇంద్రకరణ్‌రెడ్డి (ఆదిలాబాద్ ఎంపీ, నిర్మల్ ఎమ్మెల్యే, మంత్రి), వేణుగోపాలాచారి (ఆదిలాబాద్ ఎంపీ, నిర్మల్ ఎమ్మెల్యే, మంత్రి)లు ఎంపీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారు.



దుర్గమ్మ సాక్షిగా దసరా వేషాలు



నవరాత్రులకు అడక్కుండానే నజరానాలు

ఎన్నికల వేళ 'ఓట్ల పండగ'

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సీజన్ కావడంతో నేతలు ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. సందర్భం ఏదైనా ఓటరుకు దగ్గరయ్యే మార్గాన్వేషణలో ఉన్నారు. దసరా పండగ కూడా ఈసారి ఈ కోవలోకి చేరింది. ఊరూవాడా జరిగే నవరాత్రోత్సవాలను తమ ప్రచారాస్త్రాలుగా మలుచుకుంటున్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే వేడుకలకు వెనుకాడకుండా నిధులిస్తున్నారు. ఏదో ఒక సమయంలో ఆ ప్రాంతానికి వెళ్లి హడావిడి చేస్తున్నారు. అనుచర గణంతో వెళ్లి జనంతో మమేకమవుతున్నారు. దీంతో రాష్ట్రంలో ఎక్కడ చూసినా దేవి నవరాత్రుల్లో ఈసారి పొలిటికల్ కలర్ కన్పిస్తోంది. స్థానిక కేడర్ కూడా పార్టీలుగా విడిపోయి మరీ ఈ వేడుకను జరుపుకుంటున్నారు.

పోటాపోటీ..

సాధారణ రోజుల్లో అయితే దసరా ఉత్సవాల నిర్వహణకు కొంత శ్రమపడాల్సి వచ్చేది. ఈసారి ఆ ఇబ్బంది కన్పించడం లేదని నిర్వాహకులే చెబుతున్నారు. 'మీ వాడలో జరిగే వేడుకలకు అయ్యే ఖర్చు కొంత మేం భరిస్తాం' అని ఒక పార్టీ అంటే, పోటీగా మరో పార్టీ 'మొత్తం మేమే భరిస్తాం' అని ముందుకొస్తోంది. వేడుక నిర్వహించే బాధ్యులను పిలిచి మరీ బేరాలు కుదుర్చుకుంటున్నారు. దీని వెనుక అసలు పరమార్థం ఎలక్షనే. ఆ వీధిలోనో... ఊర్లోనో హాజరయ్యే ఓటర్లకు సానుకూలంగా ప్రచారం చేసే బాధ్యతను నిర్వాహకులకు అప్పగిస్తున్నారు.

పొలిటికల్ కలర్

దేవీ నవరాత్రులు ఘనంగా జరిపే నిర్వాహకులు కొసమెరుపుగా నేతలను ఆహ్వానిస్తున్నారు. ఈ సందర్భంగా ఊరూవాడా స్వాగత సన్నాహాలు, స్వాగత బ్యానర్లు ఏర్పాటు చేయడం కన్పిస్తోంది. సమ్మతి, అసమ్మతి కేడర్‌కు గాలం వేసేందుకు కూడా దీన్ని వేదికగా వాడుకుంటున్నారు. సొంత పార్టీలో అసమ్మతి నేతలను ఈ సందర్భంగా కలవడం, వారిని తమవైపు తిప్పుకునేందుకూ ప్రయత్నిస్తున్నారు. ఒకరిని మించి ఇంకో వర్గం తమ పార్టీ నేతలను ఆహ్వానించడమే కాదు.. ఆయా ప్రాంతాల్లో తమ బల ప్రదర్శన చేస్తున్నారు. అడక్కుండానే ఈసారి ఉత్సవాలు ఘనంగా జరిపేందుకు రాజకీయ నేతలు అండగా ఉంటున్నారు.

ఓట్ దిస్ పాయింట్





2 ఏళ్లకు పైబడిన కారాగార శిక్ష పడిన నేరస్తులు ఎన్నికల్లో పోటీ చేయవచ్చా?

- లేదు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8(3) ప్రకారం ఏదైనా నేరానికి ఓ వ్యక్తి 2 ఏళ్లు, ఆపై కాలానికి కారాగార శిక్ష పొందితే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హుడే.

రెండేళ్లు, ఆపై కారాగార శిక్షపై ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ పెండింగ్ ఉండగా బెయిల్‌పై బయట ఉన్న వ్యక్తి ఎన్నికల్లో పోటీ చేయవచ్చా?

- లేదు. బెయిల్‌పై ఉన్నా కారాగార శిక్షను సస్పెండ్/రద్దు చేయని పక్షంలో పోటీకి అనర్హుడు.

ఒక అభ్యర్థి ఎన్ని అసెంబ్లీ/పార్లమెంట్ స్థానాల నుంచైనా పోటీ చేయవచ్చా ?

- లేదు. ఒక అభ్యర్థి ఏకకాలంలో రెండు స్థానాలకు మించి ఎన్నికల్లో పోటీ చేయలేదు.

30 స్థానాల్లో ప్రభావితం చేసే స్థాయిలో లెఫ్ట్ ఓట్లు

కాంగ్రెస్‌కు కలసి రానున్న సీపీఐ, సీపీఎం పొత్తు

- పొత్తు కుదిరితే 30 చోట్ల భారీ ప్రచారానికి లెఫ్ట్ వ్యూహం
- బీఆర్ఎస్, బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ముందుకు...

1,000 నుంచి 5,000 ఓట్లు

బొల్లోజు రవి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వామపక్షాలు ఎన్నికల రణరంగంలో తమ సత్తా చాటాలని ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈసారి ఎలాగైనా అసెంబ్లీలో అడుగు పెట్టాలని ఉవ్విళ్లూరుతున్నాయి. అందుకోసం కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలని నిర్ణయించాయి. అయితే పొత్తు, సీట్ల వ్యవహారంపై ఇంకా అస్పష్టత కొనసాగుతూనే ఉంది. కాంగ్రెస్‌తో రాజకీయ అవగాహన కుదిరినా, సీట్లపై ఒప్పందం జరగలేదని సీపీఐ చెప్తోంది. కాగా, రాష్ట్రంలో తాము అనేక అసెంబ్లీ స్థానాలను ప్రభావితం చేయగలమని, ఇది కాంగ్రెస్‌కు కలసి వస్తుందని సీపీఐ, సీపీఎం నేతలు చెబుతున్నారు. తమ ఓట్లతో బీఆర్ఎస్, బీజేపీలను మట్టికరిపించవచ్చనీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగలదని లెఫ్ట్ నేతలు స్పష్టం చేస్తున్నారు. తాము గెలిచే స్థితిలో లేకపోయినా, మిత్రులను గెలిపించడంలోనూ, శత్రువులను ఓడించడంలోనూ కీలకంగా ఉంటామని చెబుతున్నారు. దీంతో వామపక్షాలతో పొత్తు కాంగ్రెస్‌కు కీలకంగా మారనుంది.

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో అధికంగా ఓట్లు : రాష్ట్రంలో 119 అసెంబ్లీ స్థానాలున్నాయి. అందులో 30 స్థానాల్లో అంటే నాలుగోవంతు సెగ్మెంట్‌లలో తాము పెద్ద ఎత్తున ప్రభావితం చేయగలమని సీపీఐ, సీపీఎంలు చెబుతున్నాయి. 30 స్థానాల్లో ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు వెయ్యి నుంచి 5 వేల మధ్య ఓట్లు ఉంటాయని సీపీఎం నేత ఒకరు పేర్కొన్నారు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో అధిక స్థానాల్లో ఓట్లు ఉన్నాయంటున్నారు. ఇక 100 నుంచి వెయ్యి వరకు ఓట్లున్న స్థానాలు 60 వరకు ఉంటాయని చెబుతున్నారు. 2018 ఎన్నికల్లో మిర్యాలగూడ అసెంబ్లీ స్థానంలో అప్పుడు సీపీఎం తరఫున పోటీ చేసిన జూలకంటి రంగారెడ్డికి 11 వేలకు పైగా ఓట్లు వచ్చాయి. భద్రాచలంలో కూడా సీపీఎం నుంచి పోటీ చేసిన మిడియం బాబూరావుకు 14 వేలకు పైగా ఓట్లు వచ్చాయి. సీపీఐకి కూడా కొన్ని నియోజకవర్గాల్లో భారీగా ఓట్లు ఉన్నాయి. ఈ స్థాయి ఓట్లు కాంగ్రెస్‌కు కలసి వస్తాయని, గెలుపు అవకాశాలను నిర్ణయిస్తాయని లెఫ్ట్ నేతలు అంటున్నారు. పొత్తు కుదిరిన పక్షంలో రాష్ట్రంలో తాము పోటీ చేసే స్థానాలతోపాటు, గణనీయంగా ఓట్లున్న 30 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల కోసం కృషి చేస్తామంటున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఇదే లెక్కలతో వామపక్షాలతో పొత్తుకు సిద్ధమవుతోందని చర్చా సాగుతోంది.

గాసిప్ టైమ్

మన పార్టీలో కూడా ఫ్యామిలీ ప్యాకేజీలుంటాయా?

ఆశల పల్లకీలో కమలనాథులు



అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఈసారి ఫ్యామిలీ ప్యాకేజీ లుంటాయా ? లేదా అన్న చర్చ బీజేపీలో సాగుతోంది. కర్ణాటకలో మాదిరి తెలంగాణలోనూ ఒక్కో కుటుంబంలోని ఇద్దరికి టికెట్లు కేటాయిస్తారా అన్న అంశంపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోం ఇక్కడా ఆశావహులు ఉన్నారు.. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఆయన సతీమణి కావ్యారెడ్డి, ఈటల రాజేందర్, ఆయన భార్య ఈటల జమున, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, ఆయన భార్య, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, ఆయన కుమారుడు మిథున్ రెడ్డి, డీకే అరుణ, ఆమె కుమార్తె, . ఇలా బీజేపీలో కూడా ఓ కుటుంబంలో రెండేసి టికెట్ల కోసం ప్రయత్నాలు గట్టిగా చేస్తున్నట్టు చర్చ జరుగుతోందట..ఇదంతా నిజమవుతుందా? లేక ప్రచారానికే పరిమితమా చూడాలి.

లక్ష్మీపుత్రుడి లక్కెలా ఉందో?

అసెంబ్లీలో స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించినవారు ఓటమి పాలవుతారన్న సెంటిమెంట్ బలంగా ఉంది. దీనిని బలపరుస్తూ గతంలో పనిచేసిన స్పీకర్లు ఓడిన ఉదంతాలున్నాయి. 1999 నుంచి స్పీకర్లుగా పనిచేసిన వారిలో ఇప్పటివరకు ఎవరూ గెలుపును సొంతం చేసుకోలేకపోయారు. అయితే ఈసారి ఆ సెంటిమెంట్‌ను తిరగరాస్తానన్న ధీమాలో అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. వయసు పైబడుతుండటంతో ఈసారి పోటీ నుంచి తప్పుకొని కుమారుడిని వారసునిగా నిలబెట్టాలని అనుకున్నా సీఎం మాత్రం తాను ఉన్నన్ని రోజులు శీనన్న ఉంటారని పేర్కొనడంతో ఎన్నికల బరిలో ఆయన నిలిచారు.


స్పీకర్లకు ఓటమి గండం!

- సెంటిమెంటును తిరగరాస్తానంటున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- అభివృద్ధి గెలిపిస్తుందన్న ధీమా.. విజయం కోసం విశ్వప్రయత్నాలు

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని సీఎం కేసీఆర్ లక్ష్మీపుత్రుడు అని సంబోధిస్తుంటారు. అసెంబ్లీలోనే కాదు బహిరంగ సభల్లోనూ ఆయనను అలాగే గౌరవిస్తారు. పోచారం వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో రైతుబంధు పథకం ప్రారంభించారు. రూ. వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని, అందుకే శీనన్న లక్ష్మీపుత్రుడు అంటూ సీఎం కేసీఆర్ పలు సందర్భాలలో పేర్కొన్నారు.

నిత్యం ప్రజల్లో ఉంటూ...: కామారెడ్డి జిల్లా బాన్సువాడ సెగ్మెంట్ నుంచి 1994లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన పోచారం... 2004 మినహా 1999, 2009, 2011 (ఉప ఎన్నిక), 2014, 2018 ఎన్నికల్లో విజయాలు సొంతం చేసుకున్నారు. 76 ఏళ్ల వయసులోనూ ఆయన నిత్యం జనం మధ్యే తిరుగుతుంటారు. వేకువజామునే లేచి బ్యాటరీ వాహనంలో ఊరంతా కలియ తిరుగుతారు. మున్సిపల్ సిబ్బంది మురికికాలువలు శుభ్రం చేస్తుంటే నిలబడి వారికి సూచనలు ఇస్తారు. ఇంటికి చేరగానే ఊళ్ల నుంచి వచ్చే ప్రజలు, పార్టీ నేతలతో మాట్లాడతారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత రూ.10 వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని లెక్కలతో సహా చెబుతారు. ఏ నియోజకవర్గంలో లేనివిధంగా బాన్సువాడలో 11 వేల డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందించారు. విద్య, వైద్య రంగంలోనూ నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలిపారు. బాన్సువాడలోని మాతాశిశు ఆస్పత్రి సేవల్లో దేశంలోనే ప్రథమ స్థానం దక్కించుకుంది.

స్పీకర్ పేరు	నియోజకవర్గం	పదవీకాలం	ఓడిన సంవత్సరం
ప్రతిభాభారతి	కావలి	1999-2004	2004
కేఆర్. సురేశ్‌రెడ్డి	బాల్కొండ	2004-2009	2009 (ఆర్మూర్)
కిరణ్‌కుమార్‌రెడ్డి	పీలేరు	2009-2010	బరిలో నిలవలేదు
నాదెండ్ల మనోహర్	తెనాలి	2011-2014	2014
మధుసూదనాచారి	భూపాలపల్లి	2014-2018	2018



సెంటిమెంట్ ఏం చేస్తుందో?

స్పీకర్ పదవిలో ఉన్న వారు తర్వాతి ఎన్నికల్లో ఓడిపోతూ రావడం ఆనవాయితీగా మారింది. కానీ ఈ సెంటిమెంట్‌ను పోచారం అధిగమిస్తారని ఆయన అనుచరులు నమ్ముతున్నారు. నిత్యం జనం మధ్యే ఉంటూ, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న పోచారం చరిత్రను తిరగరాస్తారంటున్నారు. నియోజకవర్గంలో ప్రత్యర్థులు బలంగా లేకపోవడం కలిసి వస్తుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అభివృద్ధి మంత్రం పనిచేస్తుందా లేక సెంటిమెంటే పునరావృతం అవుతుందా అన్నది మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది.

ఇక్కడ తీరు వేరు వార్ వేరు

ఉమ్మడి ఖమ్మం జిల్లా తీర్పు విలక్షణం

- కారు దూసుకెళ్లేనా?
- హస్తం మళ్లీ పట్టు చూపిస్తుందా?

శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఓటర్లు భిన్నమైన తీర్పును ఇస్తూ ప్రత్యేకతను చాటుతున్నారు. ప్రధానంగా తెలంగాణ ఏర్పడ్డాక జరిగిన రెండు ఎన్నికల్లో రాష్ట్రమంతా బీఆర్ఎస్ విజయం సాధించి పాలనాపగ్గాలు చేపట్టినా ఇక్కడ మాత్రం ఒకటీ రెండు సీట్లకే పరిమితమైంది. ఇక ఇప్పటికీ ఉమ్మడి ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ బలమైన ఓటు బ్యాంక్ కలిగి ఉండగా.. గతంలో సత్తా చాటిన కమ్యూనిస్టులు ఇప్పుడు ప్రాభవాన్ని కోల్పోయారు.


బొల్లం శ్రీనివాస్

2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం, ఇల్లెందు, పాలేరు, మధిర స్థానాలను గెలుచుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పినపాక, వైరా, అశ్వారావుపేట స్థానాలను దక్కించుకోగా, భద్రాచలంలో సీపీఎం గెలుపొందింది. అప్పుడే ఏర్పడిన కొత్త రాష్ట్రంలో తెలంగాణ సెంటిమెంట్ ఉన్నా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ముగ్గురు విజయం సాధించడం విశేషం. ఇక సత్తుపల్లిలో టీడీపీ, కొత్తగూడెంలో టీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచారు.

రెండు ఎన్నికల్లోనూ..

ఆ తర్వాత 2016లో జరిగిన ఉప ఎన్నికలో పాలేరు నుంచి టీఆర్ఎస్ గెలుపొందింది. ఇక 2018 ఎన్నికల్లో మధిర, పాలేరు, కొత్తగూడెం, పినపాక, ఇల్లెందు, భద్రాచలం స్థానాలను కాంగ్రెస్, సత్తుపల్లి, అశ్వారావుపేట స్థానాలను టీడీపీ దక్కించుకోగా.. వైరాలో ఇండిపెండెంట్ అభ్యర్థి, ఖమ్మంలో టీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. ఇలా రెండు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అత్యధిక స్థానాలను గెలిచింది. అయితే 2018 ఎన్నికల తర్వాత పరిణామాలతో పాలేరు, కొత్తగూడెం, పినపాక, ఇల్లెందు ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరారు.

డిస్ట్రిక్ట్ స్కాన్



బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్

తెలంగాణ ఏర్పడ్డాక మూడోసారి జరుగుతున్న ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లు హోరాహోరీ పోరు కొనసాగే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ ఇక్కడ సత్తా చాటుతోంది. ఇక గత రెండు ఎన్నికల్లో ఒక్కో సీటుకే పరిమితమైన బీఆర్ఎస్.. ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలు చేరడం, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్, కార్పొరేషన్, సహకార సంఘం ఎన్నికల్లో విజయం సాధించడంతో బలం పెంచుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో సీట్ల సంఖ్య పెంచుకోవడంపై బీఆర్ఎస్ దృష్టి పెట్టింది. ఉమ్మడి జిల్లాపై గులాబీ బాస్, సీఎం కేసీఆర్ ప్రత్యేక నజర్ పెట్టి ఇక్కడ సభలు కూడా ఏర్పాటు చేశారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా చూస్తే ఈ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు వస్తాయని ఆ పార్టీ నాయకత్వం ధీమాగా ఉంది.

జలగం హవా



సత్తుపల్లి నియోజకవర్గానికి ప్రత్యేకత ఉంది. మొదటి నుంచి ఇక్కడ ఎక్కువ కాలం జలగం కుటుంబం ఆధిపత్యం చెలాయించింది. 1957లో జలగం కొండల్‌రావు, 1962, 1967,1972లో వేంసూరు నియోజకవర్గం నుంచి జలగం వెంగళరావు విజయ బావుటా ఎగురవేశారు. అనంతరం 1978లో వేంసూరు కాస్తా సత్తుపల్లి నియోజకవర్గంగా ఏర్పడడంతో వెంగళరావు గెలుపొందారు. ఆయన కాసు, పీవీ మంత్రివర్గాల్లో పనిచేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. ఖమ్మం లోక్‌సభ నుంచి ఎన్నికై కేంద్రమంత్రిగానూ పనిచేశారు. ఆయన సోదరుడు కొండల్‌రావు సైతం ఎంపీగా ఎన్నికయ్యారు. జలగం వెంగళరావు పెద్ద కుమారుడు ప్రసాదరావు సత్తుపల్లిలో రెండుసార్లు గెలిచి మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. వెంగళరావు చిన్న కుమారుడు వెంకట్రావు 2004లో కాంగ్రెస్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. 2014లో టీఆర్ఎస్‌లో చేరి కొత్తగూడెం నుంచి పోటీచేసి గెలిచారు.

40 ఏళ్ల తర్వాత...



గత నలభై ఏళ్లగా ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం నుండి గెలిచిన ప్రతీ ఎమ్మెల్యే ప్రతీసారి విపక్షంలోనే ఉంటూ వచ్చారు. ఈ సంప్రదాయాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తిరగరాశారు. 1978లో కాంగ్రెస్ తరపున కీసర అనంతరెడ్డి గెలుపొందగా.. అప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. నలభై ఏళ్ల తర్వాత మళ్లీ 2018లో ఖమ్మం నుంచి బీఆర్ఎస్ తరపున పువ్వాడ అజయ్‌కుమార్ విజయం సాధించగా.. రాష్ట్రంలోనూ ఆ పార్టీ అధికార పగ్గాలు చేపట్టగా, ఆయనకు మంత్రి పదవి దక్కింది.

కమ్యూనిస్టుల కోటకు బీటలు

గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్నా క్రమంగా బీటలు వారుతూ వచ్చింది. గత రెండు ఎన్నికల్లోనూ కమ్యూనిస్టులు ఉమ్మడి జిల్లాలో ప్రభావం చూపలేదు. 2014 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుతో సీపీఎం భద్రాచలం సీటును గెలుచుకుంది. గతమెంతో ఘనం అన్నట్లు ఇప్పుడు ఉభయ కమ్యూనిస్టులు ఇతర పార్టీలతో పొత్తు కోసం వెంపర్లాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

సత్తా చాటిన తుమ్మల



ఇక సత్తుపల్లి రాజకీయాల్లో తుమ్మల నాగేశ్వరరావు కొత్త ఒరవడి సృష్టించారు. 1983లో తెలుగుదేశం తరఫున ఆయన రాజకీయ అరంగేట్రం చేశారు. 1985, 1994, 1999 ఎన్నికల్లో సత్తుపల్లి నుంచి, 2009లో ఖమ్మం నుంచి గెలిచారు. 2014 ఎన్నికల్లో ఖమ్మంలో ఓటమి పాలయ్యారు. పాలేరు ఉప ఎన్నికలో టీఆర్ఎస్ తరపున గెలిచినా, 2018 ఎన్నికల్లో ఇక్కడి నుంచే ఓటమి పాలయ్యారు. తుమ్మల ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్ కేబినెట్‌లో పనిచేశారు.

ఎన్నికలూ... మానవదేహాల్లోపలి మాటలు!

ఎన్నికల సీజన్ రాగానే నలుగురు మనుషులు ఒక చోట చేరడమూ, బోలెడన్ని కబుర్లు చెప్పుకోవడం కద్దు.

అలా కొంతమంది ఓ చోట గుమిగూడి ఎన్నికల విశ్లేషణలకు పూనుకోగానే..వాళ్లలోపలి అవయవాలైన గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, పొట్టపేగులూ... ఇవన్నీ కూడా మాట్లాడుకోవడం మొదలుపెట్టాయి.

గుండె : దేహమే దేవాలయం అని చెబుతుంటారు. దేహంలో దేవుడుంటాడో లేదో తెలియదుగానీ, సమస్త పార్టీల గుర్తులు మాత్రం తప్పకుండా ఉంటాయి. ఉదాహరణకు నన్నే తీసుకో. ఎవరి గుండె వాళ్ల గుప్పెడంత లేదా చేయి సైజంత ఉంటుందంటారు. అంతే 'హస్తం' గుర్తంత అన్నమాట.

కాలేయం : నన్ను కార్జం..అదే 'కార్' జం అని కూడా అంటారు. చూశారా..నాలో కారు గుర్తు పేరుంది.


పొట్టపేగులు: (ఆశ్చర్యంగా) అరెరే... మీరన్నది కరక్టే. ఇప్పుడే నన్ను నేను పరిశీలనగా చూసుకున్నా. నా పొట్టపేగులన్నీ... అచ్చం పువ్వు గుర్తులోని రేకల్లా... గుచ్ఛంగా, గుంపుగా లేవూ! నేను పూరేకులన్నింటినీ కుప్పపోసినట్టుగా కనిపిస్తున్నాను చూశారా!?

కాలేయం : మనుషులు మామూలుగానే మర్యాదస్తులబ్బా. ఎంత మర్యాద అంటే... ఓరోజున ఒకాయన తన ఆఫీసు బాత్‌రూమ్‌లోకి వెళ్లగానే... అప్పటికే అక్కడున్న మరో కొలీగ్... "రండ్రండి సార్. ఎలాగూ వచ్చారు కదా. చెరీ కాస్తంత పోసుకుపోదాం పదండి" అన్నాడు. బాత్‌రూముల్లో పోసుకోవడమే ఇలా ఉంటే.. ఇక బార్ రూముల్లో చెప్పేదేముంది? పైగా ఎన్నికల సీజన్ కదా. అక్కడా పోసుకుంటారు విచ్చలవిడిగా మద్యం.

పొట్టపేగులు : అది మామూలు తాగడమా! చూస్తుండండి... ఈ సీజను చివరినాటికి వాళ్లు తాగే మద్యం దెబ్బకు నా లైనింగంతా కొట్టుకుపోతుంది. పొట్టసంచిగారు బయటకు చెప్పుకోవడం లేదుగానీ..అభ్యర్థులు పంచే ఫ్రీ బిర్యానీలూ, మసాలా తిండ్లతో... పొద్దునే లేవగానే... పొరుగునే ఉన్న పొట్టసంచిగారి నుంచి చేదు చేదు తేన్పులూ, పొట్టంతా నొప్పి. ఈ ఎన్నికలు ముగిసే నాటికి ఆ చీపులిక్కరుతో నాలోపలి లైనింగు అంతా కొట్టుకుపోయి, నాకు పేగుపూత వచ్చేలా ఉంది.

కాలేయం : నువ్వే ఇలా అంటే నేనేం చెప్పను. మావాడు మద్యం తాగడం మొదలుపెట్టగానే, ఆ విషాలు విరిచేయాల్సింది నేనేగా. వాటిని బైటకు పంపాల్సిందే మా ఫ్రెండు కిడ్నీగాడు.పైగా మా వోనరుగాడు ఫ్రీగా వచ్చిన సరుకును ఫినాయిల్‌లా తాగేస్తాడు. ఈ అభ్యర్థులకూ, వాళ్ల కార్యకర్తలకైనా తీరికుంటుందేమోగానీ, ఈ పనిలో నాకు క్షణం తీరికుండటం లేదు. ఎలక్షన్లయ్యే నాటికి నేనూ, నా ఫ్రెండు కిడ్నీగాడూ పూర్తిగా కొట్టుకుపోయేలా ఉన్నాం.

మెదడు: మీరు చెబుతున్న ఎఫెక్టులన్నీ నామీదా ఉన్నాయి. పైగా కళ్లూ, చెవుల్నుంచీ కంటిన్యువస్‌గా టీవీ డిబేట్లూ, వేడివేడి ఆర్గ్యుమెంట్లు!! అబ్బ... ఈ డైరెక్టు ఎఫెక్టులూ, మీనుంచి వచ్చే ఇండైరెక్టు ప్రభావాలతో చచ్చిసున్నమవుతున్నాను బాబూ.



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

గుండె: అవునండీ... మావోడు తినే ఫ్రీ బిర్యానీల్లో వాడే చీపు చీపు నూనెలూ, వాటిలోని కొలెస్ట్రాళ్లతో కొవ్వు విపరీతంగా పట్టి, నాకూ ముప్పొచ్చి ఛస్తోంది.

అందరి బాధలూ వింటున్న మెదడు ఓ ఐడియా ఇచ్చింది.

మెదడు : ఓ పని చెయ్. మీవోనరు గాడి(ద)కు ఓ వార్నింగు సిగ్నలివ్వు. కాస్తంతైనా తిండీ, మందూ తగ్గిస్తాడు.

మూకుమ్మడిగా అవయవాలన్నీ వాటి మనసుల్లో ఇలా కూడా అనుకున్నాయి.

ఆ... ఇద్దాం ఇద్దాం. మనవంతుగా ఓసారి హెచ్చరించి చూద్దాం.

కానీ ఎంత వార్నింగు సిగ్నళ్లు ఇచ్చినా... ఎదురుగా ఫ్రీతిండీ, మందూ కనిపిస్తుంటే ఆగి ఛస్తాడా?! ఎక్కడ బిర్యానీలూ, బీర్లూ వదులుకోవాల్సి వస్తుందోనని గుండెపోటొచ్చినా గ్యాసు పెయిననుకుంటాడు వేస్ట్‌ఫెలో!

పంచతంత్రం

దిగ్విజయ్ సింగ్ బట్టలు చించేయండి

మధ్యప్రదేశ్‌లో టికెట్లు రాని కాంగ్రెస్ నేతలకు కమల్‌నాథ్ సూచన

భోపాల్: మధ్యప్రదేశ్‌లో విపక్ష కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేసింది. టికెట్లు రాని నేతలు భగ్గుమంటున్నారు. నాయకుల అనుచరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడికక్కడ రోడ్లపై బైఠాయించి నిరసన తెలుపుతున్నారు. పార్టీ అధిష్టానంపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ మాట్లాడిన వీడియో ఒకటి తెరపైకి వచ్చింది. 'టికెట్లు రాని నాయకులంతా వెళ్లి, దిగ్విజయ్ సింగ్, జైవర్ధన్ సింగ్ బట్టలు చించేయండి' అంటూ ఈ వీడియోలో ఆయన సూచించడం గమనార్హం. శివపురి నియోజకవర్గం నుంచి టికెట్ కోరుతున్న వీరేంద్ర రఘువంశీ సోమవారం కమల్‌నాథ్ నివాసానికి వెళ్లి నిలదీశారు. తనకు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయనతో కమల్‌నాథ్ మాట్లాడారు. టికెట్ కోసం నన్నెందుకు అడుగుతున్నారు? దిగ్విజయ్ సింగ్, జైవర్ధన్ సింగ్‌ల బట్టలు చించేయండి అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బీజేపీ కార్యకర్తలు కూడా ఈ వీడియోను షేర్ చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా విడిపోయింది. ఓ వర్గానికి కమల్‌నాథ్, మరో వర్గానికి మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ నేతృత్వం వహిస్తున్నారు.

పార్టీల గుండెల్లో రెబెల్స్...!

టికెట్లు దక్కని సీనియర్ల ఆగ్రహావేశాలు

ఇతర పార్టీల నుంచి, స్వతంత్రులుగా బరిలోకి

అన్ని రాష్ట్రాల్లోనూ పార్టీలకు తలనొప్పులు

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అన్ని పార్టీలూ రెబెల్స్ బెడదతో సతమతమవుతున్నాయి. టికెట్లు ఆశించి భంగపడ్డ పలువురు సీనియర్లు తిరుగుబాటు అభ్యర్థులుగా రంగంలోకి దిగిన ప్రధాన పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ద్విముఖ పోరు నెలకొని ఉంది. అయితే రెండు పార్టీలకూ మరో రకమైన పోటీ కూడా ఎదురవుతోంది. అది సొంత పార్టీల్లోని అసమ్మతుల రూపంలో! టికెట్లు దక్కలేదన్న అసంతృప్తితో వారు తిరుగుబావుటా ఎగరేస్తున్నారు. రెబెల్స్ అవతారమెత్తి తమ పార్టీ నాయకత్వాలకు సవాలు విసురుతున్నారు. అభ్యర్థుల జాబితాలు వెలువడుతున్న కొద్దీ రెండు పార్టీలకూ ఈ తలనొప్పి మరింత పెరుగుతోంది...



రాజస్తాన్: 12 చోట్ల తిరుగుబాట్లు

బీజేపీ తొలి జాబితాలో ప్రకటించిన 41 మంది అభ్యర్థుల్లో ఏకంగా డజను చోట్ల రెబెల్స్ గుబులు రేపుతున్నారు. ముఖ్యంగా విజయావకాశాలను పెంచుకునేందుకు సిట్టింగ్ ఎంపీలను అసెంబ్లీ బరిలో దింపాలని బీజేపీ తీసుకున్న నిర్ణయం బెడిసికొడుతున్నట్టు కన్పిస్తోంది. వారిలో చాలామందికి రెబెల్స్ బెడద అధికంగా ఉంది. ఈ అభ్యర్థులకు వ్యతిరేకంగా స్థానిక ఆశావహులు, వారి మద్దతుదారులు నిరసనలు, ప్రదర్శనలతో హోరెత్తిస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి రాజ వర్ధన్‌సింగ్ రాథోడ్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. ఆదివారం ప్రచార బరిలో దిగిన ఆయనకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. రెబెల్స్ వర్గీయులు ఎక్కడికక్కడ రాథోడ్‌ను అడ్డుకుంటూ నిరసనలతో హోరెత్తించారు. నల్ల జెండాలతో ప్రదర్శనలకు దిగారు. అభ్యర్థుల మలి జాబితాలు వెలువడ్డాక పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని బీజేపీ ఆందోళన పడుతోంది.

ఛత్తీస్‌గఢ్: కాంగ్రెస్‌కు తలనొప్పి

రాష్ట్రంలో కాంగ్రెస్ తొలి జాబితాలో ప్రకటించిన 30 మంది పేర్లలో ఏకంగా 8 మంది సిట్టింగులకు టికెట్లు నిరాకరించింది. వారిపై కార్యకర్తల్లో అసంతృప్తి తదితరాలు కారణంగా చూపింది. కానీ వారంతా పార్టీ నిర్ణయంపై భగ్గుమంటున్నారు. స్వతంత్రులుగా బరిలో దిగి సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. మొత్తం 90 స్థానాలకు గాను ఇప్పటికే ఏకంగా 85 మంది పేర్లను ప్రకటించిన బీజేపీ మాత్రం తన 13 మంది సిట్టింగుల్లో ఒక్కరికి మాత్రమే టికెట్ నిరాకరించింది. అది కూడా అంతర్గత సర్వేల్లో ఆయన పట్ల తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైనందుకేనని పేర్కొంది. కానీ ఆ 85 స్థానాల్లో పలుచోట్ల అసమ్మతి స్వరాలు విన్పిస్తూనే ఉన్నాయి. ఇవన్నీ పెరిగి పెరిగి తిరుగుబాట్లకూ దారితీసే ఆస్కారముందని పార్టీ ఆందోళన చెందుతోంది.

మధ్యప్రదేశ్: ఇద్దరికీ ఇబ్బందే

ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు టికెట్ దక్కకపోవడంతో రాజీనామా చేయడమే గాక శరవేగంగా పార్టీలు కూడా మారిపోయారు. బీజేపీ నుంచి మమతా మీనా ఆప్‌లోకి, రక్షపాల్‌సింగ్, రాసల్‌సింగ్ బీఎస్పీలోకి దూకారు. కాంగ్రెస్ నుంచి ఛటాభుజ్ తోమర్ ఆప్ తీర్థం పుచ్చుకున్నారు. రానున్న కొద్ది రోజుల్లో ఈ ధోరణి మరింత వేగం పుంజుకుంటుందని రాజకీయ పరిశీలకులు జోస్యం చెబుతున్నారు.

అధికారమిస్తే కులగణన చేపడతాం

ఓబీసీలకు 27% రిజర్వేషన్ల కల్పన

రైతు రుణాల మాఫీ అమలు	రాష్ట్ర ప్రజలందరికీ రూ.25 లక్షల వైద్య బీమా	మధ్యప్రదేశ్ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీలు



మేనిఫెస్టోను విడుదల చేస్తున్న దిగ్విజయ్ సింగ్, కమల్‌నాథ్ తదితరులు

భోపాల్: కులగణన, ఓబీసీలకు 27% రిజర్వేషన్లు, రైతు రుణాల మాఫీ, ప్రజలందరికీ రూ.25 లక్షల వైద్య బీమా.. తదితర హామీలతో కాంగ్రెస్ పార్టీ మధ్యప్రదేశ్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసింది. రాష్ట్రంలో నవంబర్ 17వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. మొత్తం 59 వాగ్దానాలు, 101 ప్రధాన గ్యారంటీలతో కూడిన 106 పేజీల మేనిఫెస్టోను మంగళవారం భోపాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ కమల్‌నాథ్ విడుదల చేశారు. రూ.500కే ఎల్పీజీ సిలిండర్, రాష్ట్రానికి ప్రత్యేకంగా ఐపీఎల్ క్రికెట్ జట్టు ఏర్పాటు వంటివి కూడా ఇందులో ఉన్నాయి. రాష్ట్రాన్ని ఆనందంగా ఉంచేందుకు కాంగ్రెస్ పార్టీ 'కుషాలి మిషన్'ను ప్రారంభిస్తుందని కూడా కమల్‌నాథ్ ఈ సందర్భంగా ప్రకటించారు. కాంగ్రెస్ వస్తుంది, ఆనందం తెస్తుంది (కాంగ్రెస్ ఆయేగి, కుషాలి లాయేగి)అనేది తమ పార్టీ నినాదమని ఆయన చెప్పారు. 'పఢో–పఢావో యోజన'కింద ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున పంపిణీ. అదేవిధంగా, 9, 10 తరగతుల బాలలకు నెలకు రూ.వెయ్యి, 11,12వ తరగతుల వారికి రూ.1,500 చొప్పున సాయం అందజేత. రాష్ట్రంలో పాఠశాల విద్య ఉచితంగా అందజేస్తామని కూడా ఈ సందర్భంగా కమల్‌నాథ్ ప్రకటించారు.

- ఇతర వెనుక బడిన కులా(ఓబీసీ)ల వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, పథకాల్లో 27% రిజర్వేషన్లు.
- గిరిజనుల కోసం.. నోటిఫైడ్ ట్రైబల్ ఏరియాల్లో పంచాయతీల చట్టం అమలు. తునికాకు సేకరించేవారికి స్టాండర్డ్ బ్యాగ్‌కు రూ.4 వేల చొప్పున చెల్లింపు
- ఎస్సీల కోసం..సాగర్ జిల్లాలో సంత్ శిరోమణి రవిదాస్ కౌశల్ ఉన్నయాన్ యూనివర్సిటీ ఏర్పాటు. నర్మదా పరిక్రమ్ పరిషత్ ఏర్పాటు, నర్మదా పరిక్రమ్ యాత్ర చేపట్టడం కూడా ఉన్నాయి.
- యువతకు..రాష్ట్రంలోని యువతకు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, రూ.1,500 నుంచి రూ.3,000 వరకు రెండేళ్లపాటు నిరుద్యోగ భృతి అందజేత.సీనియర్ జర్నలిస్టులకు.. గౌరవ భృతి నెలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.20 వేలను రూ.25 వేలకు పెంపు. వారికోసం మెట్రో నగరాల్లో కాలనీల నిర్మాణం. ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం. క్రీడలు, క్రీడాకారులకు.. మధ్యప్రదేశ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) టీం ఏర్పాటు. ఒలంపిక్, వరల్డ్ కప్, ఆసియాడ్, కామన్ వెల్త్ క్రీడల్లో పతకాలు సాధించిన వారికి నేరుగా ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశం.
- సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు 600 చదరపు అడుగుల స్థలాన్ని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం.

కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలివీ..

- మహిళలకు నెలకు రూ.1,500 ఆర్థిక సాయం
- రైతులకు రూ.2 లక్షల వరకు రుణ మాఫీ
- గృహ వినియోగదారులకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 200 యూనిట్ల వరకు సగం ధరకే కరెంట్ సరఫరా
- సాగు అవసరాల కోసమైతే 5హెచ్‌పీ మోటారుకు ఉచిత కరెంటు
- రైతుల పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లుల మాఫీ
- రైతు ఆందోళనలు, విద్యుత్ సంబంధ తప్పుడు కేసులు ఎత్తివేత
- గోధుమ పంట క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.2,600
- వరి ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,500
- 2005 వరకు ఉన్న పాత పింఛను విధానం అమలు
- దివ్యాంగులకు నెలకు రూ.2 వేల పింఛను
- రూ.10 లక్షల ప్రమాద బీమాతో కలిపి రాష్ట్ర ప్రజలందరికీ రూ.25 లక్షల వరకు ఆరోగ్య బీమా కవరేజీ

60 శాతం దేశానికి 'ఇండియా' ప్రాతినిధ్యం

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్య

ఐజ్వాల్: బీజేపీ కంటే ఎక్కువగా, ప్రతిపక్ష పార్టీల ఇండియా కూటమి 60 శాతం దేశానికి ప్రాతినిధ్యం వహిస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం, తెలంగాణల్లో తమ పార్టీయే విజయం సాధిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రజల కోసం పనిచేస్తుందని చెప్పారు. సోమవారం నుంచి మిజోరంలో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ పార్టీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. మిజోరం రాజధాని ఐజ్వాల్‌లో మంగళవారం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. అనంతరం 'ఎక్స్'లో కాంగ్రెస్ పార్టీ విధానాలను వివరించారు. 'ప్రతిపక్ష ఇండియా కూటమి రాజ్యాంగాన్ని, విలువలను పరిరక్షిస్తూ, మతం, సంస్కృతులతో సంబంధం లేకుండా ప్రజలకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను, సామరస్యంగా జీవించే హక్కును పరిరక్షిస్తుంది. బీజేపీ కంటే కూడా ఎక్కువగా ఇండియా కూటమి దేశంలోని 60 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తోంది'అని బీజేపీయేతర పాలిత రాష్ట్రాలనుద్దేశించి వ్యాఖ్యానించారు. 'మన దేశం పట్ల ఇండియా కూటమి ఆలోచనలు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లతో పోలిస్తే భిన్నంగా ఉన్నాయి. మేం వికేంద్రీకరణపై దృష్టి పెడితే బీజేపీ మాత్రం ఢిల్లీ నుంచే అన్ని నిర్ణయాలూ జరిగిపోవాలని అంటోంది. మేం అధికారంలో ఉన్న రాజస్తాన్‌లో అత్యుత్తమమైన ఆరోగ్య విధానం, కర్ణాటకలో సామాజిక భద్రత కార్యక్రమాలు, ఛత్తీస్‌గఢ్‌లో వ్యాపార సానుకూల విధానాలు అమలవుతున్నాయి'అని రాహుల్ తెలిపారు. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వస్తే ఇటువంటి విజయవంతమవుతున్న విధానాలనే దేశవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు.

స్కూటరెక్కిన రాహుల్ గాంధీ



మిజోరంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న రాహుల్ గాంధీ ఐజ్వాల్‌లో స్కూటర్‌పై ప్రయాణించారు. మంగళవారం ఆయన సీనియర్ కాంగ్రెస్ నేత లాల్ తన్హావ్లాను ఇంటికెళ్లి కలుసుకున్నారు. తిరుగు ప్రయాణంలో స్కూటర్ ట్యాక్సీపై ప్రయాణించారు. నగరంలో ట్రాఫిక్ క్రమశిక్షణ ఎంతో బాగా ఉందని ప్రశంసలు కురిపించారు. ట్రాఫిక్ క్రమశిక్షణతో ఐజ్వాల్ 'సైలెంట్ సిటీ'గా పేరు తెచ్చుకుంది.

సాక్షి హైదరాబాద్

బుధవారం ၊ 18 ၊ అక్టోబర్ ၊ 2023



టన్ను గంజాయి స్వాధీనం

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్-నాబ్) అధికారులు టన్ను గంజాయి స్వాధీనం చేసుకున్నారు. -10లో



కండక్టర్ ఆత్మహత్యపై కార్మికుల భగ్గు

బండ్లగూడ ఆర్టీసీ డిపో మహిళా కండక్టర్ ఆత్మహత్యపై కార్మికుల భగ్గుమన్నారు. ఉన్నతాధికారుల వేధింపుల వల్లే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపించారు. -10లో

దసరా రోజూ ఓయూ లైబ్రరీ ఓపెన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కార్యాలయాలకు ఈ నెల 23 నుంచి 25 వరకు దసరా సెలవులు ప్రకటించారు. కాగా.. క్యాంపస్‌లోని యూనివర్సిటీ మెయిన్ లైబ్రరీ తెరిచే ఉంటుందని మంగళవారం చీఫ్ లైబ్రేరియన్ డాక్టర్ చక్రవర్తి తెలిపారు. దసరా పండగకు వెళ్లలేని వివిధ పోటీ పరీక్షల విద్యార్థులు, పీహెచ్‌డీ విద్యార్థులు, విదేశీ విద్యార్థుల సౌకర్యార్థం లైబ్రరీ తెరిచే ఉంటుందన్నారు.

అనుమతులన్నీ యాప్‌లోనే

రెండు రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలి

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఒక్కో రాజకీయ పార్టీ అభ్యర్థులకు సీట్ల కేటాయింపు తుది దశకు చేరుకుంది. క్రమంగా బహిరంగ సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ఎన్నికల ప్రచారం రాజకీయ పార్టీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి. 48 గంటల ముందు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. బహిరంగ సభలు, ర్యాలీలు, ఇతరత్రా ఎన్నికల ప్రచారానికి సంబంధించిన అనుమతుల కోసం సువిధ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత వాటికి సంబంధించిన వివరాలు సంబంధిత రిటర్నింగ్ అధికారికి చేరుతాయి. ఈ అధికారి క్షేత్ర స్థాయిలో వీటి పరిశీలన కోసం సంబంధిత పోలీసు శాఖకు పంపిస్తారు. క్షేత్ర స్థాయిలో ఆయా దరఖాస్తు వివరాలను స్థానిక పోలీసు అధికారులు పరిశీలించి, రిమార్క్స్ రాసి మళ్లీ రిటర్నింగ్ అధికారికి పంపిస్తారు. అనుమతి మంజూరు, రద్దు తుది నిర్ణయం రిటర్నింగ్ అధికారిదే. బహిరంగ సభలు, సమావేశాలకు సంబంధించి స్థలానికి చెందిన పత్రాలు, యజమాని నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌ఓసీ) జత చేయాల్సి ఉంటుంది. మైక్ అనుమతి పొందిన తర్వాత మీ-సేవలో కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. వివాదాస్పద స్థలంలో సభలు పెడితే వాటిపై ఏదైనా ఫిర్యాదు అందితే రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు సంబంధిత స్థల యజమానిపై కూడా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



నగరవ్యాప్తంగా తనిఖీలు చేపట్టాలి

జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు నగర వ్యాప్తంగా తనిఖీలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. బ్యాంకులు, ఆర్‌బీఐ, ఇన్‌కంట్యాక్స్, విజిలెన్స్, ఆర్‌టీఏ, ఎన్‌సీబీ అధికారులతో సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ జిల్లాలో నగదు, లిక్కర్ తరలింపును అడ్డుకోవడానికి పార్సిల్, కొరియర్, ట్రైన్ చెకింగ్స్, సరిహద్దుల వద్ద నిఘా కార్యక్రమాలను విస్తృత స్థాయిలో చేపట్టాలన్నారు. అన్ని వైన్స్ షాపుల వద్ద సీసీ కెమెరాలను అమర్చి కంట్రోల్ రూం ద్వారా మానిటరింగ్ చేయాలని సూచించారు. జిల్లాలో ఎక్సైజ్ శాఖ ద్వారా హాట్ స్పాట్లను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అన్ని గోడౌన్లను చెక్ చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. 18 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ ల ద్వారా తనిఖీలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆర్‌బీఐ, పోస్టాఫీసుల ద్వారా ఆర్నెల్లలో అధిక మొత్తంలో జరిగిన నగదు



వివరాలు అందించాలని, యూపీఐ (గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం) ద్వారా ఒకే అకౌంట్ నుంచి ఎక్కువ అకౌంట్లకు జరిగిన నగదు బదిలీల వివరాలు తెలియపర్చాలని సూచించారు. బ్యాంకుల ద్వారా నగదు మూలాలను గుర్తించి సమాచారం అందించాలని పేర్కొన్నారు. సిగరెట్లు, గంజాయి సప్లై ప్రదేశాలలో నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, అడిషనల్ కలెక్టర్ మధుసూదన్, అడిషనల్ కమిషనర్ (ఎలక్షన్) శంకరయ్య, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

శివారుపై కాంగ్రెస్ దృష్టి

- పూర్వ వైభవం కోసం సరికొత్త వ్యూహం
- హస్తం పార్టీలోకి బీఆర్‌ఎస్ అసమ్మతి నేతలు
- ఆ పార్టీలో చేరిన ఇద్దరు 'కారు' కార్పొరేటర్లు

సాక్షి, సిటీబ్యూరో: అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న కాంగ్రెస్ పార్టీ నగర శివారు అసెంబ్లీ సెగ్మెంట్ల సీట్లను హస్తగతం చేసుకునేందుకు వ్యూహాత్మంగా పావులు కదుపుతోంది. పాతబస్తీ అసెంబ్లీ సెగ్మెంట్‌లు మినహా కోర్‌సిటీ, శివారు ప్రాంతాల్లో ఇవి గతంలో ప్రాతినిధ్యం వహించినవే కావడంతో వాటిపై ఆశలు పెంచుకుంది. అధికార బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఎదుర్కొనేందుకు బలబలాలను అంచనా వేసి బలమైన అభ్యర్థిత్వం ఖరారు కోసం తర్జనభర్జన పడుతోంది. తాజాగా బీఆర్‌ఎస్‌లో టికెట్ ఆశించి భంగపడిన బలమైన అసమ్మతి నేతలను సైతం తనవైపు తిప్పుకునే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది. వారిని పార్టీలో చేర్చుకొని అవసరమైతే ఎన్నికల బరిలోకి దింపేందుకు సిద్ధమైంది. ఇప్పటికే మల్కాజిగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును పార్టీలో చేర్చుకోవడమే కాకుండా అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది.

శేరిలింగంపల్లిలో సైతం..

తాజాగా శేరిలింగంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌పై సైతం వ్యూహాత్మకంగా పావులు కదిపి సఫలీకృతమైంది. ఏకంగా అక్కడి అసెంబ్లీ బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపడిన జీహెచ్‌ఎంసీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, హఫీజ్‌పేట్ కార్పొరేటర్‌గా ఉన్న అతని భార్య పూజితను సైతం కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకుంది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మాదాపూర్ డివిజన్ నుంచి జగదీశ్వర్ గౌడ్ మూడుసార్లు గెలవగా.. ఆయన భార్య పూజిత హఫీజ్ పేట డివిజన్ నుంచి రెండోసారి గెలుపొందారు. ఈ దంపతులకు స్థానికంగా గట్టి పట్టు ఉండటంతో ఎన్నికల్లో కలిసి వస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ నుంచి టికెట్ కోసం 14 మంది దరఖాస్తు చేసుకోగా ముగ్గురు మాత్రం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ జగదీశ్వర్‌రెడ్డి అభ్యర్థిత్వం ఖరారుపై మొగ్గు చూపే అవకాశాలు లేకపోలేదు. మరోవైపు మహేశ్వరంపై సైతం దృష్టి సారించి వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది.

బుజ్జగింపుల పర్వం..

ఇప్పటికే తొలి జాబితాలో మహానగర పరిధిలోని 24 అసెంబ్లీ స్థానాలకు గాను 14 అభ్యర్థిత్వాలను ఖరారు చేసిన కాంగ్రెస్.. కొన్నింటిలో అసమ్మతి సెగలు వ్యక్తమవుతుండటంతో వారిని బుజ్జగించే పనిలో పడింది. తాజాగా మంగళవారం టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్‌లు.. కుత్బుల్లాపూర్ టికెట్ ఆశించిన భంగపడిన భూపతిరెడ్డి నర్సారెడ్డి, మేడ్చల్ నుంచి టికెట్ ఆశించిన హరివర్ధన్ రెడ్డి ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని వారిని బుజ్జగించారు.

పర్యావరణానికి పట్టం కట్టేదెవరో?

కబ్జా కోరల్లోంచి చెరువులు, కుంటలను రక్షించాలి

వరదలు, ముంపు ముప్పు లేని నగరంగా మార్చాలి

హైదరాబాద్ ఒక విలక్షణమైన నగరం. విభిన్న భాషలు, జీవన విధానాలు, వైవిధ్యభరితమైన సంస్కృతి ఈ మహానగరం ప్రత్యేకత. నాలుగు వందల ఏళ్ల నాటి చార్మినార్‌తో పాటు వందల ఏళ్ల క్రితమే కట్టించిన మహోన్నతమైన చారిత్రక కట్టడాలు ప్రపంచాన్నే అబ్బురపరుస్తాయి. ఇదంతా ఒకవైపు అయితే.. మరోవైపు.. హైదరాబాద్ అంటే వరదలతో మునిగిపోయే లోతట్టు నగరం. వానొస్తే చాలు నగరవాసులు లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తాయి. రహదారులపై ప్రవాహాలు పరుగులు తీస్తాయి. ఇళ్లు, సామగ్రి, సహా సర్వస్వం కోల్పోయే నిరాశ్రయ జన సమూహం. చినుకు పడితే చాలు నీట మునిగే రహదారులు.. కబ్జా కోరల్లో చిక్కిన చెరువులు, కుంటలు, నీటి వనరులు. దురాక్రమణకు గురైన నాలాలు. ఏటా వరదలతో పాటు సామాన్య, మధ్యతరగతి ప్రజల కన్నీళ్లు సైతం ప్రవహిస్తూనే ఉంటాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి వరదలు, ముంపు ముప్పు లేని హైదరాబాద్ కావాలని నగరవాసులు కోరుకుంటున్నారు. మరోసారి ఎన్నికల క్రతువు వచ్చిపడిన వేళ.. ఓటర్లను ఆకట్టుకొనే పథకాలే కాకుండా హైదరాబాద్ మహానగరం చారిత్రక, పర్యావరణ పరిరరక్షణకు పట్టం కట్టే విధానాలపైనా రాజకీయ పార్టీలు దృష్టి సారించాలని స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. ఆ దిశగా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు సన్నద్ధమవుతున్నాయి. – సాక్షి, సిటీబ్యూరో

సుస్థిర నగరం ఎక్కడ...

అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించేందుకు ఐక్యరాజ్యసమితి సుస్థిరమైన నగరాల నిర్మాణం ఎంతో అవసరమని చెప్పింది. సుస్థిరమైన నగరాలలో జీవన వ్యయం కూడా ప్రజలు భరించగలిగే స్థాయిలో ఉంటుంది. నగర జీవనం ఎంతో నిలకడగా, ఆరోగ్యప్రదంగా ఉంటుంది. కానీ.. నగరంలో ఆ స్థాయిలో జీవన ప్రమాణాలు పెరగడం లేదని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డి తెలిపారు. ఒకవైపు గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందుతున్నప్పటికీ ఆ స్థాయిలో జీవన ప్రమాణాలు మెరుగుపడలేదని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా రాజకీయ పార్టీలు గట్టి హామీలు ఇవ్వాలని ఆయన సూచించారు.



111 జీఓ ప్రాంతాల్లో నిర్మాణాలు..

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల పరిరక్షణ కోసం తెచ్చిన 111 జీఓను రద్దు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఒకవైపు జంట జలాశయాల పరిరక్షణకు చర్యలు తీసుకోవడంతో పాటు జీఓ పరిధిలోని గ్రామాల్లో బహుళ ప్రయోజన అనుమతులివ్వనున్నట్లు పేర్కొంది. ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కేవలం ప్రభుత్వ ప్రకటన ఆధారంగా ఈ జీఓ పరిధిలోని గ్రామాల్లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. జంట జలాశయాల రక్షణకు ఇది సవాల్‌గా మారింది. జలాశయాల పరిరక్షణకు రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలని పర్యావరణ సంస్థలు, సామాజికవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

జీవన ప్రమాణాలు పెరగాలి..

- ప్రజల జీవన ప్రమాణాల్లో నాణ్యత గ్రాఫ్ క్రమంగా పడిపోతోంది. ఇప్పటికే వాహన కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. కోటి మందికి పైగా జనాభా ఉన్న మహా నగరంలో సుమారు 80 లక్షల వరకు వాహనాలు ఉన్నాయి. ప్రజారవాణా సదుపాయాలు గణనీయంగా తగ్గాయి. దీంతో వాహన కాలుష్యం ఆందోళనకరంగా మారింది. ఎలక్ట్రిక్ వాహనాలకు సముచితమైన ప్రోత్సాహాన్ని ఇచ్చినప్పటికీ ధరల భారం, చార్జింగ్ కేంద్రాలు తగినన్ని లేకపోవడం వంటి కారణాలతో వాటి వినియోగం ఆశించిన స్థాయిలో లేదు. ప్రజా రవాణా విస్తరణకు నోచుకోవడం లేదు. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి.
- హెచ్‌ఎండీఏ పరిధిలో సుమారు 4,500కు పైగా చెరువులు ఉన్నాయి. వాటిలో చాలా వరకు రక్షణ కరువైంది. అనేక చోట్ల కబ్జాలకు గురయ్యాయి. పలుచోట్ల చెరువుల్లోనే ఆకాశ హర్మ్యాలు వెలిశాయి. గతంలో హుస్సేన్ సాగర్‌లోకి వచ్చే వరద నీటిని ఎప్పటికప్పుడు తీసివేసేందుకు నాలాలు ఉండేవి. కానీ చాలాకాలం క్రితమే వాటిని మూసివేశారు. దీంతో చెరువుల్లోకి వచ్చే వరదనీరు వల్ల ఎలాంటి ముప్పు వాటిల్లుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మరోవైపు కాలుష్య కాసారంగా మారిన హుస్సేన్ సాగర్ ప్రక్షాళన కాగితాలకే పరిమితమైంది. సాగర్‌లోకి భయంకరమైన విష రసాయనాలు వచ్చి చేరుతున్నాయి.

రోకలిబండతో మోది.. కత్తితో గొంతు కోసి..

- భార్యను హత్య చేసిన భర్త
- భవనంపై నుంచి దూకి తానూ ఆత్మహత్య
- కుటుంబ కలహాలే కారణం



సంతోషి (ఫైల్)



రాజు (ఫైల్)

నాగోలు: భార్య తలపై రోకలిబండతో మోది.. కత్తితో గొంతు కోసి హత్యచేసిన భర్త.. తానూ బలవన్మరణానికి పాల్పడిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన తెలగమల్ల రాజు (45)కు, కందుకూరు మండలం ముచ్చర్లకు చెందిన పర్సన్ కృష్ణమ్మ కూతురు సంతోషి (40) తో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ కుటుంబం నగరానికి వచ్చి నాగోలు సాయినగర్ కాలనీలో అద్దె ఇంట్లో జీవనం సాగిస్తోంది. వీరి కుమార్తె సింధుజ ఇంటర్ మొదటి సంవత్సరం, కుమారుడు సాయిరాం 9వ తరగతి చదువుతున్నారు. రాజు సొంతంగా లారీ కొనుగోలు చేసి నడుపుతున్నాడు. వచ్చిన డబ్బుతో జల్సా చేసేవాడు. సంతోషి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో కొంత కాలంగా ఆయాగా పని చేస్తోంది. రాజు, సంతోషి మధ్య కొన్నేళ్లుగా మనస్పర్థలు కొనసాగుతున్నాయి. ఇరువురి మధ్య తగాదాలు ఘర్షణలు జరుగుతున్నాయి. సంతోషి ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించేవాడని స్థానికులు చెబుతున్నారు.

ఏం జరిగిందంటే..?

సోమవారం సాయంత్రం సరూర్‌గర్ గ్రీన్ పార్క్ కాలనీలో ఉంటున్న రాజు చెల్లెలు మంజుల ఇంటికి కూతురు సింధుజ, కుమారుడు సాయిరాంతో కలిసి వెళ్లారు. అక్కడ రాత్రి భోజనాలు చేసిన అనంతరం భార్యాభర్తలిద్దరూ ద్విచక్ర వాహనంపై సాయినగర్‌లోని తమ ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో రాజు, సంతోషి మధ్య ఘర్షణ జరిగింది. రాజు ఆవేశంతో సంతోషిపై ఇంట్లోని రోకలి బండతో మోదాడు. అనంతరం కత్తితో గొంతు కోశాడు. భార్య మృతి చెందిందని నిర్ధారించుకున్న రాజు.. ఇంటికి తాళం వేసి రాజు సరూర్‌నగర్‌లోని చెల్లెలు ఇంటికి వెళ్లాడు. అక్కడ భవనం రెండో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం రాజు చనిపోయిన విషయాన్ని చుట్టుపక్కల వారు గమనించి ఆయన చెల్లెలు మంజులకు చెప్పారు. సంతోషికి ఫోన్ చేయగా ఎత్తకపోవడంతో మృతుడి రాజు బంధువులు సాయినగర్‌కు వచ్చి చూడగా ఇంట్లో రక్తపు మడుగులో ఆమె శవం కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు నాగోల్ పోలీసులకు సమాచారం అందించారు. ఒకేరోజు తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో ఇద్దరు పిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పైన పటారం.. లోన లొటారం



బీఆర్‌ఎస్‌లో ఎవరి దారి వారిదే..!

- నేడు మేడ్చల్‌లో సీఎం కేసీఆర్ సభ
- ఎన్నికల ప్రచారానికి జెడ్పీ చైర్మన్ శరత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి దూరం..
- కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు..ఉప్పల్‌లో ఎమ్మెల్యే బేతి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ అంతే..

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొని విజయం సాధించాలన్న బీఆర్‌ఎస్ అధిష్టానం ఆదేశాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నేతలు పాటించటం లేదు. జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌తో పాటు పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్న తీరు.. పార్టీ కేడర్‌లో తీవ్ర చర్చ సాగుతోంది. పార్టీ అభ్యర్థులు వ్యవహరిస్తున్న తీరు వల్లనే ఎన్నికల ప్రచారానికి పలువురు నాయకులు దూరంగా ఉంటున్నారన్న గుసగుసలు కూడా పార్టీ వర్గాల్లో లేకపోలేదు. మేడ్చల్‌లో బుధవారం బీఆర్‌ఎస్ అధినేత సీఎం కేసీఆర్ ఎన్నికల సభ జరుగుతున్న నేపథ్యంలో.. పార్టీ ఎన్నికల ప్రచారానికి పలువురు ముఖ్య నాయకులతో సహా ద్వితీయ శ్రేణి కేడర్ దూరంగా ఉంటున్న తీరుపై చర్చ సాగడంతో పాటు ఈ విషయం సీఎం దృష్టికి వెళ్లవచ్చని బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. సభ ముందు కానీ.. లేదా తర్వాత సీఎం కేసీఆర్ ఈ విషయాలపై ఆరా తీయవచ్చన్న చర్చ పార్టీ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

మూడింటిలో ఎవరికి వారే..

కూకట్‌పల్లి, మల్కాజిగిరిలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం సాఫీగా సాగుతున్నప్పటికీ, ఉప్పల్, కుత్బుల్లాపూర్, మేడ్చల్ నియోజకవర్గాల్లో మాత్రం బీఆర్‌ఎస్ నేతలు ఎన్నికల ప్రచారం తీరు ఎవరికి వారే అన్న రీతిలో కొనసాగుతోంది. ఉప్పల్ బీఆర్‌ఎస్‌లో ముగ్గురు నేతలు మూడు వర్గాలుగా వ్యవహరిస్తున్నారు. అభ్యర్థిగా బండారి లక్ష్మారెడ్డికి అధిష్టానం ఖరారు చేయటంతో.. సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, నగర మాజీ మేయరు బొంతు రామ్మోహన్ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. దీంతో లక్ష్మారెడ్డి ఒక్కరే తన అనుచరులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. బొంతు రామ్మోహన్ సతీమణి, కార్పొరేటర్ శ్రీదేవి మాత్రం తన డివిజన్‌కు అభ్యర్థి లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు మాత్రం మొక్కుబడిగా పాల్గొంటున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కుత్బుల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్‌ను ప్రకటించటంతో.. టికెట్ ఆశించి భంగపడిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అసంతృప్తితో ఉన్నారు. అభ్యర్థితో కలిసి స్థానికంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనక పోయినా, అనుచరులతో కలిసి ఆత్మీయ సమావేశాల పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పైగా పక్కనున్న మేడ్చల్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంపై రాజు శ్రద్ధ చూపుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ జిల్లా అధ్యక్షుడి హోదాలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును అధిష్టానం మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారకర్తగా నియమించింది.

తీవ్ర అయోమయంలో కేడర్..

మేడ్చల్‌లో అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి ఎన్నికల ప్రచారంలో జెడ్పీటీసీ, మేడ్చల్ జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి పాల్గొనడం లేదు. ఈ ఇద్దరు తండ్రి, కొడుకులు మంత్రి మల్లారెడ్డి ఒంటెత్తు పోకడ, వ్యవహారశైలి వల్లే ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్నట్లు పార్టీ కేడర్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మల్కాజిగిరిలో మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి బీఆర్‌ఎస్ టికెట్‌ను ఖరారు చేయడంతో.. ఈయన ఒంటరిగా లేదా మామ మంత్రి మల్లారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

బల్దియా బలం మారెన్

పార్టీలు మారుతున్న కార్పొరేటర్లు

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు పార్టీలు మారుతున్నారు. దీంతో జీహెచ్‌ఎంసీలో పార్టీల బలాబలాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మాదాపూర్, హఫీజ్‌పేట కార్పొరేటర్లుగా బల్దియాలో ఉన్న జగదీశ్వర్‌గౌడ్, పూజిత దంపతులు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవలే బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరడం తెలిసిందే. రెండేళ్ల క్రితం జరిగిన జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ల ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ నుంచి 56 మంది గెలిచారు. వారిలో నలుగురు బీజేపీ కార్పొరేటర్లు బానోతు సుజాతానాయక్ (హస్తినాపురం), అర్చనాప్రకాశ్ (రాజేంద్రనగర్), డి.వెంకటేశ్ (జూబ్లీహిల్స్), సునీతా ప్రకాశ్‌గౌడ్ (అడిక్‌మెట్)లు చాలా కాలం క్రితమే బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల బలం 61కి పెరిగింది. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గెలిచిన ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో బీఆర్‌ఎస్ బలం 60గా నిలిచింది. తాజాగా బీఆర్‌ఎస్ నుంచి జగదీశ్వర్‌గౌడ్, పూజితలు కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్ బలం 58గా మారింది. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఏఎస్‌రావు నగర్ కార్పొరేటర్ శిరీషారెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఉప్పల్ ఎమ్మెల్యే టికెట్‌ను ఆశించిన ఆమె భర్త సోమశేఖర్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్ లభించకపోవడంతో పార్టీకి రిజైన్ చేశారు. బీఆర్‌ఎస్‌లో చేరవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వివిధ పార్టీలకు చెందిన నేతలు ఎమ్మెల్యేల టికెట్లు ఆశించి అవి దక్కక పోవడంతో కార్పొరేటర్లుగా ఉన్న వారి భార్యలు సైతం తమ పార్టీలకు గుడ్‌బై చెబుతున్నారు. అంబర్‌పేట ఎమ్మెల్యే టికెట్ ఆశించిన వెంకట్‌రెడ్డికి బీజేపీ టికెట్ దక్కదని తెలిసి ఆయన బీఆర్‌ఎస్‌లోకి వెళ్లగా, ఆయన భార్య సైతం బీఆర్‌ఎస్‌లోకి వెళ్లారు. తాజాగా జగదీశ్వర్‌గౌడ్ తాను ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకే పార్టీ మారినట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు ఆయన భార్య కూడా కాంగ్రెస్‌లో చేరారు. జగదీశ్వర్‌గౌడ్ అసంతృప్తిని గుర్తించిన అధిష్టానం ఇటీవలే ఆయనను జీహెచ్‌ఎంసీలో బీఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్‌గా హడావుడిగా నియమించింది. అయినప్పటికీ, ఆయనను నిలువరించలేకపోయారు. ఈ నేపథ్యంలో పోలింగ్ నాటికి ఇంకా ఎందరు పార్టీలు మారనున్నారో అనే చర్చ నడుస్తోంది.

కాంగ్రెస్‌లో చేరిన జగదీశ్వర్ గౌడ్ దంపతులు

గచ్చిబౌలి: జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ జగదీశ్వర్ గౌడ్, ఆయన భార్య కార్పొరేటర్ పూజిత కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జగదీశ్వర్ గౌడ్, పూజితలకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగదీశ్వర్ గౌడ్ చేరికతో కాంగ్రెస్‌లో జోష్ పెరిగిందని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్‌గా మూడు సార్లు ఎన్నికైన జగదీశ్వర్ గౌడ్‌కు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గట్టి పట్టు ఉంది. ముఖ్యంగా మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్లలో ఆయనకు తీరుగుండదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. బీఆర్‌ఎస్ కేడర్ రెండుగా చీలే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. జగదీశ్వర్ గౌడ్ వెంట ఎవరెవరు వెళతారనే విషయంపై బీఆర్‌ఎస్ అధినాయకత్వం నిఘా పెట్టింది. జగదీశ్వర్ గౌడ్, ఆయన భార్య కాంగ్రెస్ పార్టీలో చేరుతారంటూ నెల రోజులుగా ప్రచారం జరిగింది. దీంతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారితో చర్చలు జరిపారు. జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్‌గా నియమించి గన్‌మెన్‌ను కూఅ కేటాయించారు. అయినా ఫలితం లేకుండా పోయిందని బీఆర్‌ఎస్ వర్గాలు భావిస్తున్నాయి.



టీఎస్‌పీఎస్సీ పరీక్ష కేంద్రాల చుట్టూ 144 సెక్షన్

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించే వివిధ పరీక్షలు బుధవారం నుంచి శుక్రవారం వరకు జరుగనున్నాయి. నగరంలోని ఫిల్మ్‌నగర్, మహంకాళి, మార్కెట్, ఐఎస్ సదర్, ఆబిడ్స్ ఠాణాల పరిధిలో ఉన్న ఐదు కేంద్రాల్లో ఇవి జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పరీక్ష కేంద్రాల చుట్టూ 100 గజాల పరిధిలో 144వ సెక్షన్ విధిస్తూ నగర కొత్వాల్ సందీప్ శాండిల్య ఉత్తర్వులు జారీ చేశారు. వీటి ప్రకారం ఆయా ప్రాంతాల్లో నలుగురు, అంతకంటే ఎక్కువ మంది ఒక చోట గుమిగూడటం నిషేధం. ఉత్తర్వులు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని కొత్వాల్ హెచ్చరించారు.



బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

నగరంలో బతుకమ్మ ఉత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మంగళవారం గాంధీ భవన్‌లో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు నేతృత్వంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డితో పాటు పలువురు మహిళా కాంగ్రెస్ నేతలు సంబరాల్లో పాల్గొన్నారు.

యూఎన్ వరల్డ్ ఫోరమ్ సదస్సుకు మేయర్

సాక్షి, సిటీబ్యూరో: యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో నిర్వహిస్తున్న వరల్డ్ ఫోరమ్ సదస్సుకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి ఆహ్వానం అందింది. ఈమేరకు ఆమె బుధవారం ఈ సదస్సులో అర్బన్ ఫారెస్ట్రీ అంశంపై ప్రసంగించనున్నారు. ఈ ఫోరమ్‌లో జీహెచ్ఎంసీకి ప్రాతినిధ్యం లభించడాన్ని గౌరవంగా భావిస్తున్నట్లు మేయర్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రం, నగరంలో చేపట్టిన హరితహారం గురించి ప్రముఖంగా ప్రస్తావించనున్నట్లు తెలిపారు.

బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల సీట్ల కేటాయింపు పూర్తి

ఉస్మానియా యూనివర్సిటీ: బీపీఈడీ, యూజీ డీపీఈడీ (వ్యాయామ విద్య) కోర్సుల్లో ప్రవేశాలకు జరిగిన రెండవ, చివరి విడత కౌన్సెలింగ్‌లో సీట్ల కేటాయింపు పూర్తి అయినట్లు అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొ.రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. రెండవ, చివరి కౌన్సెలింగ్‌లో 1331 అభ్యర్థుల్లో 626 మంది వెబ్‌ఆప్షన్స్ ఇవ్వగా..527 మందికి సీట్లను కేటాయించినట్లు వివరించారు. సీటు సాధించిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ట్యూషన్ ఫీజు చెల్లించి, రసీదుతో పాటు సర్టిఫికెట్లను ఆయా కాలేజీల్లో ఈ నెల 18 నుంచి 21 వరకు సమర్పించాలన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం సీటు కేటాయింపు ఉత్తర్వులను జారీ చేయనున్నట్లు తెలిపారు.

టన్ను గంజాయి స్వాధీనం

- కర్ణాటక, మహారాష్ట్రలకు రవాణా చేసే ప్రయత్నం
- మల్కనగిరి నుంచి ఖరీదు చేసిన అంతర్రాష్ట్ర ముఠా
- నలుగురు నిందితుల్ని అరెస్టు చేసిన టీఎస్–నాబ్


స్వాధీనం చేసుకున్న గంజాయి..

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్–నాబ్) అధికారులు టన్ను గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ సరుకు ఒడిశాలోని మల్కనగిరి నుంచి హైదరాబాద్ మీదుగా కర్ణాటకలోని బీదర్, మహారాష్ట్ర లోని థానేలకు సరఫరా అవుతున్నట్లు గుర్తించారు. నలుగురు సభ్యులున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ డి.సునీతరెడ్డి మంగళవారం వెల్లడించారు. బీదర్‌కు చెందిన సకారాం రాథోడ్ 2002లో నగరానికి వలసవచ్చాడు. కొన్నాళ్ళు పానీపూరీ బండి నడిపాడు. ఆదాయం సరిపోకపోవడంతో స్వస్థలానికి వెళ్లి..డ్రగ్ సరఫరాదారుడిగా మారాడు. జన్వాడలో ఉన్న గంజాయి పెడ్లర్స్‌తో సంబంధాలు ఏర్పాటు చేసుకున్న సకారాం గంజాయి దందాలోకి దిగాడు. తన స్నేహితులైన కాశిరామ్, లక్ష్మణ్, రవి సహాయంతో బీదర్‌తో పాటు మహారాష్ట్రకు ఈ దందా విస్తరించాడు. మల్కనగిరి ఏజెన్సీలో ఉన్న గంజాయి విక్రేతలను సంప్రదించిన సకారాం వారి నుంచి నేరుగా ఖరీదు చేయడం మొదలెట్టాడు. మహారాష్ట్రలోని థానేకు చెందిన అజయ్ రమావత్ చౌరాసియా సైతం సకారాంతో చేతులు కలిపాడు. గంజాయి దందా చేస్తున్న సకారాంపై సంగారెడ్డి జిల్లా జోగిపేట, నగరంలోని ఉస్మానియా యూనివర్సిటీ సహా ఐదు ఠాణాలో కేసులు నమోదయ్యాయి. ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చిన ఇతగాడు తన సోదరుడు జయదేవ్ చౌహాన్‌తో జట్టు కట్టాడు. ఓ డీసీఎం వ్యాన్ ఖరీదు చేసి తన ప్రాంతానికే చెందిన అహ్మద్ ఖాన్, రాము పవార్‌లను డ్రైవర్, కండక్టర్లుగా నియమించుకున్నాడు. వీరికి అధిక వేతనం ఇస్తూ గంజాయి రవాణా చేయిస్తున్నాడు. తనకు భారీ మొత్తంలో గంజాయి కావాలని ఇటీవల చౌరాసియా నుంచి సకారాంకు ఆర్డర్ వచ్చింది. దీంతో మల్కనగిరికి చెందిన సన్యాసిరావుకు టన్ను గంజాయి కావాలని ఆర్డర్ ఇచ్చిన సకారాం రూ.8 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. పోలీసు నిఘా తప్పించుకోవడానికి వినియోగించే ఉద్దేశంతో 100 ఖాళీ ప్లాస్టిక్ ట్రేలను డీసీఎం వ్యానులో వేసి పంపాడు. మల్కనగిరి వరకు వెళ్ళిన డ్రైవర్, క్లీనర్ టన్ను గంజాయిని ప్యాక్ చేసి, ఈ ట్రేల్లో సర్దుకుని బయలుదేరారు. రాజమహేంద్రవరం ఆటోనగర్ వద్ద కారులో వేచి ఉన్న సకారాం నాలుగు గంజాయి బ్యాగులు డీసీఎం నుంచి తీసి తన వాహనంలో వేసుకున్నాడు. తనిఖీలను గుర్తించి అప్రమత్తం చేయడం కోసం డీసీఎం ముందు ప్రయాణిస్తున్నాడు. సరుకు తీసుకువెల్లడానికి చౌరాసియాను నగరంలోని బొల్లారం ప్రాంతానికి రమ్మని చెప్పారు. ఇదిలా ఉండగా టీఎస్ నాబ్ ఏసీపీ కె.నర్సింగ్‌రావు, ఇన్‌స్పెక్టర్లు పి.రాజేష్, జి.గోపాల్, బి.విజయ భాస్కర్‌రెడ్డి, ఎస్సైలు సి.వెంకటేష్ తమ బృందాలతో బొల్లారంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అటుగా వచ్చిన ఈ రెండు వాహనాలు ఆపి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నలుగురినీ అరెస్టు చేసి సరుకుతో సహా స్థానిక పోలీసులకు అప్పగించారు.

'గవర్నమెంట్' స్టిక్కర్‌తో గాంజా తరలింపు!

'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' అని బొలెరో వాహనానికి స్టిక్కర్లు తగిలించుకొని హైదరాబాద్ మీదుగా సీలేరు నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు నిందితులను రాచకొండ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.24 లక్షలు విలువ చేసే 80 కిలోలు గంజాయి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన కుంచాల శ్రీను హైదరాబాద్‌కు వలస వచ్చి, నాగోల్ బండ్లగూడలో నివాసం ఉంటూ..దినసరి కూలీగా పనిచేస్తూ డ్రగ్స్ పెడ్లర్‌గా మారాడు. ఈక్రమంలో ఆరు నెలల క్రితం పరిచమైన అనకాపల్లికి చెందిన కల్ల రాముతో జతగట్టి.. ఇద్దరూ కలిసి బొలెరో వాహనంలో విశాఖపట్నంలోని సీలేరు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ధన్‌రాజ్ అనే గంజాయి విక్రేత వద్ద కిలో రూ.4,500 చొప్పున 80 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. సోమవారం సాయంత్రం సీలేరు నుంచి బయలుదేరి తెల్లవారుజామున ఉప్పల్ భగాయత్ మీదుగా వెళ్లేందుకు ప్రయత్నించగా..విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు ఉప్పల్ వద్ద వీరిని పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

పీఎన్‌బీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



సాక్షి, సిటీబ్యూరో: ఆల్ ఇండియా పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైమండ్ జూబ్లీ ఇయర్ వేడుకల్లో భాగంగా సోమవారం సికింద్రాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రివెంటివ్ మెడిసిన్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో 150 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరాన్ని జోనల్ మేనేజర్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సర్కిల్ హెడ్ శివ మోహన్, ఏజీఎస్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళా కండక్టర్ ఆత్మహత్యపై కార్మికుల భగ్గు

- అధికారుల వేధింపులే కారణమని ఆరోపణ
- బండ్లగూడ డిపో ఎదుట ఆందోళన


కండక్టర్ శ్రీవిద్య (ఫైల్)


బండ్లగూడ డిపో ముందు ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు, కాంగ్రెస్ నాయకులు

నాగోలు: బండ్లగూడ ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కండక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కార్మికుల భగ్గుమన్నారు. ఉన్నతాధికారుల వేధింపుల వల్లే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే...మాన్సూరాబాద్ డీపీ నగర్‌లో నివాసం ఉండే గంజి శ్రీవిద్య(48) బండ్లగూడ ఆర్టీసీ డిపోలో గత 12 సంవత్సరాలు కండక్టర్‌గా విధులు నిర్వహిస్తుంది. ఈ నెల 12న విధుల్లో నిర్లక్ష్యం చూపారని ఆమెపై అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు సస్పెండ్ చేసి హయత్‌నగర్ డిపోకు మార్చారు. దీంతో మనస్థాపానికి గురైన శ్రీవిద్య బీపీ మాత్రలు అధికంగా మింగి తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు గమనించి ఎల్‌బీనగర్ కామినిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కార్మికులు మంగళవారం బండ్లగూడ డిపో ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. శ్రీ విద్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వీరికి కాంగ్రెస్ నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తదితరులు మద్దతు తెలుపుతూ ఆందోళనలో పాల్గొన్నారు. బండ్లగూడ డిపో చీఫ్ ఇన్‌స్పెక్టర్ శాలిని, 141–చార్టర్ అధికారి చారిని వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. శాలిని ఓ మహిళా అధికారి అయి కూడా తోటి మహిళా ఉద్యోగులపట్ల దురుసుగా ప్రవరిస్తున్నారని మహిళా ఉద్యోగులు ఆరోపించారు. వేధింపులు ఉండవని లిఖిత పూర్వక హామీ ఇస్తేనే ఆందోళన విరమించకుంటామని హెచ్చరించారు. దీంతో అధికారులు ముందుకు వచ్చి కార్మికుల సంక్షేమ కోసం కృషి చేస్తామని, ఇకపై మహిళా కండక్టర్లను ఎవ్వరూ ఇబ్బంది పెట్టరని డిప్యూటీ ఆర్‌ఎంలు విజయభాను, జగన్‌లు హామీ ఇచ్చారు. ఆందోళనలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాజిరెడ్డి, జేఏసీ నాయకులు సత్యం, శంకర్, హరికృష్ణ, కాంగ్రెస్ నాయకులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు కటకం నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక రైళ్లు

సాక్షి, సిటీబ్యూరో: దసరా రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నర్సాపూర్–సికింద్రాబాద్ (07270) ప్రత్యేక రైలు ఈ నెల 19వ తేదీన సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్–తిరుపతి (07041/07042) స్పెషల్ ట్రైన్ ఈ నెల 19వ తేదీ రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 20వ తేదీ సాయంత్రం 7.30 కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.30 కు సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్–కాకినాడ (07271/07272) ప్రత్యేక రైలు ఈ నెల 20వ తేదీ రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు కాకినాడకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 21వ తేదీ రాత్రి 8.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 కు సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్–కాకినాడ (07065/07066) స్పెషల్ ట్రైన్ 23వ తేదీ సాయంత్రం 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.10 కి కాకినాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 24వ తేదీ రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

ముగిసిన సీబీఎస్ఈ సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్ పోటీలు


కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకున్న ఎన్‌వీఎస్ అనన్య

ఒంగోలు: సీబీఎస్ఈ సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్ పోటీలు మంగళవారం ఒంగోలు నగరంలోని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూలులో మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవుల్లోని సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన దాదాపు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 12 వ్యక్తిగత విభాగాలు, 12 టీం ఈవెంట్లుగా రైఫిల్, పిస్టల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో రాణించిన వారు త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు సౌత్‌జోన్ తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా బహూకరించారు. నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ ఈ పోటీలు ఆదివారం నుంచి జరుగుతున్నాయన్నారు.

విజేతల వివరాలు ఇలా..

పిస్టల్ షూటింగ్ విజేతల వివరాలు:
అండర్ 19 బాలురు:
- అభిషేక్‌జెనో (తిరువల్లూరు), నమన్ సింగ్ (సికింద్రాబాద్), శ్రీనివాస్ పార్థసారథి జి (మధురై), సర్వేస్ చంద్రన్ ఆర్ (పుదుచ్చేరి), రోహెయిల్ అయ్‌మాన్ ఏఎస్ (ఈరోడ్)

రైఫిల్ షూటింగ్ విజేతలు:
అండర్ 14 బాలురు:
- నాగ వెంకట రాజా రమేష్ (విజయవాడ), అభ్యాన్ హరీస్ పానికర్ (హైదరాబాద్ కొండాపూర్), అక్షయ్ రాజ్ (చెన్నై), శ్రావణ్ (చెన్నై), అబ్దుల్ రహిమాన్ (నిజామాబాద్)

అండర్ 17 బాలురు:
- జైవంత్ దాస్ (కోయంబత్తూర్) పృథ్వీ సాకేత్ ఠాకూర్ (హైదరాబాద్), తరుగ శ్రీజిత్ కృష్ణ (హైదరాబాద్), విశ్వ (చెన్నై), హర్షిత్ (చెన్నై)

అండర్ 19 బాలికలు:
- ఇలాకియా ఆర్ (కోయంబత్తూర్), అనన్య (ఆర్మీ పబ్లిక్ స్కూల్, రామకృష్ణాపురం సికింద్రాబాద్), జోషిత ప్రసన్న (కోయంబత్తూర్), టి.అంజని, జి.తరిణి (నెక్స్‌జెన్),

అండర్ 19 బాలురు:
- వేదాంతం శ్రీచక్ర మిథేరే (సికింద్రాబాద్), రగుల్ ప్రణీత్ (చెన్నై).


భాగ్యలక్ష్మి దేవాలయం వద్ద ప్రమాణం చేస్తారా?

రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ మాజీ నేతల సవాల్


నెత్తిపై రంగు నీళ్లు పోసుకొని ప్రమాణం చేస్తున్న కాంగ్రెస్ మాజీ నేతలు

సాక్షి, సిటీబ్యూరో: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అసెంబ్లీ టికెట్లు అమ్ముకున్నాడని ఆరోపిస్తూ చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం వద్ద అమ్మవారి సాక్షిగా కాంగ్రెస్ మాజీ నేతలు కురువ విజయ్ కుమార్ (గద్వాల), రాగిడి లక్ష్మారెడ్డి (ఉప్పల్), ఖలీమ్ బాబా (బహదూర్‌పురా)లు ప్రమాణం చేశారు. మంగళవారం మధ్యాహ్నం వారు చార్మినార్ వద్దకు చేరుకొని భాగ్యలక్ష్మి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం రంగు నీళ్లు నెత్తిపై పోసుకొని రేవంత్ రెడ్డి టికెట్లు అమ్ముకున్నాడని ప్రమాణం చేశారు. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పార్టీ టికెట్లు అమ్మలేదంటే తన మనవడితో భాగ్యలక్ష్మి గుడి దగ్గరికి వచ్చి అమ్మవారి మీద ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ఆర్టీసీ దసరా లక్కీడ్రా



సాక్షి, సిటీబ్యూరో: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రయాణికులకు బహుమతులను అందజేసేందుకు బుధవారం నుంచి లక్కీ డ్రాను ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. ఈ నెల 30వ తేదీ వరకు ఈ లక్కీ డ్రా కొనసాగనుంది. ప్రయాణికులు గమ్యం చేరుకున్న తరువాత టికెట్ వెనుక తమ ఫోన్ నంబర్ రాసి బస్‌స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో వేయాలి. ఇందుకోసం జూబ్లీబస్‌స్టేషన్, మహాత్మాగాంధీ, దిల్‌సుఖ్‌నగర్ వంటి బస్‌స్టేషన్‌లతో పాటు ఎల్‌బీనగర్, ఉప్పల్, తదితర ట్రాఫిక్ జనరేటింగ్ కేంద్రాల్లో హిళలు, పురుషులకు వేరు వేరుగా వేర్వేరుగా డ్రాప్ బాక్సులను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి ఆర్టీసీ రీజియన్ కేంద్రంలో లక్కీ డ్రా నిర్వహించి 10 మంది చొప్పున విజేతలను ఎంపికచేస్తారు. ఈ లక్కీ డ్రాలో గెలుపొందిన ప్రయాణికులకు రూ.11 లక్షల వరకు నగదు బహుమతులను అందజేయనున్నారు. దసరా లక్కీ డ్రాకు సంబంధించిన పూర్తి వివరాలకు టీఎస్‌ఆర్టీ సీ కాల్ సెంటర్ నంబర్లు 040–69440000, 040–23450033ను సంప్రదించవచ్చు.

డల్లాస్ వేదికగా అక్కినేని-ఆకృతి జాతీయ పురస్కారం..

సాక్షి, సిటీబ్యూరో: డా.అక్కినేని శతజయంతి సందర్భంగా అమెరికాలోని డల్లాస్ వేదికగా నటసామ్రాట్ అక్కినేని –ఆకృతి జాతీయ పురస్కార కార్యక్రమాన్ని ఈ నెల 19వ తేదీన జరుపనున్నామని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తానా పూర్వ అధ్యక్షులు, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపక అధ్యక్షుడు డా.ప్రసాద్ తోటకూరకు 'నటసామ్రాట్ అక్కినేని –ఆకృతి జాతీయ పురస్కారాన్ని' ప్రదానం చేయనున్నామని పేర్కొన్నారు. ఈ పురస్కార కార్యక్రమంలో ప్రముఖ సాహితీ వేత్త, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కారాన్ని అందించనున్నారు. ఈ కార్యక్రమంలో అమెరికాలోని తెలుగు వారు, తెలుగు సాహితీవేత్తలు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్ అరెస్టు

50 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడిని రాచకొండ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.6 లక్షలు విలువ చేసే 50 గ్రాముల ఎండీఎంఏ, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజస్థాన్ రాష్ట్రం దుగోలి గ్రామానికి చెందిన మనోజ్ హైదరాబాద్‌కు వలస వచ్చి, హుస్సేనిఆలం వద్ద నివాసం ఉంటూ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. మాదక ద్రవ్యాలకు బానిసగా మారాడు. డ్రగ్ పెడ్లర్లతో మంచి సంబంధాలు ఏర్పడటంతో వినియోగదారుడి నుంచి పెడ్లర్‌గా అవతారం ఎత్తాడు. ఈక్రమంలో సోమవారం సాయంత్రం నేరెడ్‌మెట్ పోలీసు స్టేషన్ పరిధిలోని వాయుపురి బస్‌స్టాండ్ వద్ద కస్టమర్‌కు డ్రగ్స్ సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్బీనగర్ ఎస్ఓటీ, నేరెడ్‌మెట్ పోలీసులు మనోజ్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో రాజస్థాన్‌కు చెందిన పూనమ్ చంద్ పరారీలో ఉన్నాడు.

8 కిలోల బంగారం..9 కిలోల వెండి స్వాధీనం

శామీర్‌పేట్: నగరశివారు..శామీర్‌పేట మండల పరిధిలోని హైదరాబాద్– కరీంనగర్ రాజీవ్ రహదారి తుర్కపల్లి చెక్‌పోస్ట్ వద్ద భారీగా బంగారం, వెండి పట్టుకున్నారు. జినోమ్ వ్యాలీ సీఐ రాజగోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా..ఒక గూడ్స్ లారీలో 8 కేజీల బంగారం, 9 కేజీల వెండిని పోలీసులు గుర్తించారు. దీన్ని స్వాధీనం చేసుకుని ఐటీ శాఖకు అప్పగించినట్లు సీఐ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఓ కొరియర్ సంస్థకు చెందిన వాహనంగా గుర్తించామని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

క్లుప్తంగా...

వైభవంగా ఆలయ బ్రహ్మోత్సవాలు



పెద్ద శేష వాహనంపై శ్రీవారు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు ఉదయం పెద్ద శేష వాహన సేవలో, సాయంత్రం హనుమంత వాహన సేవలో తరించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి వచ్చారు. వేడుకల్లో భాగంగా ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, సేవాకాలం, హోమం, జరిగాయి. ఆలయ చైర్మన్ సీహెచ్. రామయ్య, ఈఓ ఎస్. లావణ్యతో పాటు ట్రస్ట్ బోర్డు సభ్యులు ఈ ఊరేగింపులో పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

అన్నదానం



ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్ నల్ల పోచమ్మ ఆలయంలో నవరాత్రుల సందర్భంగా చండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు మోహన్ యాదవ్‌తో పాటు పలువురు ప్రారంభించారు.

పేదలకు చేయూతనివ్వాలి



చీరలను పంపిణీ చేస్తున్న కేవీఎస్.శర్మ

లిబర్టీ: పేదరికంలో మగ్గుతున్న ప్రతి ఒక్కరికి బాధ్యతాయుతంగా ప్రతి పౌరుడు చేయుతనివ్వాలని భారతీయ ధార్మిక సేవా సమితి అధ్యక్షులు కేవీఎస్.శర్మ కోరారు. సమాజంలో పేదరికంతో తల్లడిల్లుతూ ఆకలితో అలమటిస్తున్న వారికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకోవాలని కోరారు. దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం సమితి ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు, వస్త్రాలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.

రౌడీ షీటర్ల బైండోవర్

రహమత్‌నగర్: బోరబండ పీఎస్ పరిధిలో రౌడీ షీటర్లుగా ఉన్న ఎనిమిది మందిని ఏడాది పాటు బైండోవర్ చేయడం జరిగిందని ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ తెలిపారు. వచ్చే సాధారణ ఎన్నికల దృష్ట్యా రౌడీషీటర్‌లైన అబ్దుల్ రహమాన్(రాజ్‌నగర్) విక్రం (సైట్-2)రబ్బాని(సైట్-3) ప్రభాకర్(సైట్-3)మునిస్వామినాయక్(సైట్-3) మహ్మద్‌బిన్‌అలీ (ఎర్రగడ్డ) అయుబ్ అలీ(ఎర్రగడ్డ) షేక్ సలీం (కార్మికనగర్)ను స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు మంగళవారం హాజరు పర్చగా రూ. 50 వేల సొంత పూచికత్తుపై ఏడాది పాటు బైండోవర్ చేయడం జరిగిందన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

- ఇప్పడి వరకు రూ. 3.99 కోట్ల డబ్బు స్వాధీనం
- రేయింబవళ్లు నిఘా పెడుతున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు



యూసుఫ్‌గూడలో వాహన తనిఖీలు చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్



బంజారాహిల్స్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది

బంజారాహిల్స్: ధన ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉంటున్నారు. అడుగడుగునా వాహనాలను తనిఖీ చేస్తూ డబ్బు, మద్యం, బహుమతులు తీసుకెళ్లే అవకాశాలున్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఈ తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని 11 పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటి వరకు లెక్కలేని రూ.3.99 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా స్టాటస్టిక్ సర్వైలెన్స్ బృందాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో అయిదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు రేయింబవళ్లు వాహనాలను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. ముఖ్యంగా కర్ణాటక నుంచి పెద్ద మొత్తంలో డబ్బు నగరానికి వస్తుందన్న ఆరోపణల నేపథ్యంలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో నాలుగు చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. అనుమానం వచ్చిన ప్రతీ వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌తో ఉన్న వాహనాలు తప్పనిసరిగా ఆపుతూ సోదాలు నిర్వహిస్తున్నారు. గత నాలుగు రోజుల నుంచి ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లోనే కాకుండా ప్రధాన రహదారుల్లోనూ ఈ తనిఖీలు జరుపుతున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు సమాచారం వచ్చిన వెంటనే వారు ఆయా ప్రాంతాల్లో వాలిపోతున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు స్టాటస్టిక్ సర్వైలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు కలిసి 148 చోట్ల వాహనాల తనిఖీలు చేపట్టాయి. నగదుతో పాటు మద్యం అక్రమ రవాణా అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందుకుంటున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఆయా ప్రాంతాల్లో క్షణాల్లో వాలిపోతున్నాయి.

లా అండ్ ఆర్డర్ పోలీసులు కూడా..

ఎన్నికలు సమీపిస్తున్న వేళ డబ్బు లావాదేవీలపై లా అండ్ ఆర్డర్ పోలీసులు దృష్టి పెట్టారు. రూ.50 వేల కంటే మించి నగదు తీసుకెళ్లే వారిని లక్ష్యంగా చేసుకొని ఆ డబ్బులు సీజ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు 12 చోట్ల నగదు సీజ్‌చేసిన అధికారులు అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మొదటి రోజునే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వేళల్లో వెహికిల్ చెకింగ్స్ ముమ్మరం చేస్తున్నారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్రతీరోజూ ఒక్కో పోలీస్ స్టేషన్‌పరిధిలో వందకుపైగా వాహనాలు తనిఖీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఒక్కో పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతీ సెక్టార్ పరిధిలో వాహనాల తనిఖీలు చేపట్టాలని ఇప్పటికే ఆయా పోలీస్‌స్టేషన్ల సీఐలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

కాంగ్రెస్, బీజేపీలను నిలదీయండి: ఎమ్మెల్యే దానం



మాట్లాడుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు టూరిస్ట్ పొలిటీషియన్లుగా ప్రజల వద్దకు వస్తుంటారని వీరి ప్రలోభాలను నమ్మితే పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆరోపించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 30న జరిగే పోలింగ్‌లో సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చి ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని తనకు మరోసారి కల్పించాలని కోరారు. ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు కేవలం బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందని అన్నారు. గ్యారెంటీ కార్డులతో ప్రజల వద్దకు వచ్చే కాంగ్రెస్ నేతలకు తగిన గుణపాఠం చెప్పాలని మాకేం చేశారని వారిని నిలదీయాలని మీ ప్రభుత్వాలు ఉన్న చోట ఈ ఆరు గ్యారెంటీలు ఎందుకు అమలు కావడం లేదో ప్రశ్నించాలని సూచించారు. కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి ధీమాగా మారిందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయన్నారు. రూ.400లకే గ్యాస్ సిలిండర్ పథకం దేశానికే ఆదర్శంగా నిలవబోతున్నదన్నారు. ప్రతీ మహిళా గ్రూప్ మహిళకు సొంత ఇల్లు నిర్మిస్తామని సీఎం ఇచ్చిన హామీ వచ్చే ఏడాది మార్చి నుంచి అమల్లోకి వస్తుందన్నారు. డిసెంబర్ 10 తర్వాత ఆగిపోయిన పథకాలన్నీ పంపిణీ జరుగుతాయని దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పించే బాధ్యత పూర్తిగా తనదేనన్నారు.

జంగ్ 2023 తెలంగాణ

సాధ్యమైనంత త్వరగా అభ్యర్థిని ప్రకటించాలి



మాణిక్‌రావ్ ఠాక్రేతో సమావేశం అయిన ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ నేతలు

బంజారాహిల్స్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేను గాంధీభవన్‌లో ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసి పార్టీ పరిస్థితిని ఆయనకు వివరించారు. సాధ్యమైనంత త్వరగా అభ్యర్థిని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీకి నియోజకవర్గంలో విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని రోజురోజుకూ పార్టీ బలోపేతం అవుతున్నదని ఆయనకు సూచించారు. త్వరగా అభ్యర్థిని ప్రకటిస్తే ప్రజల్లోకి వెళ్లి ఆరు గ్యారెంటీలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.

సమస్యలు పరిష్కరించిన వారికే మద్దతు



ఐక్యత ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

పంజగుట్ట: ఎస్సీల్లో మాల, మాదిగ తర్వాత అత్యధిక జనాభా ఉన్న బేడ బుడగ జంగం కులస్తుల సమస్యలు పరిష్కరించే వారికే తమ మద్దతు ఉంటుందని ఆల్ ఇండియా బేడ బుడగ జంగం వెల్ఫేర్ ఫెడరేషన్ అధ్యక్షులు డాక్టర్ చింతల యాదగిరి డిమాండ్ పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వర్కింగ్ ప్రసిడెంట్ చిత్తారి అనంతయ్య, ప్రధాన కార్యదర్శి తిరుపాటి పాండు మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తమను ఎన్నోసార్లు కలిసే వారని ఆయన చొరవతో బేడ బుడగ జంగాల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని దురదృష్టవశాత్తు ఆయన మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. మాల, మాదిగల తర్వాత ఎస్సీల్లో అత్యంత అధిక జనాభా సుమారు 25 లక్షల జనాభా ఉన్న తమ కులానికి 76 ఏళ్ల స్వాతంత్ర్య చరిత్రలో ఒక్క ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ లేకపోవడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ వ్యవస్థాపకుల్లో తానూ ఒకడినని టీఆర్ఎస్ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ ఉండగా తాను ఉపాధ్యక్షుడిగా ఉన్నానని ఫెడరేషన్ అధ్యక్షులు డాక్టర్ చింతల యాదగిరి తెలిపారు. మనం అధికారంలోకి రాగానే నీకు ఉప ముఖ్యమంత్రి, లేదా హోంమంత్రి ఇస్తానని కేసీఆర్ ఎన్నోసార్లు అన్నారని కాని ఇప్పుడు కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదని ఆవేదనవ్యక్తం చేశారు. సమావేశంలో నర్సయ్య, లక్ష్మయ్య, హన్మంతు, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



ఆరు గ్యారంటీలను ప్రజలకు తెలియజేస్తున్న విజయారెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఇందిరానగర్ కాలనీ, మహాభారత్‌నగర్‌లలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో దశాబ్దాల క్రితమే ఇందిరాగాంధీ ఇక్కడ పేదలకు ఇళ్లు నిర్మించినవే అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రెండు నియోజకవర్గాలకూ ఒకే స్ట్రాంగ్ రూమ్

బంజారాహిల్స్: వచ్చే నెల 30న జరగనున్న ఎన్నికల సందర్భంగా ఖైరతాబాద్-జూబ్లీహిల్స్ నియోజకవర్గాల ఈవీఎంల పంపిణీతో పాటు, స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపునకు యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని అధికారులు ఎంపిక చేశారు. స్టేడియంలో రెండు నియోజకవర్గాలకు వేర్వేరుగా స్ట్రాంగ్‌రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఓట్ల లెక్కింపునకు కూడా వేర్వేరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈవీఎంలు, వీవీ ప్యాట్లు భద్రపరిచే గదులకు ఉన్న కిటికీలు, వెంటిలేటర్లను గోడకట్టి మూసివేస్తున్నారు. మంగళవారం ఇక్కడ ఏర్పాట్లు చురుకుగా జరిగాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ఆదేశాల మేరకు సంబంధిత సిబ్బంది ఎక్కడెక్కడ కిటికీలు మూసివేయాలో దారులు ఎక్కడి నుంచి ఈవీఎంల పంపిణీ తదితర ఏర్పాట్లు పర్యవేక్షించారు.



యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియం

పోలీసులు- కాంగ్రెస్ నేతల వాగ్వాదం



పోలీసులతో వాగ్వాదానికి దిగిన రోహిణ్‌రెడ్డి

బంజారాహిల్స్: 'డబ్బు, మద్యం పంపిణీ చేయకుండా ఎన్నికల్లో గెలుద్దాం ప్రమాణం చేద్దాం రా' అంటూ సీఎం కేసీఆర్‌కు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్‌తో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం ఉదయం రేవంత్‌రెడ్డి గన్‌పార్క్ వద్దకు వస్తుండగా ఆయనకు మద్దతుగా ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి, నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రోహిణ్‌రెడ్డిని పోలీసులు గన్‌పార్క్‌కు వెళ్లకుండా అడ్డుకోవడంతో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల వైఖరిని నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించారు. రేవంత్‌రెడ్డి జిందాబాద్ నినాదాలతో ఖైరతాబాద్ కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో రోహిణ్‌రెడ్డితో పాటు పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

ఆటో క్యాంపెయిన్



ఎన్బీటీ నగర్‌లో ఆటో క్యాంపెయిన్‌లో పాల్గొన్న రూమ్ టూ రీడ్ ప్రతినిధులు

బంజారాహిల్స్: బాలికా విద్యా కార్యక్రమంలో భాగంగా రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సైబర్ భద్రత-నేనూ నా డిజిటల్ ప్రపంచం అనే అంశంపై వారం రోజుల పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటీ నగర్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఆటో క్యాంపెయిన్ నిర్వహించారు. ఇందులో భాగంగానే ఆటోవాలాలకు అవగాహన కలిగించే బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లో 8 ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు సంస్థ గర్ల్స్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ సీనియర్ అసోసియేట్ లక్ష్మణ్, సోషల్ మొబిలైజర్లు అన్నపూర్ణ, స్రవంతి తెలిపారు. విద్యార్థులు, స్థానికులు, సంస్థ ప్రతినిధులు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: ఐజీపురం 11 కేవీవీ ఫీడర్ బేగంపేట సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉ.10 నుంచి మ.12 గంటల వరకు ఐజీ పురం, బేగంపేట బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా బోరబండ, ఎస్పీఆర్ హిల్స్, మహాత్మానగర్, కార్మికనగర్ 11 కేవీ ఫీడర్లు ఎస్పీఆర్‌హిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల టి.అంజయ్యనగర్, ఇందిరానగర్, ఎస్ఆర్ఆర్‌పురం సైట్-3, 5, నూర్ మసీద్, ఆరోగ్యనగర్, నాట్కో స్కూల్, మహాత్మానగర్, హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్-1, 2, శ్రీరామ్‌నగర్, సంజయ్‌నగర్, కార్మికనగర్, బ్రహ్మశంకర్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ ఉండదన్నారు.

లియో సినిమా తెలుగు టైటిల్‌పై పూర్తి హక్కులు నావే

సినీ నిర్మాత, దర్శకులు జి.దినకర్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న దినకర్ రాజు

పంజగుట్ట: తెలుగు లియో సినిమా టైటిల్‌పై పూర్తి హక్కులు తమవేనని సినీ నిర్మాత, దర్శకులు జి.దినకర్ రాజు అన్నారు. తమిళ రీమేక్ లియో సినిమా ఈ నెల 19న విడుదల చేయరాదని జిల్లా సివిల్ కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 27 జులై 2022లో తాను తెలుగు ఫిల్మ్ ఆఫ్ కామర్స్‌లో లియో సినిమా టైటిల్ రిజిస్ట్రేషన్ చేసుకున్నానని షూటింగ్ కొనసాగుతుండడంతో లియో టైటిల్ తనదే అని మరోమారు రెన్యూవల్ కూడా చేసుకున్నానని రెన్యువల్ డేట్ 25 జనవరి 2024 వరకు ఉందని గుర్తు చేశారు. ఇప్పుడు తమిళ డబ్బింగ్ సినిమాకు లియో అని పేరుపెట్టి తెలుగులో విడుదల చేసేందుకు సితారా ఎంటర్‌టైన్‌మెంట్ వారు చూస్తున్నారని దీనిపై తాను తెలుగు ఫిల్మ్ ఆఫ్ కామర్స్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్పందన లేకపోవడంతో తాను జిల్లా సివిల్ కోర్టును ఆశ్రయించినట్లు కోర్టు ఈ తమిళ డబ్బింగ్ లియో సినిమాను ఈ నెల 19న రిలీజ్ చెయ్యకూడదని ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఈ సమావేశంలో న్యాయవాది అశోక్, కో ప్రొడ్యూసర్ లాజరస్, కిరణ్ కుమార్, శ్యామ్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు విద్యార్థుల అదృశ్యం



శృతి



షేక్‌సోహెల్

రహమత్‌నగర్: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీఆర్‌హిల్స్‌లోని రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన శృతి(20) డిగ్రీ పూర్తి చేసింది. ఆమె మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాక పోవడంతో ఆమె తల్లి లక్ష్మీ బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే శృతి కొంత కాలంగా మానసిక సమస్యలతో బాధపడుతుండేదని తల్లి వివరించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అలాగే బంజారానగర్‌కు చెందిన షేక్‌సోహెల్(18) ఎస్సార్‌నగర్‌లోని కేఎంఆర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రాత్రి వేళల్లో స్నేహితులతో తిరగ వద్దని తల్లిదండ్రులు మందలించడంతో, ఇతను ఈనెల 10వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాక పోవడంతో తల్లిదండ్రులు పోలీసులు ఫిర్యాదు చేశారు. ఎస్సై సర్దార్ జమాల్ మిస్సింగ్ కేసులుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

బీఆర్ఎస్‌ను ఓడించేందుకు సిద్ధం కండి



మాట్లాడుతున్న పీయూష్ గోయల్

వెంగళరావునగర్: తెలంగాణ ప్రాంతానికి అన్ని రకాలుగా నష్టాన్ని కలిగించిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రాబోవు ఎన్నికల్లో ఓడించడానికి అందరూ సమాయాత్తం కావాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని సవేరా ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం రాత్రి జూబ్లీహిల్స్ నియోజకవర్గ స్థాయి బూత్ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఇండియాను దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు తెస్తుంటే ఇక్కడేమో కేసీఆర్ ప్రభుత్వం కమిషన్ల ప్రభుత్వంగా నడుస్తుందని విమర్శించారు. ఎమ్మెల్సీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణలో మన సత్తా చాటాలని, ఇది జూబ్లీహిల్స్ నుంచే నాంది పలకాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, నగర, నియోజకవర్గ సీనియర్ నాయకులు డాక్టర్ పద్మ వీరపనేని, లంకెల దీపక్‌రెడ్డి, జూటూరి కీర్తిరెడ్డి, ఆలపాటి లక్ష్మీనారాయణ, గౌతంరావు, కిలారి మనోహర్, అట్లూరి రామకృష్ణ, ప్రశాంత్ గంగరాజు పాల్గొన్నారు.



అన్నపూర్ణాదేవిగా జూబ్లీహిల్స్ పర్వతవర్ధనీదేవి



గాయత్రీ దేవిగా దైవసన్నిధానం రాజరాజేశ్వరి దేవి



గాయత్రీ దేవిగా మాగంటి కాలనీ కనకదుర్గా దేవి



అన్నపూర్ణాదేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి



అన్నపూర్ణా దేవిగా బంజారాహిల్స్ కనక దుర్గా దేవి

జగన్మాతా పాహిమాం..

బంజారాహిల్స్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం:18లోని సీతారామస్వామి ఆలయంలో కొలువుదీరిన శ్రీ పర్వత వర్ధనీదేవి అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జ్యోతి కళా క్షేత్రం కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను, ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కనకదుర్గా దేవి అమ్మవారి సన్నిధిలో శ్రీ లలితా సహస్రనామ విధాన సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. ఫిలింనగర్ దైవసన్నిధానంలో అమ్మవారు గాయత్రి దేవి అలంకారంలో దర్శనమివ్వగా శ్రీ సకల దేవతా గాయత్రిహోమాన్ని నిర్వహించారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



పెద్దమ్మ ఆలయంలో భక్తుల సందడి



పెద్దమ్మ గుడికి పోటెత్తిన భక్తులు..

ఫిలింనగర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్దమ్మతల్లిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చారు. దీంతో ఆలయంతో పాటు ఆలయ పరిసరాలన్నీ భక్తజన సంద్రంతో కిటకిటలాడాయి. ఆలయానికి దారితీసే మార్గాలన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పవర్ లిఫ్టింగ్‌లో 'స్ఫూర్తి'కి స్వర్ణం



సాక్షి, సిటీ బ్యూరో: డబ్ల్యూపీసీ జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో హైదరాబాద్ లిఫ్టర్ ఎ.స్ఫూర్తి బంగారు పతకం కైవసం చేసుకుంది. జూబ్లీహిల్స్‌కు చెందిన స్ఫూర్తి బెంగళూరులో జరిగిన ఈ పోటీల్లో మహిళల 60 కిలోల డెడ్‌లిఫ్ట్ విభాగంలో 90 కేజీల బరువు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచింది. కిర్గిస్తాన్‌లో జరగనున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు స్ఫూర్తి ఎంపికైనట్లు రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ సంఘం అధ్యక్షురాలు రేఖ పేర్కొన్నారు.

నిమ్స్‌ని సందర్శించిన యూఎస్ ఎయిడ్ బృందం



సాక్షి, సిటీబ్యూరో: యూఎస్ఎయిడ్ ప్రాజెక్ట్ రైజ్ సారథ్యంలో నిమ్స్ ఆసుపత్రికి అందిస్తున్న అత్యాధునిక వైద్య సహకారం, అది సాధించిన పురోగతిని ప్రత్యక్షంగా చూసేందుకు ఓ ప్రతినిధి బృందం నిమ్స్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా నిమ్స్ ఆసుపత్రిలోని హై ఫిడిలిటీ సిమ్యులేషన్ స్కిల్ ల్యాబ్ సహా పలు అత్యాధునిక వైద్య సేవలను వీరు వీక్షించారు. నిమ్స్ డీన్, మెడికల్ సూపరింటెండెంట్, సీనియర్ ఫ్యాకల్టీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ ప్రోగ్రామ్ కింద చేపట్టిన పలు చర్యల గురించి ప్రతినిధి బృందానికి వివరించారు. ప్రతినిధుల బృందంలో యూఎస్ ఎయిడ్ ఇండియా గ్లోబల్ హెల్త్ డిప్యూటీ అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటర్ నిధి బౌరి, హెల్త్ ఆఫీస్ డైరెక్టర్ మిచెల్ లాంగ్-అల్లి, సీనియర్ హెల్త్ సిస్టమ్ స్ట్రెంగ్తెనింగ్ అడ్వయిజర్ విజయ్ పాల్‌రాజ్, ఇన్ఫెక్షన్ డిసీజెస్ అడ్వైజర్ భవిన్ వదేరా, కమ్యూనికేషన్ నాలెడ్జ్ స్పెషలిస్ట్ స్వాతి కపూర్ తదితరులున్నారు.

ప్రేమించాలని యువతికి వేధింపులు

వెంగళరావునగర్: ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకోకపోతే నీ అంతు చూస్తానంటూ ఫిజియోథెరపిస్ట్‌ను ఓ యువకుడు వేధిస్తున్న ఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన ఓ యువతి వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ సమీపంలో ఫిజియోథెరపి, రిహేబ్ సెంటర్‌ను నిర్వహిస్తోంది. ఆగస్టు నెలలో ఉమా మహేశ్వర్ అనే వ్యక్తి నుంచి ఇన్‌స్టాగామ్, వాట్సాప్‌ల నుంచి ఆమెకు మెసేజ్ లు వచ్చాయి. ఆమె వాటిని పట్టించుకోలేదు. అక్కడ నుంచి తరచూ వివిధ సోషల్ మీడియాల ద్వారా మెసేజ్‌లు పంపుతూనే ఉన్నాడు. ఇటీవల ఆమెను వెంబడిస్తూ ఆమె సెంటర్ వరకు వచ్చాడు. తాను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలని వేధించాడు. అంతటితో ఆగకుండా ఒకరోజు ఫిజియోథెరపీ సెంటర్‌కు వచ్చి తనకు మెడ నొప్పిగా ఉందంటూ చాలాసేపు అక్కడే కూర్చుని అనేక రకాలుగా వేధించాడు. వేధింపులు తాళలేక ఆమె తన వాట్సాప్ నెంబర్‌ను బ్లాక్ చేసింది. అయినా వివిధ సోషల్ మీడియాల నుంచి మెసేజ్‌లు పంపుతూనే ఉన్నాడు. తనను ప్రేమించకపోయినా, పెళ్లి చేసుకోకపోయినా నీతో పాటు, కుటుంబ సభ్యుల అంతు చూస్తానని తాను కూడా ఆత్మహత్య చేసుకుంటానంటూ మానసికంగా వేధింపులకు గురి చేస్తుండటంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చంద్రబాబుకు నో రిలీఫ్

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బాబు క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో తీర్పు రిజర్వు

ఫైబర్‌నెట్ కుంభకోణం కేసు విచారణ శుక్రవారం చేపడతామన్న ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయి, రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబుకి మధ్యంతర బెయిల్ మంజూరు చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది. ఫైబర్‌నెట్ కుంభకోణం కేసులోనూ మధ్యంతర బెయిల్ ఇవ్వాలన్న చంద్రబాబు విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ కేసు విచారణ శుక్రవారం చేపడతామని పేర్కొంది. అప్పటి వరకూ చంద్రబాబును అరెస్టు చేయొద్దని చెప్పింది.

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో సీఐడీ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టేయాలంటూ చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం మంగళవారం మరోసారి విచారించింది. ఇరుపక్షాల వాదనలు పీసీ చట్టం సెక్షన్ 17ఏ పైనే జరిగాయి. సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, రంజిత్ కుమార్, నిరంజన్‌రెడ్డి వాదించగా, చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు హరీశ్ సాల్వే, సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు.



తొలుత సీఐడీ తరఫున ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ సెక్షన్ 17ఏ ఈ కేసుకు వర్తించదని చెప్పారు. ఇది 2018 కన్నా ముందు జరిగిన నేరమని, ఆ సమయంలో ఉనికిలోనే లేని చట్టం ఎలా వరిస్తుందని ప్రశ్నించారు. 2018 జూన్‌లోనే విచారణ ప్రారంభించామని తెలిపారు. ఎఫ్‌ఐఆర్‌లో కాగ్నిజబుల్ నేరాలు ఉన్నాయా లేదా అనేది చూడాలని చెప్పారు. సెక్షన్ 17ఏ నిజాయితీపరులకే తప్ప అవినీతిపరులకు రక్షణ కవచం కాకూడదని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అవినీతి జరిగిందని స్పష్టంగా కనిపిస్తోందని, అటువంటప్పుడు సెక్షన్ 17ఏ అసలు వర్తించదని చెప్పారు. రూ. వందల కోట్ల కుంభకోణం దర్యాప్తును అడ్డుకోవడానికి ఈ సెక్షన్‌ను ఉపయోగించరాదని అన్నారు. 2015–16లో చట్టంలో లేనివి వర్తించవని చెప్పారు. సెక్షన్ 17ఏ భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. పీసీ చట్టానికి సంబంధం లేని అభియోగాలపై విచారించే పరిధి ప్రత్యేక కోర్టుకు ఉందని పలు కోర్టు తీర్పులను ప్రస్తావిస్తూ గట్టిగా వాదనలు వినిపించారు. ఒక వ్యక్తి పీసీ చట్టం, ఐపీసీ సెక్షన్ల ప్రకారం నిందితుడు అయితే.. ఏదైనా కారణాలతో పీసీ చట్టం నేరాలను దాని నుంచి తొలగించినప్పటికీ, ప్రత్యేక న్యాయమూర్తి మిగిలిన ఐపీసీ కింద సెక్షన్లపై చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం విచారణ చేయొచ్చని తెలిపారు. ఈ కేసులో ప్రత్యేక కోర్టు నిందితుడి విడుదలకు నిరాకరించిందని తెలిపారు. ప్రస్తుత కేసులో ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నామని, డిశ్చార్జి ఉందా లేదా అనేది పక్కనపెడితే.. పోలీసుల దర్యాప్తులో పీసీ లేదా పీసీయేతర అభియోగాల మధ్య తేడా లేనప్పుడు ఎఫ్‌ఐఆర్‌ను ఎలా క్వాష్ చేస్తారని ప్రశ్నించారు. ఇది రాజకీయ కక్ష కాదని, కేంద్ర దర్యాప్తు సంస్థల ఆరోపణలపైనా దర్యాప్తు జరిగిందని తెలిపారు. ఒకవేళ సెక్షన్ 482 విచక్షణ ప్రకారం రిలీఫ్ ఇవ్వాలంటే దానికి కొన్ని ప్రిన్సిపుల్స్ ఉన్నాయన్నారు. ఈ కేసుకు ఆ అర్హత కూడా లేదని కౌంటర్ అఫిడవిట్‌ను పరిశీలిస్తే అర్థం అవుతుందని తెలిపారు. సుప్రీంకోర్టే ప్రాథమిక విచారణ చేయాలనుకోవడం సరికాదన్నారు. ఈ సందర్భంగా తన వాదనలను సమర్థించే వేర్వేరు తీర్పులను ధర్మాసనం ముందుంచారు.

చంద్రబాబు తరఫు న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు వినిపిస్తూ.. రాజకీయ కక్ష సాధింపులు నిరోధించేందుకే 17ఏ ఉందని, ఇది చట్టం కల్పించిన రక్షణ అని చెప్పారు. రాష్ట్ర వాదన చూస్తుంటే.. సెక్షన్ 17ఏ అమాయకులైన వారికే వర్తిస్తుందన్నట్లుందని చెప్పారు. నిర్దోషులని నిర్ధారించడానికి నిర్దోషిత్వంపై ముందుగా విచారణ నిర్వహించాలంటూ ప్రొవిజన్ తలక్రిందులు చేస్తున్నారని ఆరోపించారు. జీఎస్టీ చెల్లింపులకు, ప్రభుత్వానికి ముడి పెడుతున్నారన్నార. 2021లో విచారణ ప్రారంభించి ఆధారాల కోసం మళ్లీ వెదుకుతున్నారని ఆరోపించారు. ఈ కేసులో సెక్షన్ 17ఏ వర్తిస్తుందని చెప్పారు. 40 రోజులుగా చంద్రబాబు జైల్లో ఉన్నారని, మధ్యంతర బెయిలు ఇవ్వాలని సాల్వే అభ్యర్థించారు. సాల్వే వాదనలను లూథ్రా సమర్థించారు. ఇరుపక్షాల వాదనల అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

రామోజీ మా సంతకాలు ఫోర్జరీ చేశారు

▶ మొదటి పేజీ తరువాయి

అక్రమంగా బదిలీ చేసి రామోజీ మోసానికి పాల్పడ్డారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని సీఐడీని, న్యాయస్థానాన్ని కోరారు. యూరి రెడ్డి మంగళవారం తన న్యాయవాది శివరామిరెడ్డితో కలిసి విజయవాడలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రామోజీరావు ఏ విధంగా తమ షేర్లను అక్రమంగా బదలాయించుకున్నదీ వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

తుపాకీతో బెదిరించి..

మా తండ్రి జీజే రెడ్డి చనిపోయిన తరువాత మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో మా అన్నయ్య మార్టిన్ రెడ్డి, నేను మా వాటా షేర్ల కోసం ఎన్నో ఏళ్లు రామోజీరావును సంప్రదించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరికి 2016లో హైదరాబాద్‌లో ఆయన్ని కలిశాము. మాకు డివిడెండ్ కింద చెక్ ఇచ్చారు. ఆ తరువాత మా షేర్లపై సర్టిఫికెట్ అడిగితే ఓ ప్రత్యేక గదిలోకి తీసుకెళ్లారు. మమ్మల్ని లోపల ఉంచి తలుపులు వేసేశారు. చాలాసేపటి తరువాత రామోజీరావు వచ్చి ఖాళీ స్టాంపు పేపర్లు ముందు పెట్టారు. వాటిపై సంతకాలు చేయమన్నారు. మేము నిరాకరించడంతో మా తలలకు తుపాకి గురిపెట్టి 'సంతకాలు పెడతారా లేదా.. మిమ్మల్ని కాపాడేవారు ఎవరూ లేరు ఇక్కడ' అని బెదిరించారు. అది ఆయన సామ్రాజ్యం. అంతా ఆయన మనుషులే. మా బాధ చెప్పుకునేందుకు కూడా ఎవరూ లేరు. ఆ సమయంలో అక్కడి నుంచి ప్రాణాలతో బయట పడతామనుకోలేదు. ఆయనకు ఎదురు చెబితే ప్రాణాలు దక్కవన్నది అర్థమైంది. కేవలం ప్రాణాలు కాపాడుకొనేందుకే ఆ ఖాళీ స్టాంపు పేపర్లపై సంతకాలు చేసి బయటకు వచ్చాం. షేర్ల బదిలీకి మేము అంగీకరించలేదు. షేర్ల బదిలీ ప్రక్రియ పూర్తి చేయలేదు. రామోజీరావు మాకు ఇచ్చిన చెక్‌ను కూడా నగదుగా మార్చుకోలేదు.

చట్ట ప్రకారం ఇది చెల్లదు

కంపెనీల చట్టం ప్రకారం ఏదైనా షేర్ల బదిలీ ప్రక్రియ పూర్తి కావాలంటే మూడు అంశాలు తప్పనిసరి. ప్రతిపాదన (ఆఫర్), ఆమోదం (యాక్సెప్టెన్సీ), ప్రతిఫలం బదిలీ (కన్సిడరేషన్) తప్పనిసరి. మా షేర్ల బదిలీ విషయంలో ఆ మూడూ జరగలేదు. షేర్లు బదిలీ చేస్తామని మేము ఎక్కడా చెప్పలేదు. అందువల్ల ప్రతిపాదనే లేదు. రామోజీరావు కోరినా మేము ఆమోదించలేదు. అందువల్ల యాక్సెప్టెన్సీ లేదు. మా షేర్ల బదిలీకి ప్రతిఫలంగా మాకు ఎలాంటి ఆర్థిక ప్రతిఫలమూ దక్కలేదు. కాబట్టి మేము షేర్లు విక్రయించామన్న రామోజీరావు వాదన చెల్లదు. ఆయన వాదన పూర్తిగా అబద్ధం, మోసపూరితం.

చేతి అప్పు అంటూ బుకాయింపు

మా తండ్రికి చేతి అప్పుగా ఇచ్చిన దానికి ప్రతిఫలంగానే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో పెట్టుబడి నిధిని సమకూర్చారని రామోజీరావు ముందుగా బుకాయించారు. చేతి అప్పు తీర్చాలి అంటే నగదు ఇస్తారు గానీ కంపెనీలో పెట్టుబడి పెడతారా అని మేము ప్రశ్నిస్తే రామోజీరావు సరైన సమాధానం ఇవ్వలేదు. అనంతరం షేర్లు బదిలీ చేయాలని మమ్మల్ని తుపాకీతో బెదిరించారు. ఫోర్జరీ సంతకాలతో షేర్ల బదిలీ.. ఆర్‌వోసీకి ఫిర్యాదు మేము సమ్మతించకపోయినా, చెక్‌ను నగదుగా మార్చుకోకపోయినా మా వాటా 288 షేర్లను రామోజీరావు ఆయన కోడలు శైలజా కిరణ్ పేరిట అక్రమంగా బదిలీ చేశారని 2017లో గుర్తించాం. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌వోసీ)కి వెళ్లి సంబంధిత పత్రాలను పరిశీలిస్తే అసలు విషయం తెలిసింది. పలు పత్రాల్లో మా సంతకాలను ఫోర్జరీ చేశారు. దీనిపై అప్పట్లోనే ఆర్‌వోసీకి ఫిర్యాదు చేశాను.

సీఐడీ దర్యాప్తుతో ధైర్యం వచ్చి..

రామోజీరావు తుపాకీతో బెదిరించారని కొందరికి మా ఆవేదన చెప్పుకున్నా అప్పట్లో ఫలితం లేకపోయింది. దాంతో ఫిర్యాదు చేసేందుకు ధైర్యం సరిపోలేదు. ఆయన రాజకీయ పరపతి ఎలాంటిదో అందరికీ తెలిసిందే. వ్యవస్థలన్నీ ఆయన గుప్పిట్లో ఉన్నాయి. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల సొమ్ము అక్రమ పెట్టుబడులకు మళ్లించిన వ్యవహారంలో ఏపీ సీఐడీ రామోజీ, ఇతరులపై కేసు నమోదు చేసింది. సోదాలు నిర్వహిస్తోంది. దాంతో మాకు ధైర్యం వచ్చింది. అందుకే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో మా షేర్లను అక్రమంగా బదిలీ చేసుకున్నారని సీఐడీకి కొన్ని నెలల క్రితం ఫిర్యాదు చేశాము. సీఐడీ అధికారులు నాలుగైదు నెలలపాటు మా ఫిర్యాదును పరిశీలించారు. ఆధారాలు తెమ్మన్నారు. మేము ఇచ్చిన ఆధారాలను పరిశీలించారు. మా ఫిర్యాదు సరైనదే అని నిర్ధారించుకున్న తరువాతే కేసు నమోదు చేశారు.

మూలధన నిధి ఏపీ నుంచే వచ్చింది కాబట్టి..

మా తండ్రి జీజే రెడ్డి కృష్ణా జిల్లాలోని తన వ్యవసాయ భూమి ద్వారా వచ్చిన ఆదాయాన్నే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో పెట్టుబడిగా పెట్టారు. అంటే మూలధన నిధిని ఏపీ నుంచే సమీకరించారు. ఆ పెట్టుబడితోనే మా పేరిట 288 షేర్లు వచ్చాయి. ఆ షేర్లనే రామోజీరావు ఆయన కోడలు శైలజా కిరణ్ పేరిట అక్రమంగా బదిలీ చేశారు. అందుకే ఈ కేసు ఏపీకి సంబంధించినదని న్యాయ నిపుణులు చెప్పారు. దాంతోనే ఏపీ సీఐడీకి ఫిర్యాదు చేశాం. మాకు జరిగిన అన్యాయంపై సీఐడీని సంప్రదించాం. సీఐడీ, న్యాయస్థానం మా ఆవేదనను గుర్తించి న్యాయం చేస్తాయని విశ్వసిస్తున్నాం.

శైలజ పేరిట అప్పుడు 100 షేర్లే..

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజా కిరణ్ పేరిట 2017 వరకు 100 షేర్లే ఉన్నాయి. జీజే రెడ్డి పేరిట మాత్రం 288 షేర్లు ఉన్నాయి. జీజే రెడ్డి షేర్లను అక్రమంగా బదిలీ చేసిన తరువాత ప్రస్తుతం శైలజా కిరణ్ పేరిట 388 షేర్లు ఉన్నాయి.

జీజే రెడ్డి తప్ప మిగిలిన షేర్ హోల్డర్లంతా రామోజీ కుటుంబ సభ్యులే

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో ఆరుగురు షేర్ హోల్డర్లే ఉన్నారు. ఎందుకంటే ఆ సంస్థ ఏనాడూ పబ్లిక్ ఇష్యూ జారీ చేయలేదు. ఉన్న ఆరుగురు షేర్ హోల్డర్లలో అయిదుగురు రామోజీరావు కుటుంబ సభ్యులే. జీజే రెడ్డి ఒక్కరే బయట వ్యక్తి. ఆయన పేరిట ఉన్న షేర్లను కూడా అక్రమంగా శైలజా కిరణ్ పేరిట బదిలీ చేశారు. ఆ అక్రమ వ్యవహారానికి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లోని ఇతర షేర్ హోల్డర్లు.. అంటే రామోజీ కుటుంబ సభ్యులు సహకరించారు. రామోజీరావు పెద్ద గూడుపుఠాణికి పాల్పడ్డారు.

'స్కిల్' కేసులో బెయిల్ పిటిషన్ విచారణ 19కి వాయిదా

- చంద్రబాబు న్యాయవాదుల అభ్యర్థన మేరకు హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌లో తదుపరి విచారణ గురువారానికి వాయిదా పడింది. చంద్రబాబు తరఫు న్యాయవాదుల అభ్యర్థన మేరకు హైకోర్టు విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ ఏసీబీ కోర్టు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా, చంద్రబాబు తరఫు న్యాయవాదులు వాయిదా వేయాలని కోరారు. దీంతో న్యాయమూర్తి తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'కిలారు' డుమ్మా

- రెండో రోజు విచారణకు లోకేశ్ ఆదేశాలతోనే గైర్హాజరు!

సాక్షి, అమరావతి: ఊహించిందే జరుగుతోంది! స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు కుట్రలకు తెర తీసిన టీడీపీ కీలక సాక్షులను ప్రభావితం చేస్తోంది. ఈ స్కామ్‌లో అక్రమ నిధుల తరలింపులో కీలక పాత్రధారిగా ఉన్న లోకేశ్ సన్నిహితుడు కిలారు రాజేశ్ సీఐడీ దర్యాప్తునకు డుమ్మా కొట్టడమే దీనికి నిదర్శనం. తాడేపల్లిలో సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కార్యాలయంలో సోమవారం విచారణకు హాజరైన ఆయన రెండో రోజు మంగళవారం మాత్రం ముఖం చాటేశారు. సిట్ అధికారులు తనను ఎన్నిసార్లు పిలిచినా విచారణకు వస్తానంటూ నమ్మబలికిన కిలారు రాజేశ్ రెండో రోజు మాత్రం గైర్హాజరయ్యాడు. తాను ప్రస్తుతం విచారణకు రాలేనని, దసరా తరువాత వస్తానంటూ ఈ మెయిల్ పంపడం గమనార్హం. స్కిల్ స్కామ్‌లో నిధుల మళ్లింపుపై సిట్ కీలక ఆధారాలను సేకరించినట్లు గుర్తించిన లోకేశ్, ఆయన న్యాయ నిపుణుల బృందం కిలారు రాజేశ్ వరుసగా రెండో రోజు విచారణకు హాజరైతే మరిన్ని ఆధారాలు వెలుగు చూడటం ఖాయమని ఆందోళన చెందింది. సిట్ అధికారులు అడిగిన పత్రాలను ఇవ్వొద్దని, రెండో రోజు విచారణకు హాజరు కావద్దని అతడిని లోకేశ్ ఆదేశించినట్లు సమాచారం. కేసు విచారణకు ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించవద్దని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని లోకేష్ హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో దసరా తరువాత మాత్రమే విచారణకు వస్తానంటూ మెయిల్ పంపిన కిలారు మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు.

మాపై సీఐడీ కేసు కొట్టేయండి

- హైకోర్టులో రామోజీ, శైలజా కిరణ్ పిటిషన్లు

సాక్షి, అమరావతి: తమపై సీఐడీ తాజాగా నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ ఈనాడు అధినేత చెరుకూరి రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఎండీ చెరుకూరి శైలజా కిరణ్ హైకోర్టును ఆశ్రయించారు. రామోజీరావు తమను తుపాకీతో బెదిరించి, సంతకాలు ఫోర్జరీ చేసి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో తమకున్న షేర్లను ఆయన కోడలు, మార్గదర్శి ఎండీ అయిన శైలజాకిరణ్ పేరు మీద అక్రమంగా బదలాయించుకున్నారని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌లో వాటాదారు అయిన జీజే రెడ్డి కుమారుడు యూరి రెడ్డి సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. యూరి రెడ్డి ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు ఉండటంతో సీఐడీ అధికారులు రామోజీరావు ఏ1గా, శైలజా కిరణ్ ఏ2గా కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలంటూ రామోజీరావు, శైలజా కిరణ్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ టీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం విచారణ జరిపారు. రామోజీరావు, శైలజా కిరణ్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, నాగముత్తు, హైకోర్టు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు హాజరయ్యారు. సీఐడీ తరఫున స్పెషల్ పీపీ వై. శివకల్పనారెడ్డి వాదనలు వినిపించారు. ఈ వ్యాజ్యాలు మొదటిసారి విచారణకు వస్తున్నందున, కేసు పూర్తి వివరాలను తెలుసుకుని, వాటిని కోర్టు ముందుంచాల్సి ఉందని, అందువల్ల విచారణను గురువారానికి వాయిదా వేయాలని శివకల్పనారెడ్డి న్యాయమూర్తిని కోరారు. లూథ్రా



జోక్యం చేసుకుంటూ.. ఈలోపు పిటిషనర్లను అరెస్టు చేసే అవకాశం ఉందని అన్నారు. ఈ లోపు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వాలని పోసాని వెంకటేశ్వర్లు కోరారు. ఇందుకు న్యాయమూర్తి స్పందిస్తూ.. ఈ లోపు పిటిషనర్ల విషయంలో కఠిన చర్యలేవైనా తీసుకోబోతున్నారా అంటూ శివకల్పనారెడ్డిని ప్రశ్నించారు. ఈలోపు ఎలాంటి కోర్టు ఉత్తర్వులు అవసరం లేదని, పూర్తి వివరాలు కోర్టు ముందుంచుతామని శివకల్పనారెడ్డి చెప్పారు.

రేపటి వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోబోమంటే విచారణను రేపటికి వాయిదా వేస్తానని న్యాయమూర్తి తెలిపారు. దీంతో రేపటి వరకు పిటిషనర్లపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోబోమని శివకల్పనారెడ్డి చెప్పారు. దీనిని రికార్డ్ చేసిన న్యాయమూర్తి తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

రాష్ట్రీయం

సార్లూ... సిద్ధమే!



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల విధులకు ఉపాధ్యాయులను ఎంపిక చేసే ప్రక్రియ మొదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 80 వేల మందిని పోలింగ్ కోసం నియమించాలని అధికారులు నిర్ణయించారు. ప్రతీ జిల్లాలోనూ కలెక్టర్‌కు ఎన్నికల కమిషన్ ఈ బాధ్యలను అప్పగించింది. జిల్లా విద్యాశాఖాధికారితో సమన్వయం చేసుకుని అవసరమైన, అర్హత గల వారిని విధుల్లో తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలో గత రికార్డును క్షుణ్ణంగా పరిశీలించాలని, గతంలో ఫిర్యాదులొచ్చిన వారిని, సర్వీస్ రికార్డు సరిగా లేని వారిని పక్కన బెట్టాలని కమిషన్ సూచించింది. జిల్లా కలెక్టర్లు ఎంపిక చేసిన టీచర్ల జాబితాను ఎన్నికల కమిషన్ మరోసారి పరిశీలిస్తుందని అధికారులు చెబుతున్నారు. అనారోగ్యంతో ఉన్నవాళ్లు, దివ్యాంగులు, ప్రత్యేక సహేతుక కారణాలు తెలిపిన వారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని జిల్లా కలెక్టర్లకు అందిన మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

మూడు దశల్లో శిక్షణ..

ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు మూడు దశల్లో శిక్షణ ఇస్తారు. ప్రధానంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపైనే ఇది ఉంటుంది. తొలి దశలో వివిధ శాఖల అధికారులతో పాటు టీచర్లను ఎంపిక చేస్తారు. జిల్లాకు పది మందితో కూడి ఉపాధ్యాయుల బృందం ఈ శిక్షణకు హాజరవుతుంది. వారు జిల్లా స్థాయిలో మరి కొంతమందికి ఆ తర్వాత శిక్షణ ఇస్తారు. నియోజకవర్గం స్థాయిలో టీచర్లకు ఎన్నికల నిర్వాహణపై శిక్షణ నిర్వహించాల్సి ఉంటుంది. చాలా జిల్లాల్లో ఇప్పటికే తొలి దశ శిక్షణ మొదలైంది. ప్రతీ బూత్‌కు నలుగురు చొప్పున టీచర్లను ఎంపిక చేస్తున్నారు. హెచ్‌ఎం స్థాయిలో వారికి ప్రిసైడింగ్ అధికారిగా బాధ్యతలు అప్పగిస్తారు. స్కూల్ అసిస్టెంట్లకు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారిగా, సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ) పోలింగ్ అధికారులుగా విధుల్లో ఉంటారు. కీలకమైన సమయాల్లో తీసుకోవాల్సిన నిర్ణయాలు, ఇందుకు సంబంధించిన నిబంధనలను శిక్షణ సమయంలో వివరిస్తున్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాల్లో వివిధ శాఖలతో సమన్వయం గురించి కూడా తెలియజేస్తున్నారు. వీరితో పాటు రూట్ అధికారులుగా మరి కొంతమంది ఉపాధ్యాయులను వినియోగించుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

పోలింగ్ విధుల కోసం టీచర్ల వేట

- కలెక్టర్లకు నిర్ణయాధికారం
- రికార్డు చూసి ఎంపిక చేయాలని ఆదేశాలు.. మూడు దశల్లో శిక్షణ...
- ప్రిసైడింగ్ అధికారులుగా హెచ్‌ఎంలు
- డ్యూటీలపై స్పష్టమైన మార్గదర్శకాలు
- రెండు రోజుల ముందే పోలింగ్ కేంద్రాలకు..

మమ్మల్ని వదిలేయండి ప్లీజ్..

ఎన్నికల విధుల నుంచి తప్పించుకునేందుకు కొంత మంది టీచర్లు అన్ని అవకాశాలను వాడుకుంటున్నారు. ప్రధానంగా పలు అనారోగ్య సమస్యలను తెరపైకి తెస్తున్నారు. విధులకు ఎంపిక చేసినవారు వివిధ రకాల వైద్య ధ్రువ పత్రాలను జిల్లా అధికారులకు సమర్పిస్తున్నారు. ఈసారికి విధుల నుంచి తప్పించాలని వేడుకుంటున్నారు. సాధారణంగా అన్ని దశల శిక్షణ పూర్తయిన తర్వాత ఎన్నికల విధుల కోసం జిల్లా వెలుపలకు టీచర్లను పంపుతారు. సొంత నియోజకవర్గంలో విధులు నిర్వర్తించకుండా జాగ్రత్త పడతారు. ఈ కారణంగా ఇతర ప్రాంతాలకు వెళ్లి పనిచేయడానికి కొంతమంది ఇష్ట పడటం లేదు. విధుల నుంచి తప్పించుకునేందుకు కొంతమంది ఉన్నతాధికారుల నుంచి, ఉపాధ్యాయ సంఘాల నుంచి ఒత్తిడి కూడా తెస్తున్నారు.

ఆర్ట్స్ కోర్సుల్లో ఇంజనీరింగ్ విద్యార్థులు

'సాక్షి'తో టీఎస్–సీపీజీఈటీ కన్వీనర్ పాండురంగారెడ్డి



ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీలో అధిక సంఖ్యలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు ఎంఏ కోర్సుల్లో ప్రవేశం పొందినట్లు టీఎస్–సీపీజీఈటీ కన్వీనర్ పాండురంగారెడ్డి 'సాక్షి'కి తెలిపారు. పీజీ ప్రవేశ పరీక్షలకు గతంలో ఎన్నడూలేని విధంగా 418 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 234 మందికి సీట్లు కేటాయించామని, మొదటి కౌన్సెలింగ్‌లో 128 మంది విద్యార్థులు ఆర్ట్స్ ఎంఏ కోర్సుల్లో చేరినట్లు ఆయన వెల్లడించారు. కాగా, టీఎస్ సీపీజీఈటీ కౌన్సెలింగ్‌లో భాగంగా ఈనెల 23న సీట్లు సాధించిన విద్యార్థుల రెండో జాబితాను విడుదల చేయనున్నట్లు పాండురంగారెడ్డి తెలిపారు. రెండో జాబితాలో సీటు లభించిన విద్యార్థికి మొదటి జాబితాలో సాధించిన సీటు రద్దు అవుతుందన్నారు. రాష్ట్రంలోని 8 వర్సిటీల్లోని 50 వేల సీట్లకు మొదటి విడతలో 10 వేల భర్తీ అయినట్లు, రెండో విడతకు 40 వేల సీట్లకు గాను 20 వేలమంది అభ్యర్థులు ఆప్షన్స్ ఇవ్వగా అందులో 16 వేల మందికి రెండో విడతలో సీట్లను కేటాయించనున్నట్లు వివరించారు. 23న సీపీపీ, దివ్యాంగుల అభ్యర్థుల జాబితా, ఎన్‌సీసీ కోటాలో సీటు సాధించిన విద్యార్థుల జాబితాను ఈనెల చివర్లో వెల్లడిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల్లో బీఈడీ, బీపీఈడీ కోర్సుల సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల కానందున ఎంఈడీ, ఎంపీఈడీ ప్రవేశాలకు వచ్చే నెలలో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పాండురంగారెడ్డి తెలిపారు.

ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం

- అయితే తుది తీర్పునకు లోబడి నియామకాలు..
- కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ పిటిషన్‌పై హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే తుది తీర్పునకు లోబడి మాత్రమే నియామకాలు ఉంటాయని చెప్పింది. జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, వృత్తి విద్యా కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరణకు అనుమతిస్తూ 2016, ఫిబ్రవరి 26న ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 16ను సవాల్ చేస్తూ వి.ప్రవీణ్‌కుమార్ సహా 15 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ చర్య ఏకపక్షమని, చట్టవిరుద్ధమని అన్నారు. ఈ నిర్ణయం కారణంగా అక్రమ మార్గంలో కొందరు శాశ్వత ఉద్యోగులుగా అర్హత పొందే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలో దాదాపు 6,200 పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. అందులో 5,540 జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు, ఒకేషనల్ కాలేజీల్లోని లెక్చరర్ పోస్టులను సరైన ఎంపిక ప్రక్రియ నిర్వహించకుండా క్రమబద్ధీకరించారని తెలిపారు. ఇది రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధమని వాదించారు. అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. వివిధ ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్ల సేవలను ప్రభుత్వం వినియోగించుకుంటోందని చెప్పారు. వారి దీర్ఘకాల సేవలను గుర్తించిన ప్రభుత్వం జీవో నంబర్ 16 ద్వారా క్రమబద్ధీకరించింది. వారి సర్వీసులను క్రమబద్ధీకరించే చట్టబద్ధమైన హక్కు ప్రభుత్వానికి ఉందని ఆయన తేల్చిచెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. చట్టబద్ధమైన నిబంధనలను సవరించకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం ద్వారా క్రమబద్ధీకరణ ప్రక్రియను అడ్డుకోలేమని స్పష్టం చేసింది. 16 మంది పిటిషనర్ల కోసం కొనసాగుతున్న ప్రక్రియను నిలిపివేయలేమంది. ఈ అంశంపై కౌంటర్ దాఖలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి మూడు వారాల సమయం ఇస్తూ, విచారణను వాయిదా వేసింది.

స్కాలర్‌షిప్‌ల స్కాంలో ఒకరికి మూడేళ్ల జైలు

- ముగ్గురిని నిర్దోషులుగా ప్రకటిస్తూ హైకోర్టు తీర్పు

సాక్షి, హైదరాబాద్: 2003లో నమోదైన స్కాలర్‌షిప్‌ల స్కాంలో కేవీఎల్ జయసింహను హైకోర్టు దోషిగా నిర్ధారించి మూడేళ్ల జైలు శిక్ష విధించింది. మిగతా ముగ్గురిని నిర్దోషులుగా ప్రకటిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. ఎస్సీ విద్యార్థులు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో చదవడానికి సహాయం చేసేందుకు ఉద్దేశించిన పథకంలో కాలేజీలు లేకున్నా.. ఉన్నట్లుగా సృష్టించి రూ.22 కోట్లకుపైగా స్కాలర్‌షిప్ స్వాహా చేసినట్లు 2003లో కేసు నమోదైంది. గతంలో ఈ కేసులో కొందరికి జైలు శిక్ష విధిస్తూ కొందరిని నిర్దోషులుగా ప్రకటిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పునిచ్చింది. జైలు శిక్ష పడిన జయసింహ, సంతోష్, వెంకటేశ్వర్‌రావు, మోత్యానాయక్ ఈ తీర్పును సవాల్‌చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీళ్లపై జస్టిస్ సురేందర్ విచారణ చేపట్టి మంగళవారం తీర్పు వెలువరించారు. సంతోష్, వెంకటేశ్వర్‌రావు, మోత్యానాయక్‌లను నిర్దోషులుగా పేర్కొన్నారు. జయసింహకు కింది కోర్టు ఖరారు చేసిన శిక్షను సవరిస్తూ.. ఫోర్జరీ, మోసం, ఒకరికి బదులు మరొకరిని చూపడం కింద మూడేళ్ల చొప్పున శిక్ష విధించారు. అన్ని శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని, జైల్లో ఉన్న కాలాన్ని మినహాయించాలని చెప్పారు. కాగా, స్కాం దర్యాప్తు తీరును కూడా న్యాయమూర్తి తప్పుబట్టారు. కాలేజీలకు గుర్తింపు లేదంటూ ఉస్మానియా నుంచి తీసుకున్న వివరాలు మినహా, ఇంటర్మీడియెట్ బోర్డు తదితర సంస్థల వద్ద గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న కాలేజీల వివరాలను సేకరించకపోవడం సరికాదన్నారు. ఊహాజనిత అంశాల ఆధారంగా దర్యాప్తు జరిగినట్లు కనిపిస్తోందని ఆక్షేపించారు. విచారణ సమయంలో సమర్పించిన పత్రాలకు పొంతన లేనందున మిగతా వారిని నిర్దోషులుగా ప్రకటించినట్లు చెప్పారు. ఇదిలాఉండగా, పోలీసులు పరిధి దాటి చూడలేకపోయారని, అందుకే చార్జిషీట్‌లో 2002–03లో అధికార పార్టీకి చెందిన ఎవరి పేరూ లేదన్న వాదన వినిపించింది.

మహిళలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయొద్దు

స్త్రీశక్తి అవార్డ్స్ ప్రదాన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై



'50 ఇన్‌స్పైరింగ్ ఉమెన్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్. చిత్రంలో కీర్తి రెడ్డి





స్త్రీ రత్న పురస్కారాలను అందుకుంటున్న పద్మశ్రీ మంజుల అనగాని, ఇంటాక్ కన్వీనర్ అనురాధా రెడ్డి

హఫీజ్‌పేట్: మహిళలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయొద్దని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. మంగళవారం సాయంత్రం తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ(టీసీఈఐ) ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన స్త్రీశక్తి అవార్డ్స్–2023 ప్రదాన కార్యక్రమానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో రాణించిన మహిళలకు స్త్రీశక్తి, స్త్రీరత్న, స్త్రీమూర్తి పేరిట మూడు విభాగాలలో అవార్డులు అందజేశారు. గవర్నర్ మాట్లాడుతూ అవకాశాలు కల్పిస్తే వాటిని అందిపుచ్చుకుని ముందుకు 2 సాగే సత్తా మహిళల్లో ఉంటుందన్నారు. మహిళలు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వివిధ ఆరోగ్య సమస్యలపై కూడా మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జీవనశైలిలో చిన్నపాటి మార్పులు చేసుకోవడం ద్వారా ఆరోగ్యమైన జీవితాన్ని గడపవచ్చని, సంతోషం పొందే విషయంలో రాజీపడవద్దని తమిళిసై పేర్కొన్నారు. అనంతరం తెలంగాణకు చెందిన 50 మంది మహిళల విజయగాథలతో 50 ఇన్‌స్పైరింగ్ ఉమెన్ పేరిట రచయిత అమర్ రమేష్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పవన్ మోటార్ డైరెక్టర్ కోమటిరెడ్డి కీర్తిరెడ్డి, ఫౌండేషన్ ఫర్ ఫూచరిస్టిక్ సిటీస్ అధ్యక్షురాలు కరుణ గోపాల్, స్త్రీ శక్తి అవార్డ్స్ కన్వీనర్ విశాలారెడ్డి, టీసీఈఐ అధ్యక్షులు బలరాం, వ్యవస్థాపక అధ్యక్షులు సూరజ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ

మన చుట్టూ మనకు తెలియకుండానే ఎంతో మంది రకరకాల బాధలకు లోనవుతుంటారు. వారిలో ముఖ్యంగా వృద్ధులు, వికలాంగుల సమస్యలకు సరైన పరిష్కారం తెలియక ఇబ్బందులు పడుతుంటారు. వారి మానాన వారిని అలాగే వదిలేయడం కన్నా పరిష్కారాన్ని కనుగొంటాను అనుకున్నాడు. తనదైన మార్గంలో ప్రయత్నించాడు. విజయం సాధించాడు. సత్కారాలను పొందుతున్నాడు హైదరాబాద్ వాసి హేమేష్ చదలవాడ.



తల్లి సంధ్యతో హేమేష్ చదలవాడ

అమ్మమ్మలకు అండగా!

దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో సేవలు అందించిన 21 ఏళ్ల లోపు 20 మంది యువ సాధకులను ఢిల్లీలో మొన్న జరిగిన 'అన్‌స్టాపబుల్ 21' వేదికగా సత్కరించారు. హ్యూమన్ స్టడీస్, సైన్స్, క్రీడలు, ఫైన్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్, సోషల్ ఇంపాక్ట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనే ఏడు రంగాలలో ప్రతిభావంతులైన యువతకు ఈ సత్కారాన్ని అందజేశారు. వారిలో హైదరాబాద్‌కు చెందిన 16 ఏళ్ల హేమేష్ చదలవాడ ఎలక్ట్రానిక్స్ రంగంలో కనబరిచిన ప్రతిభకు గుర్తింపు పొందాడు.

వృద్ధులకు సహాయం..

హేమేష్ పన్నెండేళ్ల వయసు నుంచి ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్ రంగంలో గణనీయమైన ప్రతిభను చూపుతున్నాడు. అల్జైమర్స్ వ్యాధితో బాధ పడుతున్న అమ్మమ్మను చూసి ఆమెకు ఏదైనా సాయం చేయాలనుకున్నాడు. తన ఆలోచనల గురించి హేమేష్ చెబుతూ 'నడిచేటప్పుడు అమ్మమ్మ అడుగులు తడబడుతుండేవి. మతిమరపు ఉండేది. ఆమెకు తన మీద తనకు కంట్రోల్ ఉండేది కాదు. కొన్నిసార్లు అర్ధరాత్రి మంచంపై నుంచి లేచి ఎటో వెళ్లిపోయేది. దీంతో ఆమెను కనిపెట్టి ఉండటం కష్టమయ్యేది. అమ్మమ్మకు, ఆమెను చూసుకునే మాకూ ఇదో సవాల్‌గా ఉండేది. కొన్ని అందుబాటులో ఉన్న డివైజ్‌లను ప్రయత్నించి చూశాం. కానీ, ఏ మాత్రం సంతృప్తిగా అనిపించలేదు. అమ్మమ్మకు సాయపడే డివైజ్‌ను నేనే సొంతంగా తయారుచేయాలనుకున్నాను' అని తనలో రూపుదిద్దుకున్న ఆలోచనను వివరిస్తాడు. హేమేష్ కృషి, పట్టుదల, అంకితభావానికి అతని తల్లిదండ్రులు కిశోర్, సంధ్యలు ప్రోత్సాహం అందించారు.



హేమేష్ తయారుచేసిన డివైజ్

> మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతో మందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను.
> – హేమేష్

పరికరం ఎలా పనిచేస్తుందంటే..

ఈ పరికరం వాచ్‌లాగా మణికట్టుకూ కట్టుకోవచ్చు. బ్యాడ్జ్‌గానూ ధరించవచ్చు. రోగి నడక, భంగిమ, శరీర ఉష్ణోగ్రత, నాడిని పర్యవేక్షిస్తుంది. నీళ్లు జారిపడుతుండే శబ్దాన్ని కూడా గుర్తించగలదు. మనిషి దూరంగా తిరుగుతున్నప్పుడు లేదా పడిపోవడం వంటి ప్రమాదంలో ఉన్నప్పుడు వెంటనే తెలియజేస్తుంది. ఇంకా అలారంలో 'పిల్‌బాక్స్' ఫీచర్ కూడా ఉంటుంది. ఇది రోగులు వారి మందులు తీసుకునే సమయం వచ్చినప్పుడు హెచ్చరికలను పంపుతుంది. 'ఈ డివైజ్ మా అమ్మమ్మ కోసం తయారుచేసినప్పుడు ఇంటర్నెట్ సరైన మార్గం చూపింది. అయితే, ఈ పరికరం పూర్తయ్యే సరికి అమ్మమ్మ చనిపోయారు' అని బాధపడే హేమేష్ డివైజ్ చేతిలో పట్టుకొని 'మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతోమందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను' అని చెబుతున్న హేమేష్ 12వ తరగతి చదువుతున్నాడు. తన తదుపరి ప్రాజెక్ట్స్‌తో ఎలక్ట్రానిక్స్, రోబోటిక్ రంగంలో మరిన్ని అడుగులు వేస్తున్నట్టుగా వివరించాడు.

2021లో ప్రధానమంత్రి చేతుల మీదుగా రాష్ట్రీయ బాల పురస్కారాన్ని అందుకున్నాడు. పేరున్న కంపెనీల నుంచి గ్రాంట్‌లను పొందాడు.

– నిర్మలారెడ్డి

మణిపూర్ ఒక మంచి వార్తను వినిపించింది. ఆ రాష్ట్రానికి చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్ తీసిన 'ఆంద్రో డ్రీమ్స్' ముంబైలో జరుగుతున్న చలన చిత్రోత్సవంలో బెస్ట్ డాక్యుమెంటరీగా ఎంపికైంది. మణిపూర్‌లోని మారుమూల గ్రామం 'ఆంద్రో'లో ఆడపిల్లల ఫుట్‌బాల్ క్లబ్‌ను 30 ఏళ్లుగా పరిస్థితులకు ఎదురీది నడుపుతున్న 'లైబి' అనే మహిళ పోరాటాన్ని ఈ డాక్యుమెంటరీ రికార్డు చేసింది. ఆడపిల్లల క్రీడా స్వేచ్ఛను ఎన్ని అడ్డంకులొచ్చినా కొనసాగనివ్వాలనే సందేశం ఇచ్చే ఈ డాక్యుమెంటరీ దేశ, విదేశాల్లో ప్రశంసలు పొందుతోంది.

అడ్డంకులను దూరంగా తన్ని...




దర్శకురాలు: మీనా లాంగ్‌జామ్

న్యూస్‌మేకర్

అంతా చేసి ఎనిమిది వేల మంది జనాభా మించని ఊరు ఆంద్రో. మణిపూర్ తూర్పు ఇంఫాల్ జిల్లాలో మారుమూల ఉంటుంది అది. అక్కడి ఆడపిల్లలు ఫుట్‌బాల్ ఆడితే ఏంటి... ఆడకపోతే ఏంటి? కాని 60 ఏళ్ల లైబి మాత్రం- ఆడాల్సిందే అంటోంది. ఆమె గత ముప్పై ఏళ్లుగా 'ఆంద్రో మహిళా మండల్ అసోసియేషన్- ఫుట్‌బాల్ క్లబ్' (అమ్మ- ఎఫ్‌సీ) నడుపుతోంది. ఈ క్లబ్‌కు నిధులు లేవు. బిల్డింగ్ లేదు. ఊళ్లో ప్రోత్సాహం లేదూ, ఏమీ లేదు. కాని లైబి మాత్రం అంతా తానై క్లబ్‌ను నడుపుతోంది. ఈ మధ్యే ఆమె ఒక పూరి పాక నిర్మించి దానినే క్లబ్ బిల్డింగ్‌గా ప్రారంభించుకుంది.

'అమ్మాయిలు కేవలం వంటకు, ఇంటి పనికి అంకితమై పోకూడదు. చదువుకోవాలి. ఆడాలి. ధైర్యంగా భవిష్యత్తును నిర్మించుకోవాలి. మా ప్రాంతంలో పురుషులదే సర్వాధికారం. ఇంటి పెద్ద, తెగ పెద్ద ఎంత చెప్తే అంత. వారి దృష్టిలో ఆడవాళ్ల గురించి చింతించాల్సింది ఏమీ ఉండదు. అమ్మాయిలు ఆడతామన్నా ఒప్పుకోరు. నా పోరాటం వల్లే ఇవాళ మా ఊరి నుంచి జాతీయ స్థాయిలో అమ్మాయిలు ఫుట్‌బాల్ ఆడుతున్నారు' అంటుంది లైబి.

ఈమె పోరాటం ప్రపంచానికి చెప్పదగ్గది అనిపించింది మణిపూర్‌కే చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్‌కు. అలా తయారైన డాక్యుమెంటరీనే 'ఆంద్రో డ్రీమ్స్'.



ఆంద్రో డ్రీమ్స్ పోస్టర్



తన ఫుట్‌బాల్ క్లబ్ పూరి పాక ముందు లైబి

ఇద్దరి కథ

ప్రస్తుతం ముంబైలో 'జాగరణ్ ఫిల్మ్ ఫెస్టివల్' అట్టహాసంగా జరుగుతోంది. ఇందులో 'ఆంద్రో డ్రీమ్స్' బెస్ట్ డాక్యుమెంటరీగా నిలిచింది. ఇప్పటికే కేరళ, కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు ఎంపికైన ఈ డాక్యుమెంటరీ ముంబైలో విమర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. 'దీనికి కారణం ఆంద్రోలో అమ్మ క్లబ్‌ను నడుపుతున్న లైబి పోరాటాన్ని, ఆ క్లబ్‌లో గొప్ప ఫుట్‌బాల్ ప్లేయర్‌గా ఉంటూ మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలనుకునే నిర్మల అనే అమ్మాయి ఆకాంక్షలని నేను చూపించడమే. ఒక రకంగా చాదస్త వ్యవస్థతో రెండు తరాల స్త్రీల పోరాటం ఈ డాక్యుమెంటరీ' అని తెలిపింది మీనా లాంగ్‌జామ్.

మణిపూర్ వెలుతురు

నిజానికి మే 3వ తేదీ నుంచి మణిపూర్ వేరే కారణాల రీత్యా వార్తల్లో ఉంది. కాని మణిపూర్‌ను అభిమానించేవారికి ఇప్పుడు ఈ డాక్యుమెంటరీ సాధిస్తున్న విజయాలు సంతోషాన్ని ఇస్తున్నాయి. 'నా డాక్యుమెంటరీ విజయం మా ప్రాంతంలో గతాన్ని మర్చిపోయి కొత్త జీవితం మొదలుపెట్టే ఉత్సాహాన్ని ఇస్తే అంతే చాలు' అంది మీనా లాంగ్‌జామ్. మణిపూర్ యూనివర్సిటీలో కల్చరల్ స్టడీస్‌లో ప్రొఫెసర్‌గా ఉన్న మీనా పాఠాలు చెప్పడంతో పాటు డాక్యుమెంటరీలు కూడా తీస్తుంది. 2015లో ఆమె మణిపూర్‌లో ఫస్ట్ మహిళా ఆటోడ్రైవర్‌గా ఉన్న లైబీ ఓయినమ్ మీద డాక్యుమెంటరీ తీస్తే దానికి చాలా పేరొచ్చింది. ఆ తర్వాత 'అచౌబీ ఇన్ లవ్' పేరుతో పోలో ఆటకు అనువైన స్థానిక జాతి అశ్వాలపై డాక్యుమెంటరీ తీస్తే దానికీ పేరొచ్చింది. ఇప్పుడు 'ఆంద్రో డ్రీమ్స్' మణిపూర్ ఘనతను చాటుతోంది.

బాలికలు, యువతులు క్రీడల్లో ఎంతో రాణిస్తున్నా ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో ఆంక్షలు ఉండనే ఉంటాయి. అలాంటి ప్రతి చోట అమ్మాయిలను ప్రోత్సహించే లైబి లాంటి యోధురాళ్లు, వారి గెలుపు గాథలను లోకానికి తెలిపే మీనా లాంటి వాళ్లు ఉండాలని కోరుకుందాం.

• ఆటో అన్సారీ

లైఫ్ గేర్ మార్చింది



ఓ యువకుడు యాచకుడి వేషంలో, కేజీల మొత్తంలో కరెన్సీ నాణేలను తీసుకుని ఐఫోన్ కొనడానికి వెళ్లిన వార్త ఇటీవల సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. మంచి వయసు, ఓపిక ఉన్న వారే ఇలా చేస్తుంటే... ఓపిక లేకపోయినా సమాజంలో గౌరవంగా బతికేందుకు బురఖా వేసుకుని ఆటో నడుపుతోంది నజ్మా అన్సారీ. అయినా ఇతరుల ముందు చేయి చాచే కంటే.. కష్టపడడమే గౌరవం అనుకుంది. 'గేర్లు మార్చేయండి చాలు గౌరంగా బతకవచ్చు' అని చెబుతూ ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తోంది.



నజ్మా అన్సారీ వయసు 45. ఉత్తరప్రదేశ్, మొరాదాబాద్ నగరంలోని కట్‌ఘర్‌లో ఆమె నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. 2010లో భర్త మరణించడంతో ఇంటి భారం ఆమె మీద పడింది. అప్పటిదాక గృహిణిగా ఉన్న నజ్మాకు తన కొడుకు, కూతుర్ని ఎలా పెంచాలో అర్థం కాలేదు. భర్త నడిపిన టీషాపును అద్దె కట్టలేక వదిలేసింది. ఇంట్లోనే టీ తయారు చేసి విక్రయించింది. అలా పిల్లల అవసరాలు చూసుకుంటూ ఉండగానే భర్త ఇన్సురెన్స్ డబ్బులు రూ.4.35 లక్షలు వచ్చాయి. మూడు లక్షల రూపాయలతో 2015లో కూతురికి పెళ్లి చేసింది.

ఆదాయం సరిపోక..

టీ స్టాల్ నడుపుతూ కుటుంబాన్ని లాక్కొస్తున్న నజ్మాకు డబ్బులు సరిపోయేవి కావు. కూతురి పెళ్లి తరువాత ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో భర్త ఇన్సురెన్స్ డబ్బుల్లో మిగిలిన మొత్తంతో ఎలక్ట్రిక్ ఆటో కొనుక్కుంది. ఇంటి పనులన్నీ పూర్తిచేసి ఆటో తోలుతూ సంపాదిస్తోంది.

అర్ధరాత్రనే భయం లేదు

నజ్మా మూడు షిఫ్టుల్లో ఆటో నడుపుతోంది. బురఖా ధరించి ఉదయం తొమ్మిదిగంటలకు ఆటో స్టార్ట్ చేస్తుంది. ఎండ వేడికి బురఖాలో ఎక్కువ సమయం ఉండలేక మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వచ్చేస్తుంది. తిరిగి సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది వరకు ఆటో నడుపుతోంది. మళ్లీ రాత్రి తొమ్మిది నుంచి రెండుగంటల వరకు విరామం లేకుండా నడుపుతుంది. ఇలా మూడు షిఫ్టుల్లో మొత్తం మీద రోజుకి ఐదు నుంచి ఆరు వందల వరకు సంపాదిస్తోంది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు నజ్మా ధైర్యాన్ని మెచ్చుకుని ప్రోత్సహిస్తున్నారు. అయితే నజ్మాను చూసిన ఓ హిందూ మహిళ కూడా ఆటో నడపడం మొదలు పెట్టింది. దీంతో ఆ మహిళ ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగు పడ్డాయి. ఇలా ఇతరులకు స్ఫూర్తి నిలుస్తూనే, తన కష్టార్జితంతో హజ్ యాత్రకు వెళ్తానని చెబుతోంది నజ్మా.

అడుక్కునే కంటే...

"పేదరికం ఉందని అక్కడా ఇక్కడా చేయి చాచకుండా కష్టపడి ఏ పనైనా చేసి గౌరవంగా బతకవచ్చు. ఆటో గేర్లు మారుస్తూ, ప్రయాణికులను గమ్యాలకు చేరుస్తున్నాను. ఇక మహిళా డ్రైవర్‌గా నాకు రాత్రి సమయాల్లో కూడా ఎటువంటి ఇబ్బంది ఎదురు కాలేదు. ముఖ్యమంత్రి యోగి ప్రభుత్వం వచ్చాక అర్ధరాత్రి బయటకు రావడానికి కూడా భయం వేయడం లేదు. ప్రభుత్వ అధికార యంత్రాంగం మాకు రక్షణ కల్పిస్తోంది. పరిస్థితులు మరింత దిగజారినప్పుడు అల్లా కాపాడతాడు" అని నజ్మా అన్సారీ ధైర్యంగా చెబుతోంది.

యూత్ పల్స్

ఢీ అంటే ఢీ
ఆర్ట్ ఆఫ్ డీఇన్‌ఫ్లుయెన్సింగ్

'ఇప్పటి వరకు ఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూశారు. ఇక డీఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూసే టైమ్ వచ్చింది'... ఇది తెలుగు సినిమాలో మాస్ డైలాగ్ కాదు. సోషల్ మీడియాలో ఒక కుర్రాడు పెట్టిన కామెంట్.

సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్‌ల హవా నడుస్తున్న కాలం ఇది. కస్టమర్‌లు ఏది కొనాలో, ఏ షో చూడాలో, ఎలాంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలో చెబుతున్నారు. ఇప్పుడు ఈ ట్రెండ్‌కు అడ్డుపడే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్ యువతరం నుంచే వచ్చి బలపడుతోంది. ట్రెడిషనల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఒక ప్రొడక్ట్‌ను హైప్ చేస్తే డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఆ హైప్‌ను ఛాలెంజ్ చేస్తున్నారు....



మార్కెటింగ్ డాటా అండ్ ఎనలిటిక్స్ కంపెనీ కంతార్ స్టడీ రిపోర్ట్ ప్రకారం వినియోగదారులపై ఇన్‌ఫ్లుయెన్సర్‌ల సిఫారసుల ప్రభావం తక్కువేమీ కాదు. సోషల్ మీడియాలో ఎటు చూసినా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కనిపిస్తారు. టీ పొడుల నుంచి టీపాయ్‌ల వరకు రకరకాల ప్రొడక్ట్స్‌ను ప్రమోట్ చేయడానికి చిన్నచిన్న క్యాచీ వీడియోలను రూపొందిస్తారు. దీనికి భిన్నంగా ఒక ప్రొడక్ట్‌ను విశ్లేషిస్తూ విమర్శిస్తే...అదే డీఇన్‌ఫ్లుయెన్సింగ్!

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' హ్యాష్‌ట్యాగ్‌తో టిక్ టాక్‌లో ఈ ట్రెండ్ మొదలైంది.

సోషల్ మీడియా ఎనాలటిక్స్ ఫర్మ్ ట్యూబ్‌లర్ ల్యాబ్స్ చెబుతున్నదాని ప్రకారం గత సంవత్సరం నుంచి ఈ ట్రెండ్ ఊపందుకుంది. మ్యాడి వెల్ అనే ఇన్‌ఫ్లుయెన్సర్ ప్రముఖ కాస్మటిక్ స్టోర్స్‌లో పని చేసింది. కొన్ని ప్రొడక్ట్స్ పట్ల కస్టమర్‌లు ఎందుకు విముఖంగా ఉన్నారో తన స్వీయ అనుభవాలను తెలియజేసింది. ఈ ప్రభావంతో ఆమె పేరు ఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితా నుంచి డీఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితాలోకి చేరింది.

న్యూయార్క్‌కు చెందిన ఇరవై సంవత్సరాల క్లారా కొన్ని బ్రాండ్‌లను విమర్శిస్తూ వీడియోలు చేసింది. వాటిలో ఒకటి వైరల్‌గా మారింది. అదే సమయంలో తాను విమర్శించిన బ్రాండ్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో అనే భయం పట్టుకుంది. అయితే తనకు తానుగా ధైర్యం తెచ్చుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు.

'నేను సరియైన వివరాలతోనే వీడియో చేశాను. నేనెందుకు భయపడాలి' అంటోంది క్లారా.

మన సెలబ్రిటీ ఒకరు ఆరోగ్య సంబంధమైన విషయాలపై కాస్త లోతుగానే మాట్లాడాడు. అయితే ఆయన అవగాహన లోపాన్ని ఒక వైద్యుడు వెంటనే ఎత్తిచూపాడు. పాపులర్ చైనీస్ వ్లోగర్ ఒకరు తన వయసు తక్కువగా కనిపించేలా సాంకేతిక మాయ చేస్తే ఎవరో కుర్రాడు కనిపెట్టి 'ఆయన అసలు రూపం ఇది' అని చూపాడు.



> సమస్య ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కాదు. కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్‌లు అనుసరిస్తున్న ధోరణి. వారిలో మార్పు రావాలి. సామాజిక బాధ్యత పెరగాలి. యువతలో అశాంతి, ఆందోళన రేకెత్తించే కంటెంట్‌కు దూరంగా ఉండాలి.
> – హిమాద్రి పటేల్, డిజిటల్ క్రియేటర్

స్వీడన్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఫేక్ ట్రిప్ గురించి మరొక యువకుడు 'ఇవి ఫొటోషాప్ చిత్రాలు' అని నిజాన్ని బహిర్గతం చేశాడు. నిజానికి ఇలాంటివి సోషల్ మీడియాలో గతంలో లేవని కాదు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' పుణ్యామా అని 'అది కాదు ఇది' అని వెంటనే సాధికార సమాచారంతో స్పందించే ధోరణి పెరిగింది.

డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు వోవర్-హైప్‌డ్ ప్రొడక్ట్స్‌ను విమర్శించడమే కాదు చౌక ధరల్లో లభించే వాటి గురించి చెబుతున్నారు.

యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలోని వార్టన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్ అయిన అమెరికస్ రీడ్ ఇలా అంటున్నారు... 'ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో ఎక్కువ మంది సాధికారికంగా మాట్లాడడం లేదేమో అనే భావన కస్టమర్‌లలో వచ్చింది. డబ్బులు ఇస్తారు కాబట్టి సంబంధిత ప్రొడక్ట్‌ను ప్రమోట్ చేస్తారు. నిజానిజాల గురించి వారికి అవసరం లేదు. ఈ నేపథ్యంలో కాస్తో కూస్తో డీఇన్‌ఫ్లుయెన్సరే నయం అనుకుంటున్నారు. నిజానికి డీఇన్‌ఫ్లుయెన్సర్ కూడా ఇన్‌ఫ్లుయెన్సరే'

కొందరు ఒక అడుగు ముందుకు వేసి ఈ ట్రెండ్‌కు 'యాంటీ క్యాపిటలిస్ట్' ట్రెండ్‌గా నామకరణం చేశారు.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ వల్ల వృథా ఖర్చులు తగ్గుతాయని, వేలం వెర్రికి అడ్డుకట్టపడుతుందని, పర్యావరణ కోణంలో కూడా ఈ ట్రెండ్ వల్ల మేలు జరుగుతుందని యువతరంలో ఎంతోమంది బలంగా వాదిస్తున్నారు. తమ అభిప్రాయాలను సామాజిక మాధ్యమాలలో ఇతరులతో పంచుకుంటున్నారు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్‌పై ప్రశంసలతో పాటు విమర్శలు కూడా ఉన్నాయి.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్‌కు విషయ సాధికారత, నిజాయితీ అనేవి కీలకం. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' రూపంలో సూడో-అథెంటిసిటీ ముందుకు వస్తుందని, ఈ ట్రెండ్‌ను తమ స్వార్థానికి ఉపయోగించుకునే వారి సంఖ్య పెరుగుతుందనే విమర్శ ఉంది.

'ఈ ట్రెండ్ కాస్త చివరికి ఎలా మారుతుందంటే ఇది కొనవద్దు. మీరు కొనాల్సింది అది అన్నట్లుగా!' అంటుంది 26 సంవత్సరాల అమెరికన్ ఇన్‌ఫ్లుయెన్సర్ జెస్సిక.


'ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌లు చెప్పగానే కస్టమర్‌ల అభిప్రాయాలు రాత్రికి రాత్రి మారిపోవు. ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కేవలం సలహా ఇస్తారు. అంతే. ఏది కొనాలి, ఏది కొనకూడదు అనే స్వీయవిచక్షణ కస్టమర్‌లలో ఉంది. ఇన్‌ఫ్లుయెన్సర్‌లుగా మేము పారదర్శకంగా, నిజాయితీగా ఉంటాం' అంటుంది ఫ్రాన్స్‌కు చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్ కోలిన్. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 4,00,000 ఫాలోవర్స్ ఉన్నారు.

ప్రస్తుతం డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ హెల్త్, ఫైనాన్స్, లైఫ్‌స్టైల్ విభాగాలలో ఎక్కువగా కనిపిస్తుంది.

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్ అనేది వాపా బలుపా?' అనేది పక్కన పెడితే ఈ ట్రెండ్ మూలంగా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ప్రాఫిట్‌కు మాత్రమే కాదు మెరిట్‌కు కూడా ప్రాధాన్యత ఇచ్చే ధోరణి, జవాబుదారీతనం పెరుగుతుంది.

బ్యూటిప్స్





• వేప చెట్టు ఇంటి దగ్గర్లో ఉంటే వేరే సౌందర్యసాధనాలతో పనే ఉండదు. వేపాకులు, బెరడు, వేపనూనె ఔషధాలుగానే కాదు, సౌందర్య సాధనాలుగానూ ఉపయోగపడతాయి. ఎలాంటి చర్మ సమస్యలకైనా వేపతో ఇట్టే చెక్ పెట్టేయవచ్చు. • ముఖంపై మొటిమలు, నల్లమచ్చలు ఏర్పడుతుంటే వేపాకులతో చక్కని విరుగుడు ఉంది. గుప్పెడు వేపాకులను అరలీటరు నీటిలో వేయాలి. వేపాకులు పూర్తిగా మెత్తగా మారిపోయేంత వరకు ఆ నీటిని మరిగించాలి. కాసేపటికి నీరు ఆకుపచ్చ రంగులోకి మారుతుంది. అప్పుడు వడగట్టి ఆ కషాయాన్ని సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఆ నీటితో కాస్త దూదిని తడిపి ముఖాన్ని రుద్దుకుంటే చాలు. మొటిమలు, మచ్చలు మటుమాయం అవుతాయి. • చర్మం పొడిబారి, తరచు దురదలు పెడుతున్నట్లయితే, పైన చెప్పుకున్నట్లే వేపాకులతో కషాయం చేసి, బకెట్ నీటిలో ఒకకప్పు కషాయాన్ని పోసి ఆ నీటిని స్నానానికి ఉపయోగిస్తే చాలు. కొద్దిరోజుల్లోనే చర్మం ఆరోగ్యకరంగా మారుతుంది. • ముఖం తరచు జిడ్డుగా మారుతుంటే, వేపాకుల పొడి, గంధంపొడి, గులాబి రేకుల పొడి సమభాగాలుగా తీసుకుని కలుపుకోవాలి. చెంచాడు పొడిలో మూడు నాలుగు చుక్కల వేపనూనె, కొద్దిగా తేనె, నిమ్మరసం పిండుకుని ముద్దలా కలుపుకోవాలి. దానిని ముఖానికి పట్టించి, అరగంటసేపు ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే ముఖం తాజాగా మారుతుంది.



జ్వరం బారిన పాక్ జట్టు!

భారత్ చేతిలో భారీ ఓటమినుంచి కోలుకొని తర్వాతి మ్యాచ్‌కు సిద్ధమవుతున్న పాకిస్తాన్ జట్టుకు కొత్త సమస్య వచ్చి పడింది. ఆ జట్టులోని పలువురు ఆటగాళ్లు వైరల్ ఫీవర్ బారిన పడ్డారు. ఆదివారం బెంగళూరుకు చేరుకున్న రోజునుంచే ఆటగాళ్లు అనారోగ్యానికి గురయ్యారు. వీరిలో బాబర్ ఆజమ్, షాహిన్ అఫ్రిది పరిస్థితి మెరుగు పడగా...సౌద్ షకీల్, జమాన్ ఖాన్, ఉసామా మీర్ పూర్తిగా కోలుకోలేదు. అన్నింటికి మించి కీలక బ్యాటర్, ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ జ్వరం, ఫ్లూతో ఇంకా తన గదిలోనే క్వారంటైన్‌లో ఉండటం పాక్‌ను ఆందోళనకు గురి చేస్తోంది. ఆటగాళ్లందరూ వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నారని పీసీబీ వెల్లడించింది. బెంగళూరులో గత కొంత కాలంగా వైరల్ ఫీవర్ తీవ్రత చాలా ఎక్కువగా ఉండగా... పాక్ క్రికెటర్లలో ఎవరికీ డెంగీ లక్షణాలు లేకపోవడం ఆ జట్టుకు కాస్త ఊరట. శుక్రవారం జరిగే పోరులో ఆస్ట్రేలియాతో పాకిస్తాన్ తలపడుతుంది.

‘సఫారీ’కి డచ్ దెబ్బ



మిల్లర్‌ను బౌల్డ్ చేసిన వాన్ బీక్ ఉద్వేగం

- సంచలన విజయం సాధించిన నెదర్లాండ్స్
- 38 పరుగులతో ఓడిన దక్షిణాఫ్రికా
- ఎడ్వర్డ్స్ మెరుపు బ్యాటింగ్
- బౌలర్ల సమష్టి ప్రదర్శన

దాదాపు ఏడాది క్రితం...టి20 ప్రపంచకప్‌లో ఈ రెండు జట్ల మధ్యే మ్యాచ్...అనూహ్య ప్రదర్శనతో దక్షిణాఫ్రికాను నెదర్లాండ్స్ కంగుతినిపించింది. దీంతో ఈ మ్యాచ్‌పై ఆసక్తి నెలకొన్నప్పటికీ దక్షిణాఫ్రికా సూపర్ ఫామ్‌తో వార్ వన్‌సైడ్‌గా భావించారు.. నెదర్లాండ్స్ 27 ఓవర్లలో 112/6 స్కోరు చేయడం చూస్తే అందరూ అనుకున్నట్లే జరుగుతున్నట్లే అనిపించింది. అయితే ఇక్కడే సీన్ మారింది. మరో సంచలనానికి నాంది పలికే ఇన్నింగ్స్‌తో నాయకుడు ఎడ్వర్డ్స్ నడిపించాడు. తర్వాతి 16 ఓవర్లలో మరో 133 పరుగులు జోడించాడు. సారథి పడిన కష్టానికి, చేసిన పోరాటానికి న్యాయం చేసేందుకు బౌలర్లంతా శ్రమించడం పెను సంచలనానికి దారి తీసింది.



ధర్మశాల: ప్రపంచ కప్‌లో నెదర్లాండ్స్ సంచలన విజయాన్ని అందుకుంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో 38 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. వర్షం కారణంగా ఆట ఆలస్యంగా ప్రారంభం కావడంతో మ్యాచ్‌ను 43 ఓవర్లకు కుదించారు. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన నెదర్లాండ్స్ 43 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 245 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’, కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (69 బంతుల్లో 78 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటం చేశాడు. అనంతరం సులువైన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా 42.5 ఓవర్లలో 207 పరుగులకే ఆలౌటైంది. డేవిడ్ మిల్లర్ (52 బంతుల్లో 43; 4 ఫోర్లు, 1 సిక్స్), కేశవ్ మహరాజ్ (37 బంతుల్లో 40; 5 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు.

ఎడ్వర్డ్స్ కెప్టెన్ ఇన్నింగ్స్

రబడ, జాన్సెన్, ఇన్‌గిడిల బౌలింగ్‌కు నెదర్లాండ్స్ టాపార్డర్ బదులివ్వలేకపోయింది. విక్రమ్‌జీత్ (2), ఒడౌడ్ (18), అకెర్మన్ (12), బస్ డి లీడ్ (2), సైబ్రాండ్ (19), తేజ (20)... ఇలా ఎవరూ ఎక్కువ సేపు నిలబడలేదు. అయితే కెప్టెన్ ఎడ్వర్డ్స్ కనబరిచిన పోరాటం సంచలనానికి ఓ మెట్టు వేసింది. వాన్‌డెర్ మెర్వ్ (29)తో 8వ వికెట్‌కు 64 పరుగులు, ఆర్యన్ దత్ (23 నాటౌట్)తో అబేధ్యమైన 9వ వికెట్‌కు 41 పరుగులు ఎడ్వర్డ్స్ జతచేశాడు.

సఫారీ విలవిల

ఆడేది సులువైన ప్రత్యర్థితో, ఎదురుగా ఉన్నది స్వల్ప లక్ష్యమే కానీ సఫారీ వల్ల అసాధ్యమైంది. నెదర్లాండ్ బౌలర్లు వాన్ డెర్ మెర్వ్, అకెర్మన్, మెకెరన్, వాన్ బీక్, డి లీడే కలిసికట్టుగా పిడికిలి బిగించడంతో...డి కాక్ (20), కెప్టెన్ బవుమా (16), హిట్టర్లు డసెన్ (4), మార్క్‌రమ్ (1) చేతులెత్తేశారు. 89 పరుగులకే 5 వికెట్లు కోల్పోయాక మిల్లర్ కొద్దిగా పోరాడాడు. చివర్లో కేశవ్ దూకుడుగా ఆడినా అప్పటికే ఆలస్యమైంది.

స్కోరు వివరాలు

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జీత్ (సి) క్లాసెన్ (బి) రబడ 2; మ్యాక్స్ ఒడౌడ్ (సి) డికాక్ (బి) జాన్సెన్ 18; అకెర్మన్ (బి) కొయెట్జీ 12; బస్ డి లీడ్ (ఎల్బీ) (బి) రబడ 2; సైబ్రాండ్ (సి) జాన్సెన్ (బి) ఎన్‌గిడి 19; తేజ (ఎల్బీ) (బి) జాన్సెన్ 20; ఎడ్వర్డ్స్ నాటౌట్ 78; వాన్ బీక్ (స్టంప్డ్) డికాక్ (బి) కేశవ్ 10; వాన్‌డర్ మెర్వ్ (సి) డికాక్ (బి) ఎన్‌గిడి 29; ఆర్యన్ దత్ నాటౌట్ 23; ఎక్స్‌ట్రాలు 32; **మొత్తం** (43 ఓవర్లలో 8 వికెట్లకు) 245. **వికెట్ల పతనం:** 1-22, 2-24, 3-40, 4-50, 5-82, 6-112, 7-140, 8-204. **బౌలింగ్:** ఎన్‌గిడి 9-1-57-2, జాన్సెన్ 8-1-27-2, రబడ 9-1-56-2, కొయెట్జీ 8-0-57-1, కేశవ్ 9-0-38-1. **దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్:** బవుమా (బి) వాన్ డెర్ మెర్వ్ 16; డికాక్ (సి) ఎడ్వర్డ్స్ (బి) అకెర్మన్ 20; వాన్‌డెర్ డసెన్ (సి) ఆర్యన్ (బి) వాన్ డెర్ మెర్వ్ 4; మార్క్‌రమ్ (బి) వాన్ మెకెరన్ 1; క్లాసెన్ (సి) విక్రమ్‌జీత్ (బి) వాన్ బీక్ 28; మిల్లర్ (బి) వాన్ బీక్ 43; జాన్సెన్ (బి) వాన్ మెకెరన్ 9; కొయెట్జీ (సి) ఎడ్వర్డ్స్ (బి) డి లీడ్ 22; కేశవ్ (సి) ఎడ్వర్డ్స్ (బి) వాన్ బీక్ 40; రబడ (సి) సైబ్రాండ్ (బి) డి లీడ్ 9; ఎన్‌గిడి నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం** (42.5 ఓవర్లలో ఆలౌట్) 207. **వికెట్ల పతనం:** 1-36, 2-39, 3-42, 4-44, 5-89, 6-109, 7-145, 8-147, 9-166, 10-207. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 5-1-19-0, వాన్ బీక్ 8.5-0-60-3, అకెర్మన్ 3-0-16-1, పాల్ మెకెరన్ 9-0-40-2, వాన్ డెర్ మెర్వ్ 9-0-34-2, బాస్ డి లీడ్ 8-0-36-2.

11 బంతుల్లో అర్ధ సెంచరీ!

- రైల్వేస్ ఆటగాడు అశుతోష్ రికార్డు
- ముస్తాక్ అలీ టి20 ట్రోఫీ

రాంచీ: దేశవాళీ టి20 టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలో మంగళవారం కొత్త రికార్డు నమోదైంది. రైల్వేస్ బ్యాటర్ అశుతోష్ శర్మ 11 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించి టి20 క్రికెట్‌లో భారత్ తరఫున కొత్త రికార్డు నమోదు చేశాడు. 2007 టి20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై యువరాజ్ సింగ్ 12 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన రికార్డు దీంతో కనుమరుగైంది. బలహీన జట్టయిన అరుణాచల్‌ప్రదేశ్‌తో జరిగిన పోరులో అశుతోష్ 8 సిక్సర్లు, 1 ఫోర్‌తో అర్ధ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. 11వ బంతికి బౌండరీతో 53 పరుగులకు చేరుకున్న అతను తర్వాతి బంతికే నిష్క్రమించాడు. 25 ఏళ్ల అశుతోష్ కెరీర్‌లో రైల్వేస్ తరఫున ఇది రెండో టి20 మ్యాచ్ కాగా, నాలుగేళ్ల క్రితం వరకు అతను 8 టి20ల్లో మధ్యప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. కెరీర్‌లో ఒకే ఒక్క దేశవాళీ వన్డే ఆడిన అతను ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇంకా అరంగేట్రం చేయలేదు. ఈ మ్యాచ్‌లో రైల్వేస్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 246 పరుగులు చేయగా, అరుణాచల్ ప్రదేశ్ 18.1 ఓవర్లలో119 పరుగులకు ఆలౌటై 127 పరుగుల తేడాతో చిత్తయింది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డు గత నెల 27న నేపాల్ బ్యాటర్ దీపేంద్ర సింగ్ నమోదు చేశాడు. అతను 9 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు.



అశుతోష్

హైదరాబాద్ విజయం

జైపూర్: టోర్నీలో హైదరాబాద్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 8 వికెట్ల తేడాతో జమ్ము కశ్మీర్‌ను ఓడించింది. ముందుగా కశ్మీర్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. శుభమ్ పండిర్ (47 బంతుల్లో 58; 4 ఫోర్లు, 3 సిక్సులు) టాప్‌స్కోరర్. అనంతరం హైదరాబాద్ 18.3 ఓవర్లలో 2 వికెట్లకు 160 పరుగులు చేసింది. కెప్టెన్ తిలక్‌వర్మ (43 బంతుల్లో 58 నాటౌట్) అర్ధ సెంచరీ చేయగా...రోహిత్ రాయుడు (28 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్సులు), రాహుల్ సింగ్ (27 బంతుల్లో 35 నాటౌట్; 2 ఫోర్లు) రాణించారు.

పంజాబ్ ‘రికార్డు’ విజయం

ఆంధ్రకు మరో ఓటమి



రికీ భుయ్

రాంచీ: రికీ భుయ్ (52 బంతుల్లో 104 నాటౌట్; 6 ఫోర్లు, 9 సిక్సులు) దూకుడుగా ఆడి సెంచరీ సాధించినా...ఇతర బ్యాటర్ల వైఫల్యంతో ఆంధ్ర జట్టుకు ఓటమి తప్పలేదు. ఈ మ్యాచ్‌లో పంజాబ్ 105 పరుగుల తేడాతో ఆంధ్రపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 275 పరుగులు చేసింది. ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో ఇదే అత్యధిక స్కోరు కాగా...ఓవరాల్‌గా టి20 క్రికెట్‌లో ఇది నాలుగో అత్యధిక స్కోరు. అభిషేక్ శర్మ (51 బంతుల్లో 112; 9 ఫోర్లు, 9 సిక్సులు), అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (26 బంతుల్లో 87; 6 ఫోర్లు, 9 సిక్సులు) మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చారు. ఆంధ్ర 20 ఓవర్లలో 7 వికెట్లకు 170 పరుగులే చేయగలిగింది. మ్యాచ్‌లో టాప్ స్కోరర్లుగా నిలిచిన ముగ్గురు బ్యాటర్లూ తలా 9 సిక్సర్ల చొప్పున బాదడం విశేషం!

ప్రపంచకప్‌లో నేడు

న్యూజిలాండ్ X అఫ్గానిస్తాన్
వేదిక: చెన్నై

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	3	3	0	6	1.821
న్యూజిలాండ్	3	3	0	6	1.604
దక్షిణాఫ్రికా	3	2	1	4	1.385
పాకిస్తాన్	3	2	1	4	-0.137
ఇంగ్లండ్	3	1	2	2	-0.084
అఫ్గానిస్తాన్	3	1	2	2	-0.652
బంగ్లాదేశ్	3	1	2	2	-0.699
ఆస్ట్రేలియా	3	1	2	2	-0.734
నెదర్లాండ్స్	3	1	2	2	-0.993
శ్రీలంక	3	0	3	0	-1.532

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రిక్వార్టర్స్‌లో సింధు



- వాకోవర్ ఇచ్చిన సాత్విక్-చిరాగ్
- డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్

ఒడెన్స్: బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 750 టోర్నీ డెన్మార్క్ ఓపెన్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు శుభారంభం చేసింది. ప్రత్యర్థినుంచి కొంత ప్రతిఘటన ఎదురైనా చివరకు తొలి రౌండ్ అడ్డంకిని అధిగమించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు 21-14, 18-21, 21-10 స్కోరుతో కిర్‌స్టీ గిల్మర్ (స్కాట్లండ్)పై విజయం సాధించింది. 56 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో తొలి గేమ్‌ను సునాయాసంగా గెలుచుకున్న తర్వాత సింధుకు ఆ తర్వాత గిల్మర్ గట్టి పోటీనిచ్చి పోరును 1-1తో సమం చేసింది. అయితే నిర్ణాయక మూడో గేమ్‌లో సింధు తన స్థాయికి తగినట్లుగా చెలరేగింది. ఒక దశలో వరుసగా 7 పాయింట్లు సాధించి దూసుకుపోయిన భారత షట్లర్ చివరి వరకు దానిని కొనసాగించింది. మహిళల సింగిల్స్‌లో మరో భారత క్రీడాకారిణి ఆకర్షి కశ్యప్ కూడా ముందంజ వేసింది. తొలి రౌండ్‌లో ఆకర్షి 10-21, 22-20, 21-12 తేడాతో లి వైవోన్ (జర్మనీ)పై సంచలన విజయం సాధించింది. అయితే పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాడు కిడాంబి శ్రీకాంత్‌ను నిరాశ ఎదురైంది. తొలి పోరులో శ్రీకాంత్ 21-19, 10-21, 16-21తో వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా) చేతిలో ఓడి నిష్క్రమించాడు. లక్ష్య సేన్ కూడా తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. థాయిలాండ్‌కు చెందిన కంటఫాన్ వాంగ్ చరన్ 21-16, 21-18తో లక్ష్యసేన్‌పై విజయం సాధించాడు. మరో వైపు ఆసియా క్రీడల స్వర్ణపతక జోడి సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి చివరి నిమిషంలో టోర్నీనుంచి నిష్క్రమించింది. ఈ జంట వాకోవర్ ఇవ్వడంతో మలేసియా ద్వయం ఆంగ్ యు సిన్ - టియో యీ యి రెండో రౌండ్‌కు చేరింది.

సినిమా



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి పురస్కారం అందుకుంటున్న వహీదా రెహమాన్



అనురాగ్ ఠాకూర్‌తో అల్లు అర్జున్ కరచాలనం



రాజమౌళి



మాధవన్



కృతీ సనన్



ఆలియా భట్



జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో కృతీ సనన్, వహీదా రెహమాన్, పల్లవీ జోషి, ఆలియా భట్

సినిమాలు... కళాకారులు సమాజంలో మార్పుకి సారథులు

- దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకున్న వహీదా రెహమాన్
- జాతీయ అవార్డు అందుకున్న తొలి తెలుగు నటుడు అల్లు అర్జున్
- ఉత్తమ నటీమణులుగా కృతీ సనన్, ఆలియా భట్
- ఆరు జాతీయ అవార్డులు అందుకున్న ‘ఆర్ఆర్ఆర్’
- ఉత్తమ తెలుగు చిత్రం అవార్డు అందుకున్న ‘ఉప్పెన’ దర్శక-నిర్మాతలు



దేవిశ్రీ ప్రసాద్

69వ జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



ముర్ము నుంచి పురస్కారం అందుకుంటున్న కీరవాణి



దాసరి కల్యాణ్



కాలభైరవ



శ్రీనివాస్ మోహన్



ప్రేమ్ రక్షిత్



కింగ్ సాల్మన్



చంద్రబోస్



బుచ్చిబాబు



నవీన్ యెర్నేని



పురుషోత్తమాచార్యులు

‘‘జాతీయ అవార్డుల ప్రదానం భారతదేశంలోని భిన్నత్వాన్నీ, అందులో అంతర్లీనంగా ఉన్న ఏకత్వాన్నీ సూచిస్తోంది. సినిమా అనేది కేవలం వ్యాపారమో, వినోదమో కాదు... శక్తిమంతమైన మాధ్యమం. ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ఉపయోగపడుతుంది. సమస్యల పట్ల సున్నితత్వాన్ని పెంచుతుంది. అర్థవంతమైన సినిమాలు సమాజంలోని, దేశంలోని సమస్యలను, విజయాలను ఆవిష్కరిస్తాయి. సినిమాలు, కళాకారులు సమాజంలో మార్పుకు సారథులు. దేశం గురించి సమాచారం అందించడంతో పాటు ప్రజల మధ్య అనుబంధం పెరగడానికి సినిమా కారణం అవుతుంది. సమాజానికి ప్రతిబింబం, మెరుగుపరిచే మాధ్యమం సినిమాయే. ప్రతిభ ఉన్న ఈ దేశంలో సినిమాతో అనుబంధం ఉన్న ప్రతిభావంతులు ప్రపంచ స్థాయిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పి, దేశ అభివృద్ధికి ముఖ్య కారణం అవుతారు’’ అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం జరిగిన 69వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో విజేతలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ అవార్డులు అందించారు. 2021 సంవత్సరానికిగాను దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును నటి వహీదా రెహమాన్, ఉత్తమ నటుడి అవార్డును అల్లు అర్జున్ (పుష్ప), ఉత్తమ నటి అవార్డును ఆలియా భట్ (గంగూబాయి కతియావాడి), కృతీ సనన్ (మిమి) అందుకున్నారు. ఉత్తమ చిత్రం (రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్ – హిందీ) అవార్డును దర్శకుడు ఆర్. మాధవన్, ఉత్తమ దర్శకుడిగా నిఖిల్ మహాజన్ (మరాఠీ ఫిల్మ్ – గోదావరి) అవార్డు అందుకున్నారు. ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపికైన ‘ఉప్పెన’కు దర్శకుడు బుచ్చిబాబు సన, నిర్మాత నవీన్ యెర్నేని పురస్కారాలు స్వీకరించారు. పూర్తి స్థాయి వినోదం అందించిన ఉత్తమ చిత్రం విభాగంలో ‘ఆర్ఆర్ఆర్’కు నిర్మాత డీవీవీ దానయ్య తనయుడు దాసరి కల్యాణ్, దర్శకుడు రాజమౌళి అవార్డులు అందుకున్నారు. ఇదే చిత్రానికి ఉత్తమ బ్యాగ్రౌండ్ స్కోర్‌కి ఎంఎం కీరవాణి, నేపథ్య గాయకుడుగా ‘కొమురం భీముడో..’ పాటకు కాలభైరవ, యాక్షన్ డైరెక్షన్‌కి కింగ్ సాల్మన్, కొరియోగ్రఫీకి ప్రేమ్ రక్షిత్, స్పెషల్ ఎఫెక్ట్స్‌కి వి. శ్రీనివాస మోహన్ పురస్కారాలు అందుకున్నారు. ఇంకా ఉత్తమ సంగీతదర్శకుడిగా ‘పుష్ప: ది రైజ్’కి దేవిశ్రీ ప్రసాద్, ‘కొండపొలం’ చిత్రంలో ‘ధంధం ధం..’ పాటకు గాను ఉత్తమ రచయిత అవార్డును చంద్రబోస్, ఉత్తమ సినీ విమర్శకుడిగా పురుషోత్తమాచార్యులు (తెలుగు), ఇంకా పలు భాషలకు చెందిన కళాకారులు పురస్కారాలను స్వీకరించారు. ఈ వేదికపై వహీదా గురించి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ – ‘‘వహీదా చక్కని నటనా నైపుణ్యం, మంచి వ్యక్తిత్వంతో చిత్ర పరిశ్రమలో శిఖరాగ్రానికి చేరుకున్నారు. వ్యక్తిగత జీవితంలోనూ ఒక మహిళగా హుందాతనం, ఆత్మవిశ్వాసంతో తనదైన ముద్ర వేసుకున్నారు. మహిళా సాధికారత కోసం మహిళలే చొరవ తీసుకోవాలని సూచించేలా వహీదా ఉదాహరణగా నిలిచారు’’ అన్నారు. ‘‘ప్రపంచంలో మంచి కంటెంట్ హబ్‌గా భారత శక్తి సామర్థ్యాలను నిరూపించడానికి ఏవీజీసీ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ అండ్ కామిక్) రంగం ఉపయోగపడుతుంది’’ అన్నారు అనురాగ్ ఠాకూర్.

సినిమా అనేది సమష్టి కృషి - వహీదా రెహమాన్

స్టాండింగ్ ఒవేషన్ మధ్య ఒకింత భావోద్వేగానికి గురవుతూ పురస్కారం అందుకున్న వహీదా రెహమాన్ మాట్లాడుతూ– ‘‘దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకోవడం గౌరవంగా భావిస్తున్నాను. నేనిక్కడ ఉన్నానంటే దానికి కారణం నేను భాగమైన ఈ అద్భుతమైన ఇండస్ట్రీ. అగ్రదర్శకులతో, నిర్మాతలతో, సాంకేతిక నిపుణులతో పని చేసే అవకాశం రావడం నా అదృష్టం. మేకప్ ఆర్టిస్ట్స్, హెయిర్ అండ్ కాస్ట్యూమ్ డిజైనర్స్, డైలాగ్ రైటర్స్... ఇలా అందరి గురించి ప్రస్తావించాలి. ఈ అవార్డు తాలూకు ఆనందాన్ని అన్ని సినీ శాఖలవారితో పంచుకోవాలనుకుంటున్నాను. ఏ ఒక్కరో సినిమా మొత్తాన్ని రూపొందించలేరు. సినిమా సమష్టి కృషి. ఇది పరిశ్రమ మొత్తానికి దక్కిన పురస్కారం’’ అన్నారు.

జాతీయ స్థాయిలో అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. కమర్షియల్ సినిమా అయిన పుష్పకు అవార్డు దక్కడం మాకు నిజంగా డబుల్ అచీవ్‌మెంట్. – అల్లు అర్జున్

* * *

ప్రేక్షకులకు నచ్చే విధంగా సినిమా తీయడం నా మొదటి లక్ష్యం. అలాంటి సినిమాలకు అవార్డులు రావడం బోనస్ లాంటిది. ముగ్గురు.. నలుగురు.. ఎంతో మంది టెక్నీషియన్లతో కలిసి చేసిన కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం... మా సినిమాకు ఆరు అవార్డులు రావడం ఆనందదాయకం. ‘ఆర్ఆర్ఆర్’ విడుదలైన తొలి రోజు ఎంతో ఉత్కంఠతో ఉన్న మాకు ప్రశంసలు రావడం మరచిపోలేని ఘటన. – దర్శకుడు రాజమౌళి

‘ఉప్పెన’ సినిమాకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం హ్యాపీగా ఉంది. నిర్మాతలు నవీన్, రవి, మా గురువు సుకుమార్ వల్లే సాధ్యమైంది. వైష్ణవ్, కృతీ, విజయ్ సేతుపతి, దేవిశ్రీ ప్రసాద్‌లకు ధన్యవాదాలు. – దర్శకుడు బుచ్చిబాబు సన

* * *

‘ఆర్ఆర్ఆర్’లో పని చేయడం నాకో మంచి అవకాశం. ఇది దేవుడు ఇచ్చిన బహుమతి. రాజమౌళి నాకు గురువు. నాకింత గొప్ప అవకాశం ఇచ్చిన ఆయనకు ధన్యవాదాలు – స్టంట్ కొరియోగ్రాఫర్ కింగ్ సాల్మన్

లియో విడుదలలో మార్పు ఉండదు - సూర్యదేవర నాగవంశీ



‘లియో’ టైటిల్‌ని తెలుగులో ఒకరు రిజిస్టర్ చేసుకున్నారు. వారు మమ్మల్ని సంప్రదించకుండా ‘లియో’ టైటిల్ నాది.. సినిమా రిలీజ్ ఆపాలంటూ నేరుగా కోర్టుని ఆశ్రయించారు. టైటిల్ రిజిస్టర్ చేసుకున్నవారితో మాట్లాడుతున్నాం.. సమస్య పరిష్కారం అవుతుంది. ‘లియో’ సినిమా విడుదలలో ఎలాంటి మార్పు ఉండదు.. ఈ నెల 19నే తమిళంతో పాటు తెలుగులోనూ ఈ సినిమా రిలీజవుతుంది’’ అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు. విజయ్, త్రిష జంటగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన చిత్రం ‘లియో’. లలిత్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 19న పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానుంది. ఈ చిత్రం తెలుగు హక్కులను సితార ఎంటర్‌టైన్మెంట్స్ సూర్యదేవర నాగవంశీ సొంతం చేసుకున్నారు. కాగా, ఈ చిత్రం టైటిల్‌పై వివాదం జరుగుతున్న నేపథ్యంలో విడుదల వాయిదా పడే అవకాశం ఉందనే వార్తలు ఉన్నాయి. ఈ సందర్భంగా సూర్యదేవర నాగవంశీ విలేకరులతో మాట్లాడుతూ– ‘‘లియో’ తెలుగు టైటిల్‌ని కూడా తమిళ నిర్మాతలే రిజిస్టర్ చేయించారు. సెన్సార్ కూడా పూర్తయింది కాబట్టి విడుదలకు ఎలాంటి ఆటంకం ఉండదు. ఈ సినిమా బాగుంటుందనే నమ్మకంతోనే తెలుగు హక్కులు తీసుకున్నాను’’ అన్నారు.

ఆయన మాట థ్రిల్లింగ్‌గా అనిపించింది - వంశీ కృష్ణ



‘టైగర్ నాగేశ్వరరావు’ కథని రవితేజగారు మొదట సగం విని, ‘షూటింగ్ ఉంది.. మిగతాది రేపు వింటాను’ అన్నారు. కథ ఆయనకు నచ్చలేదేమో? నాకు ఫోన్ రాదేమో? అనుకున్నాను. మరుసటి రోజు ఆయన ఫోన్ చేయడంతో వెళ్లి మిగిలిన సగం కథ చెప్పాను. క్లయిమాక్స్ చెబుతున్నప్పుడే... ‘జుట్టు పెద్దగా పెంచితే బాగుంటుందా? కళ్లకి లెన్స్ పెట్టుకోనా?’ అని ఆయన అన్నారు. నాకు అదొక భావోద్వేగమైన సందర్భం’’ అన్నారు డైరెక్టర్ వంశీ కృష్ణ. రవితేజ హీరోగా, తెరకెక్కిన చిత్రం ‘టైగర్ నాగేశ్వరరావు’. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వంశీ కృష్ణ మాట్లాడుతూ– ‘‘టైగర్ నాగేశ్వరరావు ఒక దొంగ అని అందరికీ తెలుసు. మరో కోణంలో మంచి మనసున్న మనిషి. ఈ రెండు కోణాలను సినిమాలో చూపించాను. 1980 నేపథ్యంలో నడిచే కథ ఇది. నా కెరీర్‌లో బడ్జెట్, స్టార్స్ పరంగా ఇది చాలా భారీ సినిమా. ఈ సినిమాలో గోదావరి బ్రిడ్జ్‌ని రీ క్రియేట్ చేసి, ట్రైన్ సీక్వెన్స్ చేయడం సవాల్‌గా అనిపించింది. ఇక షారుక్ ఖాన్’’ అన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
18-10-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్‌ ▲	261	66,428
నిఫ్టీ ▲	80	19,812

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ			
నాస్‌డాక్‌	13,538	▼	28
డోజోన్స్‌	33,981	▼	4
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,675	▲	45
డాక్స్‌	15,252	▲	14
షాంఘై	3,084	▲	10
నికాయ్‌	31,659	▲	381

అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

బులియన్‌ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	59,283
బంగారం (99.5 స్వచ్ఛత)	59,046
వెండి (కిలో)	70,846

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	82.48	84.15
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	99.99	103.36
€	యూరో	ఎస్‌బీఐ	86.39	89.43
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	54.87	56.57
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	51.87	54.16
S$	సింగపూర్‌ డాలర్‌	ఎస్‌బీఐ	59.91	61.84
SAR	సౌదీ రియాల్‌	[illegible]	21.25	22.87
UAE D	యూఏఈ దిర్హామ్‌	[illegible]	21.77	23.56
¥	చైనా యువాన్‌	[illegible]	10.26	12.34

ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌లో ఐడీఎఫ్‌సీ విలీనానికి సీసీఐ అనుమతి

న్యూఢిల్లీ: ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనానికి కాంపిటీషన్‌ కమిషన్‌ ఆఫ్‌ ఇండియా (సీసీఐ) తన ఆమోదాన్ని తెలియజేసింది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌ బ్యాంక్‌ హోల్డింగ్‌ కంపెనీగా ఐడీఎఫ్‌సీ సబ్సిడరీ అయిన ఐడీఎఫ్‌సీ ఫైనాన్షియల్‌ హోల్డింగ్స్‌ ప్రస్తుతం వ్యవహరిస్తోంది. ఇది ఆర్‌బీఐ సమోదిత ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ. విలీనానికి అనుకూలంగా ఐడీఎఫ్‌ సీ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌ బ్యాంక్‌ నిర్ణయించడం తెలిసిందే. డీల్‌లో భాగంగా ముందుగా ఐడీఎఫ్‌సీ లిమిటెడ్‌లో ఐడీఎఫ్‌సీ ఫైనాన్షియల్‌ హోల్డింగ్స్‌ విలీనం అవుతుంది. అనంతరం ఐడీఎఫ్‌సీ లిమిటెడ్‌ వెళ్లి ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌ బ్యాంక్‌లో విలీనం కానుంది. విలీన ప్రక్రియలో భాగంగా ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ ఫైనాన్షియల్‌ హోల్డింగ్స్‌ షేర్ల రద్దుకు సీసీఐ అనుమతించింది. అనంతరం ఐడీఎఫ్‌సీ ఫైనాన్షియల్‌ హోల్డింగ్స్‌ వాటాదారులకు ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌ బ్యాంక్‌ వాటాలను జారీ చేస్తారు. గ్రీన్‌ చానల్‌ రూట్‌లో ఈ విలీనానికి అనుమతించినట్టు సీసీఐ తెలిపింది. పోటీకి విఘాతం కలగదని భావించినప్పుడు గ్రీన్‌చానల్‌ కింద సీసీఐ అనుమతిస్తుంటుంది.

హ్యాపీ మొబైల్స్‌ ఫెస్టివల్‌ క్యాష్‌బ్యాక్‌ ధమాకా



హైదరాబాద్‌: హ్యాపీ మొబైల్స్‌ ఫెస్టివ్‌ క్యాష్‌బ్యాక్‌ ధమాకా ఆఫర్లు అందుబాటులోకి తెచ్చింది. మొబైల్స్‌, స్మార్ట్‌ ఎల్‌ఈడీ టీవీలు, ల్యాప్‌టాప్‌ల కొనుగోళ్లపై ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ ద్వారా 10% వరకు క్యాష్‌బ్యాక్‌ పొందవచ్చు. ప్రతి మొబైల్‌ కొనుగోలుపై కచ్చితమైన బహుమతి, అన్ని మొబైల్‌ యాక్సెసరీలపై 65% వరకు తగ్గింపు ఉంది. ఆన్‌ లైన్‌లో కంటే తక్కువ ధరలకే విక్రయిస్తున్నామని, రెండు గంటల్లో ప్రొడక్టులు డెలివరీ చేస్తున్నట్టు హ్యాపీ మొబైల్స్‌ తెలిపింది. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు వ్యాపార దక్షతకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నామని సంస్థ సీఎండీ కృష్ణ పవన్‌, ఈడీ కోట సంతోష్‌ తెలిపారు.

హడ్కో ఓఎఫ్‌ఎస్‌ @ రూ.79

బుధ, గురువారాల్లో ఆఫర్‌ షురూ

న్యూఢిల్లీ: పీఎస్‌యూ సంస్థ హడ్కో తాజాగా ఆఫర్‌ సేల్‌కు తెరతీయనుంది. తద్వారా ప్రభుత్వం 7 శాతం వాటాను విక్రయించనుంది. ఇందుకు షేరుకి రూ. 79 చొప్పున ఫ్లోర్‌ ధరను నిర్ణయించింది. ఆఫర్‌లో భాగంగా ప్రభుత్వం 14 కోట్లకుపైగా షేర్లను విక్రయించనుంది. తొలుత బుధవారం సంస్థాగత ఇన్వెస్టర్లకు విండో ఓపెన్‌ కానుండగా.. రిటైల్‌ ఇన్వెస్టర్లు గురువారం బిడ్‌ చేసుకునేందుకు వీలుంటుంది. వెరసి 7 శాతం వాటా ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రూ. 1,000 కోట్లు సమకూరే అవకాశముంది. బీఎస్‌ఈలో మంగళవారం ముగింపు ధర రూ. 90తో పోలిస్తే హడ్కో ఫ్లోర్‌ ధర 12 శాతం డిస్కౌంట్‌కావడం గమనార్హం!

కరూర్‌ వైశ్యా బ్యాంక్‌ లాభం ప్లస్‌

క్యూ2లో రూ. 378 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్‌ రంగ సంస్థ కరూర్‌ వైశ్యా బ్యాంక్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్‌(క్యూ2)లో నికర లాభం 51 శాతం జంప్‌చేసి రూ. 378 కోట్లను అధిగమించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 250 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,821 కోట్ల నుంచి రూ. 2,336 కోట్లకు ఎగసింది. స్థూల మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) 2.28 శాతం తగ్గి 1.73 శాతానికి చేరాయి. నికర ఎన్‌పీఏలు 0.47 శాతానికి పరిమితమయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో కరూర్‌ వైశ్యా బ్యాంక్‌ షేరు 5.3% జంప్‌చేసి రూ. 145 వద్ద ముగిసింది.

ఐపీవో బాటలో సెల్లో, ఆస్క్‌, ఇసాఫ్‌

- సెబీ నుంచి తాజాగా గ్రీన్‌ సిగ్నల్‌
- రూ. 2,500 కోట్లకుపైగా సమీకరణ

న్యూఢిల్లీ: ఇటీవల కళకళలాడుతున్న ప్రైమరీ మార్కెట్‌ మరింత జోరు చూపనుంది. తాజాగా మూడు కంపెనీలకు క్యాపిటల్‌ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చింది. ఈ జాబితాలో హోమ్‌వేర్‌ బ్రాండ్‌ ముంబై కంపెనీ సెల్లో వరల్డ్‌, ఇసాఫ్‌ స్మాల్‌ ఫైనాన్స్‌ బ్యాంక్‌తో పాటు అడ్వాన్స్‌డ్‌ బ్రేకింగ్‌ సిస్టమ్‌ తయారీ కంపెనీ ఆస్క్‌(ఏఎస్‌కే) ఆటోమోటివ్‌ చేరాయి. ఈ ఏడాది జూన్‌–ఆగస్ట్‌ మధ్యలో సెబీకి ఇవి ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. వెరసి ఈ మూడు కంపెనీలూ పబ్లిక్‌ ఇష్యూల ద్వారా నిధుల సమీకరణ చేపట్టనున్నాయి. తద్వారా స్టాక్‌ ఎక్స్ఛేంజీలలో లిస్టికానున్నాయి.



సెల్లో వరల్డ్‌

హౌస్‌హోల్డ్‌ ప్రొడక్టులు, స్టేషనరీ తయారీ కంపెనీ సెల్లో వరల్డ్‌ పబ్లిక్‌ ఇష్యూకి రానుంది. దీనిలో భాగంగా రూ. 1,750 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. అర్హతగల కంపెనీ ఉద్యోగులకు రూ. 10 కోట్ల విలువైన షేర్లను రిజర్వ్‌ చేయనుంది. కంపెనీ ప్రధానంగా మూడు విభాగాలలో కార్యకలాపాలు కలిగి ఉంది. కన్జూమర్‌ హౌస్‌వేర్‌, రైటింగ్‌ ఇన్‌స్ట్రుమెంట్స్‌– స్టేషనరీ, మౌల్డెడ్‌ ఫర్నిచర్‌, సంబంధిత ఉత్పత్తులను విక్రయిస్తోంది.

ఇసాఫ్‌ బ్యాంక్‌

ప్రైవేట్‌ రంగ సంస్థ ఇసాఫ్‌ స్మాల్‌ ఫైనాన్స్‌ బ్యాంక్‌ ఐపీవో ద్వారా రూ. 629 కోట్లు సమకూర్చుకునే ప్రణాళికల్లో ఉంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 487 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా వీటికి జతగా మరో రూ. 142 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్‌ సంస్థ ఎసాఫ్‌ ఫైనాన్షియల్‌ హోల్డింగ్స్‌, ఇతర వాటాదారులు(పీఎన్‌బీ మెట్‌లైఫ్‌, బజాజ్‌ అలయెంజ్‌ లైఫ్‌ ఇన్సూరెన్స్‌ ఆఫర్‌ చేయనున్నాయి. ప్రస్తుతం కంపెనీలో ఎసాఫ్‌ ఫైనాన్షియల్‌కు 62.46 శాతం వాటా ఉంది. ఈక్విటీ జారీ నిధులను టైర్‌–1 మూలధన పటిష్టతకు వినియోగించనుంది.

ఆస్క్‌ ఆటో

బ్రేక్‌ షూ, అడ్వాన్స్‌డ్‌ బ్రేకింగ్‌ సిస్టమ్స్‌ తయారీకి దేశీయంగా అతిపెద్ద కంపెనీలలో ఒకటైన ఆస్క్‌ ఆటోమోటివ్‌ పబ్లిక్‌ ఇష్యూకి వస్తోంది. ఇందుకు అనుగుణంగా ప్రమోటర్లు కుల్‌దీప్‌ సింగ్‌ రాఠీ, విజయ్‌ రాఠీ 2,95,71,390 ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. కంపెనీలో ప్రస్తుతం కుల్‌దీప్‌కు 41.33 శాతం, విజయ్‌కు 32.3 శాతం చొప్పున వాటా ఉంది. కంపెనీ ప్రధానంగా ద్విచక్ర వాహనాలకు బ్రేకింగ్‌ వ్యవస్థలను సమకూర్చుతోంది. 2022కల్లా 50 శాతం మార్కెట్‌ వాటాను కలిగి ఉంది.

3 రోజుల నష్టాలకు చెక్‌

- ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ
- క్రూడాయిల్‌ ధరల తగ్గుదల ప్రభావం
- సెన్సెక్స్‌ లాభం 261 పాయింట్లు
- 19,800 పైకి నిఫ్టీ

ముంబై: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల రికవరీ, క్రూడాయిల్‌ ధరలు దిగిరావడంతో దేశీయ ఈక్విటీ మార్కెట్‌ 3 రోజుల నష్టాల నుంచి గట్టెక్కింది. సెన్సెక్స్‌ 261 పాయింట్లు పెరిగి 66,428 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 80 పాయింట్లు పెరిగి 19,812 వద్ద నిలిచింది. ఉదయం సూచీలు లాభాలతో మొదలయ్యాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో రోజంతా లాభాల్లోనే కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్‌ 393 పాయింట్లు పెరిగి 66,560 వద్ద, నిఫ్టీ 118 పాయింట్లు బలపడి 19,850 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. అయితే చివర్లో పలు రంగాల్లో లాభాల స్వీకరణతో స్వల్పంగా లాభాలు కోల్పోయాయి. బీఎస్‌ఈ స్మాల్‌, మిడ్‌ క్యాప్‌ సూచీలు వరుసగా 0.70%, 0.40% చొప్పున పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.264 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.113 కోట్ల షేర్లు కొన్నారు. సెప్టెంబర్‌ క్వార్టర్‌ ఫలితాలు, అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఆశావహన అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి



- సెప్టెంబర్‌ క్వార్టర్‌లో మెరుగైన ఫలితాలను ప్రకటించడంతో సియట్‌ లిమిటెడ్‌ షేరు 4.50% లాభపడి రూ.2,197 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 11% దూసుకెళ్లి రూ.2,334 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. గతేడాది క్యూ2 సంస్థ నికర లాభం రూ.6.4 కోట్లుగా ఉంది. షేరు భారీ ర్యాలీతో కంపెనీ మార్కెట్‌ క్యాప్‌ రూ.388 కోట్లు పెరిగి రూ. 8,887 కోట్లకు చేరింది.
- కల్యాణ్‌ జ్యువెల్లర్స్‌ కంపెనీ షేరు 4.09% లాభపడి రూ.295 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 5% పెరిగి రూ.298 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. ఈ క్రమంలో కంపెనీ మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌ రూ.30,000 కోట్ల మైలురాయిని అధిగమించి రూ.30,422 కోట్లకు చేరింది. కాగా ఈ ఏడాది ఇప్పటివరకు కంపెనీ షేరు 133% దూసుకెళ్లింది.
- రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర పనితీరు కనబరచడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ షేరు 1% పెరిగి రూ.1,541 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 2% ర్యాలీ చేసి రూ.1,558 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- ఎలక్ట్రానిక్‌ సేవల తయారీ సంస్థ సైయెంట్‌ డీఎల్‌ఎం షేరు 3% ఎగసి రూ.709 వద్ద స్థిరపడింది. క్యూ2 లో కంపెనీ నికర లాభం 106% వృద్ధి చెందడం షేరు ర్యాలీకి కారణమైంది. ట్రేడింగ్‌లో 8.50% ఎగసి రూ.748 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

బజాజ్‌ ఫైనాన్స్‌ లాభం జూమ్‌

- క్యూ2లో రూ. 3,551 కోట్లు
- పర్మనెంట్‌లో 26 శాతం వాటా

న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం బజాజ్‌ ఫైనాన్స్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్‌ (క్యూ2)లో నికర లాభం 28 శాతం ఎగసి రూ. 3,551 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,781 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,974 కోట్ల నుంచి రూ. 13,382 కోట్లకు జంప్‌ చేసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 6,222 కోట్ల నుంచి రూ. 8,624 కోట్లకు పెరిగాయి. నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 33 శాతం మెరుగుపడి రూ. 2,90,264 కోట్లకు చేరాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్‌) 23.19 శాతంగా నమోదైంది. కాగా.. అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్‌) ద్వారా రూ. 8,800 కోట్ల పెట్టుబడుల సమీకరణకు ఈ నెల 5న బోర్డు గ్రీన్‌సిగ్నల్‌ ఇచ్చిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ప్రమోటర్‌ సంస్థ బజాజ్‌ ఫిన్‌సర్వ్‌ లిమిటెడ్‌కు ఈక్విటీగా మార్పుచెందే 15,50,000 వారంట్ల ప్రిఫరెన్షియల్‌ జారీకి సైతం బోర్డు అనుమతించింది. తద్వారా రూ. 1,200 కోట్ల వరకూ సమకూర్చుకోనుంది.



వాటా కొనుగోలు

టెక్నాలజీ కంపెనీ పర్మనెంట్‌ టెక్నాలజీస్‌లో 26 శాతం వాటాను కొనుగోలు చేయనున్నట్లు బజాజ్‌ ఫైనాన్స్‌ తాజాగా పేర్కొంది. ఇందుకు దాదాపు రూ. 268 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. వాటా కొనుగోలుకి పర్మనెంట్‌తో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. టెక్నాలజీ విభాగంలో పటిష్టమయ్యే బాటలో వ్యూహాత్మకంగా వాటా కొనుగోలుకి తెరతీస్తున్నట్లు వివరించింది. డిసెంబర్‌ 30కల్లా లావాదేవీ పూర్తికానున్నట్లు అంచనా వేసింది. బ్యాంకింగ్‌, ఫైనాన్షియల్‌ సర్వీసుల పరిశ్రమకు అవసరమయ్యే బిజినెస్‌ ఆధారిత టెక్నాలజీ సర్వీసులు, సాఫ్ట్‌వేర్‌ ప్రొడక్టులను పర్మనెంట్‌ రూపొందిస్తోంది.

ఫలితాల నేపథ్యంలో బజాజ్‌ ఫైనాన్స్‌ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.8 శాతం బలపడి రూ. 8,098 వద్ద ముగిసింది.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్‌ వాట్సప్‌ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్‌ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్‌ న్యూస్‌, టిప్స్‌, ఇంటర్‌ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్‌ కోసం ఈ చానల్‌ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేయండి.. చానల్‌ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్‌ పాయింట్‌ కోసం ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

కెరీర్‌ కౌన్సెలింగ్‌ మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్‌ sakshieducation@gmail.com

జాబ్‌ పాయింట్‌

నిట్‌ ఏపీలో 24 అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ పోస్టులు

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ.. ఆంధ్రప్రదేశ్‌ వివిధ విభాగాల్లో ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 24
» **విభాగాలు:** బయోటెక్నాలజీ, కెమికల్‌ ఇంజనీరింగ్‌, సివిల్‌ ఇంజనీరింగ్‌, కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఇంజనీరింగ్‌, ఎలక్ట్రికల్‌ ఇంజనీరింగ్‌, ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్‌ ఇంజనీరింగ్‌, మెకానికల్‌ ఇంజనీరింగ్‌, మెటలర్జికల్‌ అండ్‌ మెటీరియల్స్‌ ఇంజనీరింగ్‌, హ్యూమానిటీస్‌ అండ్‌ మేనేజ్‌మెంట్‌, సైన్సెస్‌.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఫస్ట్‌ క్లాస్‌ బ్యాచిలర్‌ డిగ్రీ,మాస్టర్స్‌ డిగ్రీ,పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు బోధన/పరిశోధన అనుభవం ఉండాలి.
» **ఎంట్రీ బేసిక్‌ పే:** రూ.70,900.
» **ఎంపిక విధానం:** అకడమిక్‌ మెరిట్‌, పని అనుభవం, ఇంటర్వ్యూ, ప్రజెంటేషన్‌ ఆధారంగా.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 13.11.2023
» **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 20.11.2023.
» **వెబ్‌సైట్‌:** nitandhra.ac.in

ఎన్‌టీపీసీలో 495 ఇంజనీరింగ్‌ ఎగ్జిక్యూటివ్‌ ట్రైనీ పోస్టులు

న్యూఢిల్లీలోని ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌టీపీసీ లిమిటెడ్‌.. ఇంజనీరింగ్‌ ఎగ్జిక్యూటివ్‌ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 495
» **విభాగాలు:** ఎలక్ట్రికల్‌, మెకానికల్‌, ఎలక్ట్రానిక్స్‌/ఇన్‌స్ట్రుమెంటేషన్‌, సివిల్‌, మైనింగ్‌.
» **అర్హత:** కనీసం 65 శాతం మార్కులతో (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు 55 శాతం) బ్యాచిలర్‌ డిగ్రీ (ఇంజనీరింగ్‌/టెక్నాలజీ) ఉత్తీర్ణతతో పాటు గ్రాడ్యుయేట్‌ అప్టిట్యూడ్‌ టెస్ట్‌ ఇన్‌ ఇంజనీరింగ్‌(గేట్‌)–2023కి హాజరై ఉండాలి.
» **వయసు:** ఆన్‌లైన్‌ దరఖాస్తు చివరితేది నాటికి 27 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** గేట్‌–2023 స్కోరు,ధ్రువపత్రాల పరిశీలన,వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరి తేది:** 20.10.2023
» **వెబ్‌సైట్‌:** www.ntpc.co.in

ఎయిర్‌పోర్ట్స్‌ అథారిటీ, న్యూఢిల్లీలో 496 జూనియర్‌ ఎగ్జిక్యూటివ్‌ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎయిర్‌పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా.. దేశ వ్యాప్తంగా ఉన్న ఏఏఐ కార్యాలయాల్లో జూనియర్‌ ఎగ్జిక్యూటివ్‌ ఎయిర్‌ ట్రాఫిక్‌ కంట్రోల్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 496
» **అర్హత:** బీఎస్సీ ఫిజిక్స్‌ లేదా ఏదైనా విభాగంలో బీఈ/బీటెక్‌ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 30.11.2023 నాటికి 27 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు లభిస్తుంది.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్‌ పరీక్ష, అప్లికేషన్‌ వెరిఫికేషన్‌, వాయిస్‌టెస్ట్‌, సైకోయాక్టివ్‌ సబ్‌స్టాన్సెస్‌ టెస్ట్‌, సైకలాజికల్‌ అసెస్‌మెంట్‌ టెస్ట్‌, మెడికల్‌ టెస్ట్‌, బ్యాక్‌గ్రౌండ్‌ వెరిఫికేషన్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:** 01.11.2023
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:**30.11.2023
» **వెబ్‌సైట్‌:** www.aai.aero

ఇంటెలిజెన్స్‌ బ్యూరోలో 677 సెక్యూరిటీ అసిస్టెంట్‌/ఎంటీఎస్‌ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇంటెలిజెన్స్‌ బ్యూరో.. దేశవ్యాప్తంగా ఐబీ పరిధిలోని సబ్సిడియరీ ఇంటెలిజెన్స్‌ బ్యూరోల్లో డైరెక్ట్‌ రిక్రూట్‌మెంట్‌ ప్రాతిపదికన సెక్యూరిటీ అసిస్టెంట్‌, ఎంటీఎస్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 677
» **పోస్టుల వివరాలు:** సెక్యూరిటీ అసిస్టెంట్‌/మోటార్‌ ట్రాన్స్‌పోర్ట్‌–362, మల్టీ –టాస్కింగ్‌ స్టాఫ్‌ (జనరల్‌)–315.
» **అర్హత:** ఎంటీఎస్‌ ఖాళీలకు మెట్రిక్యులేషన్‌ (పదో తరగతి) ఉత్తీర్ణులవ్వాలి. ఎస్‌ఏ/ఎంటీ పోస్టులకు డ్రైవింగ్‌ లైసెన్స్‌తో ఏడాది పని అనుభవంతోపాటు మోటార్‌ మెకానిజం పరిజ్ఞానం కలిగి ఉండాలి. **వయసు:** ఎస్‌ఏ/ఎంటీ పోస్టులకు 27 ఏళ్లు మించకూడదు. ఎంటీఎస్‌ ఖాళీలకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్‌:** నెలకు ఎస్‌ఏ/ఎంటీ పోస్టులకు రూ.21,700 నుంచి రూ.69,100, ఎంటీఎస్‌ పోస్టులకు రూ.18,000 నుంచి రూ.56,900.
» **ఎంపిక విధానం:** టైర్‌–1 రాతపరీక్ష (ఆబ్జెక్టివ్‌), టైర్‌–2 రాతపరీక్ష (డిస్క్రిప్టివ్‌) –ఎంటీఎస్‌ పోస్టులకు మాత్రమే, డ్రైవింగ్‌ స్కిల్‌ టెస్ట్‌(ఎస్‌ఏ/ఎంటీ పోస్టులకు మాత్రమే), ఇంటర్వ్యూ, డాక్యుమెంట్‌ వెరిఫికేషన్‌,మెడికల్‌ ఎగ్జామినేషన్‌ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, చీరాల, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్‌, కరీంనగర్‌, ఖమ్మం, మహబూబ్‌నగర్‌, వరంగల్‌.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 13.11.2023
» **వెబ్‌సైట్‌:** www.mha.gov.in

గేట్‌తో పీఎస్‌యూ కొలువు

» గేట్‌ స్కోర్‌తో పీఎస్‌యూల్లో నియామకాలు
» నవరత్న,మహారత్న,మినీరత్న సంస్థల్లో ఉద్యోగాలు
» నోటిఫికేషన్లు విడుదల చేస్తున్న పీఎస్‌యూలు
» మలి దశ ప్రక్రియపై అవగాహనతో కొలువు
» 2024 ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో గేట్‌ పరీక్ష

గ్రాడ్యుయేట్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్‌ ఇన్‌ ఇంజనీరింగ్‌.. సంక్షిప్తంగా గేట్‌! ఐఐటీలు, ఎన్‌ఐటీలు వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ఎంటెక్‌, ఇంటిగ్రేటెడ్‌ ఎంటెక్‌+పీహెచ్‌డీలో ప్రవేశానికి గేట్‌ స్కోర్‌ తప్పనిసరి!! గేట్‌ స్కోర్‌తో కేంద్ర ప్రభుత్వ కొలువులు సైతం సొంతం చేసుకోవచ్చు. మహారత్న, నవరత్న, మినీరత్న హోదా పొందిన ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ) గేట్‌ స్కోర్‌ ద్వారా ట్రైనీ ఇంజనీర్స్‌, ఎగ్జిక్యూటివ్‌ ట్రైనీ పోస్టులను భర్తీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో..గేట్‌-2024తో పీఎస్‌యూ కొలువులకు ఎంపిక ప్రక్రియ, ఇందులో విజయానికి మార్గాలు తదితర వివరాలు..

బీటెక్‌ ఉత్తీర్ణుల్లో ఎక్కువ మంది సర్కారీ కొలువు సొంతం చేసుకోవాలనే తపనతో ఉంటారు. అందుకోసం బీటెక్‌ అర్హతగా నిర్వహించే అన్ని నియామక పరీక్షలకు పోటీ పడుతుంటారు. గేట్‌ స్కోర్‌తో ఉన్నత విద్య కోర్సుల్లో ప్రవేశాలతోపాటు మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థల్లో కొలువును దక్కించుకునే అవకాశముంది. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు గేట్‌ స్కోర్‌ ఆధారంగా ఎంట్రీ లెవల్‌లో ఇంజనీర్స్‌ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాయి. కాబట్టి అభ్యర్థులు తమ డొమైన్‌ నాలెడ్జ్‌ను పెంచుకుంటే.. గేట్‌లో ఉత్తమ స్కోర్‌ సాధించి.. పీఎస్‌యూల్లో ఉద్యోగావకాశాలను మెరుగుపరచుకోవచ్చు.

మలి దశ ఎంపిక ఇలా

ప్రభుత్వ రంగ సంస్థలు గేట్‌ స్కోర్‌ ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక నోటిఫికేషన్లను విడుదల చేస్తున్నాయి. ఇలా గేట్‌ స్కోర్‌ ఆధారంగా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను షార్ట్‌లిస్ట్‌ చేసి.. మలి దశలో గ్రూప్‌ డిస్కషన్‌/గ్రూప్‌ టాస్క్‌, పర్సనల్‌ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయి. తుది జాబితా ఖరారులో వీటికి వెయిటేజీని కేటాయిస్తున్నాయి. దానికి అనుగుణంగా నిర్దిష్ట కటాఫ్‌ జాబితాలో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తున్నాయి.

గేట్‌కు 75 శాతం వెయిటేజీ

తుది జాబితా రూపకల్పనలో పీఎస్‌యూలు గేట్‌ స్కోర్‌కు 75 శాతం వెయిటేజీ; గ్రూప్‌ డిస్కషన్‌/గ్రూప్‌ టాస్క్‌లకు గరిష్టంగా పది శాతం; పర్సనల్‌ ఇంటర్వ్యూకు పదిహేను శాతం చొప్పున వెయిటేజీ ఇస్తున్నాయి. మరికొన్ని పీఎస్‌యూలు గేట్‌ స్కోర్‌కు 60నుంచి 65శాతం వెయిటేజీ ఇస్తూ.. మిగతా మొత్తాన్ని జీడీ/పీఐలకు కేటాయిస్తున్నాయి.

గ్రూప్‌ డిస్కషన్‌

మలిదశ ఎంపిక ప్రక్రియలో ముందుగా గ్రూప్‌ డిస్కషన్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో అభ్యర్థుల భావ వ్యక్తీకరణ, సమకాలీన, సాంకేతిక అంశాలపై పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్నారు. గ్రూప్‌ డిస్కషన్‌లో నిర్దిష్ట సంఖ్యలో అభ్యర్థులను వేర్వేరు బృందాలు (టీమ్స్‌)గా ఏర్పరుస్తారు. ఒక్కో టీమ్‌లో అయిదు నుంచి పది మంది అభ్యర్థులు ఉంటున్నారు. ప్రతి టీమ్‌కు ఏదైనా ఒక అంశం ఇచ్చి.. ప్రతి అభ్యర్థిని మాట్లాడాలని సూచిస్తారు. ఈ గ్రూప్‌ డిస్కషన్‌ ఇరవై నిమిషాల నుంచి 30 నిమిషాల వ్యవధిలో ఉంటుంది. ప్రతి అభ్యర్థికి సగటున అయిదు నుంచి ఆరు నిమిషాల సమయం లభిస్తుంది.

గ్రూప్‌ టాస్క్‌

పలు పీఎస్‌యూలు గ్రూప్‌ డిస్కషన్‌కు బదులుగా గ్రూప్‌ టాస్క్‌ను నిర్వహిస్తున్నాయి. గ్రూప్‌ టాస్క్‌ అంటే.. నిర్దిష్టంగా ఒక వాస్తవ సమస్యను అభ్యర్థుల ముందుంచి.. సమస్యకు పరిష్కారం కనుక్కోవాలని సూచిస్తారు. వీటిని కూడా అభ్యర్థులు టీమ్‌లుగా ఏర్పడి పరిష్కరించాల్సి ఉంటుంది. గ్రూప్‌ టాస్క్‌ అభ్యర్థుల డొమైన్‌ టాపిక్స్‌కు సంబంధించి ఉంటుంది. దీనిద్వారా అభ్యర్థుల ప్రాక్టికల్‌ నైపుణ్యాలు తెలుసుకోవడమే కాకుండా.. సమస్య పరిష్కార సామర్థ్యాన్ని సైతం అంచనా వేస్తారు.

చివరగా.. ఇంటర్వ్యూ

గేట్‌ స్కోర్‌ ఆధారంగా నియామక ప్రక్రియలో చివరి దశ పర్సనల్‌ ఇంటర్వ్యూ. గ్రూప్‌ డిస్కషన్‌ లేదా గ్రూప్‌ టాస్క్‌లో విజయం సాధించిన అభ్యర్థులకు వీటిని నిర్వహిస్తారు. ఈ ఇంటర్వ్యూల్లో అభ్యర్థుల వ్యక్తిగత నేపథ్యం, టెక్నికల్‌ నాలెడ్జ్‌లను పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. బీటెక్‌లో చేసిన ప్రాజెక్ట్‌ వర్క్స్‌, మినీ ప్రాజెక్ట్స్‌, ఇంటర్న్‌షిప్స్‌.. వాటి వల్ల సదరు అభ్యర్థులకు లభించిన నైపుణ్యాలు పరిశీలిస్తారు. దీంతో పాటు వ్యక్తిగతంగా సదరు పోస్ట్‌లకు సరిపడే అప్టిట్యూడ్‌, ఆటిట్యూడ్‌ అభ్యర్థికి ఉందా అనే కోణంలో కూడా పరిశీలిస్తారు.

కటాఫ్‌ నిబంధన

సంస్థలు నిర్దిష్ట కటాఫ్‌ నిబంధనలను అమలు చేస్తున్నాయి. ఈ కటాఫ్‌లు.. అందుబాటులో ఉన్న ఖాళీలు, వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఉంటున్నాయి. గత రెండేళ్లుగా పీఎస్‌యూలకు దరఖాస్తుల సంఖ్య పెరుగుతోంది. దీనికి అనుగుణంగానే



గేట్‌ స్కోర్‌ కటాఫ్‌ కూడా పెరుగుతూ వస్తోంది. జనరల్‌ కేటగిరీలో 750 నుంచి 800 మార్కులు, రిజర్వ్‌డ్‌ కేటగిరీలో 500 నుంచి 600 మార్కులు సాధిస్తేనే మలి దశకు అవకాశం లభిస్తుంది.

గేట్‌-2024 విధానం

గేట్‌ పరీక్షను ఆన్‌లైన్‌ విధానంలో నిర్వహిస్తారు. వంద మార్కులకు రెండు విభాగాల్లో పరీక్ష ఉంటుంది. మొత్తం 65 ప్రశ్నలు అడుగుతారు. పార్ట్‌–1లో జనరల్‌ ఆప్టిట్యూడ్‌ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగానికి 15 మార్కులు కేటాయిస్తారు. ఒక మార్కు ప్రశ్నలు అయిదు, రెండు మార్కుల ప్రశ్నలు అయిదు ఉంటాయి. ఇంజనీరింగ్‌ మ్యాథమెటిక్స్‌ నుంచి 13 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌పై పార్ట్‌–బి ఉంటుంది. ఈ విభాగంలో 72 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ఇలా మొత్తం 100 మార్కులకు గేట్‌ పరీక్ష జరుగుతుంది.

మూడు రకాల ప్రశ్నలు

గేట్‌ పరీక్షలో ప్రశ్నలు మూడు విధాలుగా ఉంటాయి. అవి.. మల్టిపుల్‌ ఛాయిస్‌ కొశ్చన్స్‌, మల్టిపుల్‌ సెలక్ట్‌ కొశ్చన్స్‌(ఎంఎస్‌క్యూ), న్యూమరికల్‌ ఆన్సర్‌ టైప్‌(ఎన్‌ఏటీ) కొశ్చన్స్‌. ఎంసీక్యూ విధానంలో నాలుగు లేదా అయిదు ఆప్షన్లలో ఏదో ఒక దాన్ని సమాధానంగా గుర్తించాల్సి ఉంటుంది. మల్టిపుల్‌ సెలక్ట్‌ కొశ్చన్స్‌లో ఒకటి కంటే ఎక్కువ ఆప్షన్లు సమాధానంగా ఉండే ప్రశ్నలు అడుగుతారు. ఇలాంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. సదరు ప్రశ్నకు సంబంధించిన టాపిక్‌పై సంపూర్ణ అవగాహన కలిగుండాలి. న్యూమరికల్‌ ఆన్సర్‌ టైప్‌ ప్రశ్నలు కొంత కాలిక్యులేషన్స్‌తో కూడినవిగా ఉంటాయి.

మంచి స్కోర్‌కు మార్గాలివే

గేట్‌లో బెస్ట్‌ స్కోర్‌ కోసం అభ్యర్థులు ప్రస్తుత సమయంలో వ్యూహాత్మకంగా ప్రిపరేషన్‌ సాగించాలి. ఇందుకోసం తాము ఎంచుకున్న సబ్జెక్ట్‌లో బేసిక్స్‌ నుంచి అడ్వాన్స్‌డ్‌ టెక్నిక్స్‌ వరకు పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ప్రతి టాపిక్‌ను చదివేటప్పుడు అందులోని ప్రశ్నార్హమైన వాటిని గుర్తించాలి. దానికి సంబంధించి ప్రాథమిక భావనలపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలి. ఒక టాపిక్‌ నుంచి ఎన్ని రకాలుగా ప్రశ్నలు అడిగే అవకాశం ఉందో గుర్తించాలి. దానికి అనుగుణంగా సాధన చేయాలి. గేట్‌ అభ్యర్థులు ప్రిపరేషన్‌ సమయంలో అనుసంధాన విధానాన్ని అలవర్చుకోవాలి. గేట్‌ సిలబస్‌ను అకడమిక్‌ సిలబస్‌తో అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్‌ సాగించాలి. వీక్లీ టెస్ట్‌లు, మాక్‌ టెస్ట్‌లు, మోడల్‌ టెస్ట్‌లకు హాజరు కావాలి.

వెయిటేజీని పరిశీలిస్తూ

గేట్‌లో ఆయా టాపిక్స్‌కు గత అయిదారేళ్లుగా లభిస్తున్న వెయిటేజ్‌, అకడమిక్‌గా ఉన్న ప్రాధాన్యాన్ని అనుసరిస్తూ ప్రిపరేషన్‌ సాగించాలి. డిసెంబర్‌ చివరి వారం లేదా జనవరి మొదటి వారానికి ప్రిపరేషన్‌ పూర్తి చేసుకునేలా టైమ్‌ ప్లాన్‌ రూపొందించుకోవాలి. ఆ తర్వాత మిగిలి ఉన్న వ్యవధిలో ఆన్‌లైన్‌ మోడల్‌ టెస్ట్‌లు, మాక్‌ టెస్ట్‌లకు హాజరయ్యేలా ప్లాన్‌ చేసుకోవాలి.

పీఎస్‌యూ నోటిఫికేషన్లు

గేట్‌ స్కోర్‌ ఆధారంగా నియామకాలకు ఇప్పటికే పలు పీఎస్‌యూలు నోటిఫికేషన్‌లు విడుదల చేశాయి. మరికొద్ది రోజుల్లో మరిన్ని సంస్థలు నోటిఫికేషన్‌లను విడుదల చేసే అవకాశం ఉంది. ఓఎన్‌జీసీ, ఇండియన్‌ ఆయిల్‌ కార్పొరేషన్‌, న్యూక్లియర్‌ పవర్‌ కార్పొరేషన్‌, స్టీల్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా, కోల్‌ ఇండియా లిమిటెడ్‌, గ్యాస్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా లిమిటెడ్‌ తదితర ప్రభుత్వ రంగ సంస్థలు నోటిఫికేషన్ల విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

గేట్‌-2024 ముఖ్య సమాచారం

- మొత్తం 30 పేపర్లలో గేట్‌–2024.
- ఆలస్య రుసుముతో ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరి తేదీ: అక్టోబర్‌ 20, 2023.
- ఆన్‌లైన్‌ దరఖాస్తు సవరణ అవకాశం: నవంబర్‌ 7 – 11, 2023.
- అడ్మిట్‌ కార్డ్‌ డౌన్‌లోడ్‌ సదుపాయం: జనవరి 3, 2024.
- గేట్‌–2024 తేదీలు: 2024 ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో పరీక్ష.
- ఫలితాల వెల్లడి: మార్చి 16, 2024.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌: https://gate2024.iisc.ac.in

కళ్లు మూసుకున్న విద్యాశాఖ.. లక్షలు కుమ్మేసిన మోసగాళ్లు

రిలయన్స్ పేరుతో యువతకు టోకరా

- సీఎస్ఆర్ ముసుగులో ఉద్యోగాల బేరం
- ఆలస్యంగా కళ్లు తెరిచిన పాఠశాల విద్యాశాఖ



సాక్షి, హైదరాబాద్: విద్యాశాఖ కళ్లు మూసుకుని ఆదేశాలివ్వడంతో మోసగాళ్లు లక్షలు కుమ్మేశారు. అధికారులు కళ్లు తెరిచేలోగా బాధిత యువత జేబులు గుల్ల చేసుకొని లబోదిబోమన్నారు. ఉద్యోగాల పేరిట లక్షలాది రూపాయలను బాధితుల నుంచి వసూలు చేసిన వైనం ఇటీవల వెలుగు చూసింది. అక్రమార్కులు తమ మోసానికి రిలయన్స్ సంస్థ పేరును వాడుకోవడం గమనార్హం. బాధితులు పోలీసులను ఆశ్రయించే వరకూ విద్యాశాఖ ఈ మోసాన్ని గుర్తించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ప్రభుత్వ స్కూళ్లలో వివిధ రకాల సేవలు అందిస్తామని రిలయన్స్ కంపెనీ పేరుతో కొంతమంది విద్యాశాఖను ఆశ్రయించారు. జిల్లాకు 25 పాఠశాలల్లో ఉచిత ఇంటర్నెట్, యోగా, ఖోఖో, ఫుట్‌బాల్ ట్రైనింగ్, ఇంగ్లిష్, కంటెంట్ క్రియేషన్ అండ్ ప్రాబ్లం సాల్వింగ్ ఇన్ దీక్ష ప్రోగ్రాం వంటి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ స్కూళ్లలో కంప్యూటర్ శిక్షణ అందిస్తామని, విద్యాంజలి సెంట్రల్ పోర్టల్‌కు సహకరిస్తామని రిలయన్స్ లెటర్ హెడ్‌తో విద్యాశాఖకు దరఖాస్తు చేసుకున్నారు. అసలు అది రిలయన్స్ కంపెనీదేనా? కాదా? అనే విషయాన్నే విచారించకుండానే వారికి సహకరించాలని ఆగస్టు 26న పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయం స్కూళ్లకు ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు ఆయా అంశాల్లో శిక్షణనిచ్చేందుకు ఉద్యోగులుగా నియమిస్తామంటూ యువతకు ఆశ చూపి వారి నుంచి డబ్బులు వసూలు చేశారు. ఈ విధంగా రూ.లక్షల్లో గుంజినట్టు ఫిర్యాదులొచ్చాయి. ఈ తరహా కేసులు నమోదవ్వడంతో ఆ వ్యక్తులతో తమకేం సంబంధం లేదంటూ సెప్టెంబర్ 1వ తేదీన విద్యాశాఖ ఉన్నతాధికారులకు రిలయన్స్ కంపెనీ ఓ లేఖ రాసింది. దీంతో ఆలస్యంగా కళ్లు తెరిచిన అధికారులు ఈ నెల 16న తమ ఆదేశాలను రద్దు చేశారు. రిలయన్స్ పేరుతో వచ్చే వ్యక్తులకు సహకరించవద్దని ఆదేశాల్లో పేర్కొన్నారు.

హైకోర్టులో ఏఎస్‌జీగా నరసింహశర్మ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టులో కేంద్రం తరఫున వాదనలు వినిపించే నిమిత్తం అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ)గా సీనియర్ న్యాయవాది బి.నరసింహశర్మను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్లపాటు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. 1959, నవంబర్ 22న పుట్టిన బీఎస్ శర్మ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. ఎల్ఎల్ఎంలో గోల్డ్‌మెడల్ సాధించారు. 1982లో ఏపీ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ చేసుకున్నారు. అప్పటినుంచి సివిల్, క్రిమినల్, ట్యాక్సేషన్, సర్వీస్ వ్యాజ్యాల న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను హైకోర్టు గత డిసెంబర్‌లో సీనియర్ న్యాయవాదిగా నియమించింది. ఆదాయపు పన్ను శాఖ, కేంద్ర పన్నులు, కస్టమ్స్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ), డీసీసీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) న్యాయవాదిగా పనిచేశారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (సీఏజీఐ), బీఎస్ఎన్ఎల్, కేంద్రీయ విద్యాలయ (కేవీఎస్)తో పాటు పలు ఇతర శాఖలకు న్యాయవాదిగా కూడా బాధ్యతలు నిర్వహించారు.



నిర్మల్ జిల్లా బాసర సరస్వతి అమ్మవారు దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం చంద్రఘంట అలంకారంలో దర్శనమిచ్చారు. -భైంసా



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించారు. -భద్రాచలం



గద్వాల జిల్లా అలంపూర్ పుణ్యక్షేత్రంలో మూడోరోజు మంగళవారం చంద్రఘంటాదేవిగా జోగుళాంబ అమ్మవారు దర్శనమిచ్చారు. -జోగుళాంబ శక్తిపీఠం



వరంగల్ శ్రీభద్రకాళి ఆలయంలో గాయత్రీమాత అలంకారంలో భద్రకాళి అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. -హనుమకొండ కల్చరల్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.